UNIVERSAL
LIBRARY
OU_204175
UNIVERSAL
LIBRARY

# HARSHACHARITRA

## TRANSLATED INTO TELUGU

BY

**M. V. RAMANACHARI**

**Senior Sanskrit Pundit,**

**Maharaja's College,**

***Vijayanagaram.***

# ఆంధ్ర హర్ష చరిత్రము.

మహారాజావారి కాలేజీ సంస్కృత పండితుడు

మేడేపల్లి వేంకటరమణాచార్యుడు రచించినది

విజయనగరము.

శ్రీవేదవ్యాస ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడినది.

1929.

**Price one Rupee.**

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అం…

# కృతి సమర్పణము.

శ్లో॥ శ్రీకాన్తాశ్లిష్ట వక్షా వికచసితసరోజాతనేత్రః పరేశశ్శర్వాబ్జ
జాతజాతప్రముఖ సురగణామేయమాహాత్మ్యవార్ధిః। భక్తాభీష్ట
ప్రదాతా ప్రవరగుణగణైః శ్రీయశ్శ్రీమురారిః పాయాదేచూరి
వంశోదధితుహినరుచిం త్వాం నృసింహార్యవర్య॥

2. చ॥ నిరుపమబుద్ధివైభవము నిస్తులనీతివిచక్షణత్వము। స్వరగత
సద్గుణగ్రహణ పాటవమున్స్కృత పూర్వవాణియున్। గరగత
కార్యనిర్వహణకౌశలమున్ శ్రితపోషణంబుధీ। వరనరసింహ
యిట్టిగుణవైభవపాత్రుఁడవీ వెయిమ్మహిన్॥

3. ఉ॥ మాయెడసత్కృపన్విబుధ మాన్యచరిత్ర మహోపకార
ముల్। వేయినొనర్చియుంటివి వివృద్ధినిఁగాంచితిమయ్య నీదు
సా। హాయకమండఁగాఁగొని యహర్నిశమున్కృతి వేదితాత్మ
తన్। బాయముగాని నీకెటులఁబ్రత్యుపకారమొనర్చు వార
మా। ర్యా యిది బాణభట్టకృతహర్షచరిత్రము నాంధ్ర
భాషలో। హాయిగవ్రాసి నీకు గృతినర్మిలినిచ్చితిఁ జేకొనం
దగున్॥

4. తే॥గీ॥ వసుధఁగడుపేదలైన మావంటివార। లేమి మీవంటి
ప్రభువుల కియ్యఁగలరు। ప్రీతిగొనుమయ్య దీనినర్పింతునీకు।
నబ్జవైరికి నూలు పోగన్నపగిది॥

20-6-1929.

ఇట్లు విన్నవించు భవద్విధేయుఁడు,
మేడేపల్లి వెంకటరమణాచార్యుఁడు,
*Senior Sanskrit Pandit,*
*Maharaja's College, Vizianagram.*

# హర్షచరిత్ర పీఠిక.

సంస్కృత వాఙ్మయములో గద్యకావ్యములనియు, పద్యకావ్యములనియు, చంపూకావ్యములనియు, కావ్యములు మూఁడు విధములు. హర్షచరిత్ర, కాదంబరి, వాసవదత్త, దశకుమారచరిత్ర, గద్యచింతామణి, తిలకమంజరి మొదలగునవి గద్యకావ్యములు. రఘువంశము, శిశుపాలవధ మొదలగునవి పద్యకావ్యములు. గద్యపద్యాత్మకమైనవి చంపూకావ్యములు. అవి రామాయణచంపు, భారతచంపు, త్రివిక్రమచంపు మొదలైనవి. పైనఁ జెప్పఁబడిన గద్యకావ్యములలో కాదంబరీ హర్షచరిత్రములు బాణకవి విరచితములు. కాదంబరి గద్యకావ్యములన్నింటిలో రసవత్తమము. దానినిఁబోలినగద్యకావ్యమే వాఙ్మయములోను లేదని నిశ్చయముగాఁ జెప్పగలను. "కాదంబరీరసజ్ఞానామాహారోపినరోచతే" అని దాని రసవత్తరత్వము వర్ణింపఁబడినది. మొదటికృతియగుటచేతనో మరియేకారణముచేతనో గాని హర్షచరిత్రము కాదంబరికంటె కఠినతరశబ్దభూయిష్ఠమైయున్నది. కాదంబరి కథ. వాస్తవచరిత్రతో సంబంధించినదికాదు. అదిపురాణకథ (Myth) వంటిది. హర్షచరిత్రము వాస్తవకథ (History). కాదంబరి కథయను కావ్యవిశేషము. దానిలక్షణ మిట్లు చెప్పఁబడుచున్నది. "శ్లోకైస్స్వవంశం సంక్షేపాత్కవిర్యత్రప్రశంసతి। ముఖ్యస్యార్థావతారాయ భవేద్యత్రకథాన్తరమ్। పరిచ్ఛేదోన యత్రస్యాద్భవేద్వాలమ్బకైః క్వచిత్। సాకథానామ తద్గర్భేనిబధ్నీయాచ్చతుష్పదీమ్॥" కథయందు కవితనవంశమును శ్లోకములచేఁ బ్రశంసించును. ముఖ్యకథా ప్రస్తావనకొఱకు కథాన్తరకథనుఁ బ్రతిపాదించును. లమ్బకములు, ఉచ్ఛ్వాసములు మొదలగువానిచే కథావిచ్ఛేదముండదు. ఆఖ్యాయికాలక్షణము. "కర్తృవంశప్రశంసా స్యాద్యత్రగద్యేన

విస్తరాత్। కన్యాహరణసంగ్రామ విప్రలమ్భవిపత్తయః। భవంతి యత్రదీప్తాశ్చరీతి వృత్తిప్రవృత్తయః। ఉచ్ఛ్వాసైశ్చ పరిచ్ఛేదో యత్ర యా చూర్ణకోత్తరా। వక్త్రం వాపరవక్త్రం వాయత్రసాఖ్యాయి కాస్మృతా॥" గద్యముచే విపులముగాఁ గర్తృవంశము వర్ణింపఁబడును. కన్యాహరణము, యుద్ధము, వియోగము, విపత్తులు మొదలగునవి ప్రతిపాదింపఁబడును. ఉచ్ఛ్వాసాదులచేఁ గథ విచ్ఛిన్నమైయుండును. ప్రత్యుచ్ఛ్వాసారమ్భమందునాయుచ్ఛ్వాసములోని కథలను సూచించువక్త్రము (ఛందోవిశేషము) గాని అపరవక్త్రముగాని వ్రాయఁబడును.

గ్రన్థారమ్భమందుఁ గవి తనకంటెఁ బూర్వులైన వ్యాస వాల్మీకి కాళిదాసాది మహాకవులను నుతించి తనకు వారియందున్న గౌరవమునుఁ జూపించెను. మొదటి యుచ్ఛ్వాసత్రయమందుఁ గవిచేఁ దన జననవృత్తాంతము, విద్యాభ్యాసము, రాజదర్శనము, హర్షచరిత్ర ప్రస్తావము, హర్షుని వంశమునకుఁ గూటస్థుఁడైన పుష్పభూతియొక్క వృత్తాంతము, మొదలగు విషయములు ప్రతిపాదింపఁబడినవి. చతుర్థోచ్ఛ్వాసము మొదలుకొని హర్షుని చరిత్రము చెప్పఁబడినది.

ఏతద్గ్రంథనాయకుఁడైన హర్షవర్ధనుఁ డుత్తరహిందూస్థానము నంతయుదన పరాక్రమముచే వశపర్చుకొని పరమధార్మికుఁడై పరిపాలించెను. ఇతఁడు విద్వాంసుఁడు కవి. ఇతనియాస్థానమందు బాణుఁడేకాక పండితులు, కవులుననేకులుండిరి. ఇతఁడు రత్నావళి, ప్రియదర్శన, నాగానందమను మూడు నాటకములను రచించెను. ఇండియాకువచ్చిన యువన్‌చాంగు, ఇత్సింగు, పాహియాన్ మొదలగు చైనాదేశపు యాత్రికులు హర్షునివృత్తాంతమును సవిస్తరముగా వ్రాసియున్నారు. హర్షవర్ధనుని వృత్తాంతమునుఁ దెలుసుకొనుటకు వారిగ్రంథములేముఖ్యాధారములు. ఇతఁడారవశతాబ్దమువాఁడు. ఇతని యాస్థానకవియగు బాణునికాలముకూడ నదియే.

ఈహూణచరిత్రము నాంధ్రీకరించుటకుఁ బలుమారు నా మిత్రులు నన్నుఁ బ్రోత్సాహపర్చుటచే నీపనినిఁ బూనుకొంటిని. ఇందులో మెందుగానున్న తప్పులను నాపండిత మిత్రులు దయతో దిద్ది నన్ననుగ్రహింతురుగాక.

అప్పుడప్పుడు నాయందనుగ్రహబుద్ధితో ప్రూఫులు విన్న నాసహోపాధ్యాయులు మ॥ రా॥ అడిదము రామారావు పంతులుగారికి, యీగ్రంథమును త్వరలో ముద్రింపించిన మా ప్రియ మిత్రులు మ॥ రా॥ కె. శ్రీనివాసరావు పంతులుగారికి నావందన శతములు.

విజయనగరము,
21-6-29.

ఇట్లువిన్నవించు విద్వద్విధేయుడు,
మేడేపల్లి వెంకటరమణాచార్యుడు.

# OPINIONS OF PANDITS.

Andhra Girvana Vidyapitham Goutamasramam, Godavary Banks.

I have seen the "Andhra Harsha Charitra" written by Mr. M. V. Ramanachari, Senior. Sanskrit Pundit, Maharaja's College, Vizayanagaram. Though in fact, a translation of the original Sanskrit, written by Bana, this book does not seem so; on the other hand, it has got all the qualities of an original composition. The introductory verses are beautifully rendered into Telugu. As an invaluable addition to the Telugu Literature, I believe, it is very useful for all lovers of Telugu Literature.

**Mukteswaram,**
31—3—1929.

***Amaranadi Hanumachchastry,***
*Principal Kovvur,*
*Sanskrit College.*

బాణకవి విరచితమగు హర్షచరిత్రము బ్రహ్మశ్రీ మేడేపల్లి వెంకటరమణాచార్యులుగారిచే నాంధ్రమున వచనరూపమునఁ బరివర్తన చేయఁబడినది. మూలమునఁగల యర్థమించుకేని వదలక వ్రాయఁబడినది. అందున్నశ్లోకముల కిందున్నపద్యము లేవిషయము ననుఁ దీసిపోవు. వచనము వ్రాయునపుడు కవివర్యులు కడుఁగడు జాగరూకులై మెలగిరి. శైలిమనోహరమై పాఠకుల కాహ్లాదమునుఁ గల్పించుచున్నది. హర్షచరిత్రమునఁగల గంభీరార్థమిందునుఁ దోచుచుండును. ఏవిషయమున నీవచనము మూలమునకుఁ దీసి పోవదు. విద్యార్థులకిది కల్పతరువనఁ దగియున్నది.

ఇట్లువిన్నవించు విబుధజనహితులు,

ముక్తేశ్వరము,
31-3-1929.

జనమంచి శేషాద్రిశర్మ.
శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.
శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి.
అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి.

# ఆంధ్ర భాషా చరిత్ర

## ప్రథమోచ్ఛ్వాసము.

### పద్యములు.

ఉ॥ శ్రీరమణీ సహోదరుఁడు శీర్షమునందు వళత్సుచామరా
కారముఁ బూని రాజిలఁ జగత్త్రియపత్తననిర్మితిక్రియా
భారతఁ గంబమున్నలె సతంబు వెలుంగు మహస్సునా నమ
స్కారము సత్కృప స్గోనునుగావుతఁ గాంక్షితసిద్ధిదాయియై॥

తే॥గీ॥ కాలకూటవిషస్పర్శ గాఢమూర్ఛ
మునుఁగు కైవడి హాలకంఠమును గ్రహించి
తత్కృతానంద పరవశత్వమున నేత్ర
యుగము మూసెడు శర్వాణి నుగ్గడింతు॥

తే॥గీ॥ అంబుజాసనురాణి వర్షాంబనంగ
నవఁడు బుణ్యాంబుభారత మిద్ధరిత్రిఁ
జేసి నిల్పెను కవిసరోజాతజాతు
డట్టిసత్యవతీసూను నాత్మఁ దలఁతు॥

తే॥గీ॥ రాగదూషితదృష్టుల రమ్యగుణులు
కామకారులు ముఖరులు కలుషమతులు
కోకిలలమాడ్కిఁ గుకవులు కుంభినిపయిఁ
దరుచు జనియించుచుందురు తప్పులెంచ॥

తే॥గీ॥ ప్రతిగృహంబున భషకాళి భంగి నెంచ
జాతిమాత్రవిశిష్టు లసంఖ్యులైన
కవులఁ జూతుము శరభమృగవ్రజంబు
పోల్కి నుత్పాదకులు లేరు బుద్ధిశక్తి॥

తే॥గీ॥ అన్యవర్ణపరావృత్తి నధిగమించి।
బంధచిహ్ననిగూహనపరతఁ గల్గి।
నెగడు కవిచోరుఁ డెవ్వఁ డనింద్యసుజన
తతిఁ బయల్పడు నూహింపఁ దనకుఁ దానె॥

తే॥గీ॥ ఔత్తరీయుల కవనంబునందు శ్లేష।
లర్థమాత్రంబె వరుణాశ నలరువారి।
కక్షరాడంబరంబె గౌడక్షితిస్థ।
కవుల కుత్ప్రేక్ష దాక్షిణాత్యకవులలోన॥

తే॥గీ॥ అర్థనూత్నత యగ్రామ్యమైనజాతి।
క్లేశవిరహితమా శ్లేషరాశి రసము।
వికటమౌ వర్ణగుంఫనవిభవ మొకట।
చోటఁగలుగుట దుష్కరమౌట నిజము॥

తే॥గీ॥ సర్వవృత్తాంతగామియై సకలదిశలఁ।
బర్వ దెవ్వరికవనంబు ప్రబలమగుచు।
భారతము వోలె నట్టి యసారకవుల।
కవనమేటికిఁ గాల్పనే భువిని దలఁప॥

తే॥గీ॥ దీర్ఘముచ్ఛ్వాసమంతమొందినను వాణి
యెవరిముఖమం దఖిన్నయై యొప్పుదురారు।
నట్టి యాఖ్యాయికాకారులైనకవులు।
జగతి వంద్యులుగారెట్లు సరసులకును॥

క॥ రవిసుతదృక్పథగతపాం।
డవశక్తినిఁ బోలి జారె నానావిధస।
త్కవివరుల దర్పమెద వా।
సవదత్తాఖ్యాతగద్య సత్కావ్యమునన్॥

# హర్ష చరిత్రము.

తే॥ హారి పదబంధరుచిరతాపూరితంబు।
రచితవర్ణక్రమస్థితి రమ్యతాఢ్య।
మాచు రంజించు రసికుల నవనిపుగతి।
భట్టహారిచంద్రకవి గద్యబంధ మిలను॥

తే॥గీ॥ శుద్ధజాతి విశిష్టతాశోభితంబు।
లైన రత్నచయంబుల నవఘళించు।
భాషితంబులఁ గోశంబు పరిఢవిల్ల।
శాతవాహనకవి గూర్చె సరసులలర॥

తే॥గీ॥ ప్రకటకుముదోజ్జ్వలంబైన ప్రవరసేన।
ధరణినాథుని యశము వానరుల సేన।
పగిది సేతువుచే నకూపారపార।
భూమిఁ జెందెను కవులెల్లఁ బొగడునట్లు॥

తే॥గీ॥ సూత్రధారకృతారంభ సుందరములు।
భూమికావ్రాత సౌష్టవ భూషితములు।
పృథుపతాకలు దేవతాప్రీతిదములు।
కోవిలలమాడ్కి నొప్పెడు గొప్ప నాట।
కములు రచియించి భాసుఁడు గాంచెఁ గీర్తి॥

తే॥గీ॥ మధురసస్యందితిమ్యత్సుమవ్రజంబు।
నందువలెఁ గాళిదాసుని సుందరంబు।
లైన సూక్తులఁ గర్ణపేయంబులనుచుఁ।
బ్రీతిఁ గాంచని మనుజుఁడీ పృథివి గలఁడె॥

తే॥గీ॥ అద్రినాథాత్మజామనోహ్లాదనంబు।
నళినబాణసముద్దీపనంబు నైన।
భర్తృనగచాపులీల కైవడి నెవనికి।
వాబృహత్కథ కలిగింప దద్భుతంబు॥

హర్ష చరిత్రము.

తే॥గీ॥ ఆఢ్యరాజకృతోత్సాహ మాత్మలోన॥
దలఁచినపుడెల్ల నాజిహ్వ జళుకుతోడఁ॥
బోవు వెనుకకుఁ జెప్పఁగఁ బోదు కవిత॥
నిట్టిదశ నేనుబలుకంగ నెట్లు నేర్తు॥

తే॥గీ॥ నిర్వహణభీతి మనములో నివ్వటిల్ల।
నవనిపతియందు నాకున్న యధికభక్తి।
నతిగభీర మహాఖ్యాయికాంబునిధిని।
జిహ్వతో దాటు చపలతఁ జేయుచుంటి॥

తే॥గీ॥ పాలయ శోభనవర్ణ సంకలితములును।
బ్రకటవిమలార్థ సంపత్తిభాసురములు।
నైన శబ్దాలి నలరు నాఖ్యాయికయును।
సౌఖ్యకరబోధ మొసఁగెందు శయ్యపగిది॥

తే॥గీ॥ తద్ద రాజిల్లు నుగ్రప్రతాపవహ్ని।
వరణకృతలోక రక్షణాపాటవుండు।
భూరియాచక బృందమనోరథైక।
సిద్ధిశ్రీశైలమగు హర్షుఁ డిద్ధయశుఁడు॥

# హాస్యచరిత్రము.

తొల్లి నిఖిలలోకస్రష్టయగు పరమేష్ఠి నిజనివాసస్థానంబైన
సత్యలోకంబున సరస్వతీసమేతుండై యుత్ఫుల్లపుండరీకాసనంబున
సుఖాసీనుండై సునాశీరప్రముఖబృందారకబృందంబు, సప్తర్షిపురస్సర
బ్రహ్మర్షిగణంబు, దక్షచాక్షుషప్రభృతిప్రజాపతినికరంబుఁ బరివే
ష్టించి భక్తినమ్రులై సేవింపఁ బేరోలగంబున నున్న
సమయంబున నాసదస్యులలోఁ గొందరు స్తుతిచతు
రంబులగు సూక్తంబులఁ బఠించిరి. కొందరు బ్రహ్మోద్యం
బులగు కథల నుడివిరి. అన్యులు ప్రశంసాపరంబులగు సామంబులఁ
బాడిరి. ఇతరులు వివృతక్రతుక్రియాతంత్రంబులగు మంత్రంబుల
నుచ్చరించిరి. అపుడచ్చటఁ బ్రకృతిరోషణుండు తారాపతిసోదరుండు
నత్రిపుత్రుండు మహాతపశ్శాలియునగు దుర్వాసుండు మందపాలుం
డను నొకసంయమితోఁ గలహించి సామగాన మొనర్చుచుఁ గ్రోధా
ధతవలన స్వరంబుఁ దప్పెను. అయ్యెడ నది విని యచటనున్న మహా
నులందఱు శాపభయత్రస్తులై మౌన మవలంబింప నన్యాలాపవ్యా
జంబునఁ గమలాసనుం డలక్ష్యము సేయ నీషదున్ముక్తబాలభావయు
నవయౌవనాలంకృతగాత్రియు నగు సరస్వతి పార్శ్వవర్తినియై పితా
మహుని వాలవ్యజనంబుచే వీచుచుఁ బక్కున నవ్వెను. తానొనరిం
చిన స్వరస్ఖాలిత్యమున కిట్లుపహసించిన వాగ్దేవినిఁ గాంచి దుర్వా
సుం డతిరోషావిష్టుండై ఓసి దురాత్మురాలా, దురభ్యస్తవిద్యాలవ
గర్వితురాలా, నన్నుపహసించెదవా నీవిద్యామదం బడగించెద నిది
గో చూడుమని పటపటఁ బండ్లు గొరుకుచు శిరఃకంపశిథిలితజటాబం
ధుండు, నాబద్ధభీషణభ్రూయుగుండు స్వేదజలక్లిన్నసర్వాంగుండు
నౌచుఁ బద్మజురాణిని శపియింపఁ దలంచి కరగతకమండలూదకముఁ
దీసి యాచమనముఁ జేసి శాపోదకంబుఁ బరిగ్రహించెను.

అత్తరి సుధాఫేనపటలపాండురదుకూలావృతాంగి, భస్మపుండ్రకరాజితలలాటఫలక, వైకక్ష్యకమాలాలంకృతవక్షస్థలయు నైన సావిత్రి తర్జనోద్యత్తర్జనీకంబగు తనదక్షిణహస్తముఁ బైకెత్తి "ఓరి దురాత్ముఁడా? అనాత్మజ్ఞుఁడా, సురాసురమునిమనుజనందనీయచరణారవింద, త్రిభువనజనని సరస్వతినిఁ గ్రోధోద్రేకంబున నోడలెఱుంగక యిట్లు శపియింపఁగోరెదవా" యని సర్వశ్రావ్యంబగు నత్యుచ్చస్వరంబుతోఁ బలుకుచు సభలో లేచెను. "ఋషిసత్తమా క్షమియింపుము ఈమె శాపమున కభూమి" యని గీర్వాణులును, "గురువర్యా యీయపరాధము నొకదానిని సైరింపుమని" స్వశిష్యులును, కుమార! "నీ చేసిన తపంబున కిట్లు భంగమాపాదింప వలదని" జనకుఁడగు నత్రియుఁ బలు తెఱంగుల వేడుకొనుచున్నను వినక రోషావేశవివశుండై దుర్వాసుండధోలోకంబగు మర్త్యభువనంబునకుం బొమ్మని పలుకుచు శాపజలంబుల విసర్జించెను. అంతఁ బ్రతిశాపమిచ్చుట కుద్యుక్తురాలైన సావిత్రినిఁ జూచి, సరస్వతి సఖి కోపముడుగుము ద్విజన్ములసంస్కృతబుద్ధులైనను జాతిమాత్రపూజ్యులని పలికి నివారించెను.

అట్లు శపింపఁబడిన సరస్వతి నవలోకించి పద్మసంభవుండు ఋషిసదస్సులోఁ బుట్టిన శాపకలకలము నివారించుచు సరస్వతీ మర్త్యభువనప్రస్థానమంగళపటహాయమానంబగు కంఠరవంబున నాశాముఖంబులఁ బూరించుచు దుర్వాసునిఁ జూచి "మునివతంసమా నీవు నడిచిన తెరువు సాధుసేవితము కాదు. ఇది పరలోకభంజకము అజితేంద్రియత్వము సర్వాపన్నిదానము క్రోధాంధుండు కార్యాకార్యంబుల తెఱుఁగడు గురుహత్యాదిమహాపాపంబుల నైనఁ జేయుటకు వెనుదీయఁడు. సాత్వికులగు కృతాత్ములు భుజంగంబు జీర్ణనిర్మోకంబు చాడ్పున మనంబున నొదవు క్రోధవృత్తినిఁ బరిత్యజించెదరు. నిసర్గవిరోధులగు పయఃపావకంబుల మాడ్కి ధర్మక్రోధంబు లొక్కచో నుండుట యసంభవము సకలవిధతపస్సులు క్షమామూలకంబులు ప్రతిమనుజుని దృష్టియుఁ బరదోషదర్శనదక్షమైనట్లు స్వదోషగ్రహణసమర్థమై

యుండదు. మహాతపశ్చరణమేడఁ బరదోషాన్వేషణపరత్వమేడఁ బ
త్ముష్కృంతుండయ్యు నతిరోషణాంధుఁడే. ఆలోకమునుఁ బరిత్యజించి
యంధకారంబునంబడియెద వేల? లోకవినాశముకొరకు విషపాదపము
వలె జటావల్కలములఁ దాల్చితివి. చిత్తశాంతిశూన్యుఁడవై శైలూ
షునిపగిదిఁ గృత్రిమమగు నీతాపసవేషమును వ్యర్థముగాఁ దాల్చితివి.
ఇచ్చటనున్న యీమహర్షులందరు జడులుమూకులుగాని రోష
దోషదూషితమగు నీచిత్తవృత్తిని నిగ్రహించుకొనఁ జాలక నిరపరా
ధిని యగు సరస్వతి నేల శపించితి"వనిపలికెను.

ఇట్లుప్రజాపతి దుర్వాసుని దూషించి సరస్వతి నాలోకించి
"దేవి విషాదము నొందకుము. ఈసావిత్రియుఁగూడ నిన్ననుసరిం
చి వచ్చి మద్వియోగజనితదుఃఖలవంబైన నీమనంబున కంటకుండఁ జేసి
నిన్ను రంజింపజేయును. పుత్రముఖకమలదర్శనము కాగా నీ
శాపము నివర్తించు"నని చెప్పి తన్నుపాసింపవచ్చిన సురాసురముని మ
నుజమండలంబునకువీడుకోలొసంగిస సంభ్రమోపగతనారదస్కంధవిన్య
స్తహస్తుండై సముచితాహ్నికకృత్యంబుల నిర్వర్తించుట కభ్యంతరం
బునకుం జనియె. శాపనిర్విణ్ణమానసయైన సరస్వతియు నధోముఖి
యై నిజపదాంగుష్ఠవిలిఖ్యమానభూతలంబున దృష్టినిగుడించుచు ను
స్సురని లేచి సావిత్రితోఁగూడ నాత్మనివాసంబున కరిగె.

అంత సరస్వతీశాపవృత్తాంతంబుఁ బాతాళతలవాసుల కెఱుఁ
గింపఁ జనువానికైవడి సూర్యుం డపరజలనిధిం గ్రుంకె. ప్రచలదనే
కవిద్యాధరచరణాలక్తకరసానులిప్తంబైనట్లంతరిక్షం బంతయు నరు
ణిమాలంకృతం బయ్యె. అలంకుర్వాణవరవర్ణినీధమ్మిల్ల మల్లికా
గంధవహంబగు సాయంతనగంధవహంబు మందముగా వీచసాగెను.
సంకుచత్సరోరుహముకుళకుటీరగర్భంబుల షట్చరణసమూహంబు
శయనింప, నృత్తోద్ధూతధూర్జటి జటాటవీకుంజకోరకనికురంబసన్ని
భంబగు తారాగణంబు వియత్తలంబున సంకురింప, కాలమేఘసంకాశం

బగు తరుణతమస్సందోహంబు జగంబు నావరింప, నిశావధూకర్ణ పూరచాంపేయ కలికాప్రకరోపమానంబగు దీపశిఖానివహంబు గృహాభ్యంతరంబులం బ్రకాశింప, పురందరదిగ్వధూముఖలంబమాన తిమిరచికురజాలంబు నిజకరంబుల నెగజిమ్ముచు విభావరీ దంతపత్రాయమాణుండగు శ్వేతభానుం డుదయింప ముఖపంకజంబున విన్నదనంబు దోప గళితాశ్రుధారాసిక్తకపోలయై మానంబున నెద్దియో ధ్యానించుచుండెడి సరస్వతినిం జూచి సావిత్రి "సఖి యెంతటి ప్రాజ్ఞులకును హితాహితంబుల నేర్పరించి యుపదేశింపం జాలినసామర్థ్యము గల నీయెదుట మాటాడుటకు నాజిహ్వ లజ్జించుచున్నయది. అయినను ప్రాప్తావసరంబని యించుక తక్కాణించెద సావధానమనస్కవై యాకర్ణింపుము. దుర్విధిచేష్ట యెట్టిగుణవంతుని యందును దుర్జనునిభంగి నిర్దాక్షిణ్యమనియు దురతిక్రమణీయమనియు నీ వెఱింగిన యంశమే నీమని వలనంగలుగు నవమానలేశమును మానవంతుని మానసమున కమితకాలుష్యము నొదవించును అతిసుకుమారులగు జనులను సంతాపలవము మాలతీకుసుమమును వలె మ్లానినొందించును. గొప్పవారలకు వాటిల్లు నత్యల్పక్లేశమును గదమున కంకుశముపగిది నధికబాధ నొసంగును. సహజస్నేహపాశబద్ధమగు జన్మభూమి మమకార మెరికిని దుస్త్యజము పరిచితజనవిశ్లేషము క్రకచమువలె హృదయవిదారకము నీవిట్టిమరవస్థ నొంద నర్హవు కావు. దుఃఖవిషతరూత్పత్తిక భూమియై ఫలప్రదము బలవత్తరమునగు పురాకృతశుభాశుభకర్మ యగ్రగామియై యుండ విద్వాంసునికి శోకింపంబనిలేదు. అమంగళములగు నశ్రుబిందువులు సకలలోకమంగళంబగు నీముఖకమలంబున కపవిత్రతం గలిగించుచున్నవి. కావున నీవిప్పుడు విరతశోకవై యేభూభాగంబు నలంకరించుటకుం గోరెదవో దానిని నాకుం జెప్పుము నీకేపుణ్యక్షేత్రమందు నివసించుట కభిలాషగలదు సహపాంశుక్రీడాస్నిగ్ధహృదయనగు నేను నీ వచ్చటనున్నను నానావిధోపచారముల నొనర్చుటకు సిద్ధముగా

నున్నాను. నేటిదినము మొదలుకొని మనోవాక్కర్మములచే సర్వవిద్యావిధాతయు సకలకళ్యాణప్రదాతయు సుధాసూతికలికాకల్పితావతంసుండు, చరణపంకజరజఃపవిత్రీకృతదేవాసురుండు, త్రిభువనగురుండు నగు చంద్రార్ధమౌళిని భజింపుము. అతఁ డల్పకాలములో నీకు శాపశోకవిరతిఁ గావించునని పలుక సరస్వతి "ప్రియసఖీ నీతోఁగూడ వసియించు నన్ను బ్రహ్మలోకవిరహముగాని శాపశోకముగాని యిసుమంతయుఁ బీడింపఁజాలదు. కాని కమలాసనచరణకమలసేవాసుఖవిచ్ఛేదము నామనంబునుఁ దపింపఁజేయుచున్నది. భూలోకమందు నీ వెఱుంగని సమాధిసాధనయోగ్యంబులగు పుణ్యధామంబులు లేవు గాన నీవలసినచోటునకే నేను వచ్చెదన"ని పలికి యూరకుండెను. ఇట్లా యజునిరాణి దుఃఖావేగకలుషితమానసయై యారాత్రి నంతయు నిద్రాశూన్యముగాఁ గడపెను.

అమరునాఁడు ఖలీనక్షతనిజరథతురగముఖక్షరద్రుధిరాప్లుతుండునుంబోలె నారక్తబింబుండు, జరత్కృకవాకుచూడారుణారుణపురస్సరుండు నగు పద్మబాంధవుం డుదయింప ననతిదూరంబుననున్న పితామహవిమానహంసకులపాలకుం డిట్లొక గీతి నుచ్ఛైస్స్వరంబుతోఁ బాడెను.

తే॥గీ॥ వర్జితాశేషకలుషతాభ్రజమాన!
మానస నిరంతరావాస మహితహంసి!
దిగుము వాపికలోనికిఁ దిరుగ నీవు!
పంకజాలయసంప్రాప్తిఁ బడయఁ గలవు॥

ఇది విని సరస్వతి యిట్లు చింతించె. "దీనిచే నావృత్తాంతము సూచింపఁబడినట్లున్నది. కానిమ్ము మునివచనమును మన్నించెద"నని లేచి మహీతలావతరణసంకల్పముతో నిజవియోగవిలంబంబగు స్వజనంబు విడనాడి చతుర్ముఖుని ముమ్మారు వలఁగొని యాను

యాత్రికనికరము ననునయోక్తుల నతికష్టముతో మరలించి సావిత్రీ ద్వితీయయై బ్రహ్మలోకమునుండి వెడలెను.

తరువాతఁ గ్రమముగాఁ గోపయుప్రయాణంబుల నంధకారి మౌళిమాలతీమాలాయమానంబై, అరుంధతీధౌతతారవత్వచంబై, శచీపతిదత్తార్ఘ్యకుసుమవిసరశారంబై, సిద్ధవిరచితవాలుకాలింగ లంఘనత్రాసవిద్రుతవిద్యాధరంబై విరాజిల్లు మందాకినీస్రవంతి ననుసరించి యరిగి యరిగి మర్త్యలోకంబునఁ బ్రవేశించెను. అంతఁ గొంత దవ్వేగి యంబరలక్ష్మి స్ఫాటికశిలాపట్టశయన సదృశంబై యొప్పు పితామహాపత్యంబగు శోణాపరనామక హిరణ్యవాహంబను నొక్క మహానదంబుఁ బొడగాంచి తత్తీరవనరామణీయకాకృష్టహృదయయై సావిత్రినిఁ గని "చెలీ, మధురమయూరవిరుతిముఖరితంబులు, కుసుమపరాగపటలసికతిలతరుతలంబులు, పరిమళాకృష్టమధుకరనిచయఝంకారనాదితంబులు, నగు నీశోణనదోపకంఠభూములు నాకమితాహ్లాదకరములై యున్నవి. ఇచ్చటనే నివసించుటకు నామనం బభిలషించుచున్నద"ని సరస్వతి వచింప సావిత్రియు నట్లె కానిమ్మని సమ్మతించి యానదపశ్చిమతీరంబున శిలాతలసనాథంబగు నొక్క తటలతామంటపమును విడిమట్టుగా నేర్పరుచుకొని యందు వారిరువురుఁ బ్రవేశించిరి. కొంతవడి విశ్రమించిన పిదప సరస్వతి సావిత్రితోఁగూడ దేవార్చనకుసుమంబులఁ గోసికొని స్నానముచేసి పులినపృష్ఠమం దొక సైకతలింగమునుఁ బ్రతిష్ఠించి యష్టమూర్తులను ధ్యానించి సద్యోజాతాదిమంత్రంబుల ననుసంధించుచు ధూపదీపాదిపురస్సరంబుగా భక్తినమ్రయై పూజఁగావించెను. అప్రయత్నోపలభ్యంబులగు ఫలమూలాదులచేతను అమృతతుల్యంబులగు శోణనదజలంబులచేతను శరీరస్థితిని నిర్వర్తించె. ఆపగటి నంతయుఁ గడిపి సాయంకాలంబున కృతసంధ్యోపాస్తియై యాలతామంటపమం దున్న శిలాతలంబునఁ బల్లవశయనంబు రచించుకొని నిద్రించెను.

ఆమఱుసటిదినముందుఁగూడ నహోరాత్రంబుల నాక్రమంబుననే గడిపెను.

ఇట్లు కొంతకాలము గతింపగా నంత నొకనాఁడు దినకరుండు ధూమమాత్రోద్గతుండై ప్రకాశింప నుత్తరదిక్కున ప్రతిశబ్దపూరిత వనగహ్వరంబగు తురంగమహేషితంబు వినవచ్చెను. అంత నలువరాణి యుట్టినిజనారణ్యంబున హయహేషాధ్వనికిఁ గారణం బేమియని యాలోచించి కౌతుహలోత్ఫుల్లచిత్తయై నివాసీకృతలతా మంటపద్వారంబున కేతెంచి కేతకీగర్భపత్రపాండురంబగు రజఃపాలంబుఁ గాంచెను. ఆరజోమండలమధ్యంబునఁ గృపాణపాణులు, సేవాగృహీతవివిధవనకుసుమపర్ణఫలమూలులునై, "శీఘ్రముగా జనుదెమ్ము, పరుగిడుమని" పలుమాఱుచ్చకంఠరవంబుతో నొకరి నొకరుఁ జీరుచుండు సహస్రసంఖ్యాకులైన పదాతులను, వారి వెనుక నాశ్వికసంఘంబు నవలోకించె, తత్పదాతిబలమధ్యంబున ధృతసితాతపవారణుండు ధవళహయారూఢుండు, నిర్భర్త్సితమనోభవలావణ్యగణ్యుండు నగు నొక్క యువతల్లజుని, వానిపిఱుంద నశ్వారూఢుండు, లోమశోరస్కుండు, ధౌతదుకూలవేష్టితశిరస్కుండు, పరిణతవయస్కుం డయ్యు ననవరతవ్యాయామకఠినగాత్రుండు నగు నొక్కపురుషునిఁ జూచెను. అంత పురోయాయిపదాతివర్గంబు విన్నవింపఁగా సముపజాతకుతూహలంబునఁ దూర్ణప్రధావితతురంగముండై యాతరుణుం డాలతామంటపసవిధంబున కేతెంచి యనతిదూరంబున నశ్వమునుండి దిగి నివారితాశేషపరిజనుండై పదాతియై యాస్థవిరునితోఁగూడ సరస్వతీసావిత్రులనుఁ జూడవచ్చెను. అత్తఱి వారిరువురును సప్రశ్రయంబుగాఁ గృతాభివందనుండై యెదుట నిలిచియున్న యక్కుమారకుం బ్రీతిపూర్వకంబుగా విలోకించి క్షేమంబరసి పల్లవాసనంబున సుఖోపవిష్టుం గావించి కుసుమఫలగర్భంబగు వనవాసోచితాతిథ్యంబు నొసంగి గారవించిరి.

ఇట్లు సత్కారప్రీతులైన వాగ్భటాదులు పల్లవాసనంబుల నధిష్ఠించి యుండ నాతిదూరధరాతలనిషణ్ణయైన సరస్వతి కొంతసేపూరకయుండి యావృద్ధనుద్దేశించి "ఆర్యా! సహజలజ్జాధనంబగు ప్రమదాజనంబునకుఁ బ్రథమాభిభాషణ మశాలీనతావేదకము. అంతమలో వనమృగీముగ్ధలగు కులాంగనాజనంబులకు మరింత ఆలోకనకృతార్థంబగు చక్షుర్యుగంబునుఁ జూచి యసహిష్ణువై శ్రోత్రవృత్తి యుష్మదుదంతశ్రవణకుతూహలంబు గలదియై నన్నుఁ బ్రేరణఁ జేయుచున్నది. ప్రథమదర్శనసమయమందె సజ్జనుం డుపాయనంబుగా నిజప్రణయం బొసంగును. పరప్రశ్రయావర్జితంబైన మనం బప్రగల్భునిసైతము మధువువలె వాచాలునిగాఁ జేయును. అతినమ్రమైన సజ్జనునియందున్న గుణంబు కార్ముకంబునుంబోలెఁ బరకోటి నొందించును. లోకములో విరించికృతసృష్ట్యతిశయములు ధీరుల మనంబులకుఁ గూడ విస్మయంబొదవించును. లోకాతిశాయియైన యీమహానుభావుని రూపలావణ్యసంపదఁ జూడఁగా సౌజన్యపరతంత్రమగు నీతనిదర్శనప్రసాదంబె నన్నిట్లు మాట్లాడించుచున్నది గాని యువతిజనసహజాత్మమగు చాపలముగాదు. మీరాకచే నేదేశము విరహపర్యుత్సుకజనంబు గలదిగాఁ జేయఁబడియె? మీకు గంతవ్యదేశం బెద్ది? రమాకాంతునికిఁ గౌస్తుభంబుపగిది సమృద్ధతపఃపరిపాకంబుగల యెవ్వాని కీతఁడు హృదయానందవర్ధనుఁడు? త్రిభువనవందనీయమైన ప్రాతస్సంధ్యవలె నిట్టి తేజోవంతునిఁ గన్నతల్లి యెవ్వతె? ఏపుణ్యాక్షరంబు లీతని నామధేయం బలంకరింపుచున్నవి? ఆర్యా! మీవృత్తాంతమునుఁగూడఁ దెలిసికొనుటకు నామనంబు తుల్యకుతూహలము గలదియై యున్నదని" వచించెను. అందుపై నాస్థవిరుండు "ఆయుష్మతి! సజ్జనులకుఁ బ్రియంవదత్వము కులవిద్య. నీముఖమే కాదు మమ్మిట్లు సుధాశీకరశీతలములగు వాక్కులచే నానందింపఁ జేయుటవలన నీహృదయంబుగూడఁ జంద్రమయమని తోఁచుచున్నది. సౌజన్యజన్మభూములయిన మీబోఁటి

వారలు లోకుల పుణ్యవిశేషంబుచేఁ జనింపుదురు. భువనమహర్షు
యులతో సంభాషణ మటుండనిమ్ము. వారి దర్శనంబె సకలదురి
తామయభేషజంబు. ఇక్కుమరుండు త్రైలోక్యమాననీయంబై
ప్రకాశించుచున్న భృగువంశంబున కలంకారభూతుఁడు. నిజప్రభావ
సంస్తంభితజంభారిభుజస్తంభుండు, సురాసురమకుటమణిరశ్మిరంజిత
పాదపంకేరుహుండు నిజతేజఃప్రసరప్రదగ్ధపులోమాసురుండు నగు
భృగుమహర్షికి బహిశ్చరజీవితంబనఁ దగిన తనయుండు. ఈతని
నామధేయంబు దధీచి. ఈతనితల్లి యనేకరాజన్యసహస్రానుయా
తుండు విభవజితసుత్రాముండునై వెలుంగు శర్యాతికిఁ బ్రియతనూజ
యైన సుకన్య. ఈతని మాతామహుండు గర్భవతియైన తనపుత్త్రి
కను వైజననమాసంబున భర్తృసదనమునుండి తనగృహంబునకుఁ
దోడ్కొనిపోయెను. అచట నామెకుఁ గొలదిదినములలో నీదీర్ఘా
యువు జనించెను. పితామహమందిరంబున నిక్కుమారుండు బాల
చంద్రునివలెఁ గాలక్రమంబున వృద్ధినొందెను. ఇతనిజనని పితృభవ
నంబునఁ గొంతకాలముండి భర్తృనిలయంబునకుఁ బోయినను
శర్యాతి మనోవినోదనుండగు నీదౌహిత్రుని విడువఁజాలక తనయొ
ద్దనె యుంచుకొనెను. ఇంతకాల మీభృగువంశదీపకుండు తాత
గారి యింటనుండి సకలశాస్త్రకళాకలాపంబునఁ గృతపరిశ్రముండై
మహావిజ్ఞానరాశి యయ్యె. ఇపుడు పారూఢయౌవనుండగు నీతని
వీక్షించి నావలె నీతనిజనకుండు నానందించును గాక యని తలంచి
యతికష్టముతోఁ బితృసన్నిధికిఁ బంపుచున్నాఁడు. నేను సుగృహీత
నామధేయుండైన యాశర్యాతికాజ్ఞాకరుండనగు భృత్యుండను
నా పేరు వికుక్షి. నాయేలిక పితృగృహంబునకుఁ బోవుచున్న
యీతనికి సహాయునిగా నన్నుఁ బంపెను. ఆశర్యాతివంశము
మాకుఁ గులక్రమాగతమగు రాజకులము. ఇచటికి గవ్యూతిమాత్ర
దూరంబునఁ జైత్రరథకల్పంబైన కాననంబా చ్యవనుని యాశ్రమము
అంతవరకు మేము బోవలసియున్నది. మాయందుఁ గటాక్షముండె

నేని యీజనుడు శ్రవశార్మ(డేని మీయిద్దరివృత్తాంతమును దెల్పు టకు బ్రార్థించుచున్నాము. మీయాకారముల వీక్షింపఁగా మీరు దివ్యాంగనలని తోచుచున్నది. మీగోత్రనామము లెవ్వియో తెలుపవలయున"ని వికుక్షి విన్నవింపగా సరస్వతి యిట్లనియె. "ఆర్య కాలక్రమమున మావృత్తాంతమంతయు మీకుఁ దెలియఁగలదు. మేమిచటఁ గొంతకాలము నివసించియుందుము. మానివాసము మాకు సమీపముగా నున్నది. పరిచయమైనకొలది మావృత్తాంతము మీకుఁ దెలియును. యదృచ్ఛాదృష్టులమగు మమ్ము మరువవలదు." అంత దధీచి నవాంభోధరగంభీరధ్వాననిభంబగు భారతిచే వసలతాభవనమయూరంబుల నాట్య మాడించుచు "ఆర్యా! ఆరాధ్యమానయై ఆర్య మనయందుఁ గృతప్రసాదకాఁగలదు లెమ్ము-మాజనకునిఁ జూడఁబోవుదము"ని పలుకగా వికుక్షియు వారికి నమస్కరించి తదనుజ్ఞాతుండై యాఋషికుమారుని వెంటఁ జనెను.

సరస్వతియు హయారూఢుండై చనుచున్న యాదధీచి ననిమేషవృత్తిగల చక్షుస్సుతోఁ జూచెను. శీఘ్రముగా శోణనదమును దాటి యకుమారుండు తండ్రియాశ్రమపదంబుఁ జేరెను. అట్లా చ్యవనసూనుండేగిన సరస్వతి కొంతవడిఁ దదశ్వఖురోద్ధూతపరాగంబును, కొంతసేపతఁడు వోయిన దిక్కునుఁ జూచి చూచి కష్టముతోఁ దనదృష్టిని మరలించుకొనెను. సరస్వతీహృదయం బననుజ్ఞాతమై దధీముని వెంటఁ జనెను. వనలతకు నూతనపల్లవమువలె నామె చిత్తమందు రాగ ముదయించెను. సాలస్యయై, శూన్యహృదయయై, సనిద్రయై యాదినశేషమును గడిపెను. అంతవరుణదిశాపర్యస్తమండలుండై కమలినీకాముకుం డస్తమింప, తరుణతమాలశ్యామలంబగు తిమిరపటలం బంతరిక్షంబున వ్యాపింప, సంచరత్సిద్ధసుందరీనూపురరవాకృష్టంబగు మందాకినీమరాళంబుమాడ్కి కుముదబాంధవుండు వియత్తలం బధిరోహింప కృతసంధ్యాప్రణామయై సరస్వతి

పల్లవశయనంబునఁ బవ్వళించియుఁ బ్రజాగరక్లాంతయై యారాత్రిం బుచ్చెను. సావిత్రియు సాయంతనక్రియాకలాపంబు యథోచితంబుగా నిర్వర్తించి యుక్తకాలమునఁ బ్రవాళశయనంబున నిద్రజెందెను. సరస్వతి పలుమా రంగవలనవిమర్దితశయ్యోత్సంగయై కన్నులు మూసికొని యున్నను నిద్రలేకుండఁ బొగులుచు "నాహా మర్త్యలోకము సర్వలోకములకు మీఁదిది. దీనియందు సమగ్రగుణపూర్ణములు త్రిభువనభూషణంబులు నగు నిట్టి మహారత్నంబు లుద్భవిల్లుచున్నవి. అది నిజమే కదా? తన్ముఖలావణ్యప్రవాహంబులోఁ జందురుఁడొక బిందువు. కుముదకువలయకమలాకరంబులు వాని చక్షుర్విక్షేపముల"ని తలపోయుచు నెట్టకేలకు నిదురించె.

అంతఁ గొన్ని దినంబు లరిగిన పిదప నొకనాఁ డామాగణంబు ననే నిజనివాసంబునకుఁ బోవుచున్న వికుక్షి నివారితపరిజనుండై ఛత్రధారునితో సరస్వతీపర్ణకుటీరంబున కేతెంచినఁ జూచి సరస్వతి సంభ్రమంబునఁ గొన్నిపదంబు లెదురుగా నేగి యాదరముతో సముచితాసనాసీనుం గావించి యతిథిసత్కారం బొనరించెను. అపనీతాధ్వశ్రముండైన వానిం గని సావిత్రి "ఆర్యా! నాఁడు మీతో వచ్చిన యాఋషిపుత్రునకు సేమంబే? యని" యడుగ నావికుక్షి "ఆయుష్మతి! అతఁడు కుశలంబుగా నున్నాఁడు. నిరంతరము మిమ్ములను స్మరించుచుండును. అదేమియోకాని కొన్నినాళ్లనుండి కేవల కృశాంగుండై శూన్యహృదయుండునుఁబోలెఁ గానుపించునని" పలికెను. అది విని సావిత్రి "రూపజితమారుండగు నక్కుమారుండు మహానుభావుండని నాయభిప్రాయము ఏలయన నపరిచితులమయ్యు క్షణమాత్రదర్శనధన్యులమైన మమ్ము మరువలేదు. యాదృచ్ఛికముగా మార్గలతాసక్తంబగు నంశుకంబువలె మాయుం దాతని మనంబు ముహూర్తమాత్రం బాసక్తం బయ్యె. మీస్వామిపుత్రు నాభిజాత్యమధిక సౌజన్యముచే నలంకరింపఁబడి యున్నది. అలసమగు నిలో

కము సులభ సౌహార్దము లైన మహానుభావుల మనంబుల నెఱుఁగఁ జాలదు. మహాత్ముల యౌదార్యాతిశయము వర్ణింపఁ దరము కాద"ని నుడివెను. ఇట్లు వికుక్షి మధురాలాపగోష్ఠిచేఁ బెద్దప్రొద్దు గడిపి వారిచే నభ్యనుజ్ఞాతుండై యథాభిలషితదేశంబున కరిగెను.

ఇప్పగిది దధీచిసరస్వతులు పరస్పరదృఢానురాగబద్ధచిత్తులై తృతీయపురుషార్థలాలసత్వంబున నొక్క సంవత్సర మొకచోటఁ గూడియుండిరి. అంత సరస్వతి గర్భంబు ధరించి దశమమాసంబున సర్వలక్షణాభిరాముండగు తనయుం గాంచె. జాతమాత్రుండైన యాడింభకునికి సరస్వతీవరప్రభావంబున సరహస్యములగు వేదములు, సర్వశాస్త్రములు, సకలకళలు స్వయముగా నావిర్భవించెను. అంత దధీచిని వీడ్కొని సరస్వతి సావిత్రితో బ్రహ్మలోకంబునకుం జనియె. దధీచియుఁ దద్విరహోత్తప్తమానసంబున జాతవైరాగ్యుండై భార్గవవంశసంభూతుఁడగు తనసోదరుని భార్యయగు నక్షమాలయను బ్రాహ్మణిని నిజపుత్రసంవర్ధనమందు నియమించి తపశ్చరణంబునకు వనంబున కేగె. సరస్వతి తనయునిఁ గాంచిన దివసమందె అక్షమాలయు నొకసుతునిం గనెను. ఆసాధ్వి వారిం సఁబు పక్షపాతశూన్యయై యాయిరువురు శిశువుల నొక్కరీతిగా స్తన్యపానాదులచేఁ బెంచెను. ఆయుభయులలో మొదటివాని పేరు సారస్వతుఁడు రెండవవాని పేరు వత్సుఁడు. ఏకగర్భజాతులకుం బోలె వారిద్దరికి నన్యోన్యప్రీతి గాఢంబుగా నుండెను.

అంత స్వమాతృప్రభావముచే నావిర్భూతాశేషవిద్యాకలాపుండగు, సారస్వతుండు, ప్రేమాస్పదుండు, ప్రాణసముఁడు, సోదరుఁడు సవయస్కుఁడు నైన వత్సునికి సమస్తవాఙ్మయమును సంక్రమింపఁజేసి కృతోద్వాహుఁడైన యాతని కాప్రదేశమందే ప్రీతికూటమను నొక నివాసస్థానమునుఁ గల్పించి యిచ్చెను. దండమేఖలా

కృష్ణాజినవల్కలాక్షమాలాదులను ధరించి జటిలుడై తండ్రి తపంబాచరించుచున్న చోటికిఁ బోయెను. తరువాతఁ గాలక్రమమున ప్రవర్ధమానాదిపురుషజనితాత్మచరణోన్నతి, పరమేశ్వర శిరోలాలితము, సకలకలాగమగంభీరము, మహామునిమాన్యము, వ్యాప్తభూతలంబునై భాగీరథీప్రవాహంబువలె విపులమైన వంశమొకటి యావత్సుని వలనఁ బ్రవర్తించెను. ఆవంశమందుఁ బుట్టినవారందరు ప్రసన్నప్రకృతులు, పరపరీవాదపరాఙ్ముఖులు, ధీరధిషణావధీరితవిబుధాచార్యులు, వావదూకులు, విమత్సరులు, కవులు, సరసభాషణావర్జితపరమనస్కులు, సత్వవ్రతులు, క్షమావంతులు, పరోపకారవ్యసనులు, క్రతుక్రియాదక్షులు, సాధుజనశ్లాఘనీయచరితులు, నృత్తగీతవాదిత్రకుశలులు, అధిగతపరమార్థులు, అధీతసాంగసశిరస్కవేదులు, సకలశాస్త్రసమూహాదధిసుష్టింధయులునై విలసిల్లిరి. లోకములో నా వంశము వాత్స్యాయనవంశమని ప్రసిద్ధినొందెను.

ఇట్లా వాత్స్యాయనవంశము మర్త్యలోకమందు శతశాఖమై వ్యాపింప, సంసారము సంసరింపుచుండ, యుగములు గడచి పోవ, కలియుగ మవతరింప నా వంశమందు వైనతేయునివలె గురుపక్షపాతియైన కుబేరుఁడను నొక ద్విజశ్రేష్ఠుండు జనించెను. వానికి శ్రీమన్నారాయణుని బాహుదండంబులవలె నచ్యుతుఁడు, ఈశానుఁడు, హరుఁడు, పాశుపతుఁడని నలుగురుపుత్రు లుద్భవించిరి. వారిలోఁ బాశుపతుని కశేషాగ్రజన్మచక్రచూడామణి, భూభారంబు మోడ్కి నచలకులస్థితియు నగు నర్థపతియనువాఁడు పుట్టెను. వాని కేకాదశరుద్రులవలె సోమరసపూతముఖులైన భృగువు, హంసుఁడు, శుచి, కవి, మహీదత్తుఁడు, జాతవేదుఁడు, చిత్రభానుఁడు, త్ర్యక్షుఁడు, అహిదత్తుఁడు, విశ్వరూపుఁడు నని పదునొకండ్రు సుతులు పుట్టిరి. వారిలో చిత్రభానుఁడనువాఁడు స్వభార్యయగు రాజదేవియందు బాణునిఁ బడసెను. అతని శైశవమందె తల్లి కాలధర్మము

నొందెను. అతిశయితవాత్సల్యముగల యాతనితండ్రియే మాతృత్వము నెరపెను. పితృపోషితుండై కాలక్రమంబున నిజగృహంబున వర్ధిల్లె. బాణుడు వేదవేదాంగముల నభ్యసించి కృతసమావర్తనవ్రతుఁడై సుమారు పదునాలుగేండ్ల వయస్సుఁగలవాఁడై యుండగా నాతనితండ్రి వృద్ధుడు కాకమున్నె స్వర్గతుఁడయ్యెను. పితృవియోగజనితశోకాకులచిత్తుఁడై కొంతకాల మతికష్టముతో స్వగృహంబున నుండెను. మెల్లమెల్లగాఁ గొన్నిదినములు గడచిపోవ మందీభూతశోకుఁడై యవినయనిదానమగు స్వాతంత్ర్యము కుతూహలబహుళమగు బాలభావము, ధైర్యప్రతిపక్షమగు యౌవనారంభము సంమిళితములై ప్రేరణసేయ శైశవోచితమైన యనేక చపలచేష్టల నొనర్చుచు భ్రమణశీలుండయ్యె. తనతండ్రికి శూద్రస్త్రీయందుఁ బుట్టుటచేఁ బారశవభ్రాతలనంబరగు చంద్రసేనమాతృషేణులు, భాషాకవియైన ఈశానుఁడు విద్వాంసులగు వారబాణవాసబాణులు, రుద్రనారాయణులు, వర్ణకవి వేణీభారతుఁడు, ప్రాకృతభాషాకవి వాయువికారుఁడు, వందులగు ననంగబాణసూచీబాణులు, లింగినియైన చక్రవాకిక, విషవైద్యుఁడైన మయూరకుఁడు, తాంబూలమమర్చు చండకుఁడు, భిషక్పుత్రుఁడైన మందారకుఁడు పుస్తకవాచకుఁడైన సుదృష్టి, స్వర్ణకారకుఁడగు చామీకరుఁడు, ప్రత్యవేక్షకుఁడైన సింధుషేణుఁడు, లేఖకుఁడైన గోవిందకుఁడు, చిత్రకారుఁడగు వీరవర్మ, లేప్యకారుఁడగు కుమారదత్తుఁడు, మద్దెలవాయించు జీమూతుఁడు, గాయకులైన సోమిలగ్రహాదిత్యులు, సైరంధ్రియైన కురంగిక, పిల్లనగ్రోవినూదు మధుకరపారావతులు, గాంధర్వవిద్యోపాధ్యాయుఁడు దర్దురకుఁడు, సంవాహకురాలగు కేరళిక, నర్తకుఁడైన తాండవికుఁడు, సొగటాలాడు ఆఖండలుఁడు, జూదరియగు భీమకుఁడు, శైలూషుఁడగు శిఖండకుఁడు, నర్తకియైన హరిణిక, సన్న్యాసియైన సుమతి, జైనమతస్థుఁడైన వీరదేవుఁడు, కథలుచెప్పు జయసేనుఁడు, శైవుఁడగు వక్రఘోణుఁడు, మంత్రసాధకుఁడైన కరాళుఁడు, అసురవివరవ్యసనియగు

లోహితాక్షుఁడు, ధాతువాదమెఱిఁగిన విహంగముఁడు, కులాలుఁడైన దామోదరుఁడు, ఇంద్రజాలవిద్యాకోవిదుఁడైన చకోరాక్షుఁడు నింక నన్యులు తనవెంబడిఁదిరుగ బాల్యలౌల్యంబున దేశాంతరాలోకన కుతూహలాయత్తచిత్తుఁడై పితృపితామహార్జితములు, బ్రాహ్మణజనోచితములు నగు విభవములున్నను, అవిచ్ఛిన్నమగు విద్యావ్యాసంగము జరుగుచున్నను, స్వగృహమును స్వదేశమును విడిచి నిరవగ్రహుఁడై యౌవనవికృతివశంబున స్వైరవిహారియై గ్రహవిప్లునికరణి దేశాటనపరుండై యోగ్యులకుపహాస్యుఁడాయెను. కాలక్రమమున బాణుఁడు సచ్ఛీలసంపన్నుఁడై మనోజ్ఞములగు రాజకులంబుల వీక్షింపుచు, నిరవద్యవిద్యావిద్యోతితంబులగు గురుకులంబుల సేవింపుచు, మహార్హాలాపసద్గోష్ఠిని రతి నవలంబింపుచు స్వభావగంభీరబుద్ధివిభవంబులగు విదగ్ధమండలంబులఁ బ్రవేశింపుచుఁ గొంతకాలము గడిపి మరల నాత్మవంశోచితవిద్వత్ప్రకృతినిఁ బొందెను. చిరకాలమునకుఁ దిరుగ వాత్స్యాయనవంశాశ్రయము స్వజన్మభూమియు నగు నా బ్రాహ్మణాధివాసమునుఁ జేరెను. అచ్చటఁ జిరకాలదర్శనమువలన శతగుణితప్రీతిస్నేహసద్భావములుగల జ్ఞాతులు, మిత్రులు, బాంధవులు నుత్సవదివసమునువలెఁ దనరాక నభినందింప బాలమిత్రమండలమధ్యగతుఁడై యమితానందము ననుభవించెను.

ఇట్లాంధ్రహర్షచరిత్రమందు వాత్స్యాయనవంశవర్ణనమను
ప్రథమోచ్ఛ్వాసము ముగిసెను.

# ఆంధ్ర హర్ష చరిత్ర.

## ద్వితీయోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ పృథివిఁ గూపము మాడ్కి గంభీరమైన।
పార్థివునియందు గుణశిష్టమైన పాత్రచయము।
నిరవతారజనంబుల నిఖిలకాంక్ష।
తముల సిద్ధింపజేయును దయను బాణ॥

తే॥ గీ॥ రాగవత్సరసిజంబున రవిజమైన।
లక్ష్మి నర్పించు దివసంబ లక్ష్యముగను।
దలపకెవ్వడు గుణదోషములను పరుల।
నుపకరించు నెట్టి సుజనాళి కుచితవృత్తి॥

తరువాత నా బాణు డనవరతాధ్యయనధ్వనిముఖరంబులును, యాగలోభాగతహుతాశనదీప్రవటుపరిషదధ్యాసితంబులు, సంతతజలసేకసంవర్ధితసోమలతా కేదారవిరాజమానంబులు, శిష్యజనసమానీతకుశపూలీహారితంబులు, సాక్షాత్త్రయీతపోవనంబులవలె వెలుంగు బంధుభవనంబులకుఁ బోవుచు వచ్చుచు సుఖంబుగ నుండె.

అంత నతఁ డచ్చటనున్న కాలంబులో నొకప్పుడు వసంతర్తువిగమమునందు సంఫుల్లమల్లికాధవళంబగు గ్రీష్మసమయం బేతెంచె. నూతనవినిద్రితుండై యస్తమించిన వసంతసామంతుని పయఃపాయులైన బాలాపత్యములవలె నున్న నవోద్యానములయందు దర్శనస్నేహమై మృదువయ్యెను. నూతనముగా నుదయించిన యుష్ణసమయము పృథివీగతసకలకుసుమబాధనమోక్షంబు గావించెను. హేమఘాతవినాశితకమలబాంధవుండగు కమలబాంధవుండు వైరనిర్యాతనమునకు బోవువానివలె హిమాలయాభిముఖముగా యాత్రసాగిం

చెను. చందనధూసరాంగులైన యువతులెల్ల కుముద్వతులభంగిన సూర్యాంపశ్యలై దినమంతయు నిద్రించిరి. నిద్రాలసములగు స్త్రీలదృష్టి రత్నాలోకమును సైతము సహింపజాలదయ్యె. జరతాతపమును జెప్పెడిదేమి? చక్రవాకమిథునాభినందితములైన సరిత్తులవలె రాత్రులు గ్రీష్మఋతువుచేఁ గార్శ్యమునొందింపబడియె. పాటలామోదభరితంబగు జలమునే కాదు. దివసకరసంతాపమువలన వాయువునుగూడఁ బానముచేయుటకు లోకమునకు వాంఛపొడమెను. క్రమముగా ప్రచండచండరశ్మియై, శుష్యన్నదీకాసారంబై, దావజనితజగన్నీరాజనంబై, సంతప్తసికతిలమార్గసంచరణభీషమనష్యంబై, సవిలస్యందసందేహాధావమానవనమృగాకర్షణచతురమృగతృష్ణికౌఘంబై, భూవివరనిలీనశలలీమృగంబై, నిదాఘకాలంబతిశోయింప నొక్కనాడపరాహ్ణసమయంబున బాణుఁడు భుక్తిసలిపి మిత్రపరివేష్టితుండై స్వగృహంబున సుఖాసీనుండై యుండ నతని పారశవభ్రాతయగు చంద్రసేనుడనువాడు లోనికివచ్చి "చతురుదధిపరీతసకలభూమండలేశ్వరుండు సకలరాజచక్రచూడామణి శాణకోణకషితపాదపీఠుండు, మహారాజాధిరాజపరమేశ్వరుండు, సర్వచక్రవర్తిధౌరేయుండు నగు శ్రీహర్షదేవుని సోదరుండు కృష్ణుండొక కింకరుని నీయొద్దకుఁ బంపెను. వాడు ద్వారదేశమందున్నాడ"ని తెలియజేసెను. అంత బాణుండును "ఆయుష్మంతుడా వాని నవిలంబితముగా నా సవిధంబునకు దోడ్కొనిరమ్మ"న నతిదూరాగమనపరిశ్రాంతుండు, శిరోవిధృతనిబిడసూత్రబద్ధలేఖమాలుండు, పరికరబంధనియమితాధోరుకుండు నగు నా లేఖహారకుని గాంచి దూరమునుండియే "భద్ర! అశేషభువననిష్కారణబంధుండగు నా కృష్ణభూపతికి నామయంబె"యని యడిగెను. వాడును "ఆర్యా! ఆర్యావతంసుడగు నాతడు సేమముగా నున్నాడ"ని పలికి సమీపంబునఁ గూర్చుండెను. కొంతసేపలసటఁదీర్చుకొని మాననీయుడగు మాస్వామి మీకుఁ బంపిన లేఖ యిదిగోయని చేతికిచ్చెను. అప్పుడు

భానుపాలేఖను సాదరముగాఁ దీసికొని స్వయముగాఁ జదువుకొనెను. మేఖలకునివలనఁ బంపిన సందేశమును బాగుగా దెలిసికొని కాలవిలంబము గాకుండ నిచటికి రావలెనని లేఖార్థము. ఇతరమంతయు వార్తాసంవాదనమాత్రము. ఇట్లు లేఖార్థమును గ్రహించి పరిజనులను పైకి బొమ్మని యాసందేశము నడిగెను. అంత మేఖలకుఁడు “మేధావంతులగు తమకు సగోత్రతగాని, సజాతీయతగాని, సహసంవర్ధనముగాని, ఏకదేశనివాసముగాని, పలుమారు చూచుటగాని, పరస్పరానురాగశ్రవణముగాని, పరోక్షోపకారకరణముగాని, సమానశీలతగాని స్నేహహేతువులని యెఱుఁగుదురు. దూరస్థమగు కుముదాకరమందుఁ జంద్రునికివలె దూరమందున్న మీయందుఁ గారణములేకుండ నామనంబు బద్ధపక్షపాతమై బంధువునందువలె స్నేహము గలిగియున్నది కాని జాతమత్సరులు కర్ణేజపులు నగు దుర్జనులు మిమ్మునుగురించి చక్రవర్తికి దుర్బోధనముఁ జేసిరి. అది సత్యముకాదు. సత్పురుషులకైనను మిత్రోదాసీనశత్రువులుండక మానరు. బాల్యచాపలాయత్తచిత్తవృత్తియగు నెవ్వఁడో యసహనశీలుడు మీవిషయమై యొక చెడ్డమాటను నుడివినచో నదియే సత్యమని నమ్మి యితరులుకూడ దానినే వ్యవహరించెదరు. లోకములో నవివేకుల మనంబులు జలమువలె గతానుగతికములై యుండును. బహుముఖశ్రవణనిశ్చలీకృతమానసుండైన భూపతి యేమి చేయఁగలఁడు? మీరు దూరమందున్నను తత్త్వాన్వేషులమైన మాకు మీయాథార్థ్యము బాగుగాఁ దెలుసును. ప్రథమవయస్సులోఁ బ్రతిమనుజుడును బాల్యసులభమగు చాపలముచే నపరాధముల నొనరించునని మేము విన్నవింపగాఁ జక్రవర్తియు నౌనని యొప్పుకొనెను. కావున మీరు శీఘ్రముగా నిచటికి రావలెను. చక్రవర్తిని సేవింపక వంధ్యమహీజమువలె బంధుమధ్యమందు నున్నక కాలముఁ బుచ్చు మీస్థితి మాకింపుగాలేదు. సేవాదాస్యచింతగాని పరమేశ్వరోపసర్పణభీరుత్వముగాని మీకుండఁగూడదు.

తే॥ గీ॥ స్వేచ్ఛనుపజాత విషయుఁడై చెప్పరాను।
దేహియని మార్గణాంబులఁ దీవ్ర దుఃఖ।
మిచ్చు జీవనహరణంబు హెచ్చు మోహ।
భరమున నొనర్చు మనసిజాభంగి జగతిఁ।
దోచునీశ్వర దుర్విదగ్ధుని చరిత్ర॥

అయిన నట్టి భూపతులు వేరు. స్వకృతనలనహుషభరత భగీరథ దిలీపనాభాగుండైన మన చక్రవర్తి వేరు. ఈతనిదృష్టి యహంకార కాలకూటవిషదిగ్ధముకాదు. ఈతనివాక్యములు గర్వ గరగ్రహణగద్గదములుకావు. నిర్మలులైన సాధువులయం దితనికి రత్నబుద్ధిగాని శిలాశకలములయందుగాదు. ముక్తాధవళములైన గుణములచే నలంకృతుఁడుఁగాని యాభరణభారముచేగాదు. చిర స్థాయియగు యశస్సునందు మహాప్రీతిగాని తృణప్రాయమగు జీవి తమందుగాదు. సగుణమైన ధనుస్సునందు సహాయబుద్ధిగాని పిం డోపజీవులగు సేవకులయందుగాదు. ఇంతియకాక యితనియాత్మ మిత్రోపకరణము. ఇతని లక్ష్మి బాంధవోపకరణము. ఇతని వైదగ్ధ్యము పండితోపకరణము. ఇతని సర్వస్వము ద్విజోపకర ణము. ఇతని యాయువు ధర్మోపకరణము. ఇతని ప్రతిపక్షము ప్రతాపోపకరణము. ఇతని పాదపల్లవచ్ఛాయ యకృతపుణ్యులకు దుష్ప్రాపమని కృష్ణరాజు మీతో జెప్పుమనెన"ని వక్కాణించెను. బాణుడాసందేశమునంతయు విని మజ్జనభోజనాదులచే నామేఖలకుని సుఖితునిగా జేయుమని యాచంద్రసేనుని కాజ్ఞాపించెను.

అంత నామేఖలకుండు బాణునిచే నభ్యనుజ్ఞాతుండై నిజ నివాసంబునకుం జనియె. ఆ త్తరి రక్తపంకజసంపుటకోయమానమో యున్నట్లు బాలవాయసాస్యారుణంబైన యపరాహ్ణాతపంబు తామ్రత నొందగా శిథిలరథవాజిజవుండై కమలినీకాంతుం డస్తాచలశిఖరం

మునఁ బోతంబునొంద శ్యామాముఖం బంధకారశ్యామంబై యొప్ప బాణుఁడు సంధ్యోపాసనం బాచరించి శయనీయంబు భజించి యేకాకియైయుండి తనమనంబులో నిట్లు చింతించెను. "ఇపుడేమి చేయుదును? భూపాలునిచే నింకొకరీతిగా నూహింపబడితిని. నిర్వ్యాజబంధుఁడైన కృష్ణరాజిట్లు వార్తనంపెను. రాజసేవ మిక్కిలి కష్టము. భృత్యత్వము విషమమైనది. రాజకుల మతిగంభీరము. నాకక్కడఁ బూర్వపరిచయముగాని, కులక్రమాగతమైన ప్రవేశముగాని, ఉపకారస్మృతిగాని, గోత్రగౌరవముగాని, పూర్వదర్శనదాక్షిణ్యముగాని, విద్యాతిశయకౌశలముగాని, ఆకారసౌందర్యాతిశయముగాని, విద్వద్గోష్ఠీవైదగ్ధ్యముగాని, రాజవల్లభపరిచయముగాని లేదు. అయినను వెళ్లకతీరదు. అన్నివిధములను భువనగురువగు పురారాతి యచటికిఁ బోయిన నాకు క్షేమవిధాతయగును." ఇట్లు కొంతప్రొద్దు తనలో దానాలోచించుకొని కొనకు వెళ్లుటకు నిశ్చయించెను.

ఆ మరుసటిదినమందు వగువాత లేచి కాల్యకృత్యంబుల దీర్చుకొని కృతస్నానుండై ధౌతదుకూలవస్త్రంబు ధరియించి యక్షమాలను చేఁబూని ప్రస్థానికసూక్తంబుల జపించి, పరమభక్తితో దేవదేవుండైన విరూపాక్షునికి క్షీరస్నపనపురస్సరముగా సురభికుసుమధూపదీపగంధబహుళంబైన పూజసలిపి ప్రచురాజ్యాహుతిసంవర్ధితశిఖాకలాపుండైన ఆశుశుక్షణినిహవ్యంబుచేఁ దనిపి యథాశక్తిగా విప్రోత్తములకు ద్రవిణదానంబొసంగి ప్రాఙ్ముఖముగా నున్న నైచికినివలగొని, శుక్లాంగరాగుఁడు, శుక్లకుసుమమాల్యాలంకృతుండు, గోరోచనావిచిత్రదూర్వాపల్లవగ్రథితకర్ణికారకృతకర్ణపూరుండు, శిఖానంసక్తసిద్ధార్థకుండు, మాతృసదృశపితృభగినీవిరచిత సకలప్రస్థానమంగళుండు, వృద్ధబంధుస్త్రీదత్తాశీర్వాదుండు, పరిజనాభినందితగమనుండు, వందితదేశికాభ్యనుజ్ఞాతుండు, శుభశకున సంవర్ధిత

మౌహూర్తికనిర్దిష్టశుభముహూర్తమందు హరితగోమయోపలిప్తాజిరసంస్థాపితంబు, సితపుష్పమాలాపరిక్షిప్తకంఠంబు, ముఖనిహిత నవచూతపల్లవంబు నగుపూర్ణకలశంబువీక్షించుచుఁ గులదేవతలకుఁ బ్రణమిల్లి, ఫలకుసుమపాణులగు ద్విజులనుగమింపఁ బ్రథమచలిత దక్షిణచరణుండై బ్రాహ్మణాధివాసంబైన ప్రీతికూటంబునుండి బయలు వెడలెను.

ప్రథమదివసంబున గ్రీష్మసమయదుస్సహంబు, నిర్జలంబు, నిష్పత్రపాదపవిషమంబు నగు చండికాకాననంబతిక్రమించి మల్లకూటంబను గ్రామంబుఁ జేరెను. అచ్చట హృదయనిర్విశేషుండగు జగత్పతియను సోదరునిచేఁ గృతాతిథ్యుండై యారాత్రి సుఖంబుగ నివసించె. ఆమరునాఁ డచ్చోటు విడిచి త్రిభువనపావనియగు భాగీరథినుత్తరించి యష్టిగ్రహకమను వనగ్రామంబున విడిసి యానిశ నాస్థలమందు నిద్రించెను. మరునాఁ డరుణోదయంబున నజిరవతీనదీసమీపమందున్న మణితారనగరంబున సన్నివిష్టంబగు స్కంధావారంబుఁ బ్రవేశించి రాజభవనంబున కాసన్నుండయ్యె.

ఆప్రదేశంబునఁ గృతస్నానాభ్యవహారుండై విశ్రమించి దివసంబు యామమాత్రావశిష్టంబై యుండఁ బ్రఖ్యాతులైన రాజుల శిబిరసన్నివేశంబులు వీక్షింపుచు నాగవీథీపాలప్రేషితములు, డిండిమాధిరోహణోపస్థాపితంబులు, కులాచలసదృశంబులు, నానాదిగ్దేశోపహృతంబులు, సామంతనరపత్యుపాయనీకృతంబులు నగు వారణఘటలచే శ్యామాయమానంబు, జవనిర్జితహరిణపోతంబులు, అనవరతఖురపుటప్రహతమేదినీపృష్ఠంబులు, పఞ్చాయమాణమండన చామరమాలాభూషితంబులు నగు తురంగసమూహంబులచేఁ దరంగాయమాణంబు, అరుణచామరికాకారచితకర్ణపూరంబులు, బహుయోజనగమనగణనసంఖ్యాతుల్యాయమాణవరాటికామాలావిరాజి

తంబులు నైన క్రమేళకకులంబులచేఁ గపిలాయమానంబు, రాజదర్శన
ప్రతీక్షమాణానేకరాజన్యసహస్రసంకులంబు రాజలక్ష్మీస్వీకృతపరిగ్ర
హంబు నగు రాజభవనద్వారంబుఁ బ్రవేశించె. దానినిఁ గాంచి
యాతఁడాహా ఇదియేమి యాశ్చర్యము. ఇంతపరిమాణముగల
ప్రాణిజాతమును సృజించిన స్రష్టలకుఁ బరిశ్రమముగాని పృథివ్యాది
మహాభూతంబులకుఁ బరిక్షయంబుగాని, కాలమున కంతముగాని,
ఆయువునకు విరామముగాని, ఆకృతులకుఁ బరిసమాప్తిగాని లేకపో
వుట పరమాద్భుతావహమని తలంచెను. దూరమునుండియే ద్వా
రపాలలోకముచేఁ బ్రత్యభిజ్ఞాయమానుండైన మేఖలకుండు "స్వామీ!
తమరు క్షణమాత్ర మిచ్చటనే నిలువుడని చెప్పి నగరులోనికిఁ
బోయెను.

అంత నొకముహూర్తకాలంబులోఁ గర్ణికారగౌరదేహప్ర
భాపటలుండు, సితకంచుకాచ్ఛాదితగాత్రుండు, పాండురోష్ణీషాలం
కృతమస్తకుండు, వామకరంబున గృపాణంబును, దక్షిణహస్తంబున
స్వర్ణవేత్రలతాయష్టిని ధరించినవాఁడు నైన యొక పురుషునిచే నను
గమ్యమానుండై మేఖలకుండు పైకివచ్చి దేవా! ఇతఁడు మహాప్రతీ
హారులలో ముఖ్యుఁడు. ప్రభువారికిఁ బ్రియతముఁడు. ఇతని పేరు
పారియాత్రకుఁడు. అనురూపమగు ప్రతిపత్తిచే నీతని యనుగ్రహిం
పుఁడని పలికెను. ఆ ద్వారికుఁడు దగ్గరకువచ్చి కృతప్రణాముఁడై
మధురభాషణములతోఁ బ్రభుదర్శనమునకు విచ్చేయుఁడు. ప్రభువు
వారు మీయెడలఁ గృతప్రసాదులై యున్నారని విన్నవించెను. బాణుఁ
డును మహారాజునకు నే ననుగ్రాహ్యుఁడనైతిని గావున ధన్యుఁడనని
పలుకుచు వానిచేఁ జూపింపబడిన మార్గము ననుసరించి రాజభవ
నాభ్యంతరంబుఁ బ్రవేశించెను.

అనంతరము సింధుకాంభోజపారశీకాది దేశోత్పన్నంబులు,

నానావిధవర్ణవిలసితంబులు నగు భూపాలవల్లభతురంగంబులచే నాకీర్ణంబగు వాజిశాల నవలోకించి కుతూహలాక్షిప్తహృదయుండై బాణుఁడు కొంచ మంతర మతిక్రమించి నిజోచ్ఛ్రాయాచ్ఛాదితగగనతలంబై కదళీవనపరివృతపర్యంతంబై యొప్పుచున్న నరేంద్రమాతంగనివాసాగారంబు వీక్షించి యది యే రాజమందిర మనుకొని "ఆర్యా! ఇచట ప్రభు వేమిచేయుచుండు నని ప్రశ్నింప దేవా! చక్రవర్తికి బాహ్యమగుహృదయము. బహిశ్చరములగు ప్రాణములు, ననదగిన దర్పశాతమను పేరుగల ఔపవాహ్యమున కవస్థానమంటపమని యాదౌవారికుఁడు చెప్పెను. అట్లయినచో నొకపరి యాగజేంద్రమును జూచి వచ్చెదను. నన్న చటికిఁ గొనిపొమ్మని బాణుఁడు పలుకఁగా నాదౌవారికు డేనుంగునుఁ జూపించెను. అపుడచటికిఁబోయి మదధారాపంకిలగృహాంగణంబగు నాదంతావళశ్రేష్ఠంబు నాలోకించి విస్మయావిష్టుండై సత్యముగా దీనికిఁ బర్వతములు దేహారంభకపరమాణువులై యుండును. లేనిచో నిట్టిగౌరవము దీని కెట్లు సంభవించును? ఇది మిక్కిలి యాశ్చర్యకరము. వింధ్యాద్రికిదంతములు. నాదివరాహంబునకుఁ దుండము మొలిచిన యెడల దీనినిఁ బోలియుండు నని తలంచుచుండగా దౌవారికుఁడు

మ॥ తొలిఁ గోల్పోయిన రాజ్యలక్ష్మిని మహాదుఃఖంబుతో మానసం
బులఁ జింతింపుచు నాధినాకులమతుల్యాభిమీశులౌ శాత్రవుల్।
చలదత్యుగ్ర శరారు సేవితవనస్థ్యానిష్టలీసామజం।
బలవోకన్ స్మరియింప భగ్ననిజరాజ్యాశన్ వగన్బొందెడున్॥

అనివలికి మహారాజదర్శనమునకు రండు జాగయ్యెనని తోడుకొనిపోయెను. బాణుఁడు తనుపదిశ్యమానమార్గుండై నృపాలసహస్రసంకులములైన మూడుకక్ష్యాంతరంబుల దాటి నాల్గవదానియందు భోజనమంటపమున కెదుటనున్న యంగణమునుపవిష్టుండు, పరిచారకలోకపరివృతుండు, హరిచందనరసా

ద్గ్రీష్మె, అవశ్యాయబిందుశీతలంబై, దంతపాండురపాదంబై చెలం వొందు ముక్తాశిలాపట్టశయనంబుననుఖాసీనుండు, ఆసన్నోపవిష్టశిష్టేష్టజనుండు, శయనీయపర్యంతనిహితభుజావష్టబ్ధదేహభాగుండు, కేవలతేజఃపరమాణు నిర్మితవిగ్రహుండు, చక్రవర్తి లక్షణోపేతుండు, ఆభరణప్రభాజాలవిరచితేంద్రాయుధుండు, ప్రతాపనిర్జితసకలారిచక్రుండు, నిగ్రహరుచిరుని యింద్రియములచేతను, దురుపసర్పుడని కలిచేతను, షండుడని పరకళత్రములచేతను, కర్మఠుండని యజ్వలచేతను, దుస్సహాయుఁడని శత్రువీరులచేతను గ్రహింపఁబడువాఁడునైన హర్షచక్రవర్తినిఁ గాంచెను. చూచి విస్మయస్మేరుఁడై యానందబాష్పబిందుసందోహమును విడుచుచు నితఁడే సుజన్ముఁడు, సుగృహీతనామధేయుఁడు, తేజోరాశి, తిరస్కృతసకలాదిరాజయశోమండలుండు నగు హర్షదేవుండని తలంచెను. ఈతఁడు కృష్ణునివలె వృషవిరోధియు, గిరీశునిపగిది దక్షోద్వేగకారియు, నింద్రునివలె గోత్రవినాశకుండును, చంద్రునివలె బహుళదోషోపహతుండును గాడు. ఇతని వితరణమునకుఁ జాలిన యాచకులు, ప్రజ్ఞకుచితమైన శాస్త్రములు, కౌశలమునకు సమమైన కళలు నీలోకమందు లేవు. ఇతనిచేఁ బృథ్వీరాజన్వతి, ఇతని యేలుబడిలో భుజంగములకే ద్విజగురుద్వేషము, వృత్తములకే పాదచ్ఛేదము భృంగములకే దానగ్రహణకలహము నని మనస్సులో ననుకొనుచు రాజసన్నిధికిఁ బోయి స్వస్తిశబ్దము నుచ్చరించెను. అపుడు రాజభవనమున కుత్తరము వైపున గజపరిచారకుండొకండు మధురమైన గీతి నొకదాని నుచ్చైస్స్వరంబుతో నిట్లు పాడెను.

తే॥ గీ॥ సామజార్భక! విడువుము చాంచలతను।
వినమితాననమొప్పగ వేగ వినయ।
వ్రతము చరియింపు మిత్తఱిఁబతగనాధ।

నఖకులిశ శాతమాస్పృశి నయవిహీన।
మాదమ క్షమియింపదిక నిన్ను నద్దిమెఱుఁగు॥

అపుడా చక్రవర్తి యాగతిని విని దాని యర్థము నవధరించి గిరిగుహాప్రస్థితసింహగర్జనగంభీరమగు కంఠధ్వనితో సభాభాగంబు బూరించుచు "ఇతఁడా ఆబాణుఁడ"ని యడిగెను. మహారాజా! అతఁడే ఇతఁడని దౌవారికుఁడు విన్నవింపగా ప్రభువు "అకృతప్రసాదుడనై యితనిని జూడ"నని నిశ్చయించి దృష్టిని మరలించుకొని తన వెనుకఁ గూర్చున్న మాళవరాజపుత్రునితో "ఇతఁడొక మహాభుజంగుడు సుమా" అని నుడివెను. రాజపలికిన యామాటను విన వల్లభినయించి రాజలోకమాతయు నూరకుండ ముహూర్తమాత్రము మూకీభూతుఁడై బాణకవి "మహారాజ యాథార్థ్యమెఱుంగనివానివలె నవిదితలోకవృత్తాంతుని భంగి యిట్లేల పలికెదరు? స్వైరములైన లోకస్వభావములు విచిత్రములైనవి. మహాత్ములు యాథార్థ్యమునుఁ దెలుసుకొందురు. సామాన్యునివలె నన్నిట్లు తలంపఁగూడదు. బ్రాహ్మణుఁడను సోమపానముఁ జేసినవారి వంశములోఁ బుట్టినవాడను. యథాకాలముగా నుపనయనాదిసంస్కారములఁ బొందితిని. సాంగోపాంగముగా వేదములఁ జదివితిని. యథాశక్తిగా శాస్త్రంబుల నధికరించితిని. పెండ్లియాడి కుటుంబపోషణావ్యాపృతుడనై యున్నాను. ఏది నాభుజంగత? శైశవమందు లోకద్వయావిరుద్ధములగు చపలచేష్టలఁ జేసిన మాట పత్యము. అందులకుఁ బశ్చాత్తాపమొందుచున్నాను. ఇపుడు సుగతునివలె శాంతమనస్కత, మనువువలె వర్ణాశ్రమాచారవ్యవస్థాపకత, సమవర్తివలె దండధారిత్వముగల దేవర సప్తాంబురాశిరశనాపరివేష్టిత సకలమహీచక్రంబు నేలుచుండ వీతశంకుఁడై యెవ్వఁడు సర్వవ్యసనమూలమైన యవినయమును మనస్సుచేనైన నవలంబింపగలఁడు. భవదీయప్రభావాతిశయముచే షట్కారణసాధు

యంబును భీతినొందినదానివలె మధుపానమొనర్చుచున్నది. రథాంగనివహంబును ప్రియానువృత్తి వ్యసనముచే లజ్జించుచున్నది. వానరనికరమును చకితమైనదానివలెఁ జాపల్యమునుఁ గనపర్చుచున్నది. వ్యాఘ్రాదిశ్వాపదగణము కనికరముగలదానివలె మాంసమును భక్షించుచున్నది. కాలక్రమమున దేవరవారే స్వయముగా నా మంచిచెడ్డలనుఁ దెలిసికొనగలరు. ప్రజ్ఞావంతులబుద్ధు లెదుటివారి చిత్తవృత్తుల యాథాతథ్యమును గ్రహింపగలవి". అని చెప్పి విరమించెను. అంత భూపతియు మేము నిట్లు విని యున్నామని పలికి యూరకుండెను. సంభాషణాసనదానాదులచే నితని ననుగ్రహింపలేదు. కేవల మమృతవృష్టులచే స్నానము చేయించుచున్నవానివలె స్నేహగర్భమగుదృష్టిపాతమాత్రముచే నాంతరప్రీతిని వెల్లడించెను. సూర్యుం డస్తాభిలాషియైయున్నతఱి విసర్జితరాజలోకుండై యభ్యంతరంబునకుం జనియె.

అంత బాణుండు నచ్చోటు విడిచి నినిః క్షారకూటకోమలాతపకాంతిగలదియై దివసంబు శాంతింప నస్తాచలకూటకిరీటంబైన పతంగబింబంబు నిచుళమంజరీనిభంబులగు తేజస్సులవిడుచుచుండఁ దరంగిణీతటంబులు శోకాకులకోక కామినీకూజితముఖరంబులై యుండ, యాయజూకజనంబులు హవిస్సును హవ్యవాహనుని కర్పింప, కౌశికకులంబు జీర్ణతరుకోటరంబులనుండి నిర్గమింప, జరన్మహిషతను నీలంబగు తిమిరసందోహంబు జగంబు నావరింప, మునిజనాంజలిక్షిప్యమాణసంధ్యావందనోదబిందునికరంబు మాడ్కిఁ దారాపథంబునఁ దారాగణంబు దోప, భావివాసరబీజప్రకరంబులైవడి గృహాభ్యంతరంబుల దీపశిఖాకలాపంబు ప్రకాశింప, జరతీకథితకథలుగల శిశుజనంబు నిద్రింప నిజనివాసంబున కరిగె. "హర్షభూకాంతుం డతి దక్షిణుఁడు. మద్బాల్యచాపలోచితకాలీనప్రకోపితుఁడయ్యు నాయందు స్నేహముగలవాఁడు. నే నీతని కనిష్టుఁడనైనచో నాకు దర్శనమే

మోసంగకపోవును. నేను గుణవంతుడనై యుండవలయునని మాతసి కోరిక. ప్రభువులు భృత్యులకనురూపప్రతిపత్తి ప్రదర్శనముచే ననవరతముగా వినయము నుపదేశించెదరు. గుణవంతుఁడైన రాజు నింకొక రీతిగాఁ దలంచిన స్వదోషాంధమానసుండనైన నేనే నిందార్హుఁడను. నాయథార్థస్థితిని గాలక్రమమున రాజెఱుంగునట్లు చేసెద"నని నిశ్చయించి మరుసటిదినముంద రాజభవనమునుండి బయలు వెడలి సుహృద్బాంధవగృహంబులఁ గొన్నినాళ్లు నివసించెను. ఇంతలోఁ బృథివీపతి యాతని యాథార్థ్యమునుఁ దెలిసికొని ప్రసన్నుఁడయ్యె. బాణుండును మరల రాజభవనంబునకు వచ్చుచుఁ బోవుచుండెను. అల్పకాలములోనే జాతవిస్రంభుఁడైన భూపతి యితనియం దత్యంత ప్రీతిగలవాఁడై స్వానుగ్రహపాత్రునిగా జేసికొని దానమానాదులచే సత్కరించెను.

రాజదర్శనమను ద్వితీయోచ్ఛ్వాసము,

సమాప్తము.

# ఆంధ్ర హర్ష చరిత్ర.

## తృతీయోచ్ఛ్వాసము.

తే। సీ॥ స్వీయవర్షా ప్రదర్శిత స్నేహఘనము।
బహుళభక్తజనవ్రాత భాసురంబు।
మంచికాలంబు కైవడి నెంచఁదగిన।
నరవరాఘము ప్రజల పుణ్యానఁ గలుగు॥

తే॥ గీ॥ అవని సుజనుల కుపకార మాచరింప।
గగనమునఁ బోవ లక్ష్మినిఁ గనుఁగొనంగ।
గొప్పవారల చరితంబుఁ గోరివినఁగ।
నెవనికుదయించు వెదవాంఛ యెంచిచూడ।

అంత నొక కాలంబున విచ్ఛాయవారిధరము, ధ్వస్తద్రౌడి హంసమండలంబు, ధౌతనిస్త్రింశనిభనభంబు, భాస్వరభాస్కరంబు, శశత్సునాసీరశరాసనంబు, నిర్మలజ్యోత్స్నావిరాజితంబు, భ్రశ్యత్సౌదామినీపుంజంబు, ప్రముషితమయూరమదంబు, నిద్రోత్థితదామోదరంబు, కల్హారాహ్లాదకరంబు, కమలవికాసదాయకంబు, సప్తచ్ఛదధూళిధూసరితసమీరణంబు, కాశకుసుమస్మేరదశదిశంబు నగు శరత్సమయారంభంబున బాణుండు బంధువులను జూచుటకు రాజసన్నిధినుండి మరల నా బ్రాహ్మణాధివాసంబున కేతెంచె. శ్రుతభూపాలసంమానసంతుష్టహృదయులగు నీతని బంధుమిత్రులుఁ జూడవచ్చిరి. కొందరికిఁ బ్రణమిల్లుచు, కొందరిచేఁ బ్రణమ్యమానుండై కొందరి శిరస్సుల నాఘ్రాణించుచు, కొందరిచే శిరంబున మూర్కొనఁబడుచు, కొందరి గౌఁగిలించుకొనుచు, కొందరిచే నాలింగ్యమానుండై కొందరి నాశీర్వదించుచు, కొందరిచే నాశీర్వదింపబడుచు, కొందరి ననుగ్రహించుచు, కొందరిచే ననుగ్రహింపబడుచు, బహు

సుహృద్బాంధవపరివారపరివృతుండై నిరతిశయప్రమోదాబ్ధినోలలాడెను. గురుజనంబు లాసనంబుల నలంకరింప బాణుండును ససంభ్రమపరిజనోపనీతవిష్టరంబునఁ గూర్చుండి బంధుకృతార్ఘ్యాదిసత్కారంబు లభించి చెప్పనలవిగాని యానందంబు నొందెను. ఇన్ని దినంబులు మీరందరు సుఖంబుగ నున్నారా? సమ్యగనుష్ఠానపరితోషితభూసురంబగు క్రతుక్రియాతంత్రంబు నిర్విఘ్నంబుగా జరుగుచున్నదా? మంత్రప్రయోగప్రహుతంబులగు హవిస్సుల నగ్నులు యథాకాలముగా భుజించుచున్నవా? వేదాధ్యయనంబు విధ్యుక్తంబుగా నడచుచున్నదా? తర్కవ్యాకరణమీమాంసాదిశాస్త్రవిచారగోష్ఠి యథాపూర్వకముగాఁ బ్రవర్తించుచున్నదా? అభినవసుభాషితసుధారసప్రవాహంబులగు కావ్యాలాపములయం దాదరము తగ్గలేదుకదా? యని ప్రీతితోఁ బ్రశ్నించెను.

వారును తండ్రీ సకలభువనపరిపాలకంబు, భుజంగరాజభోగదీర్ఘంబు నగు మహారాజ భుజదండం బీక్షితిమండలం బతి జాగరూకతతో రక్షింపుచుండ యదృచ్ఛాలాభసంతుష్టులమై వైతానవహ్నిమాత్రసహాయులమై యవిచ్ఛిన్నవిద్యావినోదంబులఁ గాలంబుఁ బుచ్చుచున్న మా సౌఖ్యంబుకొరకు మేము ప్రయత్నింప నవసరము లేదు. అనలసుండవైన నీవు పరమేశ్వరుని సవిధమందు వేత్రాసన మధిష్ఠించియుండ నిపుడు విశేషించి సుఖులము. మాశక్తి కొలది యుక్తకాల మతిక్రమింపకుండ విప్రజనోచితంబులైన క్రియాకలాపంబుల నిర్వర్తించుచున్నవారమని భాషించిరి. ఇట్లు స్కంధావారవార్తలఁ జెప్పుకొనుచు, పూర్వుల కథల నభివర్ణించుచు నతిక్రాంతశైశవక్రీడల స్మరింపుచు వినోదితమానసుండై చాల సేపుండెను. మధ్యందిన సమయంబున లేచి యథోచితకృత్యంబుల నాచరించి భుజించియుండగా నితని జ్ఞాతులు లేతెంచి యితనిచుట్టుఁ గూర్చుండిరి. ఆసమయమందు పాండురదుకూలవస్త్రధారియు,

గోరోచనారచిత తిలకుండును, తైలమసృణశిరోజుండు, తాంబూలరాగరక్తాధరుండు, కుసుమాపీడశోభితోత్తమాంగుండు, సచిరభుక్తుఁడు, పుస్తకవాచకుండు నగు సుదృష్టియనువాఁడచటికి వచ్చి సమీపమందున్న పీఠముపైఁ గొంతవడిఁ గూర్చుండి సూత్రవేష్టనముఁ దొలఁగించి శలాకాయంత్రమునుంచి వెనుకనున్న మధుకరపారావతులు జూపించిన స్థలమందుఁ గొన్ని తాళపత్రములనుఁదీసి పట్టుకొని మషీమలినాక్షరములను దంతకాంతులచే క్షాళనఁ జేయుచున్నవాని వడువున శ్రోతృశ్రవణవృత్తి నాకర్షించుచు మధురస్వరముతోఁ బవమానోక్తపురాణంబుఁ జదివెను. నాతిదూరవర్తియగు సూచి బాణుఁడనువాఁడి గీతిధ్వని ననుసరించి తారమధురస్వరంబుతో నీదిగువ గీతియుగ్మంబుఁ బఠించెను.

తే॥ గీ॥ అదియు మునిగీత మతిపృథు వవని వితత।
మదియుఁ బావన మరయంగ నదియు హర్ష।
చరితకంబు నభిన్నమీ సత్పురాణ।
మనుచుఁ దోఁచెడి నామనంబునకు నెంచ॥

తే॥ గీ॥ సతతమువిహారిదిశాంతాను స్పృతము తలప।
భరతమార్గానుయాయియై గురుతమించె।
స్ఫుటకరణహారము శ్రీకంఠ శోభితంబు।
నౌచు నీగీతి హర్షరాజ్యమునుఁ బోలె॥

అది విని పద్మాసనముఖపద్మంబుల ఛందంబున వేదాభ్యాసపవిత్రులు, ఉపాయములవలె సామప్రయోగరుచిరముఖులు, సకలపురాణరాజర్షిచరితాభిజ్ఞులు, మహాకవులు, మహావిద్వాంసులు, మహాపురుషవృత్తాంతశ్రవణకుతూహలులు వచస్సునందు, సదస్సునందు, యశస్సునందు, తపస్సునందు మొదటివారునైన గణపత్య

ధిషతి తారాపతిశ్యామలులను వారు పూర్వకృతసంకేతులై యుండుటవలన స్మితసుధాధవళితకపోలులై యొకరిముఖమును మరియొకరు చూచుచుండిరి.

అంతలో నాసోదరులలోఁ గనిష్ఠుఁడును, కమలదళాయతనేత్రుఁడును, బాణునికిఁ బ్రేమాస్పదుఁడునైన శ్యామలుఁడు, స్వసోదరదత్తనేత్రసంజ్ఞుఁడై దశనజ్యోత్స్నాప్రక్షాళితదిఙ్ముఖుఁడగుచుఁ బ్రణయముతో నాయన్నా, రాజగురుదారనుఁ బరిగ్రహించెను. పురూరవుఁడు బ్రాహ్మణధనతృష్ణచే నాయువునుఁ గోల్పోయెను. నహుషుఁడు పరకళత్రాభిలాషియై మహాభుజంగుఁడయ్యె. యయాతి బ్రాహ్మణీపాణిగ్రహణంబుఁ గావించి పాతంబునొందె. సుద్యుమ్నుఁడు స్త్రీమయుఁడయ్యె. సోమకుని జంతువధనిఘృణత్వము జగత్ప్రసిద్ధము. మార్గణవ్యసనముచే మాంధాతపుత్రపౌత్రులతోఁ బాతాళమునకుఁ బోయెను. పురుకుత్సుఁడు తపశ్చర్యాసక్తితోనున్నను మేకలకన్యకయందుఁ గుత్సితకర్మ నాచరించెను. పృథుపురుషుఁడైన పృథువు పృథివినిఁ బరిభవించెను. నృగుఁ డూసరవెల్లియై వర్ణసంకరము నొందెను. సౌదాసుఁడు పర్యాకులమైన భూమిని రక్షింపలేదు. అవశాక్షహృదయుండైన నలుని గలి పరిభవించెను. దశరథుఁ డిష్టరామోన్మాదముచే మృతినొందెను. సంవరణుఁడు మిత్రపుత్రికయందు విక్లబుఁడయ్యెను. కార్తవీర్యుఁడు గోబ్రాహ్మణపీడచే పంచత్వము నొందెను. సప్తద్వీపభోక్తయగు హర్షమహీపాలుఁడు తప్ప యపకళంకుఁడైన రాజెవ్వఁడును లేఁడు. ఇతఁ డొనర్చిన యనేకాశ్చర్యకర్మలను వినుచున్నారము. ఈభూమహేంద్రుఁడు కృతపక్షులై చరించుచున్న భూభృత్తులను నిశ్చలముగాఁ జేసెను. ఈపురుషోత్తముండు సింధురాజును మథించి లక్ష్మినిఁ జేకొనెను. ఈనరసింహుఁడు స్వహస్తఖండితారాతియై స్వవిక్రమమునుఁ బ్రకటించెను. కావున సుగృహీతనామధేయుఁడు పుణ్యరాశియు నగు

నీహర్షదేవుని చరిత్రమును మొంచటినుండియుఁ బూర్వపురుషానుక్రమముగాఁ జిరకాలమునుండి వినఁగోరుచున్నాము. అయస్కాంతమణులు లోహములను వలె గొప్పవారి గుణములు నీరసనిష్ఠురంబులైన క్షుద్రులహృదయంబులనైత మాకర్షింపగా స్వభావముచే పరసమృదులములైన తదితరుల మనంబుల నాకర్షించునని వేరుగాఁ జెప్పనేల? ద్వితీయమహాభారతము వలె నున్న యీనృపుని చరిత్రమును వినుట కెవ్వనికిఁ గుతూహలముండదు. ఆచరిత్రము నిపుడు మాకు వక్కాణింపుఁడు. ఈభార్గవవంశము శుచియగు రాజర్షిచరిత్రమును వినుటచే శుచితరమ్ము కానిండని ప్రార్థించెను.

అంత బాణుఁడు నవ్వి "ఆర్యా! మీ యలుకు యుక్త్యనురూపముగా నుండలేదు. మీకుతూహల మపనయించుట నాకు శక్యము కాదని తలంచెదను. తరుచుగా స్వార్థపరులు శక్యాశక్యవివేచన శూన్యులు. ప్రియజనకథాశ్రవణరసరభసమున మహాత్ములమతి ప్రముషితవివేకమై యుండును. పరమాణుపరిమాణముగల యీవటు హృదయ మెక్కడ? సమస్తబ్రహ్మాండవ్యాపియైన యీ ప్రభువు చరిత్ర మెక్కడ? పరిమితవర్ణవృత్తులైన శబ్దము లెక్కడ? సంఖ్యాతిగములైన యీగుణము లెక్కడ? ఈతనిచరిత్రము సర్వజ్ఞునికిఁ గూడన విషయము. వాచస్పతికినైన నగోచరము. సరస్వతికి నైతము భారమునై యున్నపుడు మాదృశులమాటఁ జెప్ప నేల? ఆమేదినీకాంతునిచరిత్రమును వర్ణించుటకుఁ బంచుసాయుష శతమైనఁ జాలదు. దానిలో నేకదేశమును వినుటకు మీకు వేడుక కలదేని చెప్పెద వినుండు. స్వీకృతకతిపయాక్షరలఘిష్టమగు నాజిహ్వ యిక నెచట నుపయోగించును. వినువారు మీరు. ప్రతిపాద్యము హర్షచరిత్రము. ఇక మరి కావలసినదేమి? నేటి దినము పరిణతప్రాయమైనది. సమంతపంచకరుధిరసరస్నానందు భార్గవరామునివలెఁ గపిలకిరణజటాభాస్వరుఁడైన భాస్కరుఁడు

సంధ్యారాగపటలమందు మునుంగుచున్నాఁడు. రేపు చెప్పఁగల నని పలికి బాణుఁడు లేచి సంధ్యోపాస్తికొఱకు శీఘ్రముగా శోణానదమునకుఁ బోయెను. మధుమత్తమాళవీకపోలకోమలాతపంబై యహస్సు క్షీణింప రవిబింబం బస్తమింప, కలికల్మషాపహంబగు నగ్నిశరణధూమంబు గగనంబున కెగయ, నియమవంతులైన యజమానులు మౌనవ్రతులై యుండ వైతానవహ్నులు హూయమానంబు లగుచుండ, బ్రహ్మాసనాసీనులై యోగులు ధ్యానింపఁ బ్రదోషసమయంబున బాణుఁ డింటి కేతెంచి బంధుమిత్రపరివృతుండై గోష్ఠీసంలాపసుఖం బనుభవించుచుఁ గొంతసేపుండి రాత్రి యామమాత్రఖండితము కాఁగా గణపతిగృహమందుఁ గల్పింపఁబడిన సెజ్జపైఁ బవ్వళించెను. తక్కినవారందరు తమ యిండ్లకుఁ బోయి శయ్యాగతులై కనులు మూసికొన్నను నిద్రలేకుండ సూర్యోదయమున కెదురు చూచుచుండు పద్మవనంబులవలె నారాత్రి నతికష్టముతోఁ దెల్లవారఁ బుచ్చిరి.

చ॥ త్రికనతివిస్తృతంబయిన దేహము దీర్ఘముగా నిగిడ్చి వె
న్కకు నొకకాలుసాచి మెడగట్టిగవంచి ముఖంబుగుండెమీ।
దికిఁ గదియించి ధూళిగల దీర్ఘసటల్విదిలించి ఘాసపూ।
లక చరణాభిలాషఁ బ్రచలత్ప్రథుఘోణము వాజి మెల్లగా।
నొకపరి హేషఁ జేసి శయనోత్థితమై ధర వ్రాయుడెక్కచేన్॥

ఉ॥ వీపును వంచి మోముకడఁ బెట్టికటిన్ మెడఁద్రిప్పి యస్సుగా।
మూపటి మంచుతుంపరలు మాటికి రాల్చెడు కేసరంబులన్।
గాపిడినొంది నిద్దురను రక్తముగాఁ గనుపట్టె నేత్రముల్।
దేవుగనుండు కండువును హెచ్చగఁగోకె హయంబు డెక్కచేన్॥

బాణుఁడా పద్యములను విని నిద్రలేచి ముఖప్రక్షాళన మొన

రించుకొని ప్రయతుండై సంధ్యనుపాసించి భానుఁ డుదయింపఁ జర్వితతాంబూలుండై యచ్చట నేయుండెను. ఇంతలో నీతని జ్ఞాతులందరు వచ్చి కూర్చుండిరి. పూర్వకృతసంకేతానుసారంబుగా బాణుఁడును వారి యభిప్రాయమునుఁ దెలిసికొని హర్షచరిత్రమునుఁ జెప్పుట కిట్లారంభించెను.

భూలోకమునం దవతరించిన వాసవావాసమువలె పుణ్యవంతులకు నివాసంబై, పుండ్రేక్షువాటసంతతులచే నిరంతరంబై, ఖలధాననిక్షిప్తధాన్యరాశినికరంబులచే సంకటప్రదేశంబై, హాలముఖోల్లిఖ్యమానశాలేయక్షేత్రవిరాజమానంబై, బహుక్షీరప్రదగోసంఘాతధవళితారణ్యంబై, వివిధమఖహోమధూమాంధజనలోచనంబై, కేతకీవనరజఃపటలపాండురీకృతోద్దేశంబై, గోకులావతరణకలుషీకృతజలాశయంబై, యుపవనశతోపశోభితంబై తనరారు శ్రీకంఠంబను జనపదం బొండు గలదు. ఇట్టి జనపదమునందు నానారామాభిరామకుసుమపరిమళసుభగంబును, మరుదుద్ధూయమానచమరీవాలవ్యజనధవళితప్రాంతంబును, జ్వలన్మఖశిఖిశిఖాసహస్రనీరాజితంబును, సుధారససిక్తధవళగృహపంక్తిపాండురంబు నగు స్థాణ్వీశ్వరంబను దేశం బొకటి యుండె.

మునులు తపోవనంబనియు, శత్రువులు యమనగరంబనియు, యాచకులు చింతామణి భూమియనియు, శస్త్రోపజీవులు వీరక్షేత్రంబనియు, గాయకులు గంధర్వనగరంబనియు, విద్యార్థులు గురుకులంబనియు, వైదేహకులు లాభభూమియనియు, సజ్జనులు సాధుసమాగమమనియు నా దేశము నుల్లేఖించెదరు.

అచ్చట నివసించు ప్రమదాజనంబులు, గౌరులు విభవవతులు, లావణ్యవతులు మధురభాషిణులు, చంద్రకాంతిశరీరలు

శిరీషకోమలలు, వాటికినయనంబె శిరోమాల్యంబు, కువలయదామంబులు భారభూతంబులు, కపోలతలగతంబులగు నలకప్రతిబింబంబులెయక్లేశకరంబులైన కర్ణావతంసంబులు, తమాలకిసలయంబులు పునరుక్తంబులు, ప్రియుల కథలే సుందరములైన కర్ణాలంకారములు, కుండలాదికమైశ్వర్యవిజృంభితము, హాసములే సురభిళమైన పటవాసములు, కర్పూరపాంసువులు నిరర్థకములు, బాహువులే కోమలములగు పరిహాసప్రహార వేత్రలతలు, మృణాళకాండములు నిష్ప్రయోజనములు.

ఆదేశము నేలు రాజు సహస్రాక్షునికైవడి సర్వవర్ణధర ధనుర్ధరుఁడు, కళాసంగ్రహమందు శశిమయుఁడు, అకృత్రిమాలాపములయందు వేదమయుఁడు, వాక్కున గురుఁడు, మనంబున విశాలుఁడు, యశమునం దర్జునుఁడు, చాపంబున భీష్ముండు, యుద్ధంబున శత్రుఘ్నుండు, ప్రజాకర్మయందు దక్షుండునై సర్వాదిరాజ తేజఃపుంజనిర్మితుని మాడ్కిఁ బ్రకాశించు పుష్పభూతియను మహారాజు. పృథుచక్రవర్తి యీభూమిని గోవుగాఁ జేసెనని స్పర్థ గలవానివలెఁ దాను మహిషినిగాఁ జేసెను.

మహనీయుల బుద్ధిస్వభావసిద్ధముగా స్వామిచ్ఛాను సారిణియై యుండును. ఏలయనఁ బరోపదేశములేకుండ సహజముగా నా భూపాలుఁడు శైశవము మొదలుకొని భవచ్ఛేదకరుండైన భవునియం దధికభక్తిగలవాఁడయ్యెను. ప్రత్యహము శివపూజఁ గావింపకుండ స్వప్నమందైన నాహారమును స్వీకరింపఁడు. శివుఁడు తప్ప దైవమే లేదని యతని నిశ్చయము. పరిపాల్యులుకూడఁ బరిపాలకునిఁ జిత్తవృత్తి ననువర్తించెదరు. ఆరాజు పురమందున్న ప్రతిగృహమం దీశ్వరారాధన మవిచ్ఛిన్నముగా సలుపబడుచుండెను. అతని దేశమందంతట గుగ్గులుధూపగంధగర్భంబులు, స్నపనక్షీరశీకరవాహులు

నగు వాయువులు వీచుచుండెను. పాదోపజీవులైన సచివులు, భుజబలనిర్జితులైన సామంతులు, పౌరులు శివపూజోపకరణంబులైన కైలాసశిఖరధవళంబులు, కనకపత్రాలంకృతవిషాణాగ్రంబులు నగు సంధ్యాబలివృషభంబులు, హేమమయస్నపనకలశంబులు, అర్ఘ్యపాత్రంబులు, ధూపపాత్రంబులు, మణియష్టిప్రదీపంబులు మొదలగు వస్తువుల నుపాయనంబుగా సమర్పించి యా భూపాలుని మనంబునకుఁ బరితోషంబుఁ గల్పించిరి. అంతఃపురకాంతలుసైత మీతని చిత్తవృత్తి ననుసరించి బలితండులావఘాతంబును, దేవగృహోపలేపనంబును, పుష్పమాలాగ్రథనంబునుఁ జేయుచుండిరి. పరమమహేశ్వరుఁడగు నీ భూవరుఁడు బహువిధవిద్యాప్రభావప్రథితయశస్కుండును, దాక్షిణాత్యుఁడు, నిటలాక్షసముండు నైన భైరవాచార్యుడను మహాశైవునిచరిత్రమును లోకులవలన విని తద్వృత్తాంతశ్రవణసమకాలమందే యాతనియందు గరిష్ఠమగు భక్తిగలవాఁడై తద్దర్శనకుతూహలియయ్యెను.

అంత నొకనాటి సాయంతన సమయమందు రాజాంతఃపురమునందుండగా నొక ప్రతీహారి కడు శీఘ్రముగా నేతెంచి "దేవా! భైరవాచార్య శిష్యుఁడైన యొక సన్యాసి దేవరదర్శనార్థియై వచ్చి ద్వారప్రదేశమం దున్నా"డని విన్నవింపగా రాజామాటవిని విలంబముగాకుండ నతని నిక్కడకుఁ దోడ్కొనిరమ్మని పలికెను. తోడనే ప్రతీహారి భూపాలుని సవిధమున కాతనిఁ దోడితెచ్చెను. ఉన్నతుఁడు, ఆజానుబాహువు, భైక్షజీవియయ్యును పీవరకఠినదేహుండు, ఉత్తుంగవళితరంగితలలాటుండు, నిర్మాంసగండస్థలుండు, కాషాయసంవీతగాత్రుండు నైన యామస్కరినిఁ గాంచి క్షితిపతి సందర్శితాదరుండై సముచితాసనంబున గూర్చుండఁబెట్టి సేమంబరసి భైరవాచార్యు డెచ్చట నున్నాఁడని యడిగె. సాదరనరపతివచనసంతుష్టాంతరంగుండై సరస్వతీనదీతీరంబుననున్న వనములో నొక

శూన్యాయతనము నున్నవాఁడనియు, మిమ్ముల నాశీర్వదించితినని చెప్పుచున్నాఁడనియుఁ బలికెను. తన యోగభారకమునుండి రత్నఖచితములైన యయిదు రజతపద్మములను బైకిఁదీసి భైరవాచార్యుఁడు మీకుఁ బంపెనని యిచ్చెను. నరపతియుఁ బ్రియజనస్నేహాభంగభీతిచే దాక్షిణ్యమవలంబించి గ్రహణలాఘవోల్లంఘనాసమర్థుండై డోలాయమానమగు మనస్సుతోఁ గొంతసేపు చింతించి "సౌజన్యమునకు లోనై యీపద్మములను స్వీకరించి సర్వఫలప్రసవహేతువగు శివభక్తి మనోరథదుర్లభములగు ఫలములను ఫలించును. భువనగురుఁడైన భైరవాచార్యుఁడు నాయందిట్టి ప్రీతిఁ గలిగియుండుట కూడ దాని ఫలమేకదా యని" సంతసించి యాచార్యుని రేపు చూడవచ్చెదనని చెప్పి యాపరివ్రాట్టును బంపివేసెను.

ఆమరునాఁడు ప్రాతఃకాలమందు లేచి కాల్యకృత్యంబుల నిర్వర్తించి కతిపయ రాజపుత్రానుయాతుండై యశ్వంబధిరోహించి సముచ్ఛ్రితశ్వేతాతపత్రుండు సముద్ధూయమానధవళచామరయుగుండునై పుష్యభూతి భైరవాచార్యునిఁ జూడఁబోయెను. కొంచెము దూరము వెళ్లఁగా నెదురుగా వచ్చుచుండెడి యాతని శిష్యులలో నొకనిఁ జూచి యాచార్యుఁ డెచ్చటనున్నాఁడని యడిగెను. ఈజీర్ణదుర్గాయతనంబున కుత్తరముగా నున్న బిల్వవాటికలో నున్నాఁడని యాశిష్యుఁడు చెప్పఁగా దత్సమీపభూమియందు గుఱ్ఱమునుండి దిగి బిల్వవాటికకుం జనియె.

ఉషఃకాలమందు లేచి స్నానముచేసి యగ్నికార్యము నెరవేర్చి ప్రియతుఁడై హరితగోమయోపలిప్తక్షితితలమందు వ్యాఘ్రచర్మోపవిష్టుండు, కృష్ణకంబళపరివృతుండు, ధవళకతిపయశిరోరుహుండు, సకలపుణ్యనదీవగాహనపవిత్రితకాయుండు, శిష్యసంఘ

మధ్యస్థితుండు, మితభాషి, అమితతపస్వి సర్వోపకారి, కుమారబ్రహ్మచారియు నైన భైరవాచార్యునిం జూచెను.

భైరవాచార్యుఁడును, రాజుం గని చంద్రోదయమందు సముద్రమువలె నుప్పొంగి ప్రథమతరోత్థితశిష్యగణంబుతోఁ రాజు నెదుర్కొని శ్రీఫలోపాయనంబు సమర్పించి జహ్నుకన్యాసముద్గీర్యమాణగంగాప్రవాహగంభీరంబగు కంఠస్వరంబుతో స్వస్తిశబ్దము నుచ్చరించెను.

నరపతియుఁ బ్రీతివిస్తార్యమాణధావళ్యముగల కంటితో బహుతరపుండరీకవనంబులఁ బ్రత్యర్పణము సేయుచున్నవాని పగిది నిటలతటఘటితాంజలియై దూరావనతశీర్షంబుతో నభినవప్రణామము నాచరించెను. ఆచార్యుం డత్యాదరంబున విచ్చేయు డిటఁ గూర్చుండుడని తన శార్దూలచర్మంబుఁ గనపర్చెను. ఉపదర్శితప్రశ్రయుండై మహీవల్లభుండును. "భగవంతుఁడా! అన్యనృపతుల్యముగా నన్ను సంభావింపవలదు. ఆచార్యుఁడు కూడ నాకిట్టి యుపచారంబుల నాచరింపఁ బోవుట సకలరాజలోకాపేక్షితమైన రాజలక్ష్మియొక్క శీలాపరాధమని గాని ద్రవిణదౌరాత్మ్యమని గాని తలంచెదను. ఈజనుఁ డిట్టి యుపచారములకుఁ బాత్రుఁడు కాఁడు. తమకు శ్రమ వలదు. దూరస్థితుఁడైన నీజనుఁడు తమ శిష్యుఁడని తలంపుఁడు. గురువువలె గుర్వాసనముకూడ పూజనీయము. తమరే యీవ్యాఘ్రచర్మాసనమందుఁ గూర్చుండుట కర్హులని మత్తకలహంసకంఠనాదమధురమగు వాణితోఁ బలుకుచుఁ బరిజనోపనీతమగు వస్త్రమందు నిషణ్ణుఁడయ్యెను. భైరవాచార్యుఁడును నృపవచన మనతిక్రమణీయమని తలంచి యథాపూర్వకముగా వ్యాఘ్రాజినముపైఁ గూర్చుండెను. రాజసమూహము, శిష్యులుఁ పరిజనులుఁ నాసీనులై యుండ భైరవాచార్యుఁడు భూపతికర్ఘ్యాదికము నొసంగ

రాజమాధుర్యహృతాంతఃకరణుండై శశికరనికరవిమలంబులగు దంతకాంతులను బ్రసరింపఁజేయుచు "భూవల్లభ నీనమ్రతయే నీగుణగౌరవమును దెలుపుచున్నది. నీవు సకలసంపత్పాత్రుఁడవు. ప్రతిపత్తులు విఖ్యవానురూపములు. పుట్టినది మొదలు ధనమందు లక్ష్యబుద్ధి లేనివాఁడను. సకలదోషానలేంధనములగు ధనముల కమ్ముఁబడని శరీరమిది. నా ప్రాణములు భైక్షరక్షితములు. దుర్జాత విద్యాక్షరములు గలవాఁడను. శివభట్టారక పాదసేవచే నించుకంత పుణ్యలేశమార్జించితిని. వీనిలో నీకుపయోగార్హమైన దానిని జేకొనవలెను. సత్పురుషుల మనంబులు కుసుమములవలెఁ బ్రతనుగుణగ్రాహ్యంబులు. విద్వత్సమ్మతినొందిన శబ్దములవలె సాధువులు సుస్థిరమైన మనస్సునందుఁగూడఁ గీర్తిని విస్తరింపఁజేయుదురు. ఫేనధవళంబులగు స్రోతస్సులవలెనున్న మీగుణగణములచే నాకృష్టుఁడనై యిచటికి వచ్చితి"నని పలికెను.

అందుకు రాజు "స్వామీ! సత్పురుషుల శరీరాదులకుఁ గూడ మిత్రులే ప్రభువులు. మీదర్శనమువలన సపరిమితమైన కుశలజాతమును బడసితిని. భవద్దర్శనమువలన స్పృహణీయమగు పదమున నారోపింపఁబడితిని" నని పలికి కొంతసేపుండి నిజనగరంబునకుఁ బోయెను.

మఱియొక దినమందు భైరవాచార్యుఁడు మరల నరపాలునిఁ జూడవచ్చెను. అప్పుడు రాజు తన కోశమును, పరిజనమును, తన్ను నతనికి సమర్పించెను. అందు కాతఁడు నవ్వి "భూనాథా! వనవర్ధితులమగు మేమెక్కడ? యీరాజ్యైశ్వర్యమెక్కడ? మనస్వితలతవలె ధనోష్మచే వాడిపోవును. ఖద్యోతతేజస్సువలె మాతేజస్సును పరోపతాపిని గాదు. మీవంటివారే యేతాదృశవిభవభాజనులని" పలికి నిజావసథంబునకుఁ జనెను.

మొదటవచ్చిన భైరవాచార్యశిష్యుఁడగు నాసవాసికము

ముగా నయిదేసి వెండితామరపువ్వులను నరవరున కుపాయనముగా నర్పించెను. ఒకనాడు శ్వేతవస్త్రావకుంఠితమగు నేదో యొకవస్తువును బట్టుకొని యాతఁడు రాజసన్నిధికేతెంచి కొంతవడి కూర్చుండి “మహాభాగుఁడా! మాగురువైన భైరవాచార్యుఁడు మీతో నిట్లు చెప్పుమనియె. మాశిష్యుఁడైన పాతాళస్వామి యను నొక బ్రాహ్మణుఁడు బ్రహ్మరాక్షసుని జయించి వానియొద్దనుండి హరించిన మహాఖడ్గమిది. అట్టహాసమని దీనిపేరు. ఇది తమ భుజము నలంకరించుటకుఁ దగిన యాయుధము గావున, దీనిని బరిగ్రహింపవలెనని వేఁడుచున్నానని” నుడివి పిండీకృతశరద్గగనోపమంబు, కాలరాత్రికటాక్షసన్నిభంబు నగు నాకృపాణమును వస్త్రాచ్ఛాదనమునుండి పైకిదీసి రాజున కొసంగెను.

అవనిపతియు నాయుధప్రీతిచే నాఖడ్గమును గ్రహించి ప్రతిబింబనిభంబున దాని నాలింగనము జేసుకొనుచున్న వానివలె బద్ధదృష్టియై కొంతసేపు చూచి “ఆర్యా! పరద్రవ్యగ్రహణావజ్ఞానభిజ్ఞుండయినను నామనం బాచార్యవచనోల్లంఘనాశక్తంబయ్యెనని చెప్పుమని సన్న్యాసితోఁ బలికెను”. రాజాఖడ్గంబును బరిగ్రహించినందు కాపరివ్రాట్టు పరితుష్టుండై “నీకు మంగళమగుగాక!” యని యాశీర్వదించి తన యిచ్చం జనెను. వీరరసానురాగియైన నృపుడాకృపాణలాభముచే భూతలంబంతయు స్వహస్తగతమైనట్లు తలంచెను.

కొంతకాల మిట్లు గడిచిపోవ నంత నొకనాఁడు భైరవాచార్యుఁడు రాజునుఁ గలిసికొని “ఓప్రభువా! మహాత్ముల ప్రకృతి స్వార్థవిముఖంబు పరోపకారదక్షంబునై యుండు. భవాదృశులకర్థిదర్శనమే మహోత్సవము. యాచన మారాధనము. అర్థగ్రహణ ముపకారము. సర్వలోక మనోరథములకు భూమివై యున్నావు. వినుము నేనొకటి విన్నవించెదను. తొల్లి నేను

మహాకాళహృదయమను మహామంత్రమును గృష్ణవస్త్రమాల్యానులేపనధరుండనై శ్మశానమందుఁ గల్పోక్తవిధిగా జపకోటిచే నుపాసించియున్నాను. వేతాళసాధనముచే నది సిద్ధించును. అసహాయులయినవారి కది సిద్ధించుట దుర్లభము. ఈపనికి మీరు సమర్థులు. మీరఖిలకార్యభారమును వహింపగా మరి ముగ్గురు సహాయులగుదురు. మిమ్ములను సేవించుటకుఁ దరుచుగా వచ్చుచుండెడి వాఁడు నాకు బాలమిత్రుఁడు నైన టీటిభుఁడను సన్యాసి యొకఁడు. పాతాళస్వామి రెండవవాఁడు. మచ్ఛిష్యుఁడైన కర్ణతాళుఁడను ద్రావిడదేశనివాసి మూఁడవవాఁడు. ఇది మీకిష్టమయ్యెనేని యొకనాటిరాత్రి యట్టహాసద్వితీయులైన మీరు నాకీ కర్మయందుఁ దోడ్పాటు గావింపవలెన"ని యతి వినయముతో వేఁడుకొనెను.

అంధకారప్రవిష్టుఁడాలోకమునుఁ గాంచినట్లింతకాలమునకిట్టి మహానుభావున కుపకార మొనరించుట కవకాశము లభించినదని నరేంద్రుఁడు ప్రముదితాంతరంగుఁడై స్వామీ! శిష్యజనసామాన్యమగు నీనిదేశంబుచే నేను ధన్యుఁడనైతినని వచించెను. ఆభూపతి భాషితములచే నాచార్యుఁడు మిక్కిలి సంతసిల్లి "యీకృష్ణపక్షచతుర్దశీ నిశీథమం దీనగరోపాంతస్థిత మహాశ్మశానంబునకు సమీపమందున్న శూన్యాయతనంబులో శస్త్రద్వితీయులైన మీరు మమ్ములనుఁ గలుసుకొనవలెన"ని సంకేత మేర్పరిచి నిజనివాసంబునకుం జనియె.

అంతఁ గొన్నిదినములకుఁ గృష్ణచతుర్దశి రాగా రాజు శైవవిధి ననుసరించి దీక్షితుఁడై యట్టహాసఖడ్గమున, గంధమాల్యాదులచే నధివాసము గావించి సుప్తజననిశ్శబ్దస్తిమితమగు నిశీథమందవరోధజన మెఱుంగకుండఁ బరిజనులకుఁ జెప్పక కోశాకృష్టంబగు నట్టహాసమును దక్షిణహస్తంబున బూని నీలపటావకుంఠితగాత్రుఁడై

నగరమునుండి నిర్గమించి భైరవాచార్యు డున్న ప్రేతభూమి కరిగెను.

అనంతరము వికటవేషముల ధరించి శిరస్స్నాతులు, మాల్యాలంకృతులు, ఉల్లాసితనిస్త్రింశులు, నిస్త్రింశాంశుసంతానసీమంతితతిమిరులు, నై నటీటిభకర్ణ తాళపాతాళస్వాములు మువ్వురును సౌప్తికమందు ద్రోణికృపకృతవర్మలవలెఁ బ్రవేశించి తమ రాక నాచార్యునికిఁ దెలియఁజేసిరి. అవనిపతియు నెవ రక్కడ యని యామువ్వురి నడిగెను. వారు తమతమ నామధేయముల వక్కాణించిరి. ఆమువ్వురుని వెంటబెట్టుకొని రాజు దీపాలోకశిథిలితాంధకారంబు, గుగ్గులుధూపవాసనావాసితంబు, సముపకల్పితసర్వోపకరణంబు, నిశ్శబ్దంబు, గంభీరంబు, భీషణంబు నగు సాధన భూమికిం జనియె.

అచ్చట భస్మరేఖాలిఖితమండల మధ్యస్థితుండు, పృథుపరివేష పరిక్షిప్తభాస్కరసదృశుండు, శవముఖకుహరహూయమాన వైశ్వానరుండు, కృష్ణవస్త్రాంగ రాగమాల్యపరిష్కృతశరీరుండు నైన భైరవాచార్యుని జూచి నమస్కరించెను. రాజు తదభినందితుండై దక్షిణాశాముఖంబు నలంకరించెను. పాతాళస్వామిపురందరదిగ్భాగంబునను, కర్ణతాళు డుత్తరదిశను, టీటిభుఁడు వరుణదిశనుఁ గాపాడిరి.

దిక్పాలకు లిట్లు నలుప్రక్కల నిల్చి జాగరూకతతోఁ గాపాడుచుండఁ దద్భుజపంజరమధ్యప్రవిష్టుండై భైరవాచార్యుఁడు విస్రబ్ధంబుగా భైరవంబగు కర్మ నాచరించుచుండ విఘ్నకారులగు పిశాచంబులు కొంతవడి కోలాహలంబు గావించి శాంతింపగా సర్ధరాత్రము గడవ మండలంబున కనతిదూరంబున నుత్తరదిశ నకాండంబుగాఁ బ్రళయవరాహదంష్ట్రావివరంబు మాడ్కి భూమిలో నొక్క

రంధ్రంబు గాన్పించెను. ఆవివరమునుండి దిగ్గజోత్క్షిప్తాలానలోహ స్తంభప్రతిముండు, మహావరాహపీవరస్కంధపీఠుండు, సాంద్రచందనకర్దమలిప్తదేహుండు, ఘూమోదరుండు శైలగురుగాత్రుండు, మస్తకాగ్రజ్వలితరత్నప్రదీపుండు, స్థూలోరుదండుండు, కర్ణవిఘ్ననిర్ఘాతపాతములవలెనున్న చండభుజాస్ఫోటనంబుల జీవలోకంబే కేంద్రియవికలంబుగా నొనరించుచున్నవాఁడు నగు నొక్క పురుషుండు బయలు వెడలి నవ్వుచు నరసింహసింహనాదఘోరంబగు కంఠధ్వనితో "ఓరీ విద్యాధరీకాముకా! యీజనునికిఁ బూజ సలుపకుండ బాలిశుఁడవలె నీవు సిద్ధి నభిలషించుట సహాయమదమా? లేక విద్యామదలేపమా? నాపేరుచే వ్యవహరింపబడు నీదేశమునకు క్షేత్రాధిపత్యమువహించి శ్రీకంఠుఁడను నామధేయముచేఁ బ్రఖ్యాతి గాంచిన నేనింతకాలమునకైన నీకర్ణపథంబునఁ బడలేదా? నా సమ్మతి లేనియెడ గ్రహగణంబునకైన గగనమందు సంచరింప శక్తి గలదే? అనాథుఁడగు నీభూనాథుఁడు నీవంటి శైవాపసదులచేఁ గింకరుఁడుగా జేయబడెను. నేఁడీ దుష్టునితోఁగూడ నీదుర్నయఫలము ననుభవింపుము"ని పలుకుచుఁ నభిముఖముగాఁ బరుగిడి టిట్టిభప్రభృతుల మువ్వురిని నిష్ఠురప్రకోష్ఠప్రహారంబులచే నేలఁ గూల్చెను.

అందుపై నపూర్వాధిక్షేపశ్రవణసంజాతరోషుండై నరనాథుండు "ఓరీ కాకోదరాధమా! వృథావాచాటుఁడా! కాకసదృశుఁడా! రాజహంసనైన నేనుండఁగా బలిని యాచించుటకు లజ్జింపవా? ఈపరుషభాషణములతో నేమిప్రయోజనము? వీర్యము భుజమందుండును గాని వాక్కునందుండదు. శస్త్రమును గ్రహింపుము. ఇదిగో నీపనిఁ గడతేర్చెద. అగృహీతశస్త్రులఁ బ్రహరించుటకు నాభుజఁ మొల్లదని" సావజ్ఞముగాఁ బలికెను. అందుకా నాగుఁడును శస్త్రమెందుకు రమ్ము. నాభుజములచేతనే నీభుజదర్పముడంచెదనని పలికి భుజాస్ఫాలన మాచరించెను. భూవరుఁడును

నిరాయుధు సాయుధముతోఁ బోరుట యసమంజసమని తలంచి చర్మ ఫలకముతో నట్టహాసఖడ్గమును విడిచిపెట్టి బాహుయుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను. నిర్దయప్రహారస్ఫుటితభుజరుధిరసిచ్యమానులై నాగభూకాంతు లిరువురు శిలాస్తంభసదృశబాహుదండపాతనములచే లోకమును శబ్దమయముగాఁ జేయుచుఁ బోరాడిరి. అల్పకాలములో భూపతి యానాగునిఁ గ్రిందఁ బడఁద్రోసి కేశములఁ బట్టుకొని శిరస్సును ఛేదించుటకు వరనుండి కత్తిఁ బెరికెను. అంతలో వాని యజ్ఞోపవీతమునుఁ జూచి యుపసంహృతశస్త్రవ్యాపారుండై "మర్త్యనీతుఁడా! దుర్నయనిర్వాహబీజము నీయొద్దనున్నది. అందుచే నిట్టి చాపలముల నాచరించుచున్నావ"ని పలికి వానిని విడిచి పెట్టెను. అనంతర మతి బహుళంబగుఁ జోత్స్నగానవచ్చెఁ వికసితకమల వనామోదము నాఘ్రాణించెను. నూపురధ్వనిని వినెను. అందుపైని రాజు శబ్దానుసారముగా నల్గడలఁ దనదృష్టినిఁ బ్రసరింపఁ జేసెను.

వీచప నించుక సేపునకు నీలజలధరోదరమందు శంపాలతవలె నట్టహాసబ్రతిబింబితయు, నిజప్రభాపటలకబళితత్రియామాంధకారయు, తామరసహస్తయు, శరత్తారాగణతారహారయు, కరతోపతంసీకృతాశోకపల్లవయు, మృణాళకోమలంబులగు నవయవములచేఁ దన కమలసంభవత్వమునత్కరముగాఁ దెలియఁజేయుచున్నదియు నగు నొక స్త్రీనిఁ జూచి రాజసంభ్రాంతుఁడై "అమ్మా! నీ వెవ్వతెవు? ఇచ్చట నాకేల దర్శన మొసంగితి"వని యడిగెను. అందు కామె స్త్రీజనవిరుద్ధమగు నవష్టంభముచే రాజు నభిభవించుచు "వీరవర్యా! నేను నారాయణోరస్స్థలలీలావిహారహారిణిని, అసిధారాజలకమలినిని, సుభటభుజజయస్తమ్భవిలాససాలభంజికను, మహాలక్ష్మిని నీశౌర్యరసముచే నాకర్షింపఁబడితిని. నీయభిలషితమునుఁ గోరుకొను మిచ్చెద"నని పలికెను.

ధీరులు పరోపకారమందు విసుకులేనివారు. ఏలయన; అప్పుడా పుడమిరేఁడు మహాదేవికిఁ బ్రణమిల్లి స్వార్థనిరపేక్షుఁడై భైరవాచార్యుఁ డాచరించుచున్న కర్మకు సిద్ధియగునట్లు కటాక్షింపుమని ప్రార్థించెను. లక్ష్మీదేవియుఁ బ్రీతహృదయురాలై క్షీరోదవీచీసహచరంబులగు కటాక్షవీక్షావిశేషంబులచే నాతని నభిషేకింపుచు "నీసత్త్వోత్కర్షచేతను, అలోకసామాన్యంబగు నీశివభక్తిచేతను నేను మిక్కిలి సంతసించితిని. సూర్యచంద్రులకు మూడవవానివలె లోకములో నవిచ్ఛిన్నమును, ప్రతిదినోపచీయమానంబు, శుచిసుభగసత్యత్యాగధైర్యశౌర్యాదిసద్గుణవిశిష్టమహాపురుషబహుళంబునగు రాజవంశమునకుఁ గర్తవు కాగలవు. హరిశ్చంద్రునివలె సప్తద్వీపభోక్తయు మాంధాతచందంబునఁ బ్రజారక్షణాతత్పరుండును, త్రిభువనవిజిగీషువునైన హర్షుఁడనుచక్రవర్తి నీవంశమున నుద్భవింపగలఁడు. ఆతనికి నా యీహస్తంబు పరిత్యక్తకమలంబై చామరంబు గ్రహించునని" పలికి యంతర్ధానము నొందెను.

లక్ష్మీవచనంబు లాలకించి భూపాలుం డతిమాత్రహృష్టుం డయ్యెను. భైరవాచార్యుండును, దేవీవరప్రభావంబునను స్వానుష్ఠితకర్మబలంబునను తత్క్షణంబున కుంతలి, కిరీటి, కుండలి, హారి, ఖడ్గముద్గరియునై విద్యాధరత్వంబునొంది "రాజా! అలసులైన లఘుచేతస్కులమనోరథంబులు దూరముగా వ్యాపింపవు. సత్పురుషులొనర్చు పరోపకృతులు లోకములో విస్తరించును. స్వప్నమందుఁ గూడ నసంభావితమగు నిట్టి దక్షిణను నాకు మరెవ్వరియ్య సమర్థులు. లఘుస్వభావులైన పురుషులత్యల్పసంపదచేనైనఁ ద్రాసువలె నౌన్నత్యము నొందుదురు. భవత్సహాయంబువలన నిట్టియలభ్యలాభమునుఁ బొందిన మూర్ఖుఁడనైన నానిర్లజ్జతనుఁ జూడుము. ఎప్పుడైన నేదైన కార్యలవోపయోగమందు నన్ను స్మరించుటకుఁ బ్రార్థించుచున్నాన"ని పలికెను. ధీరుల మనంబులు ప్రత్యుపకార

దుష్ప్రవేశములు. ఏలయన నారాజు "మీకుఁ బ్రాప్తించిన విద్యాధరత్వసిద్ధిచేతనే పరిసమాప్తకృత్యుడనైతిని. మీరింక యథాసమీహితస్థానమునకు విచ్చేయు"డని ప్రత్యుత్తర మొసగెను.

రాజిట్లుపలుక భైరవాచార్యుఁడు టీటిభాదులఁ గౌఁగిలించుకొని సాస్రులోచనుఁడై క్షితిపతివైపుజూచి "ఉర్వీధవా! పోయి వచ్చెదనని పలుకుట స్నేహోచితముగాదు. ఈప్రాణములు నీవి సుమీ యనుట పునరుక్తము. నేను నీచేఁ గ్రీతుడననుట ఉపకారానురూపముకాదు. నీవు నాకు బాంధవుడననుట దూరీకరణము. నాహృదయము నీయందున్నదనుట యప్రత్యక్షము. ఈ నాసిద్ధి భవద్వియోగకారణమయ్యెననుట యవిశ్వాస్యము. నీయుపకారము నిర్వ్యాజమనుట యనువాదము. నన్ను స్మరింపవలయుననుట ఆజ్ఞ. కావున గృతఘ్నాలాపములయందున సజ్జనకథలయందు స్వార్థపరుడనైన నన్నుఁ బోర్కొనుమ"ని పలికి వేగచ్ఛిన్నహారోచ్చలితముక్తాఫలనికరతాడితతారాగణుడై విమానంబుతో గగనంబున కేఁగి సిద్ధ్యుచితస్థానంబునకుఁ జనియె.

శ్రీకంఠనాగుడును "దేవా! శిక్షితవినయుడనైన నన్నును గ్రహించి కర్తవ్యములయందు నియోగింపు"మని విన్నవించి మరల నాభూవివరమునుఁ బ్రవేశించెను.

నరవరుండును రాత్రి క్షీణభూయిష్ఠముకాగా వికసితకమలామోదగర్భంబగు ప్రాభాతికవాతపోతంబువీవ, మృదుపవనలాసితవనలతానిచయంబు పుష్పనికరంబునుంబోలె నవశ్యాయబిందునికురుంబంబు వర్షింప, నంతర్గుంజన్మధుకరంబులగు కుముదంబులు ముకుళింప, కృకవాకుకూజితంబు లెల్లెడలఁ బిక్కటిల్ల నాగయుద్ధవ్యతికరమలీమసంబులగు నవయవంబుల వనవాపీజలంబులఁ గడిగికొని,

టీటిభాదుల ముగ్గురిని దోడ్కొని స్వపురంబుఁ బ్రవేశించెను. అచట వారిని స్నానభోజనాచ్ఛాదనాదులచే నాత్మతుల్యముగా గౌరవించెను.

కొంతకాలము గతించినపిదప టీటిభుడను పరివ్రాజకుఁడు వలదని రాజు నివారించుచున్నను వినక తపశ్చర్యార్థమై యరణ్యాంబున కేగె. కర్ణతాళ పాత్రాళస్వాము లిద్దరు శౌర్యానురక్తులై రాజును సేవించుచుండిరి. మనోరథాతిరిక్తవిభవంబనుభవించుచు రాజుచే యుద్ధముఖమందు మొదట నియోగింపబడుచున్నవారై కథాప్రసంగములందు తను శైశవవృత్తాంతమును విచిత్రమైన భైరవాచార్యుల వృత్తాంతమును వాకుృచ్చుచు రాజును రంజింపఁజేయుచు నాతనితోఁగూడ ముసలివారైరి

తృతీయోచ్ఛ్వాసము,

ముగిసెను.

# ఆంధ్ర హాషా చరిత్ర.

## చతుర్థోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ స్వప్నమందైన యోగంబుఁ బడయఁబోదు,
కరముఁ జేపట్టరైనను ఘనులు తలఁప,
నామమాత్రానఁ గొందరీ భూమిలోన,
భూపతులటంచుఁ గాంతురు పొగడితలను॥

తే॥ గీ॥ సామజాస్యుని ముఖమందు సొట్టవమునఁ,
బుట్టు దంతంబు కైవడి భూమిపైని
సర్వభూభృత్ప్రకంపకృత్స్వారుఁడొకఁడు,
పృథుసమానుఁడు జనియించి పేరు వడయు॥

శ్రీమన్నారాయణునివలన ద్విజవరస్వేచ్ఛాగృహీతకోశంబగు, నాభిపద్మంబుకరణి, రత్నాకరమువలన లక్ష్మీపురస్సరంబగు రత్నసంచయము మాడ్కి, నుదయస్థానంబునుండి గురుబుధకవికళాభృత్ప్రియంబగు గ్రహగణంబుచందంబున శూరునివలన ద్విజయబలసనాథంబగు హరివంశంబుకైవడి నాపుష్పభూతినుండి యొక రాజవంశం బుత్పన్నంబయ్యె, కృతయుగంబునుండి యవిచ్ఛిన్నధర్మధవళంబులగు పరిజాసర్గంబులవలె, సూర్యునివలనఁ బ్రతాపాక్రాంతభువనంబులగు కిరణంబుల విధంబున, బ్రహ్మకరంబునుండి భూభరణక్షమంబులైన దిగ్గజంబులరీతి, నందనవనంబునుండి యిష్టఫలదాయకంబులైన కల్పవృక్షంబులతోయంబున, నా రాజవంశమునుండి యనేకులైన రాజులుదయించిరి.

ఆవంశమందు రాజులెట్లుద్భవిల్లుచుండ వారిలోఁ దుమష్క-ఘారణాసి షాండు, సింధురాజగర్వాద్రికులిశుఁడు, లాటపాటవపాట

చ్ఛరుండు, మాళవలక్ష్మీకులతాలవిత్రుండు నైన ప్రభాకరవర్ధనుం డను రాజాధిరాజొకఁడు జనించె.

ఆభూకాంతుండు విధేయీకృతప్రకృతి, ప్రతాపవినమదశేష నరపతిమకుటమణికాంతి నీరాజితాంఘ్రిద్వయుండు, చంద్రమరీచినిచయపాండురయశః ప్రకాశితదిగంతుండు, రణజలధిపోతపాత్రీకృత కృపాణలతికాలంకృతభుజుండు, అర్థికులకలహంససంప్రీణనచణశరదవతారుండు, అప్రయత్నసముపస్థితానంతభోగలాలితుండు, నై వసుమతినేలె. అతని ప్రతాపంబు నిహతపరిపంథిపార్థివాంతఃపుర స్త్రీలహృదయంబుల నగ్నిమయంబై, లోచనంబుల జలమయంబై, నిశ్వాసంబుల మారుతమయంబై, అంగంబుల క్ష్మామయంబై, శూన్యతయందాకాశమయంబై మూర్తంబగు పంచభూతాత్మకంబనం దగియుండె. విగ్రహంబనుగ్రహంబనియు, యుద్ధాగమంబు మహోత్సవంబనియు, అరిబాహుళ్యంబభ్యుదయంబనియు, వైరము వాయనంబనియు, శత్రుముఖదర్శనంబు నిధిదర్శనంబనియు నా రాజు దలంచెడివాఁడు. అతని రాజ్యపరిపాలన సమయంబున ధాతువులకే సోపసర్గత ఇక్షుదండంబులకే పీడనంబు, సుకవికావ్యంబులయందయతిభ్రంశంబుఁ గానవచ్చెను.

శ్రీధరునికి లక్ష్మీవలె హృద్యయై, చంద్రునికి రోహిణి వూడ్కి స్ఫురత్తరళతారకయై, సరిన్నాథునికి గంగకైవడి మహోభూభృత్కులోద్గతయై రాజహంసకు హంసికరణి మానసానువర్తనచతురయై, ధర్మమునకు వేదవిద్యగతి సర్వలోకార్చితచరణయై వసిష్ఠునికరుంధతి పగిది నముక్తపార్శ్వస్థితియై, ప్రకాశించునది, గమనమందు హంసమయి, ఆలాపములయందుఁ గోకిలమయి, సకలజనవంద్యతలో సాధ్వీమయి, గురువులయందు వేతసమయి, సఖులయందు నిర్వృత్తిమయియునై సౌందర్యమునకు సర్గసమాప్తి యనఁ

దగిన రూపలావణ్యసంపదచే నొప్పారు యశోవతి యను నారీరత్నం బా రాజసింహుని పట్టమహిషి.

జన్మ మొదలుకొని యమ్మేదినీవల్లభుం డాదిత్యభక్తుండై యుండెను. ప్రత్యహము ఉషఃకాలంబున నిద్రలేచి కాల్యకృత్యంబుల నిర్వర్తించి మజ్జన మొనరించి శ్వేతపట్టాంబరంబుల ధరియించి ధవళవస్త్రప్రావృతశిరస్కుండై ప్రాఙ్ముఖుఁడుగాఁ గూర్చుండి పవిత్రపద్మరాగపాత్రీనిహితరక్తకమలషండంబుచే నవోదితసూర్యునిఁ గుంకుమపంకానులిప్తమండలంబునఁ బూజించి యపత్యలాభార్థియై త్రికాలములయందుఁ బరమభక్తితో నాదిత్యహృదయమంత్రంబు జపించుచుండెను.

దేవతల మనంబులు, భక్తజనప్రార్థనావశంవదంబులగును. గ్రీష్మసమయమం దొకనాటిరాత్రి యానరవరుండు సుధాకరకరనికరసితసుధాధవళంబగు హర్మ్యంబున నిద్రించెను. అతని పార్శ్వమందున్న ద్వితీయపర్యంకంబున యశోవతీదేవి శయనించె. నిశాపరిణతప్రాయంబుకాగా నాసన్నప్రభాతవేళావిలుప్యమానలావణ్యుండై కుముదినీబాంధవుం డస్తగిరిదరిం జేర నంతఃపుర ప్రదీపంబులు ప్రాతస్తసమారుతపాతంబునఁ గంపింప రాజుశయన ప్రసారితహస్తపాదుండై విస్రబ్ధంబుగా నిద్రింప యశోవతి "ఆర్యపుత్రా! రక్షింపుము రక్షింపుము" అని పలుకుచు భయోత్కంపితాంగియై మొఱలిడసాగెను.

భూనాథుం డపుడు దేవీముఖంబుననె కాదు, సర్వపృథివీమండలంబునఁ గూడ నెన్నఁడు విని యెఱుంగని రక్షింపుమను నార్తధ్వనిచే దగ్ధశ్రవణుండునుంబోలెఁ దత్తరపాటుతో శయనంబునుండి లేచి శిరోభాగానస్థితఖడ్గంబుదీసి కేలఁబూని రోషనిద్రాలోహితంబు

లగు లోచనకాంతులచే నాశాతటంబుల కారుణ్యంబుఁ గల్పించుచు నెల్లెడలం బరికించి "భయపడకుము, భయపడకుము"ని దేవి నోదార్చుచు నెచ్చట నేమియుం గానక దేవిని భయకారణంబడిగెను. అత్తరియామికజనంబు సంభ్రమంబునఁ బరుగిడ హృదయోత్కంపకారియగు సాధ్వసంబు శాంతింప దేవి "ఆర్యపుత్ర! బాలతపనదృశదేహప్రభాపటలవిచ్ఛురితదిగ్భాగులు, కవచకుండలాంగదమకుటధారులు, పరిహితరక్తవస్త్రులు, జగద్వందితచరణులు, ఏకకన్యకానుగతులు నగు నిద్దరుకుమారులు సూర్యమండలమునుండి భూమికిఁ దిగి భయముచే విలపించుచున్న నాయుదరమున ఖడ్గముతోఁ జీల్చి లోపలఁ బ్రవేశించినట్లు కలఁగని లేచి భయవేపమానహృదయనై మీకొఱకాక్రందించితినని వాక్రుచ్చెను.

ఈవేళయందు స్వప్నఫలమును సూచించుదానివలె రాజలక్ష్మీప్రథమాలాపమైన ప్రభాతశంఖధ్వని వినఁబడెను. భవిష్యదభ్యుదయముఁ జెప్పుచున్నవివలె నమందముగా దుందుభులు ధ్వనించెను. "జయజీవ"యని ప్రబోధమంగళపాఠకు లుచ్చైస్స్వరంబునఁ బలికిరి. వాజిశాలామందిరమందు నిద్రలేచిన పురుషుఁడొకఁడు మధుర హేషారవంబులుగల హయంబులకు మరకతహరితంబైన ఘాసంబిడుచు గీతిద్వయంబుఁ జదివెను.

తే॥ గీ॥ మహితకాంతి సమూహంబు మణివరంబు।
నవనిరుహారూఢ వికృతియనర్ఘ్యనిధివి।
రమ్యశకునంబు శుభముల రాక భువినిఁ।
దెలుపు తెల్లంబుగా నెల్ల దేహులకును॥

తే॥ గీ॥ మొదటఁ బొడసూపు నరుణు డంభోజమిత్రు।
నతిజవిష్ఠంబు పవనంబు నంబువృష్టి।

ముందుఁ దోఁచెను శకునము లొక్కదభేద।
ముల నొసంగెను మంచిచెడ్డలనుఁ దెల్పు॥

రాజది విని ముదితాంతఃకరణుఁడై "దేవి! యానందింప వలసిన సమయమందు విషాదము నొందెదవేల? గురుజనాశీర్వాదములు నేఁడు నీయందు ఫలించినవి. నీమనోరథములు నిండినవి. కులదేవతలచే ననుగ్రహింపఁబడితివి. భగవంతుఁడంశుమాలి నీయెడఁ బ్రసన్నుండయ్యె. శీఘ్రకాలములో నతి గుణవంతమగు నపత్యత్రయంబు నీకొసంగి నిన్నానందింపఁజేయు" నని చెప్పి మేడదిగివచ్చి కాల్యకృత్యంబుల నిర్వర్తించెను. యశోవతియు భర్తృభాషితంబుల సంతసిల్లెను.

తరువాతఁ గొంతకాలమునకు యశోవతి గర్భంబు ధరించెను. గర్భస్థశిశుని యశంబుచేఁ బలెఁ దల్లిశరీరంబు పరిపాండురంబయ్యె. శిశుగుణాగౌరవక్లాంతినైనట్లు గాత్రోద్వహనమందశక్తయయ్యె. ఆహారమందరుచిపొడమె. క్రమముగా నుపచీయమానగర్భభరాలసయై సఖీహస్తం బూతఁగాఁ గొని గురుపాదాభివాదనమునకుఁ జనియె. ఆసన్నస్తంభభిత్తులయందు విశ్రమించుచున్నదియై సాలభంజనవలెఁ గన్పట్టె. హస్తావలంబనంబునకు మణికుడ్యనిర్మితంబులగు ప్రతిమలనైనఁ గూడ బాహువులఁ జాచెను. భవనలతల జెప్పెడిదేమి? చేయుట యటుండఁగా గృహకార్యముల నిట్లు సలుపుఁడని చెలులతోఁ జెప్పుటకుఁగూడ నసమర్థయయ్యె. స్వావయవంబు లతి భారమైనపుడిఁక భూషణంబులఁ జెప్పనేల? క్రీడాపర్వతాధిరోహణస్మరణమాత్రంబుననె కంపితగాత్రియయ్యె. ఉదరమందుఁ దనయుఁడు హృదయమునందు వల్లభుఁడు నుండుటచే ద్విగుణీకృతంబగు శోభ వహించె. పరిచారికోత్సంగనిహితశరీరయయ్యు నపత్నీమస్తకంబులఁ బాదంబులిడెను. ఇట్లు నవమాసంబులు నిండఁ బదియవ

మాసంబున సకలభువనధారణసమర్థుండు, సకలభూభృత్సముపకారియు నగు పుత్త్రునిం గనియె. తజ్జన్మదివసంబున జాతిప్రమోదమత్తలై ప్రజ లెల్లరు నృత్యంబు సలిపిరి. అపుడు పూరితాగణ్యశంఖనాదముఖరంబు, ప్రహతానేకపటహపటురవంబు, గంభీరభేరీనినాదబధిరితభువనంబు, సంతోషోన్మత్తపౌరలోకంబునగు మహామహోత్సవం బొక దివసంబునందువలె నొక మాసంబు జరిగెను. ఆశిశువునకు రాజ్యవర్ధనుండని నామకరణం బొనర్చె.

అంత మరికొంతకాలంబతీతంబుగాఁగఁ గోరకితకదంబమహీజంబు, సంతుష్టచాతకహృదయంబు, విలుప్తపంకజశోభంబు నపగతమదహంసంబునైన శ్రావణమాసంబున దేవకీదేవికిఁ జక్రపాణివలె యశోవతికి గర్భమందు హృదయమందుఁగూడ నొక్కమారు హర్షోత్పత్తి సూచింపంబడియె. సకలప్రజాపుణ్యపరిగృహీతయో యన నామె గాత్రంబు మరల నాపాండురంబయ్యె. నిర్మలమణికుట్టిమపతితప్రతిబింబవ్యాజంబున గృహీతపాదపల్లవయైన లక్ష్మిచే సేవింపఁబడుచున్నట్లు కానవచ్చెను. కరవిధృతకమలినీపలాశపుటసలిలంబులఁ జతురంతదంతావళంబులచే నభిషిక్తయైనట్లు పలుమారు స్వప్నంబులఁ గాంచెను. క్రీడలయందుసైతమాజ్ఞాభంగమును సహింపనిదయ్యె. ఏకీకృతంబులగు చతుస్సముద్రతోయంబుల స్నానమాచరించుటకు వాంఛపొడమెను. గర్భస్థశిశుప్రేరణచేఁ బృథ్వీగతసారాసారపరీక్ష జేయువానివలె మృద్భక్షణాసక్తయయ్యె. మణిదర్పణంబులు సన్నిహితంబులైయున్న నుత్ఖాతఖడ్గపట్టంబుల ముఖముఁ జూచుకొనుటకు వ్యసనంబు పుట్టెను. శ్రుతిసుఖవిపంచికాకలనిక్వణంబులం బరిత్యజించి స్త్రీజనవిరుద్ధంబులైన ధనుర్జ్యాటంకారంబుల వినఁగోరెను. పంజరబద్ధసింహంబులయందు దృష్టి రమించెను. గురువందనంబులందు నతికష్టముతో శిరము వంచెను. ఇట్లు దినంబు లతిక్రమింపుచుండఁ బ్రసూతిసమయంబాసన్నంబై యుండ నుచిత

స్థానంబులఁ గూర్చుండి వివిధౌషధిధరులై భిషగ్వరులు శిశూత్పత్తిని నిరీక్షించుచుండిరి. చెలులామెకంఠసూత్రగ్రంథులయందు రక్షార్థమై పత్రిశస్త్రరత్నంబులం గట్టిరి. మఱికొన్నిదినంబులకు జ్యేష్ఠమాసమున రాగాఁ గృత్తికానక్షత్రయుక్త కృష్ణచతుర్దశీనిశయం దంతఃపురంబున హఠాత్తుగా స్త్రీజనకోలాహలంబు చెలంగెను. యశోవతీహృదయనిర్విశేష యనందగిన సుయాత్రయను ధాత్రీపుత్రిక సంభ్రమంబున నంతఃపురమునుండి వచ్చి నరపాలుని పాదంబులఁ గెరఁగి దేవరకు ద్వితీయపుత్రుఁడు జనించెనను శుభోదంతమునుఁ దెలిపి పూర్ణపాత్రంబు హరించె. రాజునకుఁ బరమసమ్మతుఁడు, అతీంద్రియజ్ఞాననిధి, జ్యోతిశ్శాస్త్రపారంగతుఁడు, త్రికాలవేదియునగు భోజకస్తారకుండను దైవజ్ఞశిరోమణి నృపునికడకేతెంచి "దేవా! వ్యతీపాతాదిసర్వదోషవర్జితంబైన యీదివసంబున గ్రహంబులన్నియు వానియుచ్చస్థానంబున నున్నవి. ఈదృశశుభలగ్నంబునఁ బ్రోల్లి మాంధాత యొక్కండే జనియించె. నాటిదినము మొదలుకొని నేటివరకు నీమధ్యకాలమందీజగంబున మరి యేచక్రవర్తియుఁ బుట్టలేదు. ఏలికకు జనించిన యీశిశువు సప్తచక్రవర్తులలో నగ్రగణి. చక్రవర్తిచిహ్నములకు మహారత్నములకు భాజనము. సప్తసాగరవలయితమైన భూమండలమునకుఁ బరిపాలకుండు. సప్తతంతుప్రవర్తయిత. సప్తసప్తితేజస్కుఁడు, నతిశయితపూర్వరాజచరిత్రుఁడని" విన్నవించెను. ఈసమయంబున ననాధ్మాతంబులై శంఖంబులు స్వయముగా ధ్వనించెను. అతాడితంబయ్యుఁ బట్టాభిషేకదుందుభిజలనిధి ఘోషగంభీరంబుగా మ్రోగెను. అవాదితములయ్యును మంగళతూర్యంబులు విముక్తనాదంబులయ్యె. సర్వభువనాభయఘోషణాపటహంబు మ్రోడ్కి దిగంతరంబులఁ దూర్యనాదప్రతిధ్వానంబై సఁగె. విధుతకేసరసటావిసరంబులగు హయరత్నంబులు గృహీతహరితదూర్వాపల్లవకబళంబులై హర్షంబున హేషారవంబు గావించెను. సవిలాససముద్ధృతశుండాదండంబులతో నర్తించుచుఁ వానివలె

గర్జంబులు శ్రవణసుభగంబుగా గర్జించెఁ. యజ్వాలమందిరంబులఁ బ్రదక్షిణజ్వాలాకలాపసూచితశుభాగమంబులై యజ్ఞాగ్నుల నింధనంబుగాఁ బ్రజ్వలించెను. కనకశృంఖలాబంధబంధురంబులగు మహానిధులు భూములోనుండి పైకుబికెను. శుక్లవస్త్రులు, వేదముఖులునైన బ్రాహ్మణోత్తము లమితసంఖ్యాకులు ప్రజావృద్ధికొరకు రాజభవనమునకు విచ్చేసిరి. మూర్తంబగు ధర్మంబుచాడ్పున శాంత్యుదకకు శఫలహస్తుండైన పురోహితుండత్తరిఁ జనుదెంచె. జాతకర్మమహోత్సవావలోకనకుతూహలంబున వచ్చిన వృద్ధబాంధవస్త్రీలు పురాతనస్థితులవలెఁ గన్పట్టిరి. శ్మశ్రుజాలజటిలముఖులు సాంద్రమలపంకకళంకితకాయులునైన కారాగృహబద్ధులు ముక్తులై పోవుచున్నపుడు కలికాలబంధుకులంబులవలెఁ గానవచ్చిరి. పౌరజనవిలుంఠితవిపణివీధులప్రకాంతాధర్మశిబిరశ్రేణులవలెఁ జూపట్టెను. బధిరవామనకిరాతపరివేష్టితలై సాక్షాజ్జాతమాతృదేవతలవలె నున్న వృద్ధధాత్రులాడిరి. మఱియు నపగతరాజకులమర్యాదయు, నిరర్గళాంతఃపురప్రవేశంబు, సమీకృతప్రభుభృత్యభావంబు, నిర్విశేషబాలవృద్ధంబు, తుల్యశిష్టాశిష్టజనంబు, దుర్జ్ఞేయమత్తామత్తప్రవిభాగంబునైన పుత్రజన్మమహోత్సవంబు బహుదినంబులు ప్రవర్తిల్లెను.

ఇంద్రలోకంబునుండి భూమికిదిగిన యప్సరస్సమూహంబువలెఁ బ్రకాశించు సామంతాంతఃపురస్త్రీజననిచయంబు కుంకుమాధివాసితంబులగు మణిమయభాజనంబులను, స్ఫటికశిలాశకలశుక్లకర్పూరఖండపూరితంబులగు పాత్రంబులనుఁ స్నానీయచూర్ణావకీర్ణకుసుమమాల్యంబులను, తాంబూలవృక్షకంబులనుఁ, బరిజనంబులచేఁ బట్టించుకొని నూతనజాతరాజపుత్రునిఁ జూడవచ్చిరి. నృత్యన్నారీజనపదాలక్తకరసార్ద్రంబై వసుంధరాతలంబంతయు నెఱ్ఱఁబడె. స్త్రీభుజలతావిక్షేపంబులచే జీవలోకంబు మృణాళమయమైనదానివలె భాసించెను. చంచలాక్షీనేత్రాంశువులచే వాసరంబులు

కృష్ణసారమయంబులవలె నయ్యె. ధ్వనదాభరణగణప్రతిశబ్దంబులచే దిక్కులు కింకిణీమయము లైనట్లు ధ్వనించినవి. కర్ణపూరీకృత శిరీషకుసుమంబులచే నాతపంబు హరితవర్ణంబయ్యె. ఆనందభరిత హృదయులై వృద్ధులు సైతము లజ్జవిడిచి భూతావిష్టులవలె నాడ సాగిరి. విద్వాంసులును మత్తులవలెఁ దమ్ముఁ దాము మరచిరి. నరపతి, పుత్రజన్మోత్సవానందపరవశుఁడై బ్రాహ్మణులకు సర్వస్వ దానం బొసంగెను. ప్రతిదిక్కున లోకులు కుబేరకోశములవలె ధనరాశులనుఁ గొల్లలాడిరి. నృపతి యాద్వితీయపుత్త్రునికి హర్షుఁడని పేరిడెను.

ఇట్లు మహావిభవంబుతో ద్వితీయ పుత్త్రోత్పత్తిమహోత్సవంబుకొన్నిదినంబులు జరిగినపిదపఁ గొంతకాలంబునకు సమున్మిషత్ప్రతాపవిస్ఫులింగమునుం బోలె నుత్తమాంగనిహితరక్షాసర్షపుండై సమభివ్యజ్యమానసహజక్షాత్రతేజస్కునిమాడ్కి గోరోచనాపింజరితకాయుండై, హృదయోద్భిద్యమానదర్పాంకురుని చందంబున హాటకబద్ధవ్యాఘ్రనఖపంక్తిభూషితకంఠుండై ప్రథమావ్యక్తజల్పితముచే సత్యమునకు మెల్లగా నోంకారమునురచించువాని కైవడినున్నవాఁడై ముగ్ధస్మితంబులచే బంధుజనహృదయంబుల నాకర్షింపుచున్నవాఁడై, జాయమానకతిపయకోమలదంతాంకురమండితముఖకమలుండై, అంతఃపురస్త్రీజనసమూహంబుచే జాగరూకతతో రక్షింపఁబడుచున్నవాఁడై, మృగరాజపోతంబుకరణి రక్షిపురుషశస్త్రపంజరమధ్యగతుండై, ధాత్రీకరాంగుళుల గ్రహించి హర్షుఁడయిదారడుగులఁ బెట్టఁగలవాఁడై యున్నతరి యశోవతి మరల నెలఁ దప్పెను.

మాసంబులు నిండ ప్రావృట్కాలము హంసమధురస్వరరమణీయంబగు శరదృతువునువలె, వసంతలక్ష్మి కుసుమసుకుమారావయవంబగు వనరాజినిబోలె ప్రతిపత్తు సకలజననయనానందకారిణియగు చంద్రలేఖనువలె, శచీదేవిసహస్రనయనదర్శనయోగ్యయగు

జయంతినివలె, హిమవత్కళత్రమగు మేనక సర్వభూభృద్భర్తృదుహితయైన గౌరినివలెఁ బుత్రికనుఁ గనెను.

ఆకాలమందు యశోవతీ సోదరుఁడే డెనిమిదేండ్ల వయస్సుగల భండియను తన కుమారు నారాజపుత్రుల కనుచరునిగా నర్పించెను. వానియందు మహారాజు (ప్రభాకరవర్ధనుఁడు) సుతనిర్విశేషమైన ప్రేమఁగలవాఁడై యుండెను. మలయమారుతముతోఁ గూడిన మధుమాధవులవలె నా రాజసుతు లఖిలలోకహృదయానందకారులై విలసిల్లిరి. ప్రజానందముతోఁగూడ వర్ధిల్లుచున్న వారిరువురు క్రమముగా నుపారూఢయౌవనులైరి. కఠినప్రకోష్ఠులు, ఆజానుదీర్ఘపీవరభుజులు, విశాలోరఃకవాటులు, సాలప్రాంశులునై మహానగరసన్నివేశంబు పగిది సర్వలోకాశ్రయక్షములైరి. ఆమహారాజపుత్రు లుభయులు చంద్రసూర్యులవలె నభిరామదుర్నిరీక్ష్యులు, అగ్నిమారుతములవలె నభివ్యక్తతేజోబలులు, హిమవద్వింధ్యాచలంబులవలె శిలాకఠినకాయబంధులు, మహావృషభంబులవలెఁ గృతయుగయోగ్యులు, ఇంద్రోపేంద్రులవలె నాగేంద్రగతులు, కర్ణార్జునులవలెఁ గుండలకిరీటధరులు, రాజ్యవర్ధన హర్ష నామంబులచే వ్యవహరింపఁబడుచున్నవారై యల్పకాలములోనే ద్వీపాంతరములయందుఁ గూడఁ బ్రసిద్ధినొందిరి.

అంత నొకదివసమందు ప్రభాకరవర్ధనుఁడు కృతభోజనుండై యంతఃపురంబునందుండి పుత్రుల నిద్దరిని రావించి "తనయులారా! రాజ్యాంగవర్తకమందుఁ బ్రధానులు భృత్యులు వారు యోగ్యులగుట దుర్లభము. బాలకులు మయూరమునువలె బాలిశులు రాజుల నాడించెదరు. శకులు దర్పణమందువలె రాజహృదయంబులఁ బ్రవేశించి తమప్రకృతిని సంక్రమింపఁ జేయుదురు. వంచకులు స్వప్నములవలె విధ్యావస్తుప్రదర్శనముచే నసద్బుద్ధిఁ

బుట్టించెదరు. ధూర్తులుపేక్షింపఁబడిన వాతరోగవికారములవలె వెఱ్ఱెత్తించుదురు. చాలికములవలెఁ దృష్ణావంతులగు నీచులు వశపఱచుకొనుట కశక్యులు. జాలికులు మానసమందున్న చేపనువలె నభిప్రాయమును గ్రహించెదరు. పూర్వోక్తదోషసంపర్కవర్జితులు, పరీక్షితగుణులు, శుద్ధులు, వినీతులు మాలవరాజపుత్రులు నైన కుమారగుప్త మాధవగుప్తులనువారిద్దరు నాకు ప్రాణసములు. వారిని మీకనుచరులనుగాఁ జేయుటకు నిశ్చయించితిని. వారియందు మీరిరువురు విశేషప్రతిపత్తితో నడచుకొనవలయును" అని యుపదేశించి, వారిని రప్పించుటకుఁ బ్రతీహారినిఁ బంపెను.

అష్టాదశవర్షదేశీయుండు, నాత్యుచ్చనాతిఖర్వశరీరుండు, అనేక నరపతిసంచరణచంచలంబగు నుర్వీనిఘృష్టంబులగు పాదన్యాసంబులచే నిశ్చలముఁగాఁ జేయువానివలె నున్నవాఁడు, అనవరతాభ్యస్తలంఘనకఠినమాంససాంద్రంబగు నూరుద్వయమునుండి వెలువడు తనుతరజంఘాకాండంబులఁ బ్రకాశించువాఁడు, కృశించినపార్శ్వంబులచే సురాసురభ్రమితవాసుకికషణక్షీణంబగు మందరాద్రివలె నున్న మధ్యంబున భాసించువాఁడు, అతివిస్తీర్ణంబగు వక్షంబుచే నపరిమితంబులగు స్వామిసంభావనల కవకాశంబొసంగువానివలె నున్నవాఁడు, ఆజానుదీర్ఘభుజయుగళవిక్షేపంబుల నతిదుస్తరంబగు యౌవనసముద్రంబు నీఁదువానివలెఁ గన్పట్టువాఁడు, చాపకిణాంకితపీవరప్రకోష్ఠుండు. జ్యేష్ఠుండునైన కుమారగుప్తుఁడు వాని వెనుక వానితమ్ముఁడగు మాధవగుప్తుండునుఁ బ్రతీహారితో రాజసన్నిధికేతెంచి దూరమునుండి వినయవినమితోత్తమాంగులై మహారాజునకుఁ బ్రణమిల్లిరి. నరేంద్రస్నిగ్ధదృష్టినిర్దిష్టంబగు ప్రదేశంబునను పవిష్టులైరి. కొంతసేపయిన తరువాత రాజు "నేఁటిదినము మొదలుకొని మీరుభయులు నాకుమారుల ననువర్తించి యుండవలయునని" వారికాజ్ఞాపించెను. అందుపై కుమారగుప్త మాధవ

గుప్తులు తమ శిరస్సులచే భూమిని స్పృశించుచు లేచి "మహారాజులు మమ్ముల ననుగ్రహించుటచే మేము ధన్యులమైతిమి. భవదాజ్ఞాను సారముగా నొనర్చెదమని" విన్నవించి రాజ్యవర్ధనహర్షులకు నమస్కరించిరి. అది మొదలుకొని రాజకుమారుల కుచ్ఛ్వాసనిశ్వాసములవలె నహోరాత్రంబు లభిముఖస్థితులై భుజంబులవగిది సతత పార్శ్వవర్తులై యనువర్తింపఁ దొడఁగిరి.

అంత రాజ్యశ్రీయును, నృత్యగీతాది సర్వకళలయందుఁ బ్రతి దినము వర్ధమానపరిచయముగలదై క్రమముగా నంకురిత యౌవనయయ్యెను. లక్ష్యమందు బాణములవలె సర్వధరాధీశుల దృష్టులామెపైఁ బడెను. రాజులామె జనకునియొద్దకు దూతలఁ బంపించి యాకన్యకను దమకిమ్మని యాచించిరి.

ఒకానొకదినమందు రాజాంతఃపురములోనుండ బాహ్యకక్ష్యాస్థితుండైన పురుషుఁ డొకఁ డీదిగువనున్న పద్యమునుఁ జదివెను.

క॥ తలఁపగఁ బయోధరోన్నతి।
విలసిల్లెడు సమయమందు వృద్ధిగ శోభ।
కలితె నదితటమువలె స।
త్కులజుని పిత సుడినిఁ ద్రోయుఁ గూతురు ధరలోఁ॥

రాజదివిని యుత్సారితపరిజనుండై పార్శ్వమందున్న దేవి నవలోకించి "దేవీ! మనరాజ్యశ్రీ తారుణ్యము నొందినది. ఏతదీయ సద్గుణంబులవలెనే తదీయచింతకూడ నామనంబు విడువకుండనున్నది. అంగసంభూతలు, అంకలాలితలు, అవిమోచ్యస్నేహపాశబద్ధలు నైన యాత్మపుత్రికల నాగంతుకముగా వచ్చిన యపరిచితుఁ డెవ్వఁడో కొని పోవుట నాకభిమతముగాఁ గానరాదు. ఇవియే సంసారములో

హృదయసంతాపహేతువులు. పురుషులు స్త్రీలు తల్లిదండ్రులకుం దుల్యముగా నపత్యమై యున్నను స్త్రీశిశువు జనింపఁగాఁ బ్రాజ్ఞులు వ్యధనొందుదురు. ఇందువలన సాధువులు కన్యకలకొఱకశ్రువులచే సలిల మొసంగుదురు. మునులిందువలననే యకృతదారపరిగ్రహులై విరక్తులై శూన్యారణ్యంబులఁ దపశ్చర్యారతాత్ములై యుందురు. అపత్యవిరహము నెవఁడు సహించును? పిల్లనమగు రాజపుత్రిల దూతలువచ్చినప్పుడెల్ల చింతనాహృదయంబులోఁ బ్రవేశించుచున్నది. ఏమిచేయఁగలము? అయినను గృహస్థులు లోకవృత్తముననుసరింపక తీరదు. వరుని కెన్ని సద్గుణములున్నను దరుచుగా బుద్ధిమంతు లభిజనమునే గణించెదరు. సర్వభూభృచ్ఛిరోమాల్యంబగు మౌఖరవంశము మాహేశ్వరపాదన్యాసంబువలె సకలలోకనమస్కృతంబు. తద్వంశప్రదీపకుండగువాఁడవంతివర్మ. అతని జ్యేష్ఠపుత్రుఁడైన గ్రహవర్మ సకలసద్గుణములచేఁ దండ్రి నతిశయించినవాఁడు. అతఁడు మనపిల్లనుఁ బెండ్లియాడఁగోరుచున్నాఁడు. నీకుఁ గూడ నావరుఁడు సమ్మతుఁడేని వాని కియ్యఁదలఁచియున్నానని" పలికెను.

భర్త యిట్లు నుడువ రాజమహిషియుఁ బుత్రీస్నేహకాతరహృదయయై కన్నీళ్లతో నాథ లోకములోఁ దల్లులు కన్యకలకు సంవర్ధనమాత్రోపయోగినులు. వీరిని వరుల కొసంగుటలో జనకులకే హెచ్చుస్వాతంత్ర్యము తల్లులకుఁ బుత్రులయందుకంటెఁ బుత్రికలయందు స్నేహమధికతరమై యుండును. అయినను మనదారిక మనోవ్యథాశూన్యయై బ్రతికియున్నంతకాల మెట్లు సుఖముగా జీవించునో యట్లుచేయుట తమకే తెలుసునని పలికి యూరకుండెను.

రాజు మనరాజ్యశ్రీని మౌఖరవంశోత్పన్నుఁడైన గ్రహవర్మ కియ్య నిశ్చయించితినని కుమారులతోఁ జెప్పెను. ఇదివరకే గ్రహ

వర్మచేఁ బంపఁబడిన ప్రధానదూతుని హస్తము దొరక శుభదినంబున నరపతిపుత్రికాదానధారాజలంబు విడిచెను. ప్రమోదభరితహృదయుండై యాదూత తనప్రభుసన్నిధికిం బోవ నుద్వాహదివసంబు లాసన్నముకాఁగా నుద్దామదీయమానతాంబూలపటవాసకుసుమమాలాలంకృతసర్వలోకంబై, నానాదేశాగతశిల్పిసార్థసాంద్రంబై, సామంతపురుషానీయమానోపకరణసంభారంబై, దౌవారికోపనీతానేకనృపోపాయనంబై, బహుదేశాగతబాంధువర్గసంకులంబై, సుధాలేపధవళీక్రియమాణప్రాసాదంబై, శిల్పిశతాలంక్రియమాణవివాహమంటపంబై, గంధోదకసిచ్యమానభూతలంబై, చిత్రపటవేష్టితస్తంభశోభితంబై రాజకులంబు విలసిల్లె.

అంత యశోవతి దుహితృవివాహోత్సవపర్యాకులహృదయయై మనంబుచే భర్తయందుఁ, గుతూహలంబున జామాతయందు స్నేహంబునఁ బుత్రికయందు నుపచారంబుల నిమంత్రితపురంధ్రీవర్గంబునందు నాదేశంబులఁ బరిజనమందు శరీరంబున సంచరణమందుఁ గంటిచే గృతాకృతకర్మప్రత్యవేక్షణమందు నానందంబున మహోత్సవమందు నొక్కతెయయిన ననేకప్రకారములుగా విభక్తయైనట్లు కానవచ్చె.

అపుడు రాజకులంబు విలాసినీమయంబై, జీవలోకంబు మంగళమయంబై, దిఙ్ముఖంబులు చారణమయంబులై, అంతరిక్షము పటహధ్వనిమయంబై, పరిజనంబు భూషణమయంబై, సృష్టియంతయు నిర్వృతిమయంబై, కాలము లక్ష్మీమయంబై, మహోత్సవంబతిశయింప సుఖంబునకు నిధానంబుకైవడి, జన్మమునకు ఫలమువలెఁ బుణ్యమునకుఁ బరిణామంబుమాడ్కిఁ, బ్రీతికి యౌవరాజ్యంబు కరణి, మనోరథమునకు సిద్ధికాలంబు పగిదిఁ బ్రకాశించునదియై జనాంగుళులచే గణింపఁబడుచున్న దివసమె మంగళవాద్యప్రతిధ్వనులచే

నెదుర్కొనఁబడుచున్నదానివలె మహాహూర్తికులచే నాహూయమానమయినదానివలె, వివాహమంగళదివసము సంప్రాప్తించెను. ఆనాటిప్రాతఃకాలమందుఁ బ్రతీహారులు జనులనందరినిఁ బైకి వెడలఁగొట్టి రాజభవనంబు వివిక్తముగా నొనరించిరి.

అంత నొక రాజసేవకుఁడు రాజసన్నిధికేతెంచి "దేవా! అల్లునివద్దనుండి పారిజాతకుఁడను తాంబూలదాయకుఁడు వచ్చె"నని విన్నవించి రమ్యాకృతియైన యొకపురుషునిఁ గనపర్చెను. రాజు జామాతయందున్న ప్రీతిచే వానియందాదరముఁ జూపుచు నోయి భద్రముఖుఁడా గ్రహవర్మ కుశలముగా నున్నాఁడా యని యడిగెను. వాక్చతురుఁడైన యాసేవకుఁడు రాజు కంఠధ్వనిని విని ముందుకుఁ బరుగిడివచ్చి కృతసాష్టాంగనమస్కారుఁడై "మహారాజా! గ్రహవర్మ కుశలముగా నున్నాఁడు. నమస్కారముచే దేవర నర్చించుచున్నాఁడని" విన్నవించెను. అల్లునిరాకఁ దెలుపుటకు వచ్చిన యాభృత్యుని వస్త్రభూషణాదులచే సత్కరించి "యీరాత్రి ప్రథమయామమందు శుభలగ్నము గావునఁ గాలాత్యయదోషంబు లేకుండ శీఘ్రముగా రావలయునని చెప్పుమ"ని సందేశించి వానినిఁ బంపివేసెను.

అంత సకలకమలవనశోభను వధూముఖమందు సంక్రమింపఁ జేసి వాసరమంత మొంద, వివాహదినలక్ష్మీపాదపల్లవమువలె సూర్యుఁడారక్తబింబమును వహింప వధూవరానురాగదర్శనలజ్జితంబులుం బోలెఁ జక్రవాకమిథునంబులు వియోగంబుఁ జెంద రక్తాంశుకవితానంబుమాడ్కి నంతరిక్షంబున సంధ్యారాగంబు దీపింప వరయాత్రోద్ధూతరజఃపటలంబు పగిది నంధకారంబు దిశాముఖంబులఁ గప్ప లగ్నసంపాదన సిద్ధంబైనదానివలె జ్యోతిర్గణంబుదయింప వివాహమంగళకలశంబు చందంబునఁ దారాధిపమండలంబు దయాచలశిఖరం బలం

శరింపఁ జంద్రోదయవిలీనంబగు తిమిరపటలంబు మరల గజఘటలచే నంకురింపఁ జేయుచుఁ, బురందరదిశాయూథుఁడగు శీతాంశునికరణి నక్షత్రమాలాలంకృతంబగు దంతావళేంద్రంబు నెక్కి తాళావచర చారణపురస్సరులగు జనుల కోలాహలంబు దిక్కులఁ బిక్కటిల్ల గంధతైలావసేకసుగంధికరదీపికా సహస్రంబుచే రాత్రినిఁ బగలుఁ జేయుచు వధూముఖావలోకనకుతూహలియై గ్రహవర్మ శుభలగ్నంబు సమీపింప నత్తవారింటికిఁ జను దెంచెను.

అల్లుఁడు ద్వారదేశమునకు వచ్చినాడని విని రాజలోకానుగమ్యమానుఁడై పుత్రులతో నెదుర్కొనఁబోయెను. ఏనుఁగునుండి దిగి నమస్కరించిన యాతనిని బాహువులఁ జాచి మాధవుఁడు పున్మధునివలె గాఢముగా నాలింగనము చేసుకొనెను. రాజ్యవర్ధన హర్షుల కౌఁగిలించుకొన్న పిదప నల్లుని రాజాభ్యంతరమునకుఁ గొని పోయి తనతో సమానముగా నాసనాదులనొసంగి యుపచారములఁ గావించెను.

కొంతసేపూరకుండి రాజమిత్త్రుఁడు విద్వాంసుఁడు నగు గభీరుఁడను బ్రాహ్మణుఁడు గ్రహవర్మతో "నాయనా చిరకాలమునకు నిన్ను లభించి రాజ్యశ్రీతోఁ గూడుకొని తేజోమయములగు చంద్రసూర్యవంశములవలె పుష్పభూతి ముఖరవంశములు రెండును సకలజగద్గీయమానగుణగణముఁ గలవి యైనవి. హరికిఁ గౌస్తుభమువలె నీవు గుణగణముచే మానరేంద్రునికి హృద్యుడవైతివి. ఇపుడు పరమేశ్వరునిచేఁ జంద్రునివలె శిరస్సుచే వహింపఁ బడఁదగినవాఁడవైతివని" పలికెను. ఈపండితోత్తముఁ డిట్లు శ్లాఘించుచుండఁగా మహామాత్రికులు వచ్చి దేవా! లగ్నవేళయాసన్నమైనది. పెండ్లికొడుకు కౌతుకాగారమందుఁ బ్రవేశింపవలసిన సమయమనిరి. వెళ్లుమని మామగారు చెప్పఁగా గ్రహవర్మ యంతఃపురమునుఁ బ్ర

వేశించి వరసందర్శన కుతూహలముగల తరుణీజనంబుల వికచనీల కువలయవనంబులవలె నున్న లోచనసహస్రములఁ దప్పించుకొని కౌతుకగృహద్వారమునకుఁ బోయి నివారితపరిజనుండై లోనికిఁ జొచ్చెను.

అంత నచ్చటఁ గతిపయాప్త ప్రియసఖీ పరివేష్టితయుఁ, బ్రభాతసంధ్యవలె నరుణాంశుకావకుంఠితముఖయు, తనుకాంతిచ్ఛటాకబళితదీపప్రకరప్రభయు, నుదయద్యావసయు, సాధ్వసనిరుధ్యమాన ప్రశ్వాసయు, తామరసప్రతిపక్షము నాసన్నగ్రహణుండై నస్వహస్తమునఁ జంద్రునిరోహిణివలె భయవేవమానమనంబుతోఁ జూచుచున్నదియు, జ్యోత్స్నాదానసంచితలావణ్యముఁ గల కుముదినీగర్భము నుండి పుట్టినట్లున్నదియు, వసంతునిహృదయమునుండి నిర్గమించినదానివలెఁ గుసుమామోదమనోహరమైనదియు, కౌస్తుభచంద్రవారుణీపారిజాతసుధాప్రభవంబులైన ప్రభాలావణ్యమదసౌరభమాధుర్యములైన సర్వరత్నగుణంబులను బెట్టి దేవదానవులయందుఁ దనకుఁ గల కోపంబున రత్నాకరునిచే సృజింపఁబడిన రెండవలక్ష్మివలెనున్నదియు, స్ఫురన్ముక్తాఫలకల్పితకర్ణావతంసయు, వరాలోకన కుతూహలంబు గల తనహృదయమును కృతిముఖాన్న మనప్రియత్వంబగు సఖీజనంబును బలుమారు నిందించుచున్నదియు నగు వధువును వీక్షించెను.

పరిహాసస్మేరముఖులగు స్త్రీలు కౌతుకగృహమందేమేమి చేయుమని యాజ్ఞాపించిరో వానినన్నింటినిఁ బెండ్లికొడుకతిచతురతతోఁ జేసెను. వివాహానురూపవేషపరిగ్రహముఁ గల పెండ్లికూతురు చేయిఁబట్టుకొని వరుఁడు సుధాధవళంబు, నిమంత్రితాగతభూమీశసంకులంబు, నేకసుకుమారయవాంకురదంతురంబులు, కోమలవర్ణవిచిత్రంబులగు కలశలచేతను, మాంగళ్యఫలకుసుమహస్తలై

నపురంధ్రిజనంబులచేతను, సముద్భాసితపర్యంతంబు, ధూమాయమానాగ్నిసంధుక్షణవ్యగ్రద్విజంబు, అగ్నిసమీపనిహితహరితకుశంబు, సన్నిధాపితదృషదాజ్యసమిత్పూలీనివహంబు, నూతనశూర్పార్పితశమీపలాశమిశ్రితలాజంబునగు వివాహవేదిక కేతెంచెను. రక్తాశోకసమీపమునకు రతిద్వితీయుఁడగు కుసుమాయుధునివలె జ్వలితారుణశిఖాకలాపంబైన యగ్నియొద్దకువచ్చి యగ్నిహోత్రహోమంబు కాగా వధూద్వితీయుండై ప్రదక్షిణనమస్కారంబు లాచరించెను. లాజహోమంబు ముగిసిన తదప హవ్యవాహనుం డదృష్టపూర్వవధూవరరూపదర్శనజాతవిస్మయుండునుం బోలెఁ గన్పట్టె.

ఈసమయమందు వధువు, నిర్మలకపోలోదరసంక్రాంతంబగు నవలప్రతిబింబంబు శమింపఁజేయుచున్నదానివలె స్థూలముక్తాఫలవిమలాశ్రుబిందుసంసందోహదుర్దినయై ముఖవికారములేకుండ రోదనముచేయ బాంధవస్త్రీలుకూడను దశ్రులోచనలై యొక్కపెట్టున నాక్రందించిరి. పరిసమాపితవైవాహికక్రియాకలాపుండై, జామాత యుత్తమామలకు నమస్కరించెను.

అత్తరిపక్షలిఖిత రతిదైవతంబు, అలికులకోలాహలముఖరితంబు, భ్రమరబృందపక్షానిలకంపితప్రదీపనికరంబు, స్వాస్తీర్ణసోపధానశయనశోభితంబు, శయనశిరోభాగవిన్యస్త మంగళకలశంబునైన యొప్పెడు శయనగృహంబుఁ బ్రవేశించెను.

ఇట్లు నూతన వధూసంగతుండై, శ్వశ్రూహృదయంబు నిజశీలామృతవర్షంబున నాప్యాయితంబుగావించుచు నవనవోపచారసత్కృతుండై, శ్వశురగృహంబున సుఖమయంబులైన దశదినంబులు గడిపి యాతకధనంబుల పగిది సర్వలోకహృదయంబుల దనతోఁ దీసికొని మహారాజాభ్యనుజ్ఞబడసి భార్యతోఁగూడ స్వనగరంబునకరిగెను.

ఇట్లు చతుర్థోచ్ఛ్వాసము ముగిసెను.

# హర్ష చరిత్రము.

## పంచమోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ మొదట నాలోకమును జూపి పిదప బిఱుగు|
రాల్చు చంచలవలె విధి రాజసుఖము||
దొలుత నోడఁగూర్చి యావెన్క నలవిగాని|
దుఃఖముల నిచ్చు జనులకు దుర్నయమున||

తే॥ గీ॥ నిరవధికమహిమ జరిగెడు నిష్ఠురంపు|
కాల మవనీధ్రములభంగిఘనతఁ గెక్కు||
పురుషశార్దూలులను బట్టి పుడమిలోన|
నొక్కపరిఁ గూలఁగాఁజేయు నుక్కుమిగిలి||

అంత నొకకాలమందు హరిణములఁ జంపుటకు మృగరాజు మృగరాజపోతమునంపుతెఁ బ్రభాకరవర్ధనుఁడు హూణులను జయించుట కపరిమితపదాతిసైన్యంబును జిరంతనామాత్యుల ననురక్తులైన సామన్తనృపులను సహాయముగానిచ్చి తన జ్యేష్ఠపుత్త్రుఁడగు రాజ్యవర్ధను నుత్తరాపథంబునకుఁ బంపెను. అట్లు దండయాత్రకుఁ బోవుచున్న జ్యేష్ఠసోదరుని హర్షుఁడుగూడఁ గొన్ని ప్రయాణకంబుల ననుగమించెను. అన్న కైలాసప్రభోద్భాసియగు దిక్కునకుఁ బోవవిక్రమై కరసానుసారియగు నూతనవయస్సులోనున్న హర్షుఁడు సింహశార్దూలకాసరవరాహబహుళంబులగు తుషారగిరిప్రాంత విపినంబుల మృగయావినోదనపరాయణుండై కొన్నిదినంబులు గడిపెను. ఆకర్ణాంతాకృష్టకార్ముకచ్యుతభల్లవర్షియై కతిపయదివసంబులలో నరణ్యాంతరంబుల శ్వాపదశూన్యంబుల నొనర్చెను. అచటనున్న దినములలో హర్షుఁడొకనాటిరాత్రి చతుర్థయామమందు మహా

గ్నిజ్వాలాభీలంబై దుర్నివారంబై వనంబునంతయు నాక్రమించిన దావాగ్నిచే దహ్యమానంబగు నొక్క కేసరిని స్వప్నమందుఁ గాంచెను. శాబకంబులఁగూడఁ బరిత్యజించి యావనవహ్నియందే ప్రవేశించిన యూథసింహమునుఁగూడఁ జూచెను. "లోకములో స్నేహమయబంధనపాశములు లోహశృంఖలలకంటెఁ గూడ దురుచ్ఛేద్యములుగదా ఆహా! తాదృశస్నేహపాశాకృష్టంబులై తిర్యక్కులు సైత మిట్లాచరించుచున్నవి" అని తన మనంబులోఁ దలంచెను. నిద్ర లేచినతరువాత నీతని వామనయనము పలుమారు స్ఫురింపసాగెను. అవయవము లకస్మాత్తుగా వడఁకఁ జొచ్చెను. నిర్నిమిత్తముగా హృదయము స్వస్థానమునుండి చలించినట్లయ్యెను. అకారణముగా మనంబున కమితదుఃఖము కలిగెను. ఇట్లు సంభవించిన దుర్నిమిత్తపుంజముచే నేమి యనర్థము సూచింపఁబడునోయని మనంబునఁ జింతాభయంబులు ముల్లడిగొనఁ దనలోఁ దాను నానావిధవికల్పంబులఁ జేసికొనుచు దుఃఖావనమితవదనుండై యేమియు నిశ్చయింపనేరక పెద్దప్రొద్దూరకుండెను. ఆదినమందుఁగూడ శూన్యహృదయుండు నై వేటాడుట కటవీమధ్యంబునకుం జనియె. హరిదశ్వుండంత నభోమధ్యంబధిరోహింప నావసథంబునకు మరలివచ్చి స్నానభోజనాదుల నిర్వర్తించి వేత్రశయనంబున సాశంకుండై పవ్వళించియుండెను.

ఇంతలో నీలీరాగరంజితంబు లేఖగర్భంబునగు చీరచీరికనుఁ దలకుఁ జుట్టుకొని శోకదీనముఖుండై యతివేగంబున వచ్చుచుండెడి కురంగకుడను తనభృత్యునిఁ జూచి పూర్వానిమిత్తజాతభయంబున నిర్భిణ్ణహృదయుండయ్యె. అంతఁ గురంగకుండును సమీపంబునకుఁ బోయి హర్షునకుం బ్రణమిల్లి మొదట నాననలగ్నమగు విషాదంబును పిదప లేఖనుఁ జూపెను. హర్షుండా లేఖనుఁ దీసికొని స్వయముగాఁ జదువుకొని దుఃఖసంతప్తహృదయుండై "కురంగకుఁడా! మహారాజున కేమివ్యాధి" యని యడిగెను. వాఁడు బాష్పజలబిందు

దుర్దినీకృతలోచనుండై, శోకగద్గదభాషణంబుల "దేవా! మహారాజు దాహజ్వరముచేఁ బీడింపఁబడుచుండె"నని పలికెను. ఆమాట విని హర్షునిహృదయము సహస్రశకలంబులయ్యె. ప్రియతముఁడై జనకు నాయుర్వృద్ధ్యర్థమై భూసురుల కపరిమిత మణికనకరజతాదులను దానమిచ్చి భుజింపకయే "అశ్వమునకుఁ బల్యాణముఁ గట్టు"మని సవిధమందున్న భృత్యుని కాజ్ఞాపించెను. సంభ్రమాశ్వపాలోపనీతంబగు తురంగమంబధిరోహించి యేకాకిగా నాప్రదేశంబునుండి బయలు వెడలెను. అకాండప్రయాణశంఖధ్వని శ్రవణక్షుభితంబైన యాశ్వీయబలంబు ఖురరవభరితభువనవివరంబగుచు నాతని వెంటఁ జనెను. మార్గమం దాతని కపసవ్యముగా సంచరించుచు వనమృగములు రాజసింహుని వినాశమునుఁ బ్రకటించినవి. దావదగ్ధంబగు స్థాణువునందుఁ గూర్చుండి వాయసము సూర్యుని కెదురుగా ముఖమెత్తి హృదయమును ఖండించుచున్నదానివలెఁ గూయఁదొడఁగెను. మలపంకధరుఁడైన క్షపణకుఁడొకఁడు దిగంబరుఁడై యెదురుగా వచ్చెను. ఇట్టి యపశకునములచే జనకుని క్షేమమునుగురించి మిక్కిలి శంకితుండయ్యును వానిని సరకుసేయక తురంగమబద్ధదృష్టియై, హసితభాషితశూన్యుండై మూకీభూతంబగు రాజలోకంబు వెనువెంటఁ జనుదేర బహుయోజనపరిమాణంబు గల మార్గంబు నొక్క పగటిచే నతిక్రమించెను.

అపుడు పితృనరేంద్రవ్యాధివార్తావిషణ్ణునికైవడి భానుఁడు నష్టతేజస్కుండై యధోముఖుండు కాఁగా స్నిగ్ధులైన భండిప్రముఖరాజపుత్రులచే ననేకవిధంబుల ననునీయమానుండయ్యు నాహారంబు నొల్లక పురప్రస్థితరాజభటసందర్శితమార్గుండై యారాత్రినంతయుఁ బ్రయాణంబుననె గడిపెను.

మరునటిదినము మధ్యాహ్నసమయంబున విగతజయశబ్దంబు,

పరిత్యక్తతూర్యనాదంబు, విరతోత్సవము, అప్రసారితాపణము, కృతాంతపాశములవలె నున్న శాంతిహోమధూమలేఖలచేఁ బరివేష్టితంబు, యమమహిషకాలాయసకింకిణీసంఘంబుల పగిది ధ్వనించు వాయసమండలంబుచే నా వేద్యమానానన్యాశుభంబు, ఒక్కచో సుహృద్బాంధవారాధితేష్టదైవంబు, ఒకచక్కి కులపుత్రికారాధ్యమానమాతృమండలంబు, ఒకప్రక్క నవసేవకప్రార్థ్యమానమహాకాళంబునై శ్మశానపాంసుసందోహంబుచే నుపహతమైనట్లు, అమంగళములచేఁ బరిగృహీతమైనట్లు కలికాలముచేఁ గబళితమైనట్లు, పాపపటలంబుచే నాచ్ఛాదితంబైనట్లు కానవచ్చునదియు, శూన్యమై, సుప్తమై, మూర్ఛితమైనదియు నగు స్కంధావారమునుఁ బ్రవేశించుచుండగా విపణిమార్గమందు భీషణమహిషాధిరూఢ ప్రేతనాథసనాథంబగు చిత్రపటమందు వ్రాయబడిన పరలోకవృత్తాంతమునుఁ జూపించి పాటలుఁ బాడుచుండు నొక యమపట్టికునిఁ జూచెను. వాడిట్లు చదివిన యొక పద్యమునుఁగూడ వినెను.

తే॥ గీ॥ తల్లిదండ్రుల వేలును దారపుత్ర।
శతములునుఁ గూడఁ గడచెను ప్రతియుగమున।
వారలెవ్వారి వారలెవ్వారికి నీవు।
నగుదు వీమాటఁ దలపుమీయాత్మలోన॥

ఈపద్యమును విని ధైర్యమునుఁ గోలుపోయి, విదీర్యమాణహృదయుండై నిషిద్ధసకలజనప్రవేశంబగు ద్వారంబుఁ జేరి యశ్వంబునుండి దిగి వచ్చుచుండగా నభ్యంతరమునుండి పైకిఁ బోవుచున్నవాఁడు అప్రసన్నముఖరాగుఁడు, ఇంద్రియశూన్యునివలె నున్నవాఁడునైన సుషేణుఁడను వైద్యకుమారుని వీక్షించి "సుషేణుఁడా! నాయనగారి శరీరస్థితి యిపుడెట్లున్నది యని"యడిగెను. కృతనమస్కారుండైవాఁడు "ఇపుడించుకంతయు బాధ తగ్గలేదు. మిమ్ములఁ జూచిన తరువాత నేమో చెప్పఁజాల"ననెను. ద్వార

పాలకుల వందనంబులందుకొనుచుఁ జని దీయమానసర్వస్వదానంబు, ప్రారబ్ధచరుపచనక్రియంబు, ప్రవర్త్యమానగృహశాంతి, పఠ్యమాన భగవన్నామసహస్రంబు, నిర్వర్త్యమానభూతరక్షాబలివిధానంబు, ప్రయుతవిప్రప్రస్తుతమంత్రజపంబునై, అభ్యంతరమునుండి పైకి జనుదెంచుపోరిని వార్తలడుగువారు, స్నానభోజననిద్రాహీనులు, ఆత్మసంస్కారవర్జితులగుటచే మలినవేషులు చిత్రార్పితులవలె నిశ్చలులు నైన నరపతిశతంబులచే సేవింపఁబడుచున్నదియు, ద్వారముఁదు గుంపులుఁగూడి రహస్యముగా మాటలాడువారు, చికిత్సకుల సముగ్ధులనువారు, అసాధ్యవ్యాధిలక్షణములఁ బఠించువారు, దుస్స్వప్నఫలములఁ జెప్పువారు, పిశాచవార్తలను వివరించువారు, కార్తాంతికాదేశముల వెల్లడించువారు, సంసారానిత్యతను భావించువారు, కలికాలవిలసితమును నిందించువారు, దైవమును దూరువారు, రాజకులదేవతల నధిక్షేపించువారు, కులపుత్రకభాగ్యంబులెట్లుండునో యనువారు, బాహ్యపరిజనులవలనఁ బాధావస్థను దెలుసుకొనువారు నైన జనులచే నిండియున్న రాజభవనమునఁ బ్రవేశించెను. అవిరళబాష్పబిందుప్లుతలోచనులైన వృద్ధపరిజను లతిదీనముగాఁ జూచుచుండ వివిధౌషధిద్రవగంధంబు నాఘ్రాణించుచుఁ దృతీయకక్ష్యాంతరంబుఁ జొచ్చె.

అచ్చట నతి నిశ్శబ్దంబు, ద్వారావస్థితానేక వేత్రివర్గసంకులంబు, త్రిగుణీకృతతిరస్కరిణీ సమాచ్ఛాదితంబు, పిహితగవాక్షనిరుద్ధమారుతంబు, దుఃఖితపరిచారకజనంబు, అంగుళిసంజ్ఞాసమాదిశ్యమాన సకలకర్మంబు క్రూరజ్వరారంభభీతభిషగ్వ్రాతంబు, కోణనిషణ్ణమంత్రిమండలంబు, నిరానందవందిబృందంబు, భూసురవికీర్యమాణశాంత్యుదకలవంబు నగు ధవళగృహమందున్నవాఁడు, పరలోకజయముకొరకు జ్వరజ్వాలనముచే నీరాజనమీయఁబడుచున్నవానివలెఁ గాన్పించువాఁడు, లయకాలమం

డెండిపోవుచున్న జలధివలె నున్నవాఁడు, వ్యాధిచేఁ గ్రోడీకృ
తుఁడు, మహాప్రస్థానసమయమందు స్వసంతాపసంతానము నాప్త
హృదయంబులందు సంక్రమింపఁజేయువాఁడు, అరతిపరిగృహీతుఁడు,
అంతకాహ్వానములవలెనున్న సభయభిషగ్దృష్టారిష్టములచే నావిష్టుఁ
డైనవాఁడు మరణవేదనావశీకృతుఁడు, దుఃఖాకారితుఁడు, కాలునికి
సమీపమందు దీర్ఘనిద్రాద్వారమందు మృత్యువక్త్రమందును
వర్తించువాఁడు, చిత్తమందుఁ జలితుఁడు, శరీరమందు విహ్వలుఁడు,
ఆయుష్యమందు క్షీణుఁడు, ప్రలాపమందుఁ బ్రచురుఁడు, ఆధులకు
బరాధీనుఁడునై యున్నవాఁడు, దగ్గరఁగూర్చుండి సంతతరోదనోచ్ఛూ
నవయనయు, గృహీతచామరయయ్యు, నిశ్వసితపరంపరలచే వీచు
చున్నదియు, వివిధౌషధిధూళిధూసరితశరీరయు, పలుమాఱార్య
పుత్ర! నిద్రఁబోవుచుంటివాయని యడుగుచుండునదియు నగు యశో
వతిచే శిరస్సునందు వక్షస్స్థలమందు స్పృశింపఁబడుచున్నవాఁడునైన
తండ్రినిఁ జూచెను.

అంత హర్షుఁడు ప్రథమదుఃఖాశనిపాతభిన్నహృదయుఁడై
స్వాదృష్టమందు శంకితుఁడాయెను. జనకుఁడంతకపురవర్తియని
తలంచెను. అంతఃకరణముచే నిరాకృతుండు, ధైర్యముచే నవధూ
తుండు, విషాదముచే వివశీకృతుండునై శూన్యత్వమం దాకా
శము నతిశయించుచున్నవాఁడై యితికర్తవ్యతామూఢుఁడాయెను.
అవనిపతి యట్టి దురవస్థలో నున్నను బ్రియపుత్రుఁడైన హర్షుని
దూరమునుండి చూచి నిర్భరస్నేహాలోలుఁడై ముందు మనంబుచేఁ
బరుగిడి భుజములఁజాచి "వత్సా! రమ్మురమ్ము"ని శరీరార్ధముచే
శయనమునుండి లేచెను. సంభ్రమముతోఁ దనయొద్దకు వచ్చిన
వినయావనమ్రుఁడైన పుత్రుని బలాత్కారముగా గుండెపైఁ బెట్టి
కొని చంద్రమండలమధ్య ప్రవిష్టునివలె నమృతమహాసరోనిమగ్నుని
కైవడి హరిచందనరసార్ద్రీకృతునిమాడ్కి తనయశరీరసంస్పర్శచేఁ

శీతలీకృతదేహుండై, క్షణకాల దూరీకృతజ్వరసంతాపుండై, స్వాంగముచేఁ దదంగమునుఁ బీడించుచుఁ దనివిసనక కొంతవడి గాఢముగాఁ గౌఁగలించుకొనెను. నమస్కరించి తల్లితోఁగూడ శయనసమీపమందు పవిష్టుఁడైన యాహర్షుని విగమనిమేషనిశ్చలంబులగు నేత్రంబులచేఁ బానముచేయుచున్నవానివలె వీక్షించెను. కంపించుచున్న పాణితలంబున స్పృశించెను. క్షయక్షామకంఠధ్వనితో నతికష్టముగా నాయనా కృశించితివని పలికెను. అందుపై భండి మూఁడు దినములనుండి భోజనము లేదు, సరియేకదా- జలమునైన పానము చేయుటలేదని చెప్పెను. ఆమాట విని రాజు బాష్పవేగనిరుద్ధవచనుఁడై దీర్ఘోచ్ఛ్వాసమును విడిచి "వత్సా! నీవతి మృదుహృదయుఁడవనియు, పితృప్రియుఁడవనియు నేనెఱుంగుదును. ఇట్టి యాపదలు బుద్ధిమంతుల బుద్ధులనుఁగూడఁ గాలుష్యమునొందించును. బాంధవస్నేహము దుస్త్యజము. గంభీరమగు హృదయంబు నశోకంబున కవకాశమొసఁగుట నీకుఁ దగదు. ఉద్దామదాహజ్వరదగ్ధుఁడనైన నేను నీమనోవ్యధచే నధికతరముగా దహింపబడుచుంటిని. నీకృశత్వము శస్త్రమువలె నన్ను ఖండించుచున్నది. నాప్రాణములు, రాజ్యము, సుఖము, వంశము నీయధీనములు. నీవు నాకెట్టి ప్రియతముఁడవో ప్రజల కందరి కట్లనేయని తలంపుము. నీవంటివానికిఁ గలిగిన పీడలు సకలలోకులనుఁ బీడించును. నీవంటి వారలల్పపుణ్యులవంశమునందు జనింపరు. బహుజన్మోపార్జితశుభకర్మకు ఫలమైనవాఁడవు. నీసాముద్రికలక్షణములు చతుస్సముద్రపరివేష్టిత సకలోర్వీమండలాధిపత్యంబును సూచించుచున్నవి. నీవు నా కడుపునఁ బుట్టుటవలన ధన్యుఁడనైతిని. ఇక నాకు జీవితమందభిలాషలేదు. వైద్యుల నిర్బంధముచే నౌషధములఁ ద్రాగుచున్నాను. సకలభువనతలపరిపాలనార్థమై యుదయించెడు నీవంటివారికిఁ దలిదండ్రులు కేవలము జన్మప్రదానోపాయభూతులు రాజులకుఁ బ్రజలు బంధువులుగాని జ్ఞాతులుకారు. కావున లెమ్ము. శరణీయంబు

తైన కృత్యంబుల నాచరింపుము. నీవు భుజించినగాని నేనాహారమును స్వీకరింపనని" పలికెను. తండ్రి యిట్లు బోధింపగా నీహర్షుని హృదయమును శోకాగ్ని మరింత హెచ్చుగా దహింపసాగెను. క్షణమాత్రముండి యాహారమును స్వీకరింపుమని జనకుడు మరల నాజ్ఞాపింప ధవళగృహమునుండి నిష్క్రమించుచు "ఆహా! మేఘములేని పిడుగువలె నాకస్మికముగా నిట్టిప్రళయము సంభవించినది. సామాన్యమైన శోకము సైత మూపిరితోఁ గూడిన మరణము. అప్రతీకార్యమయిన మహావ్యాధి. దేహమును భస్మముచేయని యగ్నిప్రవేశము. మృతిలేని నరకయాతన. ముక్కలుచేయని రంపపుకోత. గాయమును పుట్టింపని వజ్రసూచీపాతము. విశేషమైన శోకమును గుఱించి చెప్పనేల? ఇపుడేమిచేయుదును" అని తన మనంబున దాననుకొనుచు రాజపురుషాధిష్ఠితుఁడై నిజనివాసంబున కరిగి ధూమమయములవలె నశ్రుపాతజనకములు, అగ్నిమయములవలె హృదయదాహకములు, విషమయముల పగిది మూర్ఛాప్రదములు, మహాపాతకములవలె ఘృణోత్పాదకములు, క్షారమయములమాడ్కి వేదనావహములు నగు కొన్ని కబళములను భక్షించెను. హస్తపాదప్రక్షాళనము సలిపి యాచమనముజేసి నాయనగారి శరీరస్థితి యెట్లున్నదో తెలుసుకొని రమ్మని చామరగ్రాహి నాజ్ఞాపించెను. వాఁడు పోయి మరలివచ్చి "దేవా! అట్లనే యున్నదట" అని విన్నవింపగా నచర్వితతాంబూలుఁడై తల్లడమునొందు మనంబున సూర్యుఁడస్తమించు తఱి రహస్యముగా వైద్యుల నందరిని రావించి యిట్టి సమయమందు మనమేమిచేయవలయునని యడిగెను. వారు "దేవా! కొలదిదివసంబులలో మహారాజు మరల స్వప్రకృతినిబొంది స్వస్థుఁడు కాగలఁడని విన్నవించిరి. వారిలోఁ బునర్వసుమునిప్రోక్తమైన వైద్యశాస్త్రమునుఁ జదివినవాఁడు, అష్టాదశవర్షవయస్కుఁడు, రాజకులమందుఁ గులక్రమాగతవైద్యుఁడు, అష్టాంగములతోఁ గూడిన ఆయుర్వేదమును బాగుగాఁ దెలుసుకొన్నవాఁడు, మహారాజునకుఁ

బుత్రతుల్యుఁడు వ్యాధిస్వరూపనిరూపకుఁడునై నరసాయనుఁడను వైద్యకుమారకుఁడు సాశ్రులోచనుఁడై ముఖము వంచుకొనియుండెను. అంత వానినిఁ జూచి హర్షుఁడు "మిత్రమా! నిజము జెప్పుము. నీ కేమి తోఁచుచున్నదని" ప్రశ్నించెను. ఆభిషగ్వరుఁడు "దేవా! రేపటియుదయమున యథార్థస్థితిని విన్నవింపగలనని పలికెను.

ఇంతలో భవనకమలినీపాలకుఁడు చక్రవాకము నూరడించుచు నొక పద్యమునుఁ జదివెను.

తే॥ గీ॥ విహగ దృఢపఱ్చుకొనుము నీవెఱ్ఱిమనసు।
విడువుశోకము బూను వివేకపథము।
కమల వనలక్ష్మితోఁగూడఁ గమలహితుఁడు।
మేరుభూధర శిఖరంబుఁ జేరనుండె॥

వాక్ష్మిమిత్రజ్ఞుఁడైన హర్షుఁడాపద్యమును విని తండ్రిబ్రతుకుపై బొత్తుగా నాశను విడనాడెను. వైద్యులందరు తమ యిండ్లకుఁ బోవ రజనీముఖమందు క్షితిపాలసమీపముననే చనెను. అచ్చట "హారిణి! తాపము హెచ్చుగానున్నది. హారములఁ దెమ్ము. వైదేహీ! నా దేహమందు మణిదర్పణముల నుంచుము. లీలావతి! హిమలవములను నా లలాటమునకుఁ బూయుము. ధవళాక్షి! కర్పూరపరాగములను నాపైఁ జల్లుము. కాంతిమతి! కంటియందు జంద్రకాంతముల నిడుము. కళావతి! కపోలమందుఁ గువలయము నుంచుము. చారుమతి! చందనచర్చను రచింపుము. పాటలికా! పటమారుతమునుఁ బ్రవర్తింపఁ జేయుము. మాలతి! మృణాళములఁ దెమ్ము. అవంతికా! తాళవృంతముఁ జేకొనుము. బిందుమతి! పైకెగురుచున్న శిరస్సునుఁ గట్టుము. ధారణికా! మెడను బట్టుకొనుము. కురంగవతి! జలశీకరార్ద్రమగు హస్తమును నాపై

నుంచుము. బలాహికా! బాహువులఁ బట్టుము పద్మావతి! పాద
ములను నొక్కుము. అనంగసేనా! వేళ యెంతయైనది. కుము
ద్వతి! నిద్ర రాలేదు, కథలు చెప్పుమని" పలుకుచుండెడి తండ్రి
యాలాపముల ననవరతము వినుచు సంతప్యమాన హృదయుఁడై
దుఃఖదీర్ఘమగు నారాత్రినంతయు నిద్రలేకుండ వెళ్లఁబుచ్చెను.

మరునాఁడు ప్రాతఃకాలమున దశ్వపాలుఁడు రాజగృహద్వా
రమునొద్ద కశ్వమును దెచ్చియుంచినను దాని నెక్కక పాదచారియై
స్వమందిరమున కరిగెను. అపుడు సోదరుని రప్పించుటకొఱకు జవిష్ఠు
లుక్షిప్రగాములు నగు నుష్ట్రపాలురను బంపెను. ముఖప్రక్షాళ
నము గావించుకొని పరిజనోపనీతమగు పరికర్మనుఁగూడ స్వీకరింప
లేదు. తన మ్రోల విమనస్కులై నిలువఁబడియున్న రాజపుత్రులు
కొందరు "రసాయనుఁడు రసాయనుఁడు" అని యస్ఫుటముగాఁ బలు
కుట వినెను. "సౌమ్యులారా! రసాయనుఁడని యెందుకుఁ బలికి
తిరి" అని యడిగినను వారు ప్రత్యుత్తర మియ్యక యూరకుండిరి.
పలుమారు నిర్బంధించి యడుగగా వారతిదుఃఖముతో "దేవా!
రసాయనుఁ డగ్నిలోఁ బడెనఁట" యని చెప్పిరి. హర్షుఁ డామాట
విని యంతస్తాపముచే దగ్ధుఁడైనట్లు క్షణమాత్రము వివర్ణుఁడయ్యెను.
ఉన్మూలితమైనట్లున్న శోకాంధహృదయమును ధరింపలేకపోయెను.
"అభిజాతుఁడు ప్రాకృతునివలె నప్రియవచనము నెన్నఁడుఁ బలు
కఁడు. వీని సత్కులజత్వమగ్నిప్రవేశముచే స్వర్ణమువలె నుజ్జ్వ
లతరమైనది. వీఁడు చేసిన పని స్నేహమున కనురూపమైనది. అవును
సత్యమే. మాతండ్రి యతనికిఁ దండ్రి కాఁడా? మాతల్లి యతనికిఁ
దల్లి కాదా? మేమతనికి సోదరులము కామా? సామాన్యముగా లో
కములో నెవ్వఁడైనఁ బ్రభువు కాలధర్మము నొందఁగా ననుజీవులు
బ్రతికియుండుట లజ్జాకరము. అనుజీవుల కమృతమయుఁడు, నిర్వ్యా
జబంధువు, అమోఘప్రసాదుఁడు నగు మాజనకుని విషయమందు

యింకఁ జెప్పనేల? ఇప్పుడీరసాయనుఁడు తన్నుఁ దాను దహించుకొ
నుట యుక్తమైన పనియే. కల్పాంతస్థాయియైన వీనికీర్తి కేమినాశ
నము వాటిల్లును? అతఁడొక్కఁడే యగ్నిలోఁ బడినను మేమంద
రము దహింపఁబడితిమి. పుణ్యాత్ములలో నగ్రేసరుఁడగు నాతఁడు
ధన్యుఁడు. అట్టికులపుత్రునిచే విరహితమగు నీరాజకులమే యధ
న్యము. నాకీప్రాణములతో నిక నేమి ప్రయోజనము. ఆహా!
యీప్రాణములెంతనిష్ఠురములు? ఇప్పటికి నన్ను విడువకుండనున్నవి.
నాహృదయము వేయిముక్కలుగా భిన్నముకాకపోవుటకుఁ గార
ణము తెలియదు'' అని యిట్లు పలుతెఱఁగుల మనములోఁ జింతిం
చుచు దుఃఖాతురుఁడై యావేళఁ బితృసవిధమునకుఁ బోలేదు. సర్వ
కార్యములఁ బరిత్యజించి యుత్తరీయముచే శరీరమునంతయు నాచ్ఛా
దించుకొని శయనముపై బడియుండెను.

హర్షుఁ డిట్లు చింతాక్రాంతుఁడై యుండఁ "భూనాథు డట్టి
యవస్థలోనుండ లోకులు కపోలకీలితకరులై, సాస్రులోచనులై,
నాసాగ్రలగ్నదృష్టులై వగలబాగలఁ జెవులయందు రోధనధ్వనులు,
జిహ్వలయందు హాకష్టశబ్దములు, ముఖములయందు నిట్టూర్పులు,
హృదయములందు దుఃఖములు నవిచ్ఛిన్నములయ్యెను. ఉష్ణాశ్రు
దహనభయముచేవలెఁ గన్నులకు నిద్ర రాలేదు. నిశ్వాసవాతని
ర్ధూతములైనట్లు నవ్వులడఁగిపోయెను. సంతాపదగ్ధమైనట్లు వాక్కు
పైకి రాలేదు. కథలయందుఁగూడఁ బరిహాసము లస్తమించెను.
సంగీతగోష్ఠి యెచటికి జనెనో తెలియదు. లాస్యములు జన్మాన్తరి
తమైనట్లు స్మరింపఁబడలేదు. ప్రసాధనవిధిని స్వప్నమందుఁగూడ
నెవ్వరు తలంపరైరి ఆహారనామస్మరణముఁగూడ నంతరించెను.
పానగోష్ఠిఖపుష్పప్రతిమంబయ్యె. వందివాక్కులు లోకాంతరమునుఁ
బొందినట్లుండె. సౌఖ్యము యుగాంతరస్థితము పగటియందుఁగూడ
జనులు శయనంబుల విడువలేదు. మహాపురుషవినిపాతసూచకము

త్తైన మహోత్పాతంబులు జనులకు మనంబుల మహాభయంబు త్పాదించుచు లోకమందెల్లెడలఁ గానవచ్చెను. డోలాయమానసకలకులాచలచక్రవాళంబైన ధరిత్రి భర్తతోఁగూడఁ బోవుదానివలెఁ జలించెను. పరస్పరాస్ఫాలనవాచాలతరంగంబులై యర్ణవంబులు ఘూర్ణిల్లెను. భూభృదభావభీతములైన దిక్కుల కేశపాశముల పగిది ధూమకేతువులు పొడవుగాఁ గానవచ్చెను. ధూమకేతువ్యాప్తములగు దిఙ్ముఖములుగల భువనము దిక్పాలకులొనర్చు నాయుష్కామహోమముచే ధూమ్రమైనట్లు కాన్పించెను. నష్టకాంతియుఁ దప్తకాలాయసకుంభసవర్ణమునగు సూర్యమండలమందు ఘోరకబంధకాయవ్యాజముచేఁ బార్థివప్రాణార్థియగు నెవ్వఁడో పురుషబలి నిచ్చినట్లుండెను. రక్తశీకరాసారలోహితమై భూవధువు భర్త్రనుమరణముకొఱకు రక్తాంశుకప్రావృతమైనట్లుండెను. నరపతివినాశభీతులవలెనున్న దిక్పాలకులచే దిఙ్ముఖములు కాలాయససదృశములైన కాలమేఘపటలములచే నాచ్ఛాదింపబడినట్లు భాసిల్లెను. ప్రేతపతిప్రయాణపటహములకైవడి ఘోరనిర్ఘాతఘోషములు వ్యాపించెను. ఆసన్నయమమహిషఖురోద్ధూతములైనట్లున్న పాంసువృష్టులు సూర్యతేజస్సును ధూసరవర్ణముఁ గలదానినిగాఁ జేసెను. కాలరాత్రివిధూయమానవేణీబంధవిభ్రమముఁగల భృంగసముదాయము రాజసింహాసనసమీపమందు సంచరించెను. అంతరిక్షమునుండి పడుచున్న యుల్కలనగ్నిజ్వాలలనుకొని సృగాలసమూహములు విరసముగాఁ గూయఁదొడఁగెను. వాయసమితియంతఃపురభవనంబుపైఁ దిరుగుచు ననవరతము శ్రుతికటువుగా నరవఁజొచ్చెను. రాజ్యజీవితసదృశంబు సరసమాంసపిండలోహితంబునగు శ్వేతాతపత్రమధ్యస్థితమాణిక్యఖండంబును గృధ్రమపహరించెను.

ఇట్లు దినము లతిక్రమించుచుండ నొకనాఁడు శీఘ్రగమనవశంబున గళద్భూషణఝుంకారిణియు, విషాదవిజయఘోషణవలె

నున్నదియు, చలచ్చరణనూపురధ్వనులచే నుద్గ్రీవములై యరచుచున్న భవనకలహంసలచే దూరమునుండి యేమేమియని యడుగఁబడుచున్నదానివలె నున్నదియు, బాష్పాంధురాలై శ్రోణిభాగమునుండి జారుచు ధ్వనించు రశనాకింకిణీసంతతి ననుసరించి యరచుచున్న గృహసారసనికరముచేఁ జూపింపఁబడిన మార్గముగలదానివలె నున్నదియు, కవాటసంఘట్టనస్ఫుటితలలాటరుధిరపాటలంబైనట్లున్న రక్తాంశుకముచే ముఖము నాచ్ఛాదించుకొని యేడ్చుచున్నదియు సంతాపబలవిలీనకనకవలయరసధారవలెనున్న వేత్రలతను విడుచుచున్నదియు, భుజంగనిర్మోకమునువలె ముఖమరుత్తరంగితమగు నంశుకము నాకర్షించుచున్నదియు, ధమ్మిల్లరచనారహితమై శోకాచితమైన శిరోరుహసమూహముచేఁ బ్రావృతవక్షస్స్థలయు, వక్షస్స్థలతాడనపీడచే నుబ్బినట్లునై యుండుటచేఁ బలుమారుష్ణాశ్రుపరిమార్జనమువలన దగ్ధమైనట్లున్న కరకిసలయమును గదల్చుచున్నదియు, స్వకపోలప్రతిబింబితులైన జనులను శోకాగ్నిప్రవేశముకొరకు నేత్రాశ్రునిర్ఝరంబుల స్నానము చేయించుచున్నట్లు కానవచ్చునదియు నగు సువేలయను యశోవతీప్రతిహారి, "కుమారుఁడెక్కడ? కుమారుఁడెక్కడ" యని యడుగుచువచ్చెను. విషణ్ణలోకలోచన ప్రత్యుద్గతలై సమీపించి మణికుట్టిమన్యస్తకరయుగళయై యుష్ణశ్వాసలచే నెండిపోయిన యధరమును దశనకాంతిధారలచేఁ దడుపుచు నధోముఖియై "దేవా! రక్షింపుము, రక్షింపుము, మహారాజు జీవించియుండగా దేవి సాహసకృత్యము నొనరించుటకు నిశ్చయించినది" అని విన్నవించెను.

దుశ్శ్రవంబగు నావార్త విన్నతోడనే హర్షుఁడు చింతచే నాక్రాంతునివలె దుఃఖముచేఁ గబళితుని పగిది సంతాపముచే వశీకృతునిమాడ్కి నధైర్యమునకాయత్తుని కరణినయి కొంతవడి విసంజ్ఞుఁడయ్యెను. తెలివివచ్చినతరువాత కఠినోపలముండుఁబడు లోహ

ప్రహారమువలె నాహృదయమును దాకిన యీదుఃఖాభిషంగమ
గ్నినిఁ బుట్టించుచున్నదిగాని దేహమును భస్మముగాఁ జేయలేదని
మనస్సులో ననుకొనెను. లేచి తొందరగా నంతఃపురమునకుఁ
బోయి యచట "తండ్రీ చూతపోతమా! నీతల్లి ప్రవాసమునకుఁ
బోవుచున్నది. ఇంక నిన్ను నీవే చూచుకొనుము. జాతీగుచ్ఛమా-
నేను పోవుచున్నాను. నాయొద్ద శలవు పుచ్చుకొనుము. సోదరీ!
నేను పెంచిన దాడిమలతా! ఇపుడు నన్ను విడిచి యనాథవగుచు
న్నావు. రక్తాశోకమా! నాపాదప్రహారములను కర్ణాలంకారము
నకై చిగుళ్ళకోయుటను సైరింపుము. పుత్రికా! బాలవకుళమా!
వారుణీగండూషగ్రహణదుర్లలిత! నిన్నుఁ జూచితిని. అమ్మాయీ!
ప్రియంగులతికా! నన్ను గాఢముగా కౌగిలించుకొనుము. ఇంక
నీకు నేను దుర్లభనగుదును. భవనద్వారమందున్న సహకారమా.
నాకుఁ దర్పణము విడువుము. నీవు నాపుత్రుఁడవు. తమ్ముఁడా
పంజరశుకమా! నన్ను మరవకుము. శారికా! నీకు నేను దూర
మయితిని. మనకు మరల స్వప్నమందు సమాగమము కలుగును.
త్రోవలో నన్నడ్డుకొనుచున్న యీ మయూరము నెవ్వరికొప్పఁ
జెప్పెదనమ్మా? అమ్మా యీ హంసమిథునమును గుమారునివలెఁ
జూచుకొనుము. మందభాగ్యనగు నేనీజక్కవకవకుఁ బెండ్లి సలుపఁ
జాలకపోతిని. మాతృవాత్సల్యముగల హారిణి! మరలిపొమ్ము.
కంచుకీ! ఆవీణ నిటుఁదెమ్ము- ఒకపరి దానినిఁ గౌగిలించుకొనియెద.
బిందుమతి! ఇది నాయంత్యనమస్కారము. చేటీ! నాపాదములను
విడువుము. కాత్యాయనికా! ఎందుకేడ్చెదవు. దైవము నన్నుఁ
గొనిపోవుచున్నది. నాయనా కంచుకీ! దుర్లక్షణనైన నాకేల ప్రద
క్షిణ మొనర్చెదవు. ఏమి- ప్రియసఖీ- మలయవతీ! నాకు గాన
రాలేదు. సానుమతీ! ఇది నాపరమనస్కారము. కువలయవతీ!
ఇదిగో నాకొస కౌగిలి. సఖులారా! ప్రణయకలహములను క్షమిం

పుడు" అని పలుకుచు ననుమరణోద్యతలైన రాజమహిషుల యాలాపములను వినెను.

అట్టిపలుకులు వినుటచే దహ్యమానశ్రవణయుగళుండై యంతఃపురములోనికిఁ బోవుచున్న హర్షుఁడు సర్వధనంబుల నాశ్రితుల కొసంగి మరణాలంకారమును గ్రహించి జనకరాజపుత్రికవలె భర్తృసన్నిధియందగ్నిలోఁ బడఁబోవునదియు, స్నానార్ద్రవస్త్రయగుటచే నాక్షణంబున సముద్రమధ్యమునుండి వెడలుచున్న లక్ష్మినిఁ బోలునదియు, సాంధ్యరాగద్వయమును వహించు నంతరిక్షము మాడ్కి కుసుంభరాగరక్తంబగు వాసోయుగళంబు ధరించినదియు, ఉరస్స్థలావలంబమానమగు రక్తకంఠసూత్రముచే శోకస్ఫుటితహృదయగళద్రక్తధారయోయను శంకనుఁ బొడమించునదియు, కుంకుమాంగరాగపరిలిప్తయగుటచే దహింపఁబోవు చితాగ్నిచేఁ గబళింపఁబడినదానివలె నున్నదియు, పతివ్రతాపతాకవలెనున్న భర్తృప్రాసయష్టినాలింగనము చేసుకొనుచున్నదియు, బంధువుని యెదుటవలె రాజాతపత్రముదగ్గిర నశ్రుమోచనముఁ జేయుచున్నదియు, బాష్పాంభఃప్రవాహానిరుద్ధనేత్రలగు సచివుల కతికష్టముతో సందేశంబుల బంపుచున్నదియు, వృద్ధబాంధవాంగనాక్రన్దధ్వనులచే విదీర్యమాణకర్ణయు, భర్తృభాషితనిభంబులగు పంజరసింహగర్జితంబుల నపహృతహృదయయు, భర్తృభక్తిచేఁ బ్రసాధితయు, పీడచే గృహీతసర్వావయవయు, చింతచే సమాలింగితయు, వృద్ధులచే ననుగతయు, భూపాలుని కిష్టమైన కౌలేయకములనుఁగూడఁ గన్నీళ్లతోఁ జూచుచున్నదియు, సపత్నీపాదంబులకు వందనంబులాచరించుచున్నదియు, శుకశారికామయూరాదుల కంజలి రచించుచున్నదియు, గృహపాదపముల నాలింగనముఁ జేసుకొనుచున్నదియు నగు తల్లినిఁ జూచెను.

ఇట్టి స్థితిలో నున్న తల్లినిఁ జూచి హర్షుఁడు దూరమునం

జూచియే "అమ్మా! నీవును మందభాగ్యుడనైన నన్ను విడిచి చనియెదవా? నన్ననుగ్రహింపుము. ఈపని౯ జాలింపుము" అని పలుకుచు నామె పాదములపైఁ బడెను. అట్లు పాదనిహితశిరస్కుఁడు, శ్రేష్ఠుడు, కనిష్ఠుఁడు నగు హర్షుఁడట్లుండఁగా మూర్ఛాంధకారములో మునుగుచున్న యశోవతి కృతప్రయత్నయయినను బాష్పోత్పీడమును నివారింప నశక్తయై యుత్కటకుచోత్కంపప్రకటితాసహ్యశోకభారయై, గద్గదికాగృహ్యమాణకంఠస్వరయై, నేత్రజలప్రవాహంబునఁ గపోలంబులఁ దడుపుచు, మన్యువేగస్ఫురన్నాసాపుటయై యంశుకాంచలముచే ముఖచంద్రు నాచ్ఛాదించుకొని దుఃఖించుచుఁ బ్రస్నుతస్తనియై ప్రసవదివసము మొదలుకొని యీ హర్షుని సకలశైశవవృత్తాంతమును స్మరించుచు, "అంబా, తాతా, పరలోకప్రస్థితనైన దుఃఖించుచున్న నన్నుఁ జూడరా?" అని పలుమారు తలిదండ్రులకొఱకు మొఱ్ఱబెట్టుచున్నదియు, "అయ్యో నాయనా కొనకు నిన్నుఁ జూచుటయే లేకపోయెనుగదా" అని యసన్నిహితుఁడైన జ్యేష్ఠపుత్రునిగురించి విలపించుచు, "అమ్మా! నీవనాథవైతివే" అని శ్వశురగృహవర్తినియైన కుమార్తెకొఱకు దుఃఖించుచు, "దయాహీనుఁడా! యీ జనుఁడు నీ కేమి యపరాధముఁ జేసె" నని దైవమును దూరుచు, నావలె దుఃఖభాగినియైన స్త్రీ లోకములో లేదని బహువిధములఁ దన్నుఁ దాను నిందించుకొనుచుఁ, బ్రాకృతస్త్రీవలె దుఃఖమాపలేక ముక్తకంఠముగా నేడ్చెను.

దుఃఖోద్రేకము కొంత శాంతింపఁగా స్నేహముతోఁ గుమారుని లేవనెత్తి స్రవదశ్రుబిందుసందోహదూషితమగు నాతని కన్నుదోయిని తనచేలాంచలముచేఁ దుడిచెను. కఠోరరక్తిమాక్రాంతధావళ్యంబులు, అనవరతరోదనోచ్ఛూనపర్యంతంబులు నగు తన లోచనంబులను స్వయముగాఁ దుడిచికొని బాష్పార్ద్రకపోలసక్తంబు

లగు లంబాలకంబుల, శ్రవణశిఖరంబున నారోపించి వికీర్ణంబగు కేశపాశంబు ముడిచికొని, అశ్రుప్రవాహార్ద్రంబై నస్తనోత్తరీయంబు స్వస్థానమందుంచుకొని జలంబుల ముఖకమలంబు గడిగికొని దుఃఖమూకపరిజనవిధృతంబగు వాసశ్శకలంబునఁ జేతులుఁ దుడిచికొని సుతవదననిబద్ధలోచనయుగళయై కొంతసేపుండి నిట్టూర్పువిడిచి. "బాబూ! నీవు నాకప్రియుఁడవుగాని, గుణహీనుఁడవుగాని, పరిత్యాగార్హుఁడవుగానికావు. స్తన్యముతోఁగూడ నాహృదయమును నైతము పానముచేసితివి. ఈసమయమందు ప్రభూతప్రభుప్రసాదాంతరితమైన నాదృష్టి నిన్నుఁ జూడకుండనున్నది. లక్ష్మివలెఁగాని భూమివలెఁగాని నేను పురుషాంతరవిలోకనవ్యసనముఁగలదానిని గాను. కులకళత్రమును, చారిత్రధనముఁగలదానిని. ధర్మప్రధానమగు కులమందు జనించితిని. సింహమునకు సింహివలె సమరశతశౌండుఁడైన పురుషప్రకాండునికి గృహిణిని. వీరప్రసూతను, వీరపత్నిని. వీరజనని పరాక్రమక్రీతమైననావంటిదిమఱియొకరీతిగా నెట్లు చేయును. భరతభగీరథనాభాగనిభుఁడైన నరేంద్రబృందారకుఁడు మీతండ్రి నన్ను చెట్టఁబట్టెను. సామంతసీమంతినీసమావర్జితఘటాభిషేకంబుచే నభిషిక్తనైతిని. మనోరథదుర్లభమైన మహాదేవీపట్టబంధసత్కారమును లభించితిని. సపత్నీశిరస్సులయందుఁ బాదయుగళముంచితిని. ఇట్లు కృతార్థనైన నేనిక మఱేమి యపేక్షించెదను. అవిధవనై మృతినొందుటకుఁ గోరుచున్నాను. ఆర్యపుత్రవిరహితనై రతీదేవివలె నిరర్థకప్రలాపములఁ జేయుటకిష్టము లేదు. నీతండ్రి పాదధూళివలె మొదట గగనగమనమునుఁ దెలియఁ జేయుదాననై శూరానురాగిణులైన సురాంగనలకు బహుమతనగుదును. దారుణదుఃఖదగ్ధనైన నన్నగ్ని యేమిచేయును? ఈసమయమందు నాకు మరణముకంటె జీవితమే సాహసము. స్నేహాన్ధమైన పతిశోకానలముకంటె లోకప్రసిద్ధానల మతిశీతలము. కైలాసకల్పుఁడగు జీవితేశ్వరుఁడు ప్రవసించుటకు సిద్ధముగానుండ, జర్ధ

తృణలఘిష్ఠమగు జీవితమందు లోభ మెట్లుకలుగును? నరపతిమరణాపధీరణ మహాపాతకి నైన నేను బ్రతికియున్నను రాజ్యసుఖములతోఁ బనియేమి? దుఃఖదగ్ధులైనవారి భూతియు మంగళము అప్రశస్తము, నిరుపయోగము. కావున నాయనా! నేనే నిన్ను వేడుకొనుచున్నాను. నన్ననుగ్రహింపుము” అని పుత్రుని కాళ్లపైఁ బడెను.

హర్షుఁడు తనపాదములను తొందరతో వెనుకకుఁ దీసికొని యువనమితదేహుఁడై నేలఁబడిన తల్లిని రెండుచేతులచే నెత్తి కూర్చుండఁబెట్టెను. శోకము దుర్నివారము గావునఁ గులస్త్రీల కుచితమైనదియు, శ్రేయస్కరమైనదియు నిదియే యని తలంచి యామె నిశ్చయము నెఱింగి యధోముఖుఁడై మిన్నక యుండెను. స్నేహకాతరుఁడైనను కులీనుఁడు దేశకాలానురూపమైన యట్టి పనికిష్టపడును. యశోవతియుఁ గుమారునిఁ గౌఁగిలించుకొని శిరమాఘ్రాణించి పరిజనాక్రందబధిరితమైన యంతఃపురమునుండి వెలువడి కాలినడకతో సరస్వతీ నదీతీరంబునకుఁ బోయెను. అచ్చటఁ జంద్రమూర్తి రక్తపంకజపుంజంబులచే సూర్యునివలె స్త్రీస్వభావకాతరములైన దృష్టిపాతములచే నర్చించి చిత్రభానునిఁ బ్రవేశించెను. హర్షుఁడును మాతృమరణదుఃఖవిహ్వలుఁడై బంధువర్గము తోఁగూడ నిరాగా జనకునికడకువచ్చి యల్పావశేషప్రాణవృత్తియై యస్తాభిలాషియగు చంద్రునివలెనున్న తండ్రినిఁ జూచెను. దుస్సహదుఃఖోద్రేకము నాపఁజాలక స్నేహమును విడిచి ధైర్యమవలంబించి సకలదుర్మదనృపాలమౌళిమాలార్చితంబులగు జనకుని పాదపద్మములయం దశ్రుసంతానమును వర్షించుచుఁ బ్రకృతునివలెఁ జాలసేపు ముక్తకంఠముగా నేడ్చెను.

అపుడు రాజతికష్టముతోఁ గనులెత్తిచూచి పుత్రుని గురుతుపట్టి “నాయనా! యిట్లధైర్యమునొందుట నీవంటి ధీరునికిఁ దగునా?

నీవంటివారు మహాసత్త్వులు. లోకమునకు మహాసత్త్వతయే మొదటి యవలంబనము. సత్త్వవంతులలో నగ్రేసరుఁడవైన నీ వెక్కడ నిట్టి శోకవివ్హలత్వ మెక్కడ? సూర్యసమతేజస్కుఁడవైన నిన్నుఁ గులప్రదీపుఁడవనుట లాఘవము. శౌర్యపటుప్రక్షోపబృంహిత పరాక్రముఁడవైన నిన్నుఁ బురుషసింహుఁడవనుట నింద. చక్రవర్తి లక్షణాంకిత శరీరుఁడవైన నీకీభూమి యధీనమనుట పునరుక్తము. లక్ష్మీస్స్వయంగృహీతుఁడవైన నీవీరాజ్యలక్ష్మిని బరిగ్రహింపుమనుట విపరీతము. ఉభయలోకవిజిగీషువైన నీవీలోకము నధిష్టింపుమని చెప్పుట యపభ్యాష్టము కోశసంచయమును స్వీకరింపుమనుట చంద్రికావిమలయశస్సంచయైకాభిరతుఁడవైన నీకు నిరుపయోగము. రాజసమూహమును వశపఱచుకొనుమనుట గుణగణాత్మీకృతలోకుఁడవైన నీకు గతార్థము. రాజ్యభారమును వహింపుమనుట భువనత్రయభారోద్వహనశక్తుఁడవైన నీకనుచితనియోగము. ప్రజలఁ బాలింపుమనుట దీర్ఘదోర్దండార్గళితదిఙ్ముఖుఁడవైన నీకనువాదము. పరిజనమును రక్షింపుమనుట లోకపాలోపముఁడవైన నీకానుషంగికము. శస్త్రాభ్యాసము మానవలదని చెప్పుట ధనుర్గుణకిణాంకితప్రకోష్ఠుఁడవైన నీకు నిరర్థకము. నూతన వయస్సులో జితేంద్రియుఁడవైన నీకుఁ జాపలమును నిగ్రహింపుమని చెప్పుట కవకాశమే లేదు" అని యిట్లు నదింపుచు నా రాజసింహుఁడు కనులు మూసెను.

ఈసమయమందే భాస్కరుఁడు తేజస్సును విడిచెను. నరపతి జీవితాపహరణరూపమైన యాత్మాపరాధమువలన లజ్జించుచున్న వానిపగిది నధోముఖుఁడయ్యె. భూపాలకధనదుఃఖాగ్నితప్తమానుండునుంబోలె నాతామ్రశరీరుఁడయ్యెను. ఎవ్వరైన నప్రియప్రశ్న నడుగుదురేమోయని శంకించుచున్నవానివలె మెల్లగా నంతరిక్షము నుండిఁ జారెను. నరవరునికి జలాంజలి నియ్యఁగోరుచున్నవానివలె

అపరజలనిధి సమీపంబునకుఁ బోయె. దుఃఖాగ్నిదగ్ధమైనట్లెఱ్ఱఁబడి యున్న కరసహస్రముఁ గలవాఁడయ్యెను. ఇట్లు నరపతిమరణసంజాతవైరాగ్యునివలె శాంతశరీరుఁడై మరీచిమాలిచరమగిరిగుహాగహ్వరమునుఁ జొచ్చెను. మహాజనాశ్రుసంతానార్ద్రీకృతమైనట్లు తపము శాంతిం బరోదనతామ్రలోకలోచనకాంతిచే బలె జగమెఱ్ఱఁబడగా, జనోష్ణనిశ్వాససంతాపదగ్ధమైనట్లు దివసము నల్లఁబడ, నరపతి ననుగమించుటకుఁ బోవునదానివలె నున్న లక్ష్మీకమలవనమును విడువ, భర్తృశోకవిధురమైనట్లు పరివృతచ్ఛాయయై భూమి నల్లగా నగుపడ, కులపుత్రులవలెఁ బరిత్యక్తకళత్రములై దుఃఖముతో మొఱలిడుచుఁ జక్రవాకములు వనాంతరముల నాశ్రయింప, అరాజకభీతములైనట్లు పద్మములు తమకోశములను దాచుకొనగ, దినకరుఁడు రాగశేషుఁడై లోకాంతరమునకేగ, ప్రేతపతాకవలె సంధ్య గగనతలమందు విస్తరింప, శవశిబికాలంకార నీలచామరసందోహంబు పగిది దృష్టిప్రతిరోధకతిమిరసంచయంబెల్లెడల నతిశయింప, శాలాగరుకాష్ఠములచే నెవ్వఁడో రచించినచితవలె రాత్రికానుపింప, అవతరత్త్రిదశవిమానకింకిణీక్వణితముమాడ్కి శాఖాంతరకులాయలీయమానశకుని కలకలంబు వినఁబడ, నాకలోకంబునకుఁ బోవుచున్న భూపాలు నెదురుకొనుట కింద్రుఁడు బంపిన శ్వేతాతపత్రముచందంబునఁ దూర్పుదెసఁ జంద్రుండుదయింప, శిబిసముఁడైన నరేంద్రునిఁ బురోహితపురస్సరులైన మంత్రులు, సామంతులు, పౌరులు మొదలగువారు శిబికలోఁ బెట్టి సరస్వతీతీరమునకుఁ గొనిపోయి యచట రాజార్హమైన చితయందుంచి విధ్యుక్తరీతిగాఁ జరమసంస్కారమును గావించిరి.

హర్షవర్ధనుఁడును రాజకులసంబంధులు శోకమూకులు నగు లోకులచేఁ బరివృతుఁడై యాస్తరణశూన్యమైన భూమియందు రాజులతోఁ గూర్చుండి భీమరథీభీమమైన యారాత్రినంతయును గడి

పెను. "మాతండ్రి స్వర్గతుఁడుకాఁగా లోకమనోరథమార్గములు భగ్నములయినవి. భూతిస్థానములు ఖిలమైనవి. ఆనందద్వారములు మూసివేయఁబడినవి. సత్యవాదిత్వము నిద్రించినది. లోకయాత్ర లోపించినది. బాహుశాలిత్వము నశించినది. ప్రియభాషిత్వ మభావమునొందె. పురుషకారము భ్రష్టమయ్యె. సమరశౌండత సమాప్తినొందినది. పరగుణప్రీతి విధ్వస్తమయ్యె. శాస్త్రములిక నిరుపయోగములు. విక్రమము నిరాలంబనము. విశేషజ్ఞత కథావశిష్టము. ఔర్జిత్యము దత్తజలాంజలి. ప్రజాపాలననైపుణి కాషాయము నవలంబించె. రాజలక్ష్మి శ్మశానాశ్రమమును స్వీకరించునుగాక. వసుమతి ధవళవస్త్రమును ధరించునుగాక. విలాసిత్వము వల్కలముఁ దాల్చునుగాక. తేజస్విత్వ మరణ్యముల పాలగునుగాక. ధీరత్వము చీవరములఁ గట్టుకొనునుగాక. కృతజ్ఞత యిక నెవ్వని నాశ్రయించును. తాదృశమహాపురుషనిర్మాణపరమాణువుల నిక నెచటఁ జతుర్ముఖుఁడు లభింపఁగలఁడు. దశదిశలు శూన్యములైనవి. జగమంతయు నంధకారమయము. శస్త్రోపజీవుల జన్మ మింటపైని నిష్ఫలము. వీరగోష్ఠులిక యెట్లు జరుగును? దీర్ఘరక్తనయనంబైన తన్ముఖపంకజంబు స్వప్నమందైనఁ గనఁబడునా? లోహస్తంభాధికగరిమగర్భంబగు తద్భుజయుగళంబు జన్మాంతరమందైన నన్నాశ్లేషించుకొనునా? మథ్యమానక్షీరసాగరోద్గారగంభీరమగు కంఠధ్వనితోఁ బుత్రకా యని లోకాంతరమందైనఁ బిలుచునా" యని యిట్లు బహువిధంబుల విలపించుచు నారాత్రియంతయుఁ గృతజాగరుండై యుండెను.

అంత దుఃఖించుచున్నవివలెఁ గృకవాకుసమూహములు కంఠము లెత్తి కూయఁదొడఁగెను. భవనమయూరములు వాసయష్టులనుండి క్రింది కురికెను. పక్షికులంబులు తమకులాయవృక్షంబులం బరిత్యజించి యాహారార్థ మరణ్యంబులకుం బఱచె. అంధకారంబు తనుత్వమునొందె. దీపంబులు క్షపితనిజస్నేహంబులై నిర్వాణభూయిష్ఠం

బులయ్యెను. అంతరిక్షము నరుణవల్కలపరివృతమై సన్న్యాసమును ధరించినట్లుండె. కలవింకకంధరాధూసరంబులగు నక్షత్రంబులు పార్థివాస్థిశకలంబులవలెఁ బ్రకాశించెను. వనకరిచయంబువిధ సరస్సరిత్తీర్థాభిముఖంబుగా బయలుదేరెను. ధవళశావాన్నపిండమువలెఁ జంద్రుఁడు పరపయోనిధిపుళినపరిసరమందుఁ బతితుండయ్యె. స్వర్గారూఢుఁడైన భూపాలుని చందంబునఁ గమలాప్తుం డుదయగిరిమస్తకంబు నలంకరించె. రాజ్యమువలె రాత్రి మారిపోయెను. ప్రబుద్ధరాజహంసమండల ప్రబోధ్యమానంబగు పంకజాకరంబుమాడ్కి హర్షుం డచటనుండి బయలువెడలి నూపురరవాభావంబున మూకీభూతంబులై యున్న మరాళంబులను, శోకాకులశిథిలకంచుకివర్గంబుతోఁ గూడిన శుద్ధాంతంబును, నిహతయూధపమైన వనగజయూధమువలెనున్న పితృపరిజనంబును, రుదన్మహామాత్రమై నిష్పందమగు రాజకుంజరంబును, మందురాపాలకాక్రందకథితంబగు వల్లభాశ్వంబును, విశ్రాంతజయశబ్దకలకలంబయి శూన్యమై యున్న మహారాజాస్థానమంటపంబును వీక్షింపుచు దహ్యమానదృష్టియై రాజభవనంబుఁ బ్రవేశించెను. ఆమరుసటిదినమందు సరస్వతీతీరంబునకుం జని స్నానము జేసి తండ్రి కుదక మొసంగెను. అది వ్రీడితపశాళ్లియై నూతనదుకూలవస్త్రంబులఁ దాల్చి యాతపత్రము లేకుండ హయంబున్నను బాదచారియై యుష్ణనిశ్వాసముల విడుచుచు మరల రాజభవనంబుఁ జొచ్చెను.

రాజవల్లభులు, సుహృత్తులు, భృత్యులు, సచివులు రాజమరణదివసమందే గృహములను ప్రియులైన దారపుత్రాదులనుఁ బరిత్యజించి బంధుజనులు తమ్ము నివారించుచున్నను వినక నృపగుణగణాపహృతచిత్తులై కొందరు భృగుపాతము నంగీకరించిరి. కొందరు తీర్థవాసులైరి. కొందరు కుశశయనసంవిష్టులై యనశనవ్రతముచే ననసమానమైన శోకమును శమింపఁజేసుకొనిరి. శోకావేగవివశు

లైన మరికొందర నలప్రవిష్టులైరి. కొందరు దారుణదుఃఖాగ్నిదహ్యమానహృదయులై హిమశైలము నాశ్రయించిరి. కొందరు వింధ్యపర్వతోపత్యకలయందుఁ బల్లవశయనశాయులై సంతాపమును వీడిరి. కొందరు సేవావిముఖులై శూన్యారణ్యభూముల నాశ్రయించిరి. కొందరు పవనాశనులై ధర్మార్జనాసక్తిచే మునులైరి. కొందరు కాషాయంబుల ధరించి కాపిలమతప్రవిష్టులైరి. కొందరు పూర్వము కిరీటములను ధరించిన శిరస్సులచే జడలను ధరించిరి. కొందరు రక్తాంబరధారులై స్వామ్యనురాగము నుజ్జ్వలముగాఁ జేసిరి. కొందరు తపోవనంబులఁ దపస్సానరించుచు శరీరములను జీర్ణింపఁ జేసిరి.

సంపద శాపమనియు, భూమి మహాపాతకమనియు, రాజ్యము రోగమనియు, భోగములు సర్పములనియు, గృహము నరకమనియు, బాంధవులు బంధనమనియు, జీవిత మపయశంబనియు, దేహము ద్రోహమనియు, సామర్థ్యము కళంకమనియు, అయువపుణ్యఫలమనియుఁ, ఆహారము విషమనియు, విషమమృతమనియు, చందన మగ్నియనియు, కామము క్రకచమనియు, హృదయస్ఫోటన మభ్యుదయమనియు, దలంచుచు సకలవ్యాపారవిముఖుండై పితృశోకవిహ్వలీకృతమానసుండైన హర్షుని చిరంతనమిత్రులు, పితృపితామహక్రమాగతులైన కులపుత్రులు, గ్రాహ్యవాక్కులైన గురువులు, శ్రుతిస్మృతీతిహాసపురాణ విశారదులైన వృద్ధబ్రాహ్మణులు, శ్రుతాభిజనశీలశాలులు, మూర్ధాభిషిక్తులు నగు రాజులు, యథావదధిగతాత్మతత్త్వులైన సన్న్యాసులు, సమదుఃఖసుఖులైన మునులు, సంసారాసారతాకథనకుశలులైన బ్రహ్మవాదులు, శోకాపనోదన నిపుణులైన పౌరాణికులు, పరివేష్టించి రాజ్యమునుఁ బరిగ్రహింపుమని బోధించిరి. వారిట్లనునయింప నతికష్టముతో మెల్లగ నాహారాదులయం దాభిముఖ్యము గలవాఁడయ్యెను. "మహాప్రళయసదృశమైన మాతండ్రి మరణవార్తను విని

మాయున్న బాష్పజలస్నాతుండై వల్కలమును ధరించి తపశ్చరణమున కరణ్యమునకుఁ బోయెదనని నిశ్చయింపఁడుగదా? ఆపురుషసింహుఁడు గిరిగుహ నాశ్రయింపఁడుగదా? అశ్రుజలపూర్ణలోచనుఁడై నను అనాథమైన యీపృథివిని చూచునా? సంసారానిత్యతాజనితవైరాగ్యుఁడై సవిధమునకు వచ్చు రాజ్యలక్ష్మిని నిరసింపఁడుగదా? ప్రథమవ్యసనవిషవిక్లబుఁడై తన్నుఁ దాను మరువఁడుగదా? దారుణదుఃఖాగ్నిదగ్ధదేహుఁడై పట్టాభిషేకము నొప్పుకొనునా? ఇచ్చటకు వచ్చినతరువాత రాజులచే బోధింపబడినవాఁడై రాజ్యపరిపాలనయందు విముఖతనొందఁడుగద. అతఁడు తండ్రిగారియందతి పక్షపాతముఁగలవాఁడు "కాంచనతాళవృక్షసదృశదేహప్రమాణము, దివసకరప్రీతిచే దినమంతయు వికసించియుండు పద్మమువంటి యీ ముఖము, వజ్రస్తంభభాస్వరములైన యీభుజకాండములు, మదాలసహాలధరవిభ్రమములైన యీవిలాసములు, పూర్వమెవ్వరికైనఁ గలవా? ఇఁక ముందువారికుండునా? ఆతనివంటివదాన్యుఁడు పరాక్రమవంతుఁడు, మానవంతుఁడు, మఱెవ్వఁడున్నాఁడని నాతోఁ బలుమారు ప్రసంగించుచు దరుచుగాఁ దండ్రిగారిని శ్లాఘించెడువాఁడ"ని భ్రాతృగతహృదయుఁడై తనలోఁ దాను చింతించుకొనుచు భ్రాతృదర్శనోత్కంఠావిసంస్థుల హృదయుఁడై యతనిరాకను నిరీక్షించుచుండె.

ఆంధ్రహర్షచరిత్రములో
మహారాజ మరణవర్ణనమను పంచమోచ్ఛ్వాసము.
ముగిసెను.

# హర్ష చరిత్రము.

## షష్ఠోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ వెదకి వెదకి కృతాంతుండు పృథ్విలోనఁ।
బంపి తన దూతసమితి యుపాంశువుగను।
శూరులనుఁ బట్టి తెప్పించు నేమొ పురను।
రోషకలితాత్ముఁడై విజగీషుపగిది॥

తే॥ గీ॥ కుంభిసంభగ్నతరుపాత ఘోరరవము।
సింహసుప్తిని వనములోఁ జెరుచు కరణి॥
నమ్మకముపైని మనుజుని నఱికినట్టి।
దోషమున నాశనంబొందు దుర్జనుండు॥

అంత ద్విజన్ముఁడు ప్రథమప్రేతపిండంబు భుజింప, భయంకరములగు నాశౌచదినంబులతిక్రమింప, ఆలోకనమాత్రదుఃఖదాయకములగు నృపశయనాసనఛత్రచామరామత్రశస్త్రాదికము బ్రాహ్మణదత్తముకాఁగా, రాజాస్థిసంచయము తీర్థస్థానంబుల నుంచఁబడఁగా, రాజకుంజరము నరణ్యములో విడిచిపెట్టఁ గ్రమముగా నాక్రందములు మందగింప, విలాపములు విరళముకాఁగా, లోకలోచనాశ్రుధారాసంతానము శాంతింప, నిట్టూర్పులు శైథిల్యమునొంద, హాకష్టశబ్దము లంతరింప, శోకశయ్యలు పరిత్యక్తములు కాఁగా, మనుష్యశ్రవణము లుపదేశార్హతనొంద, నృపగుణములు గణనీయదశకు రాఁగా, శోకమచ్చుటచ్చుటఁ గానుపింప, కవులు తమ రోదనములఁ జాలింప, నరనాథుఁడు స్వప్నావశేషదర్శనుఁడు, హృదయావశేషస్థానుఁడు, చిత్రావశేషాకృతి, కావ్యావశేషనాముఁడును గాఁగా, హర్షదేవుఁడాకాలమందు సంత్యక్తవ్యాపారాంతరుఁడై,

శోకమూకులు, అవనతశిరస్కులు నగు మహాజనులు, వృద్ధబాంధవులు, గుంపుగూడి తనచుట్టుం గూర్చుండియుండుటను జూచి "శోకపరాభూతమైన యీజనసముదాయము మాయన్నగారి రాకనుం దెలియంజేయుచున్నది. అంతకంటె మఱేమియున్నదని" తనలోం దాననుకొని లోనికి వచ్చుచున్న యొక భృత్యునిఁగాంచి "ఓయీ! మాయన్నగారు వచ్చినారా" అని కంపమానహృదయుండై యడిగెను. వాడు "స్వామీ! అవును. తమరు సెలవిచ్చినట్లు ద్వారదేశమందున్నారు" అని మెల్లగాం బలికెను. అది విని హర్షుండు సోదర్యస్నేహపరవశుండై బాష్పోదకప్రవాహముతోం దన ప్రాణములను విడిచిపెట్టక యతికష్టముతో నాపెను.

అనంతరము మొదటం బ్రవేశించిన పరిజనముపలెనున్న ద్వారపాలకాక్రందనధ్వనిచేం దెలుపంబడిన రాకంగలవాడు, బహువాసరములనుండి స్నానభోజనశయనాదివిహీనులై కృశించిన పరిజనులచేం బరివృతుండు, అవిరళమార్గధూళిధూసరితాంగుండగుటచేం గ్రమాగతమైనభూమిచే శరణీకృతశరీరుని పగిది నున్నవాండు, సమాసన్నరాజ్యలక్ష్మీకటాక్షపాతములమాడ్కి నున్న ధవళములగు హూణసమరశరవ్రణబద్ధపట్టకములచే శబలీకృతకాయుండు, అవనిపతి ప్రాణపరిత్రాణార్థమై శోకాగ్నియందు హోమముచేయబడిన మాంసముకలవివలెం గృశించిన యవయవములచే నివేదింపంబడిన దుఃఖభారముగలవాడు, కిరీటశూన్యమై మలినకుంతలమై యున్న శిరస్సునందు మూర్తిభవించినట్లున్న శోకమును ధరించుచున్నవాండు ఆతపగళితస్వేదముతోను, పితృపాదపతనోత్కంఠతోనుం గూడినలలాటముం గలవాండు, విపులబాష్పపయఃప్రవాహముచేం బతిమరణమూర్ఛితవలెనున్న భూమినిం దడుపుచున్నవాండు, నిరంతరాశ్రుబిందుపతనమువలన లొత్తంబడి చిక్కియున్న కపోలములుంగలవాండు, అత్యుష్ణముఖమారుతముచే ద్రవించు

చున్నట్లున్న యధరముతోఁ గూడినవాఁడు. అచిరశ్రుతపితృమరణ మహాశోకముచే దగ్ధమైనట్లున్న శ్రవణప్రదేశముగలవాఁడు, సూర్యుఁడస్తమించుటచే లుప్తశోభమైన దివసమువలె శ్యామాభాతుఁడు, భగ్నమైన కల్పతరువులుగల నందనమువలె వివర్ణుఁడు, దిగ్గజము నశించిన దిగ్భాగమువలె శూన్యుఁడు, వజ్రపాతదారితమైన పర్వతమువలెఁ గంపమానుఁడు, దౌర్మనస్యముచే దాసీకృతుఁడు, అధికీవశంవదుఁడు, మౌనముచే మూకీకృతుఁడు, పీడచే నాక్రాంతుఁడు, వైరాగ్యముచే ధరింపఁబడినవాఁడునై సాధుభాషితములకసాధ్యమైనది, వృద్ధబుద్ధులకబోధ్యము, గురువాక్యములకగమ్యము, శాస్త్రశక్తికశక్యము, ప్రజ్ఞాప్రయత్నములకందనిది, సుహృదుపదేశములకగోచరమైనది, విషయోపభోగములకవిషయమైనదియునగు శోకముచేఁ గబళితుఁడునైయున్న యన్నగారినిఁ జూచెను.

అంత రాజ్యవర్ధనుఁడు చిరకాలనిరుద్ధదుఃఖోద్రేకము నాపలేక దూరమునుండి ప్రసారితదోర్దండయుగళుఁడై తమ్మునిఁబట్టుకొని మాటిమాటికిఁ గంఠమందు, కపోలములయందు, స్కంధభాగమందు నిడికొని శ్రోతృహృదయములను బంధనములతోఁ బెల్లగించుచున్న వానివలె ముక్తకంఠముగా నేడ్చెను. నిర్వృష్టనేత్రజలుఁడై శరత్కాలపు మేఘమువలెఁ గొంతసేపటికి స్వయముగా నుపశమించెను. పరిజనోపనీతంబగు జలంబునఁ జక్షుఃప్రక్షాళనంబుఁ జేసికొని దాసి తెచ్చిన చంద్రాతపశకలోపమంబగు వాసఃఖండముచే నుష్ణబాష్పదగ్ధమైన ముఖమునుఁ దుడిచికొనియె. చాలసేపూరకయుండి లేచి స్నానభూమికిఁ జని కొంతవడి యచటఁ గూర్చుండి స్నానముఁ జేసి తల దుడుచుకొని పర్యంకమందుఁ బడియుండెను. హర్షుఁడును స్నాతుఁడై భూతలనిహితమైనకుథయందన్నకు దగ్గరగానుపవిష్టుఁడయ్యె. దుఃఖసంతప్తహృదయుఁడైన జ్యేష్ఠసోదరునిఁజూడ నాతనిహృదయము సహస్రశకలములయ్యెను. రాజ్యవర్ధనుడు రాజధానికి వచ్చిన

దినము నరపతి మరణదివసముకంటె దారుణతరంబయ్యెను. ఆదిన మందాపురములో నొక్కఁడును స్నానభోజనాదులను సలుపలేదు. అంత త్వష్టృటంకముచే నూతనముగాఁ జెక్కఁబడిన శరీరముగల వానివలె బహుళరుధిరచ్ఛవినిఁదాల్చినవాఁడై యరుణసారథియపర పారావారజలంబునఁ గ్రుంకె. ముకుళితకమలినీకోశనిబద్ధంబగు చంచరీకకులంబు కమలసరస్సున ధ్వనించెను. సూర్యుఁడస్తమింపగాఁ జక్రవాకవితతివిరహవ్యాధివిధురంబగు వధూకదంబమును సాప్రిముగాఁజూచెను. కలహంసరమణీరమణీయంబగు కైరవాకరమందు సంచరించు లక్ష్మీశ్రీయొక్క మాణిక్యకాంచీకింకిణీజాలమువలె మధుకరనికరము ధ్వనించెను. ఆకాశంబున నుదయమానంబై ప్రకటకళంకంబగు శశాంకమండలంబు విషాణోత్కీర్ణపంకిలకకుదకూటంబు గల శంకరవృషభంబు పగిదిఁ బ్రకాశించెను.

ఈ సమయమందనతిక్రమణీయవచనులైన ప్రధానామాత్యులచే విన్నవింపఁబడినవాఁడై రాజ్యవర్ధనుఁ డెట్టట్లో లేచి భుజించెను. ఆరాత్రి తెల్లవారగా రాజులందరువచ్చి ప్రవేశించియుండ నన్నతమ్మునిఁజూచి "నాయనా, హర్షా, గురుజననియోగంబునకు లోబడినవాఁడవు. శైశవమందే నాయనగారి చిత్తవృత్తిని బాగుగా గ్రహించినవాఁడవు. కావున నిట్టి విధేయుఁడవైన నీకొక విషయము నామనంబు చెప్పఁగోరుచున్నది. బాలభావసులభమైన వక్రత నవలంబింపఁగూడదు. ఈ నాకోరికకు బాలిశునివలె విఘ్నమాచరింపకుము. లోకవృత్తమునుఁ దెలియనివాఁడవుకావు. లోకత్రయత్రాతయగు మాంధాత స్వర్గతుఁడుకాగా పురుకుత్సుఁడేమి చేసెను. భూలతాదిష్టాష్టాదశద్వీపుఁడైన దిలీపుని యనంతరము రఘువు, మహాసురసంగ్రామాధిష్ఠితసుత్రామరథుండగు దశరథుండు దేవభూయంబునొంద శ్రీరామచంద్రుండును, గోష్పదీకృతచతుస్సముద్రుండైన దుష్యంతుఁడు కాలధర్మంబు నొంద భర

తుండు నేమి సేయఁగలిగిరి. వీరందరిమాట యటుండనిమ్ము. శత సమధికాధ్వరధూమవిసరధూసరితవాసవావాసుఁడైన తన జనకుఁడు పరాసుఁడుకాఁగా మనతండ్రిగారు రాజ్యమేలలేదా? శోకమునకు లోఁబడిన పురుషుని శాస్త్రవేత్తలుకాపురుషుఁడందురు. శోకాయత్తు లగువారు స్త్రీలు. ఐనను స్వభావమున కేమిచేయఁగలము. ఇదియే కాపురుషత్వము. ఇదియే స్త్రైణము. పితృశోకాగ్నికి స్థానభూతుఁడ నైతిని. మహారాజు గతింపఁగా స్రోతోరూపముగా నశ్రుధారాసంతానమును విడిచితిని. మహాతేజ మస్తమింపఁగా నంధకారీభూతలోకుఁడనైన నాప్రజ్ఞాలోకము నష్టమైనది. దహనభీతినొందినదాని వలె వివేకము స్వప్నమందైనను సమీపింపకుండనున్నది. బలిష్ఠమగు సంతాపముచే లక్కవలె ధైర్యమంతయుఁ గరగిపోయినది. విషదిగ్ధబాణనిహతమగు హరిణమువలె మతి మోహము నొందుచున్నది. నాధృతికూడ నమ్మవలెఁ దాతతోఁబోయినది. స్మృతి విలుప్తమైనది. వడ్డికిచ్చిన విత్తమువలెఁ బ్రతిదినము దుఃఖము పెరుగుచున్నది. శోకానలధూమసంభారసంభూతాంభోధరభరితమయినట్లీ నాశరీరము నయనవారిధారాసంతానమును వర్షించుచున్నది. మనుష్యులు మరణానంతరము పంచభూతములైపోవుదురని లోకము వ్యవహరించుమాట యసత్యము. ఏలయన మన నాయనగారు కేవలహుతాశనత్వము నొంది నన్ను దహించుచున్నారు. దుర్నివారమగు నీశోకము సముద్రమును బడబాగ్నివలెఁ నన్ను దహించుచున్నది. పర్వతమును వజ్రాయుధమువలె ఖండించుచున్నది. రవిని రాహువువలెఁ గబలించుచున్నది. విషమందుఁ జకోరమునకువలె రాజ్యమందు నాకన్ను విరక్తమగుచున్నది. సుమేరుకల్పుఁడైన యట్టి మహాపురుషుని వినిపాతము కేవలాశ్రుపాతముచేఁ బ్రతీకార్యముకాదు. ఈ రాజ్యలక్ష్మినిఁ బరిత్యజించుటకు నామనం బభిలషించుచున్నది. ఈ దగ్ధగృహమందు శారికవలె క్షణమైనఁ నుండజాలను. వస్త్రమందువలె మనస్సునందు

లగ్నమైన స్నేహమలమును నిర్మలములగు గిరినిర్ఝరిణీజలంబుల నాశ్రయపదమందు క్షాళనమొనర్చుటకు నా మనంబు వాంఛించుచున్నది. కావునఁ దొల్లి తండ్రియాజ్ఞచేఁ బూరువుజరనువలె నీవును నా రాజ్యచింతనుఁ బరిగ్రహింపుము. త్యక్తసకలబాలక్రీడుఁడైన శ్రీకృష్ణునివలె లక్ష్మికి నీయురస్స్థలమిమ్ము. నాచే శస్త్రము విడువఁబడినది''అని పలికి దగ్గిరనున్న శస్త్రగ్రాహి చేతినుండి నిస్త్రింశమునుఁ దీసికొని నేలఁ బడవైచెను.

అది విని హర్షుఁడు నిశితశూలాహతునివలె విదీర్ణహృదయుఁడై "మాయన్నకు నాపైఁ గోపమువచ్చునట్లెవ్వఁడైన దుర్బోధనముఁ జేసియుండెనా? లేక యిదినన్నాతఁడు పరీక్షించువిధమా? లేక శోకజనితమైన చిత్తవిక్షేపమా? ఇతఁడు మాయన్నకాఁడా? ఆతఁడొకటిఁజెప్పఁగా శోకశూన్యమైన శ్రవణేంద్రియముచే నేను మరియొకటిగా వింటినా? ఒకటిఁజెప్పదలఁచి మఱియొకటిఁజెప్పెనా? ఇది విధివన్నిన సకలవంశనిపాతనోపాయమా? నిఖిలపుణ్యకర్మపరిక్షయోపక్షేపమా? ప్రతికూలగ్రహచక్రవాళవిలసితమా? తాతవినాశనిశ్శంకకలికాలక్రీడితమా? ఏలయన సామాన్యజనునివలె యత్కించనకారినైన నన్నుపుష్పభూతివంశసంభూతునివలె, ఆతండ్రికిఁ బుట్టనివానివలె, తనతమ్ముఁడుగానివానివలె, అభక్తునివలె, దృష్టదోషునివలె,శ్రోత్రియునిసురాపానమందువలె,సద్భృత్యునిస్వామిద్రోహమందువలె,సజ్జనుని నీచోపసర్పణమందువలె,సుకళత్రమును వ్యభిచారమందువలె నతి దుష్కరమైన కర్మయందు నన్నాజ్ఞాపించెను. సకలపరిపంథిమండలజలధిమథనమందరుండగునట్టి జనకుఁడు స్వర్గంబునకేగ తపోవనము నాశ్రయించుటగాని, వల్కలములను ధరించుటగాని, తపశ్చరణముగాని, యుక్తమైన పనియేగాని నన్ను రాజ్యమేలుమని చెప్పుట యిదివరకే శోకాగ్నిదగ్ధుఁడనైన నాపై నంగారవృష్టివలె నున్నది. అట్లు పలుకుట మాయన్నకుఁ దగదు. ఆలోచింపగా

నభిమానములేని ప్రభువు, నిరభిలాషుఁడైన బ్రాహ్మణుఁడు, దోష ములేని ముని, చాపలములేని వానరము, అమత్సరుడైన కవి, తస్కరుఁడు గాని వర్తకుఁడు, శంకితుఁడుగాని ప్రియజాని, దరిద్రుఁ డుగాని సజ్జనుఁడు, ఖలుఁడుగాని ధనికుఁడు, ప్రియుఁడైన క్షుద్రుఁడు హింసింపని వేటకాడు, సుఖమైన సేవకుఁడు, కృతజ్ఞుఁడైన జూదరి, ఆకలిలేని సన్యాశి, ప్రియవచనములుగల క్రూరుఁడు, సత్యముఁ బలుకు నమాత్యుఁడు, దుర్వినీతుఁడుగాని రాజపుత్రుఁడు, లోక ములో దుర్లభులు. అయినను నాకు మాయన్నయే ఆచార్యుఁడు. తండ్రియు రాజవరేణ్యుఁడు నగునట్టి మహానుభావుడంతంబునొంద విఫలీకృతవిశాలశిలాస్తంభోరుభుజుండు, నూతన వయస్కుండునగు మాయన్న రాజ్యమును విడిచి తపోవనమునకుఁ బోవనిశ్చయించి యుండ సకలలోకలోచనజలపాతాపవిత్రంబు వసుధాభిధానంబునగు నీమృద్గోళకంబును విత్తమదమత్తనీచాశ్రియణయు, సుభటకుటుంబ కుమ్భదాసియు నగు నీ హతలక్ష్మి నేచండాలుఁ డభిలషించును. అత్యంతానుచితమగు నిది మాయన్నకెట్లు తోచెను. నాయందే దోషము నాతఁడు కనిపెట్టెను. సౌమిత్రిని భీమసేనప్రభృతులను మరచెనా? మాయన్న ప్రభుత్వము స్వార్థనిష్పాదననిష్ఠురము. అనపేక్షితభక్తజనముకాదే. ఆతఁడు తపోవనమునకుఁ బోవగా జీవనేచ్ఛగలవాడెవ్వఁడు మనస్సుచేనైన రాజ్యము నభిలషించును. కులిశధారానిశాతనఖవిదళితమత్తమాతంగంబగు కేసరి వనవిహారము నకుఁ జనఁగాఁ దన్నివాసభూతమైన గిరిగుహ నెవ్వఁడు గాపాడును? సత్త్వవంతులు ప్రతాపసహాయులు. చపలమైన రాజ్యలక్ష్మిని గురించి మాయగ్రజుని కింత నిర్బంధమేల? కుశకుసుమసమిత్పలా శంబుల మోసికొనుచు వనహరిణివలె నరణ్యంబున జరాక్రాంతి యగుగాక. వ్యర్థమగు నీవికల్పములతో నాకేమిపని? నేనును మాయన్న ననుసరించెదను. గురువచనోల్లంఘనజనితంబగు నాకిల్బి షమును తపోవనమందు నాతపంబే శమింపఁజేయును. ఇట్లు నిశ్చ

యించి మనస్సుచే మొదటఁ దపోవనమునకుఁ బోయినవాఁడై యధోముఖుఁడై యూరకుండెను.

అంతలో మొదట నాజ్ఞాపింపఁబడినవానివలె నేస్పుచు వస్త్రభృత్యుఁడు వల్కలములను సిద్ధపర్చి తీసికొనిరాగా నిర్దయకరతలతాడనభీతిచేవలె హృదయమెచ్చటికో పోవ, రాజస్త్రీసమూహము మొఱలిడ, విప్రులందరబ్రహ్మణ్యమని చేతులు పైకెత్తి శోకింప, వలదని పౌరబృందము పాదములపైఁబడి ఘూత్కారమొనర్ప, చిరంతనపరిజనము కరిగిన మనస్సులతోఁ బరుగిడఁ, కంపమానహృదయులు, పరిజనావలంబితులు, శోకగద్గదవచనులు, క్షరద్బాష్పబిందుసందోహులు, నివారణోద్యతమనస్కులునగు వృద్ధబాంధవులు చనుదేర, నఖవిలిఖితమణికుట్టిములు, అవనతిముఖులునై, సామంతులునై రాశ్యమవలంబింప. బాలవృద్ధులతోఁ గూడిన ప్రజలందరు తపోవనగమనోద్యతులై యుండ, రాజ్యశ్రీపరిచారకుఁడైన సంవాదకుఁడు స్రవన్నేత్రసలిలప్రవాహంబుతో శీఘ్రముగాఁ బరుగిడివచ్చి ముక్తాక్రందుఁడై సభామధ్యంబునఁబడెను.

అది చూచి హర్ష రాజ్యవర్ధను లుభయులు నేమి యుపద్రవము సంభవించెనోయని తొట్రుపాటుగలవారై “భద్ర, మా వ్యసనములను వృద్ధినొందించుటలో బద్ధదీక్షుఁడు, మహారాజనిధనసంతుష్టమతియునగు దుర్విధియింక నేయధికతరమైన వ్యసనములోఁ మమ్ముఁద్రోయదలంచియున్నాఁడో చెప్పుము చెప్పుము”అని వాని నడిగిరి. “నీచాత్ములు పిశాచములవలె ఛిద్రప్రహారశీలులు. ఏదినమందు భూనాధుఁడీలోకమునుఁ బరిత్యజించెనను దుర్వార్తవుట్టెనో యాదినమందే దుష్టుఁడైన మాళవరాజు గ్రహవర్మను వధించెను. భర్తృదారికయైన రాజ్యశ్రీయును చోరాంగనవలె నిగళితచరణయై కాన్యకుబ్జయందుఁ గారాగారములో నుంచఁబడియె. అరాజకమని తలంచి

యా ఖలుఁడీదేశమునుఁగూడ జయించుటకు రాఁదలంచి యున్నాఁడని యొకకింవదంతి పుట్టినది. నేను విన్నవింపఁదగినవిషయమును విన్నవించితిని. ఇక తమదియే భారము." అని వాఁడతిదుఃఖముతో దెలియజేసెను. అనుపేక్షణీయము, అసంభావితము, ఆకస్మికము నగునట్టి దారుణవ్యసనోపనిపాతమును విని పరులవలనఁ బరిభవమెన్నఁడుఁ బొందనివాఁడగుటచేతను, పరపరిభవమును సహింపని స్వభావముఁగలవాఁడగుటచేతను, నవయౌవనము దర్పబహుళమగుటచేతను, తాను వీరక్షేత్రమందుఁ బుట్టినవాఁడగుటచేతను, సోదరి కృపాభూమియగుటచేతను బద్ధమూలమై యతిగరిష్ఠమగు నీరాజ్యవర్ధనుని పితృమరణశోకమంతయు నొక్కపెట్టున నశించెను. సింహము పర్వతకందరమునువలె భయంకరకోపావేశ మీతనిహృదయగుహను బ్రవేశించెను. పృథులలాటపట్టమందు భీషణభ్రుకుటిని బంధించెను. నఖకిరణసలిలనిర్ఝరములచే నభిషేకము గావించుచున్నవానివలె వామకరముచేఁ దనబాహుశిఖరమును స్పృశించెను. గళత్స్వేదసలిలపూరితోదరంబగు నీతని దక్షిణహస్తము దుర్మదలక్ష్మీకచగ్రహణోత్కంఠచేతనువలెఁ గంపించుచున్నదియై మాళవరాజోన్మూలనముకొఱకు గృహీతకేశమువలె భీషణంబగు కృపాణంబు ధరించెను. కపోలములయందు రోషరాగమగుపడెను. సమాసన్నసకలమహీపాలచూడామణి చక్రాక్రమణాహంకారముఁగలదానివలె నన్న దక్షిణచరణమును వామోరుదండమందుంచెను. నిష్ఠురాంగుష్ఠకషణముచే నుద్గీర్ణధూమలేఖంబైన యితరపాదపద్మముచే మణికుట్టిమమును వ్రాయఁదొడఁగెను. శోకవిషప్రసుప్తమగు పరాక్రమమును లేపుచున్నవానివలె రాజ్యవర్ధనుఁడు దమ్ముని జూచి "ఆయుష్మంతుఁడా! యీరాజకులము, యీబంధువులు, యీపరిజనము, యీరాజ్యము, భూపతిభుజపరిపాలితులగు నీప్రజలు, నీయధీనము. నేనిప్పుడే మాళవకులోచ్ఛిత్తికొఱకుఁ బోయివచ్చెద. ఇదియే వల్కలగ్రహణము. ఇదియే తపస్సు. ఇదియే శోక

నిరసనోపాయము. ఇదియే అత్యంతావినీతశత్రునిగ్రహము. మాళవరాజులు పుష్పభూతివంశమును బరిభవించుట హరిణములు సింహము కేసరములను లాగుట. భేకములు కాలసర్పముపైఁ జేతు లుంచుట. గోవత్సములు వ్యాఘ్రమును బందిగాఁ గొనుట. నీరుకట్టెలు గరుడుని గళము బట్టుకొనుట. చీకటులు సూర్యునావరించుట. మహాకోపముచే నాశోకసంతాప మంతరించినది. చతురంగసైన్యము నీయొద్ద నుండనిమ్ము. గుఱ్ఱపుదండుతో నీభండి యొక్కఁడే నన్ననుసరించి వచ్చునుగాక" అనిపలికి తోడనే ప్రయాణపటహమును వాయించుట కాజ్ఞాపించెను.

తనతో రావలదని యాజ్ఞాపించుచున్న యన్ననుఁజూచి సోదరీభర్తృవధజనితకోపోద్రేకంబు మనంబున నుద్దీపింప హర్షుఁడు "ఆర్యా! నేను మీతో వచ్చిన నేమిదోషము? బాలుఁడనందువా మఱింత విడువఁదగినవాఁడను కాను. రక్షణీయుఁడనందువా నీభుజపంజర మే నాకు రక్షాస్థానము. అశక్తుఁడనందువా నన్నిచ్చటఁ బరీక్షించితివి. సంవర్ధనీయుఁడనందువా నీవియోగము నన్నుఁ గృశింపఁజేయును. క్లేశమును సహింపలేనందువా నన్ను స్త్రీలలోఁ బరిగణించితివి. ఇచ్చట సుఖముగా నుండుమంటివేని నాసుఖము నీతోడనే యున్నది మార్గాయాసము మెండుగా గలుగునంటివా నీవిరహముకంటె నది హెచ్చుబాధకముకాదు. లఘుపరికరుఁడ్వన పోమెదనంటివా నీపాదరజము నీకేపాటిభారము. నీభుజమున కిట్టి కుక్షింభరిత్వమేలకలిగెను. ఒంటిగా నది క్షీరోదఫేనపటలపాండురంబగు యశము నమృతమువలెఁ బానముఁజేయుటకుఁ గోరుచున్నది. నాయందనుగ్రహముఁ జూపితివిగాని నన్నిట్లెప్పుడు వంచింపలేదు. కావున నాయందుఁ బ్రీనన్నుడవుక మ్ము. నన్ను నీవెంబడి రానిమ్ము అని బ్రతిమాలుచు భూతలనిహితశిరస్కుఁడై యుగ్రజుని పాదపద్మంబులపైఁ బడెను.

అప్పుడతఁడు తమ్ముని లేవనెత్తి "నీచుఁడైన యాశత్రువుని విషయమై యింత మహాసంరంభమేల? హరిణములకొఱకు సింహము సంరంభించుట సింహమునకు లజ్జాకరముగాదా? తృణముల దహించుట కేపాటి యగ్ని కావలెను. అష్టాదశద్వీపయుతంబగు నీమేదిని నీపరాక్రమమునకు విషయము. కులశైలనివహంబు నెగర గొట్టఁగలవాయువున కతిచంచలమైన తూలరాశియందుఁ బ్రయత్నమేల? మేరుగిరియందు వప్రక్రీడసలుపు దిగ్గజములు వల్మీకముసుఁ జూచునా? సకలపృథ్వీపతి ప్రళయోత్పాతధూమకేతువు, చామీకరపత్రలతాలంకృతంబునగు కార్ముకంబును దిగ్విజయమందు ధరింపఁగలవు. దుర్నివారమైన నాశత్రువినాశనక్షుద్బాధ కీయొక కోపకబళమును క్షమింపుము" అనిపలికి యాదివసమందే యభ్యమిత్రీణుఁడై చనియె. సోదరుఁ డట్లు దండయాత్రకుఁబోవ, దండ్రి స్వర్గతుఁడుకాఁగా, దల్లి మృతినొంద, జామాతకథావశిష్టుఁడుకాఁగా, జెల్లెలు కారాగృహనిబద్ధయైయుండ, హర్షుఁడు యూథపరిభ్రష్టమైన దంతావళంబుమాడ్కి యేకాకియై యతికష్టముతోఁ గాలమును గడిపెను. బహుదినంబు లతిక్రమింప నాతడు సోదరవిరహదుఃఖాసిక చే నిద్దురలేకుండఁ బొగులుచుండెను. ఒకనాఁడు రాత్రి యామమాత్రావశిష్టమైయుండ యామికుఁ డిట్లొక గీతపద్యమునుఁ బాడెను.

తే॥ గీ॥ ద్వీపసన్నుత గుణమగు దివ్యరత్న।
రాశి సంపాదన ప్రవిరాజితంబు।
పోతమును మారుతము మాడ్కి పురుషుని విధి।
గూల్చు నాకస్మికంబుగఁ గుంభినిపయి॥

అది విని యనిత్యతాభావనచే మిక్కిలి దూయమానహృదయుఁడై యాలోచింపుచుండఁ మరల నిద్రపట్టెను. ఆనిద్రలో మిక్కిలి పొడవైన లోహస్తంభ మొకటి విరిగి నేలఁ బడినట్లు కలఁ

గనెను. కశాభిహతుఁడైనట్లు నిద్ర మేల్కాంచి యుత్కంపమాన మానసుఁడై "ఏమిది తరుచుగా నన్ను దుస్స్వప్నములు విడువకుండ నున్నవి. తెంపులేకుండ నహోరాత్రములు నా వామనేత్రము నదురుచున్నది. మహాక్షితీశుని సంక్షయమును సూచింపుచున్న విధమై యీ మహోత్పాతములు శాంతింపకుండనున్నవి. రాహు వవికలదేహుఁడై సూర్యబింబమందుఁ గానవచ్చుచున్నాఁడు. సప్తర్షిమండలము ధూమమును గ్రక్కుచున్నది. ప్రతిదినము దారుణములగు దిగ్దాహములుఁ గానవచ్చుచున్నవి. దిగ్దాహభస్మకణనికరంబుమాడ్కి నభస్స్థలమునుండి తారకాగణంబులు జారెను. తారకానిపతనదుఃఖముచేవలెఁ జంద్రుఁడు నిష్ప్రభుఁడగుచున్నాఁడు. వెదురుమొలకనుఁ బెరికివేయుమత్తగజమువలె మావంశజుఁడైన పూర్వవయస్కుని సైతము హరించు కృతాంతుని యెవరడ్డఁగలరు. సర్వవిధముల మాయన్నకు మంగళమగుగాక" అని చింతించుచు భ్రాతృస్నేహకాతరమై ద్రవించుచున్న తన చిత్తమును దృఢపఱచుకొని లేచి కాలోచితకృత్యంబుల నాచరించెను.

అంత హర్షుఁడాస్థానగతుండై యుండ విషణ్ణజనానుగమ్యమానుఁడు, మలినపటావృతగాత్రుఁడు, జీవితధారణలజ్జచేవలె నధోముఖుఁడు, నాసాగ్రగ్రథితదృష్టి, మూకీభూతుఁడై యున్నను స్వామివ్యసనమునవిచ్ఛిన్నాశ్రుధారాపాతముచేని వేదించువాఁడు, రాజ్యవర్ధనునికటాక్షపాత్రుఁడునగు కుంతలకుఁడనువానినవలోకించెను. వానిఁ జూచి శంకితుఁడై నేత్రద్వయమం దుదకమును, ముఖమందు శ్వాసమును, హృదయమం దగ్నిని, ఉత్సంగమందు భూమినిగలిగియున్నవాఁడగుటచే సర్వావయవములయం దేకకాలంబున లోకపాలకులచే దారుణాప్రియవార్తాశ్రవణసమయంబునఁ బట్టుకొనఁబడినవానివలెఁ గానవచ్చెను. వాఁడపుడు "దేవా మీయన్న మాలవసైన్యమును హేలగా నోడించెను. అది సహింపనివాఁడై నృశంసుఁడైన గౌడ

రాజునకై తపోపచారములచే మాయన్న మనమునందు దృఢవిశ్వాసంబును బుట్టించి ముక్తశస్త్రుండై యొంటరిగానున్న యాతనిని స్వభవనమందు వధించె''నని చెప్పెను. ఆత్మాపహార్యోపమానంబగు నా మాటను విని హర్షుఁడు ప్రచండకోపాగ్నిచే ద్విగుణీకృతశోకావేగుండై ప్రజ్వలించెను. శిరఃకంపశిథిలితములైన శిఖామణిశకలములను నిప్పులుగాఁగలదానివలె నున్న రోషాగ్నిని గ్రక్కుచు సంతతము స్ఫురించుచున్న పెదవిచే సకలతేజోవంతుల యాయువును బానముఁ జేయుచున్నవానివలెనున్నవాఁడు, రోషారుణనేత్రకాంతులచే దిగ్దాహమునుఁ బుట్టించువానివలెనున్నవాఁడు హరునివలె ధృతభైరవాకారుండు, హరివలెఁ బ్రకటితనరసింహరూపుండు, సూర్యకాంతశైలముమాడ్కి నన్యతేజోదర్శనప్రజ్వలితుండు, ప్రళయదివసంబుపగిది నుదితద్వాదశార్కదుర్నిరీక్ష్యవిగ్రహుండు, మహోత్పాతమారుతముకరణి సకలభూభృత్కంపకారియు, వింధ్యాచలంబు చందంబున వివర్ధమానవిగ్రహోత్సేధుండు, మహాసర్పమువలె దుర్నరేంద్రాభిభవరోషితుండు, పరీక్షితుని పగిది సకలభోగిదహనోద్యతుఁడు వృకోదరునివలె రిపురుధిరపానరతుఁడునై మిక్కిలి భీషణత్వమును ధరించెను.

“దృష్టద్యుమ్నుఁడు ద్రోణాచార్యునివలె నా గౌడరాజు నిర్వ్యాజభుజవీర్యనిర్జిత సకలరాజన్యుఁడు, ముక్తశస్త్రుఁడునైన మాయన్నను సర్వలోకవిగర్హితమైన మృత్యువుతోఁ గూర్చెను. అనార్యుఁడైన యీ గౌడరాజు తప్ప మరెవ్వఁడిట్టి యకార్యమును నాచరించును. భాగీరథీఫేనపటలపాండురములైన మాయన్న శౌర్యాదిగుణము లెవ్వని మనస్సునందుఁ బక్షపాతముఁ గలిగింపవు. కమలాకరసలిలశోషణమందు గ్రీష్మభానునికివలె మాయన్న జీవనమును హరించుటకు వానికిఁ గరములెట్లువచ్చెను? వాఁడేగతికిఁ బోవును? ఏజన్మమెత్తును? ఏనరకమందుఁ గూలును? చండాలుఁడైన

నిట్టిపనిఁ జేయుట కొడంబడునా? ఆ పాపాత్ముని నామము నుచ్చరిం
చుచున్న నా జిహ్వకు పాపమలమంటును. మధువునువలె నార్య
జీవితమును హరించిన యామాఘుఁడు ముందువచ్చు శిలీముఖసం
పాతమునుఁ గానఁజాలకపోయెను. సకలలోకాహ్లాదన చతురమైన
చందనవృక్షమును కీటమువలె నిర్దయుఁడైన యాక్షుద్రుఁడు మా
యన్నను నాశమొందించెను. జాలకినిహితప్రదీపము కాటుకమసిని
వలె నా గౌడాధముఁడు కేవలమ యశస్సును సంపాదించెను. త్రి
భువనచూడామణియగు సూర్యుఁడస్తమించినను సత్పథశత్రువైన
యంధకారము నడంచుటకు విధినియుక్తుఁడైన చంద్రుఁ డుదయిం
చును. శిక్షించుటకు సాధనమైన యంకుశము భగ్నమైనను వ్యా
ళవారణమును లొంగదీయుటకు సకలమత్తమాతంగకుంభస్థలవిదార
కంబగు సింహనిశాతనఖముండనే యున్నది. తేజోవంతములైన
రత్నములను నశింపఁజేయు ఖలులెవ్వరికి వధ్యులుఁగారు. ఆదుర్బుద్ధి
యిపుడెచ్చటికిఁ బోవఁగలఁడు" అని హర్షుఁ డిట్లు పలుకుచుండఁగా
నింతలోఁ బితృసఖుఁడు, యుద్ధమల్లుఁడు, హరితాళశైలావదాతదే
హుఁడు, సాలప్రాంశుఁడు, శౌర్యోష్మచేఁ బరిపక్వుఁడు, గతభూయి
ష్ఠమైన వయస్సులోనున్నవాఁడు, బహుశరశయనసుస్థితుఁడై
భీష్మునిహసించువానివలెనున్నవాఁడు, అతి దీర్ఘాయుష్యముఁగల
వాఁడు, దృఢశరీరి, యగుటచేతనుఁ బ్రకటితప్రాగల్భ్యముగలదియై
నను భయము నొందినట్లున్న ముసలితనముచే సమాలింగితుఁడైన
వాఁడు, అన్యప్రభుముఖదర్శనపాతకమునుఁ దొలగించుకొను కోరిక
చేతనువలెను శిథిలమై వ్రేలాడుచుండు చర్మముఁగల భ్రూయుగ
ముచేఁ గప్పఁబడిన దృష్టిఁగలవాఁడు, వ్రణకిణములచే విషమితవిశా
లవక్షస్స్థలుఁడు, నిశితశస్త్రఘాతబహుళవ్రణాంకురపంక్తిచే సమర
విజయగణనుఁ జేయువానివలెనున్నవాఁడు, నడిచివచ్చు నుద
యాద్రిపగిదిఁ బ్రకాశించువాఁడు, వివిధవీరరసవృత్తాంతములచే
మహాభారతమునుఁగూడ సరకుఁగొననివాఁడు, శత్రువిజయాతినిర్భం

ధముచేఁ బరశురామునిఁ గూడ శిక్షించువానివలె నున్నవాఁడు, అభ్రాంతితో ననాదరలక్ష్మీసమాకర్షణవిభ్రమముచే మందరాచలము నుపహసించువానివలె నున్నవాఁడు, వాహినీనాయకమర్యాదానువృత్తిచే సముద్రమునుఁ దిరస్కరించువానివలె నున్నవాఁడు, స్థైర్యకార్కశ్యోన్నతులచే నచలములకుఁ గూడ సిగ్గుఁ గలిగించువానివలె నున్నవాఁడు, సహజప్రచణ్డతేజస్స్ఫురణముచే నుష్ణకిరణునిసైతము తృణీకరించువానివలె నున్నవాఁడు, ఈశ్వరభారోద్వహనవృషపృష్ఠుఁడగుటచే హరవృషభము నుపహసించువాఁడు, అమర్షాగ్నికరణి, శౌర్యమున కైశ్వర్యము, మదమునకు మదము, జగీషుతకు జీవితము, ఉత్సాహమున కుచ్ఛ్వసితము, దుర్మదుల కంకుశము, వీరగోష్ఠులకుఁ కులగురువు, శస్త్రవిద్యలలోఁ బారదృశ్వ, మహాసంగ్రామముల మర్మమెఱింగినవాఁడు నైన సింహనాదుఁడను సేనాధిపతి దుందుభిఘోషగంభీరమగు కంఠధ్వనితో భటులకు యుద్ధోత్సాహమునుఁ బుట్టించుచు హర్షుని సాన్నిధ్యమం దిట్లు విన్నపంచెను. "దేవా! మలినమగు కోకిలముచే వంచింపఁబడు కాకములవలె హతలక్ష్మిచే మోసపుచ్చఁబడుచున్న ఖలులు తమ్ముఁదాము తెలుసుకొనఁజాలరు. సంపదయాంధ్యమునకుఁ గారణము జడబుద్ధులు ఛత్రచ్ఛాయాంతరితసూర్యులై యన్యతేజంబుల మరచిపోవుదురు. ఆ దీనఁ డేమిచేయును. పిరికివాఁడగుటచే సర్వాతిశాయి శౌర్యముఁగల మహాతేజోవంతుల కోపపాటలములగు ముఖముల నెన్నఁడుఁ జూచి యెఱుఁగఁడు. అభిచారహోమములవలె విప్రకృతులైన మానవంతులు సకలకులప్రళయమునుఁ గలుగజేయుదురను నంశమును నా దీనుఁ డెఱుగఁడు. సకలవీరగోష్ఠిబాహ్యుఁడైన యా గౌడరాజెన్నటికి దాటనేరని నరకమందుఁ బ్రవేశింపఁజేయు కర్మము నొనర్చెను. మనస్విజనులకు యుద్ధప్రధానసాధనమగు ధనస్సు, లక్ష్మికలహాంసకప్రీడకు గువలయమైన కృపాణమునను నీ రెండు సాధనము

లుండగా లక్ష్మీసముత్థాపనమునకుఁ బయోధిమథనము మొదలగునవి కూడఁ గృపణోపాయములు. లోకపరిత్రాణమందు బ్రహ్మచే నియోగింపఁబడిన కులగిరులు సైత మెవ్వరి కులిశకర్కశభుజపరిఘప్రహారణములచే లోహములనుఁ గ్రక్కుచున్నవో యట్టి బాహుశాలులు, విమలకీర్తికాయులు, మనస్వులైన నిట్టి యకార్యమును స్మరింతురా? సర్వగ్రహాభిభవముచేఁ బ్రకాశించు సుభటకరముల యెదుట సూర్యునికరములకించిత్కరములు. యమునికి మహామహిషశృంగభీషణాంతరాళంబగు దక్షిణదిశనివాసమని లోకప్రవాదమాత్రమేగాని వాస్తవముగాఁ బలికినచో సుభటభ్రుకుటియే యునికిపట్టు. యుద్ధములయందున్మత్తసింహనాదములుఁగల శూరులకు సాహావరసరోమాంచకంటకనికరముతో సటలు పైకి రావనుట చిత్రము. ప్రతిపక్షమును దహించు దారుణమగుఁ బడబానలము మహాపురుషుల హృదయమునను నీ రెండును చతుస్సాగరసంభూతమగు భూతిసంభారమునకు భాజనము వృథావితతమగు విపులఫణాభారముగల భుజంగాధిపతియు భోగముచేఁ గేవలమ్మృత్పిండమునే వహించుచున్నాఁడు. భూమియొక్క యప్రతిహతశాసనోపభోగరసమును దిక్కుంజరకరసదృశప్రకోష్ఠములుఁగల వీరుల బాహువులే యెఱుంగును. సూర్యునివలె నున్నమ్రముఖపద్మాకరగృహీతపాదపల్లవుఁడై యఖండితతేజస్కుఁడైన శూరుఁడు సుఖముగా దినములనుఁ గడుపుచుండును. చంద్రునివలె హరిణహృదయుఁడు లజ్జాహీనుఁడునైన పిరికివానిలక్ష్మి రెండుదినములై నిశ్చలముగా నెట్లుండును? లోకములో వ్యాపించు వీరరస మమిత యశస్సును వర్షించును. పౌరుషమార్గములు ముందుఁ బ్రసరించు ప్రతాపముచేఁ బ్రహతములగును. శౌర్యముయొక్క దిక్కులు శస్త్రలోకప్రకాశితములై శూన్యములగుచున్నవి. రిపురుధిరశీకరాసారముచే భూమివలె లక్ష్మియు ననురక్తయగుచున్నది. నరపతి కిరీటమణి శిలాశాణకషణముచేఁ బాదనఖరాజవలె రాజత్వముకూడ నుజ్జ్వల

మగును. నిరంతరశస్త్రాభ్యాసముచేఁ గరతలములవలె శత్రుముఖములుఁకూడ మలినములగును. బహువ్రణబంధపట్టశతములచే శరీరమువలె యశస్సుకూడఁ దెల్లనగును. కవచితములైన శత్రువక్షస్స్థలములయందుఁ బ్రయోగింపఁబడిన నిష్ఠురశస్త్రప్రహారము లగ్నిశిఖలనువలె లక్ష్మినిఁగూడఁ గ్రక్కుచున్నవి. శత్రువులచేఁ జంపబడిన స్వజనముఁగల యెవ్వఁడు శత్రువనితోరస్తాడనముచే హృదయదుఃఖమునుఁ దెలియఁజేయునో భయంకర.ఖడ్గలతానిపాతపవనముచే నూపిరి విడుచుచున్నాఁడో నిశ్వాసశూన్యశత్రుశరీరాశ్రుధారానిపాతముచే నేడ్చునో విపక్షవనితాశ్రువులచే జలము నిచ్చునో వాఁడే ప్రశంసనీయుఁడు. ఇతరుఁడు కాఁడు. జ్ఞానులు స్వప్నదృష్టనష్టములగు పదార్థములవలె క్షణికములగు శరీరములయందు బంధుబుద్ధిఁగలవారుకారు. వీరులకుఁ గల్పాంతస్థాయియైన కీర్తియందు శరీరబుద్ధి. కలుషమైన కజ్జలమలము నిరంతరభాస్వరస్వభావమగు మణిదీపమునువలె శోకము తేజస్వినంటదు. అట్టి నీవు సత్త్వవంతులలో నగ్రేసరుఁడవు. ప్రాజ్ఞులలో మొదటివాఁడవు. సమర్థులలోఁ నగ్రగామివి. అభిజాతులలోఁ బ్రథమగణ్యుఁడవు. తేజోవంతులలో శ్రేష్ఠతముఁడవు. సతతసన్నిహితధూమాయమానాగ్నులు, సులభాసిధారాజలతృప్తములు, బాహువనచ్ఛాయోపగూఢములు నగు సుభటుల యురశ్శికవాటభిత్తులు నీయధీనములై యున్నవి. ఒక గౌడాధిపుఁడే కాదు. భూమిలో నన్యుఁడెవ్వఁడుఁ నిట్టిపనిని మరలఁ జేయకుండఁ జేయుము. అలీకవిజిగీషువులైన రాజుల చామరముల నంతఃపురపురంధ్రినిశ్వసితములచేఁ జలింపఁజేయుము. నీశత్రువులు ఛత్రచ్ఛాయాభిలాషనుమాని మాంసప్రాసక్తగృధ్రమండలపక్షచ్ఛాయావృతులగునట్లు చేయుము. నిశితశరశిరావేధములచే నకార్యశౌర్యమనెడు శ్వయథురోగమును శమింపఁజేయుము.

ఏమార్గము నవలంబించి మీతండ్రి, మీతాత, మీముత్తాతయు

జనిరో త్రిభువనస్పృహణీయమైన యట్టిమార్గమును విడువకుము. కాపురుషోచితమైన శోకమును విడిచి కులక్రమాగతమైన రాజలక్ష్మిని జేకొనుము. దేవా! భూకాంతుఁడు దేవత్వము నొంద రాజ్యవర్ధనుఁడు దుష్టగౌడాధిపహృతజీవితుఁడుకాఁగా నిట్టి మహాప్రళయమందు ధరణీరాజ్యభరణముకొఱకిపుఁడు నీవొక్కఁడవే శేషించితివి. అశరణ్యులైన ప్రజల నోదార్పుము. శరద్భాస్కరుని వలె రాజుల శిరస్సులందు లలాటంతపములైన పాదములనుంచుము. నూతనసేవాదీక్షాదుఃఖసంతప్తులగు వైరినృపతుల చూడామణి చక్రవాళ బాలాతపములచేఁ జిత్రవర్ణమయ పాదుఁడవుకమ్ము. కార్తవీర్య పుత్రులచే నేకాకియైన తండ్రి వధింపఁబడగా వనమృగములతోఁ గూడ సంవర్ధితుఁడు సహజబ్రాహ్మణ్యమార్దవసుకుమారమనస్కుఁడు, కృతనిశ్చయుఁడు నగు పరశురాముఁడు గుంజజ్జ్యాశబ్దజనితజగజ్జ్వరము, చాపటంకారనాదనిర్మదీకృతదిగ్గజమునగు క్షత్రసమాహాముఁనంతయు ముయ్యేఁడుమారులు చెండాడెను. నైసర్గికకాయ కార్కశ్యము, కులిశాయమానమానసముఁగలిగి మానవంతులలో మూర్ధన్యుఁడవైన నీవిషయమై చెప్పనేల? కావున నిప్పుఁడే కృతప్రతిజ్ఞుండవై గౌడాధమ జీవితధ్వంసముకొఱ కకాండ దండయాత్రాచిహ్నమగు ధనుస్సునుఁ జేకొనుము. పరిభవాగ్నిసంతప్యమానదేహుఁడవైన నీదుఃఖదాహజ్వరమరాతి రక్తచందనచర్చాశిశిరోపచారము లేకుండ శమింపదు. రైణుకేయుఁడుకూడ నుద్దామమన్యుశిఖిశిఖాసంతాపశాంతికొఱకు సుఖస్పర్శశీతలములైన క్షత్త్రియశోణితహ్రదంబులయందు స్నానముచేసెనని" పలికి విరమించెను.

హర్షదేవుఁ డామాటలు విని "మాన్యుఁడవైన నీవవశ్య కర్తవ్యమైన పనినే యుపదేశించితివి. ఇంకొకరీతిగా భూమిని మోయుచున్న భోగినాథునియందుఁగూడ నీర్ష్యగలఁ నాభుజమునకు శత్రుబుద్ధియే. ఇట్టియుపద్రవము రాకపోయిన నంతరిక్షముపై సంచ

రించు గ్రహగణమందుఁగూడ నాభ్రూలత నిగ్రహముకొఱకు చలించు చున్నది. ఒంగని శైలములయందుఁగూడ కచమాక్రమించుటకు నాహస్త మభిలషించుచున్నది. తేజోదుర్విదగ్ధములగు సూర్యకరములచేఁగూడఁ జామరము వేయించుకొనుటకు నాహృదయము కోరుచున్నది. రాజ శబ్దముఁగలవియగుటచే మృగరాజముల శిరస్సులను పాదపీఠముగాఁ జేసికొనుటకు నాపాదము మనోరథించుచున్నది. స్వేచ్ఛగా లోక పాలకు లేలుచున్న దిక్కులను నాకిచ్చివేయుఁడని యాజ్ఞాపించుటకు నాయధరము కదలుచున్నది. ఇట్లు సంభవించిన మహాపద్రవముచే మనంబు క్రోధపూర్ణంబై యుండ శోకమున కవకాశమే లేదు. హృదయశల్యసదృశుఁడు, మూర్ఖుఁడు, జగన్నిందితుఁడు నగు గౌడాధిపచండాలుఁడు జీవించియుండగా శుష్కాధరపుటుఁ డనై నపుంసకునివలె నశక్తుని పగిది వ్యర్థముగా శోకించుటకు లజ్జించుచున్నాను. శత్రువుని బలాబలములు పరీక్షింపక యూరక యశ్రుమోక్షముఁజేయు కన్నులుఁగల నాకరయుగళమునకు జలాంజలిదాన మెట్లు? గౌడాధముచితాధూమమునుఁ గంటితోఁ జూడకుండ నెట్లు కన్నీరొలుకును? నాప్రతిజ్ఞను వినుఁడు. మాయన్నగారి పాద పాంసువులనుఁ బట్టుకొని ప్రమాణముఁ జేయుచున్నాను. కొలది దినములలో భూమిపైని గౌడరాజాంకురము లేకుండఁ జేయనేని పతంగమువలె వహ్నియందుఁబడి ప్రాణములనుఁ బరిత్యజించెదను.''
అని పలికి దగ్గిరనున్న మహాసంధివిగ్రహాధికారియైన అవంతికుఁడను వానితో నీనుహాపృథివియందున్న సకలరాజన్యులు కరదానము కొఱకు మీచేతులను సిద్ధముచేయుఁడు. దిక్కులనుగాని చామరములనుగాని గ్రహింపుఁడు. శిరస్సులనుగాని ధనుస్సులనుగాని వంచుఁడు. ఆజ్ఞనుగాని మౌర్వినిగాని కర్ణపూరముగాఁ జేయుఁడు. శిరస్త్రములుగాని పాదరజస్సులుగాని శిరోభూషణములవునుగాక. చేమోడ్పులనుగాని గజఘటలనుగాని కూర్పుఁడు. భూములనుగాని బాణములనుగాని విడువుఁడు. కుంతములనుగాని వేత్రయష్టులను

గాని పూనుఁడు మీ ప్రతిబింబములను నా చరణములయందుఁగాని, కృపాణములయందుఁగాని ప్రతిఫలింపఁజేయుఁడు. ఇదిగో నేను వచ్చిపడితిని. సకలనరపతిమకుటమణిపుంజములయందు నా పాదరజస్సును వ్యాపింపఁజేసినఁగాని నాకుఁ జిత్తశాంతి కలుగదని రాజులకందరికి వ్రాయుమని యాజ్ఞాపించెను. ఇట్లు కృతనిశ్చయుఁడై హర్షుఁడు సకలరాజలోకమునకు సెలవిచ్చి పంపి యాస్థానమునుండి లేచి స్నానాకాంక్షియై యభ్యంతరంబునకుఁ జనియె. హర్షుని ప్రతిజ్ఞను విన్న త్రిభువనము యొక్క దర్పప్రసరమునకు నౌష్ణ్యముతోఁ గూడిన దివసము గళితమయ్యెను. నిజాధికారాపహరణభీతునివలె నహిమకరుఁ డెచ్చటికో చన విరతమధురధ్వనులుగల పంకజవనములు భయమునుండివలె సంకోచింప, పక్షిగణములు పక్షవిక్షేపధ్వనులనుమాని నిశ్చలములై యుండ హర్షకృతప్రతిజ్ఞను వలె భువనవ్యాపినియైన సంధ్యను సకలజనులు ఘటితాంజలులై, నతశిరస్కులై పూజింప, స్వపదభ్రంశమువలన భయపడిన దిక్పాలకులచే నిర్మింపఁబడిన లోహప్రాకారవలయమువలె నున్న తిమిరసమూహముచే దిక్కులు కప్పఁబడగా, హర్షుఁడు ప్రదోషాస్థానమందు కొంతసేపుండెను. అంత నమన్నృపతి లోకలోలాంశుకపవనకంపితశిఖలుఁగల దీపికాచక్రవాళములచేఁగూడ నమస్కరింపఁబడుచున్నవానివలె సేవకజనుల నిండ్లకుఁ బంపివేసి ప్రతిషిద్ధపరిజనప్రవేశుండై శయనగృహమునకుఁ బ్రవేశించెను. అప్పుడు లబ్ధావకాశమైన భ్రాతృశోక మొంటరిగా శయనించియున్న యాతనిలోఁ బ్రవేశించెను. కనులు మూయగాఁ బ్రతికియున్నవానివలె నగ్రజుఁడు కనఁబడెను. భ్రాతృజీవితము నన్వేషించుచున్నవానివలె శ్వాసము లూర్ధ్వముగాఁ బ్రసరించెను. ధవళాంశుకమువలె నిర్మలమగు నశ్రుజలపూరముచే నాచ్ఛాదితముఖుఁడై నిశ్శబ్దముగా చాలసేపేడ్చెను. అట్టి యాకృతి కిట్టి పరిణామ మెట్లు గలిగియున్నదని మనస్సులో ననుకొనెను. పర్వతముకంటెఁ దజ్జన్యలోహ

ధాతువు కఠినతరమైయున్నట్లు కర్కశకాయబాధనుఁగల మాతండ్రి
కంటె మాయన్న కర్కశతరకాయుఁడై యుండెడివాఁడు. అట్టి
మహానుభావుని వియోగమందుఁగూడ నాహతహృదయముసోచ్ఛ్వా
సమైయుండుట యుక్తమా? ఆతనియందు నాకున్నప్రీతియు భక్తియు
ననువృత్తియు నిదియేనా?. మాయన్న మృతినొందగా నేను జీవించి
యుందునని బాలిశుఁడైన తలంచునా? అట్టి మాయిద్దరియొక్క
మిపుడెచ్చటికిఁ బోయెనో? అప్రియత్నముగా హతవిధి సన్నాతని
నుండి యెడఁబాపెను. కనికరములేక రోషాంతరితశోకముఁగల
నేనాతనికొఱకు ముక్తకంఠముగాఁ జిరకాల మేడువనైనలేదు. సర్వ
విధముల చేతనుల ప్రీతులు సాలెపట్టుదారములవలెఁ దెగిపోవు స్వ
భావములుగలవి. బంధుత్వము లోకయాత్రామాత్రనిబంధనము
ఏలయన నేను సైతమట్టి మాయన్న స్వర్గస్థుఁడుకాగాఁ బైవాని
వలె స్వస్థుఁడనై యుంటిని. పరస్పరప్రీతిబంధముచే సుఖితహృద
యముఁగల మా భ్రాతృయుగళమును విడఁదీసినదైవహతకుఁడేమి
ఫలము నొందెను? చంద్రునివలె జగదాహ్లాదకరములైన మాయన్న
గుణములుచితాగ్నులవలె నన్ను దహించుచున్నవి. అని యిట్ల
నేకవిధముల హర్షుఁడు తన మనంబులో విలపించెను. రాత్రి
తెల్లవారగాఁ బ్రాతఃకాలమందు గజసైన్యాధికారియైన స్కంధగు
ప్తుని రమ్మని ప్రతీహారున కాజ్ఞాపించెను.

ససంభ్రమప్రధావిత బహుపురుషాహూయమానుఁడు, వా
హనము వచ్చువరకు నిరీక్షింపక స్వమందిరమునుండి పదాతియై
వచ్చుచున్నవాఁడు, తొందరగా వేత్రహస్తులు బరాబరులు సేయఁ
బ్రతిదిక్కునందుఁ బ్రణమించుచున్న గజవైద్యులను రాత్రి వార్తల
నడుగుచున్నవాఁడు, ఉన్నతఘోణుఁడు, శత్రుపక్షపరిక్షయముచేఁ
బరిత్యక్తకార్ముకవ్యాపారముఁ గలవాఁడైనను సకలదిగంతముల
యందు శౌర్యమాణగురుగుణధ్వనిగలవాఁడు, ఆత్మస్థసకలమత్త

మాతంగసాధనుఁడైనను మదరహితుఁడు: భూతిమయుఁడయ్యును స్నేహమయుఁడు, పార్థివుఁడైనను గుణమయుఁడు, ఏకభర్తృభక్తి నిశ్చలయగు కులాంగనవలె ననన్యగమ్యమైన స్వామిప్రసాదభూమి నధిరోహించినవాఁడు, విదగ్ధులకు నిర్వ్యాజబంధువు, తన్ను భజించు వారికభృత్యభృత్యుఁడు, విద్వాంసులకక్రీతదాసుఁడునై శోభిల్లు స్కంధగుప్తుఁడు రాజకులమునఁ బ్రవేశించెను. దూరమునందుండియే కరయుగళస్పృష్టమహీతలమును దశకిరీటముచే స్పృశించుచు నమస్కరించెను.

సమీపోపవిష్టుఁడైన యాతనిఁ జూచి హర్షుఁడు "మా యగ్రజన్మునికి సంభవించిన దుర్మరణమును నాచేయఁబూనినపనిని సవిస్తరముగా వింటివా? కావున మేతఁబెట్టించి గజసైన్యములను శీఘ్రముగా నాయితముసేయుము. ఆర్యపరిభవపీడాపావకమత్యల్పమైన విలంబమునుఁగూడ సహింపదు" అని పలికెను. అపుడిట్లు ప్రభుసమాదిష్టుఁడైన యాస్కంధగుప్తుఁడు "స్వామిభక్తిచేఁ గొంచెము విన్నవించుకొనుచున్నాను. దేవర ఆకర్ణింపవలయును. పుష్పభూతివంశమునకు, సహజతేజస్సునకు, దిక్కరిశుండాదండసదృశబాహుయుగళమునకు, అసాధారణసోదరస్నేహమునకుఁ దగినట్లుగా నేలికచే నుపక్రమింపఁబడినది. క్షుద్రజంతువులైన భుజంగములు సైతము పరులొనర్చు నికారమును సహింపవు. తేజోరాశులైన తమ బోంట్ల విషయమై చెప్పెడిదేమి? మీ యన్నగారి వృత్తాంతములోనే ప్రభువువారు కొంతమట్టుకు దుర్జనచారాత్మ్యమునుఁ గనిపెట్టియున్నారు. లోకస్వభావము లిట్టివి. ప్రతిగ్రామమందుఁ బ్రతిపట్టణమందుఁ బ్రతిదేశమందుఁ బ్రతిద్వీపమందుఁ బ్రతిదిక్కునందు మనుష్యుల వేషములు, ఆకారములు, ఆహారములు, వ్యవహారములు, భిన్నభిన్నముగా నుండును. కావున నాత్మదేశాచారమున కుచితమైనదియు, స్వభావసరళహృదయమువలనఁ గలుగు

నతియు నైన నమ్మకమునకు వినవలెను. ఇట్టి ప్రమాదదోషాభి భవముల వృత్తాంతమును దేవరవారు ప్రతిదినము వినుచున్నారు. తొల్లి పద్మావతీనగరమందు నాగవంశోత్పన్నుఁడైన నాగసేనుఁడను రాజధర్మరాజ్యమును హరించిన మంత్రినిఁ దొలగించుటకు శారికా సమక్షమందు మంత్రమునుఁ జేయఁగా నా పక్షివలన నామంత్రమునుఁ దెలుసుకొని యా మంత్రి యా నృపాలుని విస్రంభపూర్వకముగా వధించెను. శ్రావస్తీనగరమందుఁ జిలుకవలన రాజరహస్యము నెఱింగినవారై మంత్రులు శ్రుతవర్మయను రాజును రాజ్యపదభ్రష్టునిఁ గావించిరి. కాబట్టి రాజు గూఢ మంత్రుఁడై యుండవలెను. మృత్తికావతీపురమందు స్వర్ణచూడుడను నొక రాజు మఱియొకనినిఁ బట్టుకొనవలెనని రహస్యముగా నాలోచించుచుండగా నయ్యాలోచన మెట్లనో పైకిఁ దెలియగా నిద్రించుచున్న యారాజును విశ్వస్తుఁడైన శిరోరక్షకుఁడు వధించెను. కులస్వభావాదులనుఁ బరీక్షింపక యెవ్వనిని భృత్యునిగాఁ జేయవలదని యిందువలన గ్రహింపవలెను. ఒకకాలమందు యవనేశ్వరు నొక శత్రువ్రుఁడు చంపఁదలంచియున్నాడని నానివాతువ్రుఁడు చామరగ్రాహిణివలన లేఖనుఁబంపి యీ లేఖను నీవు స్వయముగాఁ జదువుకొనవలయునని పైనివ్రాసెను. కిరీటమణులయందుఁ బ్రతిబింబించిన యాలేఖాక్షరముల నా చామరగ్రాహిణి చదువుకొని స్వప్రభువునకుఁ దెలియఁజేసి వాని యాజ్ఞచేయు యవనేశ్వరునిఁ దెగటార్చెను. లోభముఁగలవాఁడై కృష్ణపక్షనిశీథమందు నిధినిఁద్రవ్వుచున్న మధురేశుఁడైన బృహద్రథుని విదూరథసైన్యము సంహరించెను. ఉజ్జయినీ నరనాథుడగు మహాసేనుఁడు తనకుమార్తెయగు వాసవదత్తను వత్సరాజున కొసంగఁదలంచి మనుష్యగర్భమగు కృత్రిమగజమును నిర్మించి వింధ్యారణ్యమందు సంచరింపఁ జేయుచుండ గజగ్రహణలోలుఁడైన వత్సరాజది సత్యగజమని భ్రాంతినొంది దానినిఁ బట్టుటకు దగ్గిరకుఁబోవ దానిలోనుండి మనుష్యులు పైకివచ్చి యాతనినిఁ

బట్టుకొనిరి. లాస్యదర్శనప్రీతిచే శైలూషమధ్యమందుండి లాస్యమునుఁ జూచుచున్న అగ్నిమిత్రతనూభవుఁడైన సుమిత్రుని శిరస్సును మిత్రదేవుఁడు మృణాళమునువలె ఖడ్గముచేఁ దుంచివైచెను. వీణావాదనశ్రవణాభిలాషముగల యశ్మకేశ్వరుఁడైన శరభుఁడనువాని శిరస్సును సంగీతవిద్యార్థులవేషములనుధరించి శత్రువులువీణాలాబుసుషిరాభ్యంతర గుప్తనిస్త్రింశముచే ఖండించివేసిరి. అనార్యుఁడైన పుష్పమిత్రుఁడు సేనాధిపతిగానుండియు మౌర్యవంశస్థుఁడైన బృహద్రథుని సేనామధ్యమందుఁ గెడపెను. చండీపతి నియవను లంతరిక్షసంచారముఁగల యంత్రయానముచే నెచటికో కొనిపోయి గూఢముగాఁ బరిమార్చిరి. కాకవర్ణుఁడు శైశునాగియు నగరోపకంఠమందు నిహతులైరి. అతి స్త్రీలంపటుఁడగు శుంగుని వసుదేవుఁడను మంత్రి దేవీవేషధారిణియగు దేవభూతిదాసీపుత్రికచే వీతజీవితునిఁ జేయించెను. అసురవివరవ్యసనియగు మగధరాజును మేకలాధిప మంత్రులు పరిమితరమణీమణినూపురఝణత్కార రమణీయమగు గోధనగిరి సురంగముద్వారా స్వదేశమునకుఁ గొనిపోయిరి. మహాకాళోత్సవమందుఁ దాళజంఘుఁడను వేతాళుఁడు ప్రద్యోతుని కనిష్ఠపుత్రుఁడైన కుమారసేనునిఁ దునిమెను. వైద్యులమను మిషతోఁ బోయి శత్రువులు బహుపురుషశ్లాఘ్యములైన యౌషధములఁ గనపర్చి విదేహరాజపుత్రుఁడైన గణపతికి క్షయరోగమునుఁ బుట్టించిరి. స్త్రీలయందు విశ్వాసముఁగల కళింగదేశాధీశ్వరుఁడగు భద్రసేనని వానిసోదరుడగు వీరసేనుఁడు మహాదేవీ గృహభిత్తి వెనుక దాగియుండి ఖడ్గముచే నణుముసేసె. పట్టాభిషేకమునకు సిద్ధముగానున్న కరూశాధిపతియగు దధ్రుని తనయు నింకొక కుమారుఁడు తల్లిపర్యంకముక్రింద దూఁరియుండి విగతాసువునిఁ జేసెను. శూద్రకుని దూత సచివునితోఁ గూడిన చంద్రకేతువును సమయించెను. మృగయాసక్తుఁడై యరణ్యమందొంటరిగా గుమ్మరుచున్న చాముండీనగరాధిపతియగు పుష్కరుని గుల్మాంతరితులై చంపాధి

పతి సైనికులు చంపిరి. వాదులయందుఁ బ్రీతిఁగల మౌఖరివంశస్థుఁ డైన క్షత్రవర్మను జయశబ్దముఖరముఖులైన మంఖులు పరప్రయుక్తులై సమయించిరి. శత్రుపురమందుఁ బరకళత్రాసక్తుఁడై తిరుగుచున్న శకపతిని స్త్రీవేషనిగూఢుఁడైన చంద్రగుప్తుఁడు వధించెను.

ప్రమత్తుల విషయమై ప్రమదాజనకృతప్రమాదము లనేకము లేల్లిక వినియేయున్నారు. సుప్రభ యనునది తనపుత్రునికి రాజ్యమిప్పించుటకొఱకు మద్యపానమోహితుఁడైన కాశీరాజును విషలిప్తమైన పేలాల నిచ్చి చంపెను. తాను కామపరవశయై యున్నట్లభినయించి రత్నవతి అయోధ్యాధిపతియైన పరంతపునిక్షురధారానిశితమైన దర్పణముచేతను, దేవరాసురక్తయగు దేవకి సుహ్మదేశాధిపతియగు దేవసేనుని విషచూర్ణమిశ్రితమకరందముఁ గల నల్లఁగలువపువ్వుచేతను, సవతులయందున్న కోపమువలన భార్య, రంతిదేవుని అభిచారయోగచూర్ణమును వర్షించు మణినూపురముచేతను, బిందుమతి విదూరథునిఁ గొప్పులో దాచిన కత్తి చేతను, భార్యయైన హంసవతి సౌవీరదేశాధీశ్వరుఁడైన వీరసేనుని విషరసదిగ్ధమైన మేకలామధ్యమణిచేతను, పౌరవి, పౌరవేశ్వరుఁడైన సోమకుని విషవారుణీగండూషదానముచేతను, దెగటార్చిరి." అనిపతికి స్కంధగుప్తుఁడు స్వామ్యదేశనిర్వాహణముకొఱకుఁ బైకి వెడలెను.

అంత హర్షదేవుఁడు స్వరాజ్యమందుఁ గొన్ని కట్టుబాటుల నేర్పరిచి దిగ్విజయమునకుఁ బ్రస్థానము నాజ్ఞాపింపగా గతాయువులగు సామంతరాజుల గృహములయందు నానావిధములైన దుర్నిమిత్తములావిర్భవించెను. ఎట్లనగా; కాలకింకరదృష్టులవలె కృష్ణసారసమూహము లిటు నటు సంచరించినవి. ప్రచలితలక్ష్మీమణినూపురప్రణాదసదృశములైన సరఘాసంఘాతఝాంకారము లెల్లెడల విజృంభించెను. వివృతవదనకుహరోద్వాంత వహ్నికణములుఁగల సృగాలసందోహములు పగటివేళయందే యమంగళముగా నరవఁ

దోడఁగె. శవమాంసగ్రసనలాలసములవలె మర్కటశిశుకపోల కపిలపక్షములుఁగల గృధ్రచక్రములు వీధులలోఁ దిరుగఁజొచ్చెను. ఉపవనతరువులన్నియు నొక్కమారు కృతసంకేతములవలె నకాల కుసుమములఁ బూసెను. సభలయందున్న సాలభంజికలు కరతల ములచే రొమ్ములఁగొట్టుకొనుచు నేడువసాగెను. యోధులాదర్శ ములయందు దమ్ములను శిరోవిహీనులనుగాఁ జూచిరి. రాజమహి షుల చూడామణులయందు శంఖచక్రచిహ్నితములైన పాదన్యాసము లగుపడెను. చేటీహస్తపల్లవములనుండి చామరములుఁ జారి నేలఁ బడెను. గజకపోలములయందుఁ దుమ్మెదల మధుమదిరాపానగో ష్ఠులు విరమించెను. యమమహిషగంధము నాఘ్రాణించినదానివలె నశ్వములు నూతనఘాసమును భక్షించుట మానినవి. భవన మయూరములు చలవలయావళీవాచాలబాలికాతాళికాతోద్వేలాలి తములయ్యును నాట్యము చేయలేదు. రాత్రులయందు నిశాకర హరిణనిహితదృష్టిఁగలదానివలె ముఖమెత్తి నిర్నిమిత్తముగా వేట కుక్కల గుంపరవసాగెను. గతాయువులనుఁ దర్జనిచే లెక్కబెట్టు చున్నదానివలె దిగంబరయైన స్త్రీ పగలుతయు గ్రామములయందుఁ దిరిగెను. కుట్టిమములయందు బాలతృణములు పుట్టెను. భటస్త్రీల ముఖములు జడగట్టిన శిరోజములుఁ గలవిగాను, కజ్జలహీనములు గాను సురాపూర్ణపానపాత్రలయందుఁ బ్రతిబింబించెను. సమాప న్నాత్మాపహారణభయముచేవలె భూమికంపించెను. శూరుల శరీర ములయందుఁ బడిన వికసితబంధూకకుసుమకాంతులుఁగల రక్తవర్ష ములు వధ్యాలంకారరక్తచందనచర్చలవలెఁ గన్పట్టెను. నశించుపోవు సంపదకుఁ బర్యగ్నికరణముచేయువానివలెఁ బ్రజ్వలించుచు నుల్కలంత రిక్షమునుండి నిరంతరముగాఁ బడెను. ప్రతీహారివలెఁ జామరాతపత్రవ్య జనముల నపహరించుచున్నదియై పరుషమైన సుడిగాలి వీచెను.

రాజప్రతిజ్ఞావర్ణనమను షష్ఠోచ్ఛ్వాసము,

ముగిసెను.

# ఆంధ్ర హర్ష చరిత్రము.

## సప్తమోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ ప్రీతిఁ బూనిన హంవీరసితకరునకు।
వసుధ యంగనవేదిక వార్ధికుల్య।
తలపఁ బాతాళమంతయు సలతనొంకుఁ।
నగును వల్మీకసదృశమా హాటకాద్రి॥

తే॥ గీ॥ ఆత్తబాణాసనుండైన యమితబాహు।
బలసనాథునికద్రిలు ప్రణతిసేయ।
నగునె యాశ్చర్య మెవ్వరికైన మదిని।
గణనయే పాటి క్షుద్రాద్రిగణములందు॥

అంతఁ గొన్ని దినంబులైన పిదప శరత్కాలమేఘములవలె సలిలత్యాగసమర్థంబులైన రజతహేమమయకుంభములచే స్నానముచేసి పరమభక్తియుక్తుండై శివునిఁ బూజించి ప్రదక్షిణశిఖాకలాపంబై యుద్గతజ్వాలలుఁగల వహ్నియందు హోమము మొనర్చి రత్నఖచితములైన రజతహేమమయతిలపాత్రలను కనకపత్రలతాలంకృతంబులగు శఫశృంగంబులుఁగల ధేనువులను వేలకొలది బ్రాహ్మణోత్తములకు దానమిచ్చెను. వ్యాఘ్రచర్మాస్తీర్ణంబగు భద్రాసనమందు పవిష్టుండై నిజయశోధవళంబగు చందనమును మొదట నాయుధమునకుఁ బూసి తానుఁ బూసికొని రాజహంసమిథునచిహ్నితంబైన దుకూలవాసోయుగళంబు ధరించి పరమేశ్వరచిహ్నంబైన చంద్రికవలెనున్న సితకుసుమమాలికను శిరంబునదాల్చి, కర్ణాభరణమరకతకాంతివలె నున్న నూతనదూర్వాపల్లవమునుఁ గర్ణావతంసముగాఁ జేసికొని శాసనవలయముతోఁగూడ గమనమంగళప్రతిసరమునుఁ బ్రకోష్ఠమందుంచుకొని, పూజాప్రహృష్టుండైన

పురోహితుఁడు శాంత్యుదకమును శిరస్సుపైఁ బ్రోక్షింప, దిగ్వ్యాప్త రత్నకాంతులుఁగల మహాహారములైన భూషణములను రాజులకుఁ బంపి, దీనులైన కులపుత్రికసమూహమునకు నానాదానంబుల నొసంగి, కారానిబద్ధులను విడిపించి, పలుమారు స్ఫురించుచున్న దక్షిణభుజము నష్టాదశద్వీపవిజయాధికారమందు నియోగించి, నేను నేనని ముందు పరుగిడు సేవకులవలెనున్న శుభశకునములచే వర్ధిత గమనోత్సాహుండై, ప్రముదితప్రజాఘుష్యమాణజయశబ్దకోలాహలముతో బ్రహ్మాండమునుండి హిరణ్యగర్భునివలె హర్షుఁడు స్వభవనమునుండి వెడలెను. రాజధానికి సమీపమందున్న సరస్వతీనదీతీరమందుఁ దృణనిర్మితము, వేదికానిహితహేమకలశంబు, ధవళధ్వజవిభూషితంబు, బద్ధపుష్పదామంబు, బ్రాహ్మణశ్రుతిపాఠముఖరితంబు, నగు మందిరమందు నివసించెను. హర్షుఁడచ్చట నుండఁగా గ్రామాక్షపటలికుఁడు (Record Keeper) కరణి, (Sub-registrar) పరికరములతో వచ్చి "అవ్యాహతశాసనులైన దేవర వారీదినమందిచ్చటనే యుండి శాసనములఁ గటాక్షింపుఁడని విన్నవించి నూతనముగా రచింపఁబడినది, వృషభాంకము, స్వర్ణమయమునగు నొక ముద్రను సమర్పించిరి. దానిని హర్షుఁడు తీసికొని మొదట నొక మృత్పిండముపై నుంచుచుండగాఁ జేతిలోనుండి జారి యది భూమిపైఁబడెను. కొంచమెండిన పంకముతోఁ గలిసిన మెత్తని మన్నుగల సరస్వతీతీరధరను ముద్రాక్షరపంక్తులు స్పష్టముగాఁ గానవచ్చెను. అట్లా ముద్రిక రాజుచేతినుండి జారి నేలఁ బడుట యమంగళమని శంకించుచుఁ బరిజనము విషాదమునొందె హర్షుఁడు "అవిదగ్ధుల బుద్ధులు తత్త్వమునుఁ గ్రహింపనేరవు. ఏలయన; నీకీభూమండలమంతయు నేకశాసనముద్రాంకితము కాగలదని యీశకునముచే నివేదింపబడినను మందబుద్ధులగు నీగ్రామ్యులన్యథాగ్రహించిరి" అని తనమనస్సులో ననుకొనెను. ఇది గొప్ప శుభశకునమని హర్షుఁడు మనస్సులో సంతసిల్లి వేయి హల

ములచే దున్నఁబడు క్షేత్రములుగల నూరుగ్రామములను ద్విజులకు దానమొసంగి యా దివస మచ్చటనే గడిపెను. రాత్రి సర్వరాజలోకమును సమ్మానించి నిద్రించెను.

అంత సకల ప్రాణిసంచయము నిద్రించియుండుటచే నిశ్శబ్దమైన రాత్రి తృతీయయామము గతింపఁగా దిక్కుం జరకంఠబృంహిత సదృశధ్వనిగల ప్రయాణపటహము వాయింపఁబడెను. సైన్యము నడవవలసిన దూర మెనిమిది కోసులున్నదని తెలియఁజేయుటకుఁ బ్రయాణభేరిమీద నెనిమిదిదెబ్బలు గట్టిగాఁ గొట్టఁబడెను. పటహములు, దుందుభులు, కాహళములు ధ్వనింపఁగా, సేనాకలకలము క్రమముగా వృద్ధినొంద, అధికారులు పరిజనమును లేపుచుండ, జనులు వెలిగింపుచున్న కొరువుల వెలుగుచే నశించు చీఁకటికలది, నిద్రలేచిన హస్తిపకులు విడుచుచున్న శయ్యాగృహములతోఁ గూడినది, రజోభరాక్రాన్తదశదిశంబు నగు ప్రయాణసమయమందు నానాదిక్కులనుండి యసంఖ్యాకులైన రాజులు వచ్చి రాజమందిర ద్వారమందు నిల్చిరి. సూర్యోదయముకాగా రాజదర్శనోచిత సమయమును దెలుపు సంజ్ఞాశంఖము పలుమారూదఁబడెను. అపుడు ప్రథమప్రయాణసమయమందే గమనవిలోలకర్ణతాళవిలాసములచే దిగ్విజయముకొఱకు దిగ్గజసమాగమమునుఁ జేయుచున్నదానివలె నున్న కరేణుకనారోహించి పద్మరాగమణిఖచితమగుటచే సూర్య దర్శనకోపమువలన నెఱ్ఱఁబడినట్లున్న మంగళాతపత్రమును ఛత్రగ్రాహిపట్టగా, మృణాళసూత్రకోమలతంతునిర్మితంబు, క్షీరోదఫేనధవళంబునగు నంబరంబు ధరించినవాఁడు, త్రిభువనవశీకరణచూర్ణమువలెనున్న కర్ణపూరకుసుమమంజరీ రజస్సుచే దిక్కులనుఁ బూయుచున్నవాఁడు, చూడామణి ప్రతిబింబితుఁడైన సూర్యునిఁ దన తేజస్సుచేఁ గబళించువాఁడు, కంఠహారమణిమరీచిసమూహములను చామరములనువలె దిక్కులను గ్రహింపఁజేయువాఁడు, సామంత

రాజులనుఁ జూచుటలోఁ బైకెత్తఁబడిన దీర్ఘమగు భ్రూలతచేఁ ద్రిభువనములను కరదానముకొఱకు నాజ్ఞాపించువానివలెనున్నవాఁడు, సకల క్షీరాబ్ధిమాధుర్యమునుఁ దీసికొని పైకివచ్చిన లక్ష్మిచే నాలింగితుఁడు కుతూహలోత్ఫుల్లలోకలోచనములచే నమృతమయునివలెఁ బానము చేయఁబడుచున్నవాఁడు, అమరపతివలె నగ్రజవధకళంకప్రక్షాళనోద్యతుఁడు, పృథుచక్రవర్తివలెఁ బృథివీపరిశోధనార్థమై సముత్సారిత సకలభూభృత్సమూహుండు, జయశబ్దము నుచ్చరించుచు ముందు నడుచువారు, వాయువునకుఁగూడ వినయమును శిక్షించువారు, చరణోద్ధూతధూళిపటలావృతములగు సూర్యకిరణములనుఁగూడ నుత్సారణము సేయువారు, నసంఖ్యాకులునగు దండధరులచే నుత్సార్యమాణజనసమూహుండై హర్షుఁడు బయలు దేరెను.

అంత వినయనమితశరీరములు, భయచకితమనంబులు చలనశిథిలమణిమకుటకాంతిరుచిరశిరస్సులు, కుసుమశేఖరరజస్సులుగల రాజసమూహము లొక్కచోఁ గలియఁగా వారికిరీటకాంతులు సమ్మిళితములై శుభశకునసంపాదనకొఱకుఁ బాలపిట్టలగుంపులవలెఁ బ్రకాశించినవి. నిండు చూపులచేతను, అర్ధస్మితములచేతను, పరిహాసములచేతను, విదగ్ధాలాపములచేతను, కుశలప్రశ్నలచేతను, ప్రణతిప్రణామములచేతను, ఆజ్ఞాదానములచేతను, ప్రణయప్రదానములచేతను వీరుల ప్రాణములను గొనుచున్నవానివలె యథానురూపముగా రాజలోకమును విభజించెను.

అంత రాజు బయలుదేరగా సేనా కలకలధ్వనిచే భయపడిన దిగ్గజముల ఘీంకారములవలె గంభీరమైన తూర్యనాద ప్రతిధ్వని దిగంతములయందు వ్యాపించెను. దిగ్గజములపైఁ గోపించిన సేనాగజముల మదధారలు కాళిందీ జలప్రవాహసహస్రములవలె

ప్రవించెను. సిందూరపరాగముచే నెఱ్ఱఁబడిన సూర్యబింబమునుఁ
జూచి చక్రవాకమిథునములు సూర్యాస్తమయసమయమని శంకించి
నవి. ఏనుఁగుల మదధారలను గ్రోలు తుమ్మెదల ఝుంకారధ్వను
లచే వృద్ధినొందిన కర్ణతాళధ్వనులు దుందుభినాదములఁ గప్పి
వేసెను. చలించుచున్న చామరసంఘాతము చరాచరప్రపంచము
నంతయును గబళించెను. అశ్వశ్వాసవిక్షిప్తములై సిందువారకుసుమ
సదృశములైన ఫేనపిండములచే నంతరిక్షమార్గ్రము వ్యెను. తొంగర
పువ్వులగుత్తులవలెఁ దెల్లనివి, కనకదండములు గలవియగు నాతపత్ర
వనము దివసమునుఁ గప్పివేసెను. ముకుటమణికాంతివిసరముచే
వాసరము వికసించెను. స్వర్ణమయమైన హయాలంకారముల
కాంతులచే దిక్కులు పచ్చనయ్యె. శత్రుప్రతాపాగ్నినిర్వాపణము
కొఱకువలెను సేనాగజములు మదధారాశీకరములచే దిక్సమూహ
మునుఁ దడిపెను. విద్యుత్తులవలె చంచలములైన చూడామణికాం
తులు నేత్రస్మేమమును హరించినవి. యుగాదియందు భగవ
త్కుక్షినుండి వెలువడు జీవలోకమువలె స్వస్థానమునుండి నిష్క్ర
మించుచున్నదియు, కార్తవీర్యార్జునుఁడు తన బాహుదండసహ
స్రముచే నడ్డుకొని విడిచిపెట్టినతరువాత సహస్రశాఖలతోఁ బ్రవ
హించు నర్మదానదీప్రవాహమువలె భాసించునదియు నగు తన
బలౌఘమునఁ జూచి హర్షుఁ డాశ్చర్యమునొందెను. తాతా! నడు
వుము; బావా యేమి? ఆలస్యము చేయుచున్నావు; అయ్యా!
పొట్టవానివలె నడుచుచున్నావేమి? గమనశీలుఁడా! ఏమి యిట్లు
తొందరపడుచున్నావు; సౌరభేయుఁడా మార్గమును విడిచి గుఱ్ఱ
ములమధ్యకు బోవుచున్నావేమి? స్వైరిణి! సుఖముగానుండుము.
సౌవీరకకుంభము భిన్నమైనది. మంథరకుఁడా-ఎద్దును నివారించుము.
ద్రోణకుఁడా! దూరముగాఁ బోవలసియున్నది. ఇప్పుడే పరుగిడు
చున్నావేమి? దండయాత్ర దీర్ఘమయినది. ధవుఁడా! కొడవలితో
గడ్డిఁ గోయుము. బురదనుండి యెద్దునుఁ బైకిఁదీయుము. మాణ

షకుఁడా! రమ్ము. ఈ యేనుఁగులగుంపును మనము తప్పించుకొనలేము" అనుచు నిట్లు జరుగుచున్న యనేక సంభాషణములుగలది, హస్తిపకులు, బ్రహ్మచారులు, మూర్ఖులు, గర్దభదాసులు, ఘూర్ణులు, అశ్వపాలురు, ప్రగల్భులు మొదలగువారిచే స్తుతింపబడునదియు, ఈదాఁడయాత్ర పాతాళతలమునకుఁ బోనిమ్ము, సకల దుఃఖమూలమగు నీకటకమునకు మంగళమగు గాక యనుచుఁ గులపుత్రికులచే నిందింపబడునదియు, సువర్ణపాదపీఠము, సువర్ణకలశములు, పతద్గ్రహము మొదలగు రాజోపకరణములను, మహానసోపకరణములనుఁ బట్టుకొని గర్వముగా నడుచుచున్నవారు, ఛాగవరాహహరిణశశాదుల నీడ్చుకొనిపోవువారు, ధవళవస్త్రఖండపరివృతముఖములుగల గోరసభాండములను, అగ్నిశకటికలను, శరావములను, కటాహములను మోయు జనులచే నిండినదియు, ఒకచోట నరపతిదర్శనకుతూహలముచేఁ బరుగిడుచున్న జానపదులుగలది, త్రోవలోనున్న గ్రామములనుండివచ్చి యంభఃకుంభములను నిలిపి మహీపాలునికి దధిగుడఖండకుసుమకరండముల నుపాయనముగా సమర్పించి ప్రచండదండివిత్రాసనములచే నిటునటు పరుగిడుచు నరేంద్రనిహితదృష్టులై జారిపడువారు, పూర్వాధికారులలేని దోషముల నుగ్గడించువారు, చిరంతనచోరాపరాధములను వెల్లడించువారునైన జనుల పాదములచే నెగరగొట్టఁబడిన రజఃపటలముగలది, మఱియొకచోటఁ బంకిలప్రదేశములఁ బూరించుటకుంచఁబడిన తృణపూలకములుగలది, జగత్కబళనముకొఱకుఁ బ్రవర్తించిన ప్రళయజలధివలెనున్నదియు, మహాభోగుల్లోకకుత్పాదితమైన పాతాళమువలెనున్నదియు, పరమేశ్వరవసతికొఱకు సృజింపబడిన కైలాసమువలెఁ బ్రకాశించునదియు నగు సైన్యమును వీక్షించుచు హర్షుఁడేగెను.

తన తరువాత వచ్చు రాజులకు మాంధాత దిగ్విజయ

మార్గములనుఁ బ్రవర్తింపఁజేసెను. అప్రతిహతరథవేగముగల రఘుమహారాజల్పకాలములో దిక్కులను జయించెను. శరాసనద్వితీయుఁడైన పాండురాజు భుజబలాభిజనధనమతావలిప్తులైన రాజుల గరమర్పించు వారినిగాఁజేసెను. పాండుపుత్రుఁడైన ధనంజయుఁడు రాజసూయయాగార్థమై చీనదేశము నతిక్రమించిపోయి గంధర్వ ధనుష్టంకారముఖరితంబగు హేమకూటపర్వతమును జయించెను. బలవంతులు సంకల్పమాత్రముచే విజయము నొందుదురు. హిమాద్రి వ్యవహితుఁడయ్యును ద్రుముఁడను కింనరరాజు కిరీటిబాహుబలకాతరుఁడై కింకరునివలెఁ గరము చెల్లించెను. పూర్వరాజులెవ్వరు నతి జిగీషువులుగారు. ఎట్లన; భగదత్తదంతవక్త్ర కౌరవ శిశుపాల సాల్వజరాసన్ధ సిన్ధురాజ ప్రభృతులల్పభూభాగములకె అధిపతులైరి. ధనంజయజయజనితజగత్కమ్పుఁడైన ధర్మరాజుకిమ్పురుషరాజ్యమును సహించెను. అలసుఁడైన చండకోశుఁడు స్త్రీరాజ్యమును జయించెను గాని దానిలోఁ బ్రవేశింపలేదు. హిమవద్గన్ధమాదనముల కంతరమత్యల్పము. కిష్కుతురుష్కదేశము లుత్సాహముకలవి. పారశీకదేశము పదదేశమాత్రము. శకదేశమందున్నవారు శశసదృశులు. ప్రతిభటులులేని పారియాత్రమునకుఁ బోవుట నిష్ప్రయోజనము. శౌర్యశుల్కముగల దక్షిణాపథము సులభము. దక్షిణోదధితరంగానిలసురభిళదరీమన్దిరములుగల దర్దురాద్రికి మలయము దగ్గరఁ ఆ మలయముతో మహేంద్రము కలిసియున్న"దని పలుకుచున్న బాహుశాలులైన రాజకుమారుల సంభాషణముల వినుచు హర్షుఁడావాసముఁజేరెను. మందిర ద్వారమందు బహుమానముతో రాజలోకమునకు సెలవిచ్చి పంపి వాహనము నుండి దిగి బాహ్యాస్థానమంటపమందున్న సింహాసనమును క్షణకాల మధిష్ఠించెను.

అంత నచ్చటకుఁ బ్రతిహారివచ్చి భూతలవిన్యస్తపాణియుగళుండై "దేవా! ప్రాగ్జ్యోతిషాధీశ్వరుఁడైన కుమా

రుఁడుఁ బంపిన హంసవేగుఁడను దూత దేవరదర్శనార్థమై వచ్చి ద్వారదేశమందున్నాఁడని" విన్నవించెను. అతనిని శీఘ్రముగాఁ బ్రవేశింపఁ జేయుమని రాజు సాదరముగా నాజ్ఞాపించెను. దక్షుఁడగుటవలనను రాజాదరమువలనను ప్రతీహారి యాతనిఁ దోడ్కొని వచ్చుటకు స్వయముగాఁ బోయెను. అనంతర మాకృతి విశేషముచే నయనానందసమ్పాదకుఁడైన హంసవేగుఁడు ప్రభూతప్రాభృతవర్గమును ధరించినపురుషులను వెంటఁబెట్టుకొని వినయముతో రాజమందిరమునుఁ బ్రవేశించెను. హర్షునికి దూరమునుండి సాష్టాందండప్రణామమాచరించెను. రారమ్మని పార్థివునిచే గౌరవముతోఁ బిలువఁబడినవాఁడై శీఘ్రముగాఁ బరుగెత్తి పార్థివునిచేఁ బృష్ఠమందు స్పృశింపఁబడినవాఁడై పాదపీఠఘటితలలాటుండై మరల నమస్కరించెను. ప్రీతితోఁ గూడిన నరేంద్రదృష్టిచే నిర్దిష్టమైన ప్రదేశమందుఁ గూర్చుండెను. అప్పుడు రాజుసింహాసనమునుండి హంసవేగునివైపు దిరిగి మధ్యనున్న చామరగ్రాహిణినడ్డుగా లెమ్మని చెప్పి "హంసవేగుఁడా! శ్రీమంతుఁడైన కుమారుఁడు కుశలముగా నున్నాఁడా"యని వినయముతో నడిగెను. సౌహార్దద్రవార్ద్రమైన పలుకుచే దేవరవారాతని కుశలమడుగుచున్నారుఁ గావున నిపుఁడతఁడు విశేషించి కుశలియని ప్రత్యుత్తరమిచ్చెను.

ఆ హంసవేగుఁడు ముహూర్తమాత్రమూరకుండి చతుస్సముద్రభోగభూతిభాజనులైన దేవరవారి సద్భావగర్భమగు హృదయమును విడిచి లోకమందనురూపమైన మఱియొక ప్రాభృతమే దుర్లభము. అయినను పూర్వులచే సంపాదింపఁబడిన యాభోగమను పేరుగల యీ వరుణాతపత్రమును రూపస్థానమందర్పించుటచే సందేశమున శూన్యముగా నొనరించుచున్న మాస్వామిచేఁ గృతార్థముగాఁ జేయఁబడినది. కుతూహలమునుఁ గలుగజేయుననేకాశ్చర్యము లీఛత్రమందుఁ గలవు. దీని నీడఁ జల్లఁగా జేయుటకుఁ

చంద్రుని వెయ్యికిరణములనుండి దినమున కొక్కొక్క కిరణము దీని యందుఁ బ్రవేశించుచుండును. ఈకిరణము ప్రవేశించిన తరువాత ధ్యానింపఁగా దంతపీఠాప్యాహారము నుపదేశించునవి, మధురములు నగు జలధారలు మణిశలాకలనుండి యథాపేక్షితముగా స్రవించును. వరుణునివలె నెవ్వఁడు చతుస్సముద్రాధిపత్యమునుఁ జేసెనో లేక యిక ముందుఁ జేయఁగలఁడో అట్టివాని నిధత్రము తననీడచే ననుగ్రహించును. గాని యితరుని సరకుఁగొనదు. దీని నగ్ని దహింపఁజాలదు. వాయు వెగరఁగొట్టలేదు. జలము తడప నేరదు. పరాగము మలినముగాఁ జేయఁజాలదు. ముసలితనము శైథిల్యమొందింపలేదు. ప్రభువువారు మొదట దీనినిఁ గటాక్షింపుఁడు. పిదపఁ గుమారుని సందేశమును వినవచ్చును” అని పలికి “లెమ్ము ప్రభువువారికి దానినిఁ గనపర్చుమని తన భృత్యుని కాజ్ఞాపించెను.

వెంటనే యాపురుషుఁడు పట్టుగవిసెననుండి యాగొడుగును పైకిఁదీసి విప్పెను. అతిమాత్ర ధవళకాంతిగల యయ్యాతపవారణము నిచోళమునుండి పైకిఁదీసి మీఁదికెత్తఁగా హరుఁడు నవ్వినట్లు పాతాళమునుండి శేషఫణిఫణామండలము పైకి వచ్చినట్లు, అంతరిక్షముపై పాలసముద్రము చక్రీభూతమై నిలిచినట్లు, గగనాంగణమునఁ బుంజీభూతమై గానవచ్చు శరన్మేఘమువలెను, వియత్తలమును వితతపక్షసమూహముఁగల పితామహవిమాన హంసయూథము మాడ్కి, అత్రినేత్రవినిర్గతుఁడైన కుముదబాంధవుని జన్మదివసము కరణి, జనులచేఁ బ్రత్యక్షీకరింపఁబడిన శ్రీమన్నారాయణ నాభిపుండరీకముయొక్క యుద్గమనక్షణము చాడ్పున, కన్నులకు గలిగిన కౌముదీప్రదోషదర్శనానందతృప్తివలెను, త్రైలోక్యమునకు దిలకమువలెను, శ్వేతద్వీపముయొక్క శైశవమువలెను, శరచ్చంద్రుని యంశావతారమువలెను, ధర్మముయొక్క హృదయమువలెను,

చంద్రలోకముయొక్క నివేశమువలెను చక్రవర్తిత్వముయొక్క దంతమండల ధవళమైన ముఖమువలెను, అంతరిక్షముయొక్క మౌక్తిక జాలగ్రథితమైన సీమంత చక్రమువలెను, చంద్రుని బహుళ జ్యోత్స్నాధవళోదరమగు పరివేష మండలమువలెను, త్రివిక్రముని త్రిభువన వందనీయము, శ్వేతగంగావర్త పాండురమునగు పాదము వలెను, బ్రకాశించుచున్నది. వరుణుని చూడామణి మరీచి శిఖల వలెనున్న మానస బిసతన్తు నిర్మితములైన చామర సమూహములచే రచింపఁబడిన పరివేషముగలది. చక్రవర్తి లక్ష్మీ నూపురస్వన శ్రవణాసక్తిచే నిశ్చలమై వితతపక్షమైన మరాళముచే చిహ్నితమైన శిఖరముగలది. సుఖస్పర్శముతోఁ గూడి ప్రభావస్తమ్భితుండై ముకుళితఫణములుగల వాసుకివలె నున్న దండముగలది, ధవళిమచే నక్షత్రపథమును బూయుచున్నదానివలె నున్నది, ప్రభాప్రవాహవైపుల్యముచే దివసమునఁ గప్పివేయునది ఔన్నత్యముచే నంతరిక్షమును గ్రిందుగాఁజేయునది, సర్వమంగళములకు పైనున్నదియు, లక్ష్మీ శ్వేతమంటపమువలెను, కీర్తిహాసమువలెను, ఖడ్గధారాజల ఫేన రాశివలెను, శౌర్యశాలిత్వముయొక్క యశఃపటలమువలెనుఁ రాజిల్లుచున్నదియు నగు నాఛత్రమును రాజలోకముతోఁగూడిన హర్షుఁడు సాదరముగాఁ జూచెను.

భూనాధుఁడిట్లు గొడుగునుజూచిన తరువాత నాహంసవేగుని భృత్యులు మహార్ఘ రత్నకాంతులచే నెఱ్ఱగాఁ జేయఁబడిన దిగ్భాగములుగలవి. భగదత్తుడు మొదలగు విఖ్యాతపార్థివుల కాలము నుండి వచ్చినవి యగు నలంకారములను, చూడామణులను, క్షీరాబ్ధి కిఁగూడ ధావళ్యమునొసంగు హారములను, రంగులుగల బెత్తుపెట్టె లోఁ బెట్టిన శరచ్చంద్ర మరీచిగౌరములైన కౌశేయంబులు, కుశలులైన శిల్పులచే రచింపఁబడిన శుక్తి శంఖగల్వర్క ప్రముఖములైన పానభాజనసమూహములు, నిచోళకనిగూఢములైన కార్దరంగ

దేశోత్పన్నములైన చర్మములు, వేత్రాసనములు, సుభాషితములు గల పుస్తకములు, పక్వమగుటవలనఁ బొట్లపండు రంగుగల పూగీ ఫలములు, కక్కోలపల్లవములు, లవంగపుష్పమంజరులు, జాతీఫల స్తబకములు, అతిమధుర మధురసామోదముగల పుష్పాసవముతో నిండిన కలశలు, సితాసిత చామరనికరములు, ఆలేఖ్య ఫలక సమ్పుటములు, కనకశృంఖలాబద్ధ కంఠములుగల కింనరులు, వన మనుష్యులు, జలమానవులు, చకోరములు, పరిమళామోదిత దిగ్భా గములుగల కస్తూరీమృగములు, గృహపరిచిత చమరీమృగములు, చామీకర రసచిత్రవేత్ర పంజరాంతర్గతములు, బహుసుభాషిత జల్పాకములు నగు శుకశారికా ప్రభృతి పక్షిగణంబులు, విద్రుమ విరచిత పంజరస్థములైన చకోరములు, జలగజ కుంభస్థలముక్తాఫల మాలికాదంతురములైన దంతకాండములు మొదలగు వానినిఁ జూ పించిరి.

రాజు ఛత్రదర్శనమువలనఁ బ్రహృష్టహృదయుఁడై ప్రథమ ప్రయాణమందిట్టి శోభననిమిత్తము విజయప్రదమని మనస్సులోఁ దలంచెను. హంసవేగునిఁ జూచి సౌమ్యుఁడా! సముద్రమునుండి చంద్రునివలె సకల రత్నధామము, పరమేశ్వర శిరోధారణార్హము నగు నీమహాతపత్రమును గుమారునివలన లభించుట యాశ్చర్యము కాద"ని ప్రీతితోఁ బలికెను. పరోపకృతులు మహాత్ములకు బాల విద్యలు. ప్రాభృత సంభారము నా ప్రదేశమునుండి తీసి దాచ మని భటులకు నియమించి కొంచముసేపుండి హంసవేగుఁడా విశ్ర మించుమని పలికి రాజు వానినిఁ బ్రతీహార భవనమునకుఁ బంపి వేసెను. తానునులేచి స్నాతుఁడై మంగళములనుఁ గోరుచుఁ బ్రాఙ్ముఖముగానుండి యావరణచ్ఛత్రచ్ఛాయ యందుఁ బ్రవే శించెను. హర్షుఁడా గొడుగునీడలోఁ బ్రవేశించిన క్షణమందే నీడవలనఁ గలిగిన శైత్యముచే జంద్రబింబము చూడామణిత్వము

నొందింపఁబడినట్లుండెను. జలబిందువులను విడుచుచుండు చంద్ర కాంతమణు లాతని లలాటమునుఁ జుంబించినట్లుండెను. కన్నుల యందుఁ గర్పూరపరాగము జల్లినట్లాయెను. జారుచున్న మంచు బిందువులుగల హారములు మెడలో నుంచుకొన్నట్లగుపడెను. వక్షస్థలమందుఁ జందన రసా సారము వర్షించినట్లయ్యెను. కలువ పువ్వులు పెట్టినట్లు హృదయము చల్లఁబడెను. లోపలఁ బ్రవేశించిన మంచుగడ్డ కరుగుచున్నదియై యంగములను బూసినట్లుండెను. "స్నేహమును విడిచి సంపత్కారమైనది యింకొకటిలేదు". అని జాతివిస్మయుఁడై మనస్సులో ననుకొనెను. భోజన సమయమందు ధవళవస్త్ర ఖండప్రావృతమైన నారికేళసముద్గకమందుంచి పూసికొనగా మిగిలిన చందనమును ప్రశస్తమైన వస్త్రయుగళమును, శరత్తార కాకారముక్తాస్తబకితమగు కటిసూత్రమును, పద్మరాగమాణిక్య రంజితమగు కర్ణాభరణమును, బహుళమైన భోజ్యజాతమును హర్షుఁడు హంసవేగునికిఁ బంపెను. క్రమముగా నాదివసమిట్లు గడిచిపోయెను.

సైన్యధూళీధూసరితమైన తన శరీరమును గడిగికొనుటకు వలె నంశుమాలి యపరజలనిధి జలమందుఁ గ్రుంకెను. ఛత్రప్రదానవార్తను వరుణునితోఁ జెప్పుటకువలె వరుణ దిశకుఁబోయెను. ముకుళిత సకల కమలవనములు గలదియై భూమి నృపాలుని యెదుట బద్ధసేవాంజలిపుటముగల దానివలె నగుపడెను. నిఖిలజీవలోకాంజలి బద్ధబద్ధవగు సంధ్యారాగము జగము నాగ్రహించెను. గాఢాపరాధ శంకగలదానివలెఁ దూర్పుదిక్కు నల్లనయ్యెను. వృద్ధినొందిన తిమిరపటలముచేఁ గప్పఁబడిన మేదిని శాంతించిన యన్యనృపతి ప్రతాపానలముగల దానివలెఁ గాళిమమును విస్తరింపఁజేసెను.

రాజాస్థాన వికీర్ణ పుష్పనికరమువలెనున్న వికచతగరకుసుమ రుచిరమైన నక్షత్ర సమూహమును దిక్కులుజల్లినవి స్కంధావార

ముందున్న గన్ధగజముల మదామోదమాఘ్రాణించి వాని పైకిఁ బరుగిడు దానివలెనున్న ఐరావతముయొక్క మార్గ మంతరిక్షమందుఁ బ్రకాశించెను. కుపితరాజ వ్యాఘ్రముచే నాఘ్రాణింపఁబడి యుపద్రవముతోఁ గూడినదానివలె నున్న తూర్పుదిక్కునువిడిచి రోహిణీవల్లభుఁడ స్తశిఖరము నెక్కెను. ప్రియాణవార్తలవలె మానినులహృదయములను భేదించు చంద్రకిరణములు పదిదిక్కులయందు వ్యాపించినవి. నూతనభూపతియైన హర్షుని దండయాత్రవలన భీతినొందినట్లున్న సముద్రములు జలజంతు సమూహములతోఁ గూడ క్షోభించెను. రాజుల హృదయములను జింతవలె భూలోకమునంతయును విడిచి తిమిరసంతతిగిరి గుహాలయందుఁ బ్రవేశించెను. శత్రుసామంత రాజులయందువలెఁ గుముదవనములయందు నిద్రవశించెను.

ఈ సమయమందు వితానముక్రింద నడుచుచున్న హర్ష భూపతి నడువ్రఁడని తనయను జీవివర్గము నాజ్ఞాపించి హంసవేగునిఁ జూచి సందేశము నిపుడు చెప్పుమనియడిగెను. వాఁడు నమస్కరించి "దేవా తొల్లి శ్రీవరాహదేవుని సంపర్కమువలన భూదేవికి నరకుఁడను రాక్షసుఁడు పాతాళమందు జనించెను. ఆపీనుని బాల్యమందే లోకపాలకులందరు చూడామణులతోఁ గూడిన శిరస్సులచేఁ బ్రణమిల్లిరి త్రైలోక్యము నేలిన భుజపరాక్రమశాలియైన యాదనుజుని గృహదీర్ఘికా కమలవనమందున్న చక్రవాకమిథునములకోప కషాయి తేక్షణములచేఁ జూడఁబడినవాఁడై నను సూర్యుఁడు భీతారుణ నివర్తితరథుఁడై వానియాజ్ఞలేనిది యస్తమునొందఁడు. వరుణుని బహిశ్చరమైన హృదయము వలెనున్న యాఛత్రము నా రాక్షసుడు హరించెను. ఆమహాత్ముని వంశమందుఁ బుట్టిన భగదత్త, పుష్పదత్త, వజ్రదత్త ప్రభృతులగు మేరుకల్పులైన యనేక నృపాలురుగతింపగా మహారాజ భూతివర్మకుఁ బ్రపౌత్రుఁడు చండవర్మకుఁ బౌత్రుఁడు కైలాసస్థిరనివాసియైన స్థితివర్మకుఁ బుత్రుఁడు

నగు మహారాజాధిరాజు సుస్థిరవర్మ పుట్టెను. వానినే జనులు మృగాంకుడందురు. వాడహంకారముతోఁ బుట్టెను. వాఁడు బాల్యమైయుండఁ బ్రీతిచే ద్విజాతులను, అప్రీతిచే నరాతులను ప్రతిగ్రహములఁ బరిగ్రహింపజేసెను. లవణార్ణవ సంభూతయగు లక్ష్మీ కంఠముగూడ నాతని మాధుర్య మధికతరముగానుండెను. అతఁడు వాహినీశుల శంఖములను హరించెను గాని రత్నములను ముట్టలేదు. పృథివీస్థైర్యమును గ్రహించెనుగాని కరముఁ జేకొనలేదు. రాజుల గౌరవమును స్వీకరించెనుగాని నైష్ఠుర్యమును జూడలేదు. శంతను చక్రవర్తికి గంగాదేవియందు భీష్మునివలె నాతనిభార్యయైన శ్యామాదేవియందు సుగృహీతనామధేయుఁడు భాస్కరసమతేజస్కుఁడునైన భాస్కరవర్మయను కుమారుఁడు పుట్టెను. ఉమానాథ పాదారవిందయుగళమును విడిచి యాతఁడన్యదైవమునకు నమస్కరింపలేదు. త్రైలోక్యమును జయించుటగాని ప్రచండప్రతాపాగ్నిచే దిక్కులను దహించు జగదేకవీరుఁడగు తమవంటి మిత్రునితోఁ జెలిమిచేయుటగాని యతనికి బాల్యమునుండి కోరిక. రాజులకు మైత్రి కార్యవ్యపేక్షతోఁ గూడినది. ఏది యుపన్యసింపఁబడఁగా దేవరవారిని మిత్రునిఁగాఁ జేయునో అదియే కార్యమనంబడును. యశస్సులనుఁ గూడఁ బెట్టుటకు గోరుచుండు దేవరకు ధనములు బహిరంగభూతములు. కూర్చున్నవాని బాహువులు తన యితరావయవములకే సహాయము చేయలేనపుడు పైవారివిషయమై యికఁ జెప్పనేల? చతుస్సాగరవేలాపరివేష్టిత మహాఘుస్మరుఁడైన వానికి భూమ్యేకదేశమును దానమియ్యమని చెప్పుటవలన నేపాటితుష్టి. లక్ష్మీముఖారవిందసందర్శనభాగ్యమును లభించిన దృష్టిగల మిమ్ము సుందరకన్యావిశ్రాణనముచే లోభపెట్టుట యుకించిత్కరము. ఇట్లే యుపాయములచేతను సిద్ధింపని యీకార్యమందు ప్రార్థనామాత్రము నననరించి మేలినవారాకర్ణింపుదురుగాక. ప్రాగ్జ్యోతిషాధీశ్వ

రుఁడు గిరీశునితోఁ గుబేరునివలె నిందునితో దశరథునిపగిది, పుండరీకాక్షునితో ధనంజయునిగతి, దుర్యోధనునితోఁ గర్ణునిమాడ్కి వసంతఋతువుతో మలయానిలము కరణి తమతో దృఢమైన మైత్రినిఁ గోరుచున్నాఁడు. కొందరు దాస్యమునే మైత్రియని వాడుచున్నారుఁ గావున నట్లనే యాతఁడు తమదాస్యమును స్వీకరించునుగాక. క్షీరాబ్ధిమథనసమయమందు శ్రీమహావిష్ణువుయొక్క కేయూరాగ్రములయందున్న మణులరాపిడిచే ధ్వనించు సానుమణిశిలాశకలములుఁగల మందరగిరివలెఁ గామరూపాధిపుఁడు తమగాఢాలింగనముల ననుభవించునుగాక. విమలలావణ్యామృతనిర్ఘరముఁగల యేలినవారి ముఖచంద్రునిఁ జూచి ప్రాగ్జ్యోతిషేశ్వరలక్ష్మి చిరకాలమునకుఁ దనలోచనద్వయమును సఫలముఁ జేసుకొనునుగాక. ఇట్లాతనితోఁ స్నేహముచేయుట తమకిష్టము లేనియెడల నాతనితో నేనేమి చెప్పవలసియున్నదో దాని నాజ్ఞాపింపుడని పలికెను.

హంసవేగుఁ డిట్లు పలికి విరమింప భూనాథుఁడు పూర్వమందే యాతని సద్గుణగణములను వినియుండుటవలనఁ గుమారుని యందుఁ బ్రీతిబహుమానములుఁగలవాఁడై యా యా భోగఛత్రప్రదానముచే నధికతరప్రీతినొంది లజ్జించుచున్నవానివలె హంసవేగుడా! మహాభిజనుఁడు, పుణ్యరాశి, గుణసముద్రుఁడు, పరోక్షసుహృత్తునగు నట్టి మహాత్ముఁ డిట్లు నాయందు నిర్వ్యాజస్నేహమునుఁ గనపఱచుచుండగా నావంటివానిమనస్సు స్వప్నమందైన నింకొకరీతిగా నుండునా? సకలజగత్సంతాపకరములైన తిగ్మకరుని కరములు త్రిభువననయనానందకరమైన కమలాకరమందుఁ జల్లనయి పోవును. సుబహుగుణగణకీర్తులమైన మే మెవ్వర మాతని సఖ్యమునకు? సజ్జనమాధుర్యమునకుఁ బదిదిక్కులు వేతనములేని దాసులు. కుమారుని సంకల్పము శ్రేయస్కరమైనది. ఆతఁడు స్వయముగా బాహుపరాక్రమశాలి. మిత్రుఁడనైన నేను ధను

ష్ప్రాణినై యుండ నాతఁడు హరునికిఁ దప్ప మరెవ్వరికి నమస్కరించును? ఈసంకల్పముచే నాప్రీతి హెచ్చినది. గర్వముగల పశువైన సింహమందుఁగూడ బహుమానముండునుగదా స్నేహితునియందుఁ జెప్పనేల? కుమారదర్శనోత్కంఠ మిమ్ములనుఁ జిరకాలము బాధింపకుండఁ బ్రయత్నింపుము"ని వచించెను.

దేవా! మిమ్ములను మరేమి క్లేశపెట్టును? గొప్పవారియింట్లోఁ బుట్టినవానివలెఁ బలికితిరి. సత్పురుషులు సేవాభీరువులు. అయిననందులో విశేషించి యీ వైష్ణవవంశ మహంకారమే ధనముగాఁ గలది. మాస్వామివంశ మటూడనిమ్ము దీనినిఁ జిత్తగింపుము. దుష్టురాలగు తల్లివలెఁ బెరిగిన దారిద్ర్యముచే సేవయం దాభిముఖ్యముఁ గలిగింపఁబడినవాఁడు, అసంతుష్టయైన భార్యవలె తృష్ణచేఁ బ్రేరితుఁడు, యౌవనమందుఁ బుట్టిన దుష్టసంతానములవలెనున్న నానాభిలాషలుఁగల యసత్సంకల్పములచే వ్యాకులీక్రియమాణుఁడు, స్వగృహమందు దుష్టబంధువులవలెనున్న దుస్థితములైన గ్రహములచేఁ బట్టుకొనఁబడినవాఁడు, విడువశక్యముగాని పురాతనభృత్యులవలెనున్న మలినకర్మలచే ననుసరింపఁబడినవాఁడు, రాజకులప్రవేశసమయమందు ద్వారరక్షకులచే నిరుద్ధుఁడై పలుమారు ప్రతీహారమండలకరప్రహారములచే నిరస్యమానుఁడు, కంటకము కానిపోయినను చరణాలగ్నుఁడు, అసమయోపసర్పణాప్రకుపితప్రభుదృష్టిదగ్ధుఁడు, మర్కటమువలెఁ గోపనిర్భర్త్సితుఁడైనను మారనిముఖరాగముఁ గలవాఁడు, ప్రేతవలె ననుచితప్రదేశమందియ్యఁబడిన యన్నపిండముఁ గలవాఁడు, శవదహనభస్మముచేఁ బరుషీకృతములైన శ్మశానపాదపములవలెనున్న రాజవల్లభులను సేవించువాఁడు, జఠరపరిపూరణమాత్రప్రయోజనమునకొఱకుఁ బుట్టినవాఁడు, తల్లియొక్క యపుణ్యకర్మాచరణమువలన జనించినవాఁడునైన దాసపురుషుని కేమి ప్రాయశ్చిత్తము? వాని జీవితమెట్టిది? వానికి శాంతియుసగా నెద్ది?

వాని ధనము నిధనమును బొందునుగాక; వాని జీవనము కాల్పనా? వాని సుఖమునకు నమస్కారము. వాని యైశ్వర్యమున కంజలి." అని హంసవేగుఁడు సేవావృత్తిని నిందించి కొలది దివసములలోఁ బ్రాగ్జ్యోతిషేశ్వరుఁడు మీసన్నిధికి వచ్చున"ని విన్నవించి రాజాభ్యనుజ్ఞాతుఁడై తన నివాసస్థానమునకుం జనియె. హర్షుఁడును కుమారదర్శనోత్కంఠాక్రాంతహృదయుఁడై యారాత్రిని గడిపెను. ఆత్మార్పణము గొప్పవారలను వశపర్చుకొనుటకు మూలికమంత్రము గాని సాధనము. ప్రభాతసమయమందు ప్రభూతమైన ప్రతిప్రాభృతమునుఁ బ్రధానదూతచేతికిచ్చి హంసవేగుని ద్వారా ప్రాగ్జ్యోతిషాధీశ్వరునికిఁ బంపెను. ఆదినము మొదలుకొని హర్షుఁడెడ తెగని ప్రయాణకములచే శత్రువునికి కెదురుగా వెళ్లెను. అట్లు పోవుచుండగా నొకదినమందు మార్గమధ్యమందు రాజ్యవర్ధన భుజబలోపార్జితమైన మాళవరాజు ధనమునంతయుఁ బట్టికొని భండి వచ్చుచున్నాడని లేఖాహారకునివలన వినెను. వినిన వీభ్రాత భ్రాతృవియోగదుఃఖముఁ గలవాఁడై కాతరహృదయుఁడయ్యెను. మార్గాంధకారములోఁ బ్రవేశించెను. ఆదినమందు సకలవ్యాపారములను విడిచి నిషిద్ధసకలజనప్రవేశుండై రాజులతోఁగూడి భండి రాక కెదురుచూచుచు నిజమందిరమందుఁ గూర్చుండెను.

అంతలో భండి యొకగుఱ్ఱము నెక్కి రాజలోకపరివృతుఁడై, మలినవస్త్రసంవీతుఁడు, శరశల్యనిచితగాత్రుఁడు, బాష్పవారిప్రవృతవదనుఁడు, పాతకివలె నపరాధివలె ద్రోహివలె, సాయంతన సమయ నిశ్శ్రీకమైన కమలాకరమువలె, దుర్యోధనవధదుఃఖితుఁడైన యశ్వత్థామవలె, అపహృతరత్నమైన రత్నాకరమువలె రాజద్వారమును సమీపించెను. గుఱ్ఱమునుండి దిగి యవనతముఖుఁడై రాజనికటమునకేతెంచెను. దూరమందుండియే విముక్తాక్రందుఁడై హర్షుని పాదములయందుఁ బడెను. అవనిపతియు వానిని లేవనెత్తి

గాఢముగా నాలింగనము జేసికొని యతికరుణముగాఁ జాలసే పేడ్చెను. శోకావేగము కొంతశాంతింప మరలివచ్చి నిజాసన ముందుఁ గూర్చుండెను. మొదట భండియుఁ దరువాత రాజును ముఖప్రక్షాళనముఁ జేసికొనిరి. కొంతసేపూరుకొని హర్షుఁడు భ్రాతృవధ వృత్తాంతము నడిగెను. భండియు జరిగిన వృత్తాంతము నంతయుఁ బూసగ్రుచ్చినట్లు తెలియఁజేసెను. తరువాత రాజునిజ సోదరీవృత్తాంత మంతయు నడిగెను. "దేవా! రాజ్యవర్ధనుఁడు కాలధర్మము నొందఁగా గుప్తుఁడనువాఁడు కుశస్థలమునుఁ బట్టుకొనఁగా రాజ్యశ్రీదేవి బాధనమునుండి తప్పించుకొని తన పరివారముతోఁ గూడ వింధ్యారణ్యమునకుఁ బోయెనని లోకుల వలన నొకవార్తను విని యున్నాను. ఆమె నన్వేషించుట కనేకజనులనుఁ బంపితిని. వారిప్పటికిఁ దిరిగి రాలేదు" అని విన్నవించెను. హర్షుఁడది విని "యితరులనుఁ బంపిన నేమిఫలము? పరిత్యక్తాన్య కృత్యుఁడ నై యామెను వెదకుటకు నేనే స్వయముగా బోయెదను. నీవు సైన్యమును దీసికొని గౌడాభిముఖముగా బయలుదేరుము" అని భండికాజ్ఞాపించి స్నానభూమికిఁ జనెను. క్షౌరాభ్యంగములచే భండికి శరీర సంస్కారమును గావించి ధారణోచిత వసనకుసు మాంగ రాగాలంకారములచే నలంకృతునిఁ జేసి వానితో భుజియించి యాదినమునంతయు వానితో సంభాషించుచు గడిపెను.

ఆ మరుసటి దినమందుఁ బ్రాతఃకాలమున భండి రాజ సన్నిధికిఁ బోయి "రాజ్యవర్ధన బాహుబలార్జితమైన మాళవరాజు ధనములనుఁ గటాక్షింపుమని వేడుకొనెను. నరపతిచేనను జ్ఞాతుఁడై జంగమములైన గండశైలములవలెను, భూమిపైకిఁ దిగిన గంభీర గర్జిత ధ్వనులుగల మేఘములవలెను ఉత్ఫుల్ల సప్తచ్ఛదవనా మోదముగల శరద్దివసంబులమాడ్కి, బ్రకాశించు ననేక సహస్ర సంఖ్యాకములైన గజములు, హరిణ వేగముగల గుఱ్ఱములు,

అలంకారవిశేషములు, కాంతిపూరప్లావితదిగంతములైన తారహారములు చంద్రమరీచినిచయగౌరములైనవాలవ్యజనములు, సువర్ణమయదండ భూషితములై లక్ష్మీనివాస పుండరీకముల వలెనున్నయాతపత్రములు, అప్సరసలవంటి వారవిలాసినీ జనము, సింహాసనశయనాది నానారాజోపకరణములు, కాలాయస శృంఖలానియమిత చరణ యుగళముగల యశేషమాళవ రాజలోకము, అలంకారములతోఁ గూడిన కోశకలశములు, మొదలగు వస్తుసమూహములను భండి హర్షునికిఁ గనపర్చెను. నృపాలుఁ డావస్తు జాతమునంతయు నవలోకించి "మీమీయధికారవులకుఁ దగినట్లుగా నావస్తువులను స్వీకరింపుడ"ని తన యధ్యక్షుల కాజ్ఞాపించెను. మఱి యొకదినమందు రాజుసోదరిని వెదుకుటకుఁ గతిపయాప్త జనసమేతుడై బయలుదేరి కొన్నిప్రయాణములచే వింధ్యాటవిం బ్రవేశించెను.

ఛత్రలబ్ధియను సప్తమోచ్ఛ్వాసము

ముగిసెను.

# ఆంధ్ర హర్ష చరిత్రము.

## అష్టమోచ్ఛ్వాసము.

తే॥ గీ॥ భవ్యులగువారి వాంఛితవస్తువితతి।
నానుకూల్యము గలదియై యవనిలోన।
వేయివిధముల నొడఁగూర్పు విధిప్రభువును।
భక్తి సేవించు సుభటుని రక్తిఁబూని॥

తే॥ గీ॥ బుధజనులతోడఁ బొత్తును భూమిలోన।
బుట్టి కంటికిదూరమై పోవునిష్ట।
జనుల దర్శన లాభంబు ఘనమణితతి।
లబ్ధియెవరికి నొసగద లభ్యముదము॥

ఆమరునటి దినంబున లేచి హర్షుఁడా గ్రామమునుండి నిర్గమించి విన్ధ్యారణ్యముంజొచ్చెను. బహుదినము లయ్యడవి యందుదిరిగెను ఇట్లా కాంతార గహనమందు రాజు గ్రుమ్మరు చుండగా నొకనాడాటవిక సామంతరాజైన శరభకేతువను వాని పుత్రుఁడు వ్యాఘ్రకేతునాముఁడు, కజ్జలశ్యామలమైన జుట్టుముడిని, త్రిశాఖమైన భ్రుకుటిభంగమునుఁ దాల్చినవాఁడు, శుకపక్షకాంతి గల మణికర్ణికతోఁ గూడిన కర్ణములచే శోభించువాఁడు, విరళమైన రెప్పలుగల నేత్రములసహజారుణకాంతిచే రసాయన రసోపయుక్తమగు తరక్షురక్తమును స్రవించుచున్నవాని వలెనున్నవాఁడు, స్థూలమైన యధరముఁ గలవాడు, అనవరతధనుర్జ్యాకర్షణవ్యాయామమువలన విస్తరించిన వక్షస్థలముచే విన్ధ్యగిరితటశిలావైపుల్యమును పరిహసించుచున్నవాని వలెను, అజగరగరిష్ఠమగు భుజయుగళముచేఁ గైలాసభూరుహముల దైర్ఘ్యమును తిరస్కరించుచున్నవాని వలెను, విన్ధ్యగిరినుండి కారుచున్న యశ్మసారమువలెను, చలించు

చున్న గిరితట తమాల పాదపమువలెను, యంత్రముచే మీఁదికెత్తఁబడి తిరుగుచున్న అయస్కాంత స్తంభమువలెను భాసించువాఁడు, హరిణయూథములకుఁ గాలపాశమైనవాఁడు సింహ సమూహములకు ధూమకేతు సదృశుఁడు, మహిష మండలమునకు మహా నవమీ మహోత్సవము వంటివాఁడు, హింసకు హృదయము వలెను, పాపమునకు ఫలమువలెను, కలికాలమునకుఁ గారణమువలెను, కాలరాత్రికిఁ గాముకునివలెను, కానవచ్చువాఁడు నగునొక కిరాతునిఁ వెంటఁదీసికొనివచ్చెను. వానినావ్యాఘ్రకేతువుదూరమందుంచి హర్షునియొద్దకు వచ్చి "స్వామీ! వింధ్యపర్వతమునకుఁ బ్రభువు. సర్వపల్లీపతులకధిపతియునగు భూకంపుఁడను పేరుగల శబర సేనాధిపతి యొకఁడు గలఁడు. వానికి వీఁడు మేనల్లుఁడు. వీనిపేరు నిర్ఘాతుఁడు. వీఁడీయడవిలోనున్న సకలవృక్షముల పత్రములను గూడ నెఱింగినవాఁడు. అటవీ ప్రదేశములమాటఁ జెప్పనేల? తమయాజ్ఞను నిర్వహించుటకు సమర్థుఁడు. మీకపేక్షితమైన వృత్తాంతమును వీని నడుగుఁడని విన్నవించెను. ఇట్లు వ్యాఘ్రకేతువు రాజుతో విన్నవింపఁగా నాభిల్లుఁడొక తిత్తిరిపక్షిని జెవుల పట్టి నృపాలునకుపాయనముగా సమర్పించెను. అవనిపతియు వానిని గౌరవముతోఁ జూచి "ఓయీ యీయరణ్య ప్రదేశము లన్నింటిని నీవుపూర్ణముగా నెఱింగినవాఁడవుగదా మీరెందఱో స్థలములయందు దిరుగుచుందువారు. మీసేనాపతిగాని తదనుజీవులుగాని దివ్యాకృతిగల యొక స్త్రీని యీ విపినమునఁ జూచియున్నారా?" యని యడిగెను. హర్షుఁడట్లు ప్రశ్నింపఁగా నిర్ఘాతుఁడు తన్ను రాజ సత్కృతునిగాఁ దలంచుకొనుచు "స్వామీ! యీయరణ్యమందు సంచరించెడు మృగసంహతిసైతము మాసేనాని యెఱుఁగనిదికాదు. అట్టిమహనీయాకారముగల స్త్రీవ్యక్తి విషయమై చెప్పనేల? అయినను దేవరవారి యాజ్ఞచే నిట్టిపని యితరకృత్యములఁ బరిత్యజించి ప్రతిదిన మామెనన్వేషించుటకుఁ బ్రయత్నము సలుపుదుము. ఇచటి కర్ధగవ్యూతి

నాతిదూరమందు మునిమండలీ మహితంబైన వృక్షషండం బొండు గలదు. తన్మధ్యంబున ననేక శిష్యజనోపాస్య మానుండగుచు దివాకర మిత్రుండను నొక బౌద్ధసన్యాసి నివసించి యున్నాడు. ఒకప్పుడతం డెఱింగిన నెఱింగి యుండవచ్చున"ని నుడివెను. అది విని రాజు "ఔనౌను, పూజ్యుడు, సుగృహీత నామునకు గ్రహవర్మకు బాలమిత్రుండు, విద్వాంసుడునైన బ్రాహ్మణుం డొకడు త్రయీధర్మమును విడిచి యోగాభ్యాసరతుండై బాల్యమందే సౌగత సన్యాసి యయ్యెనని వినియున్నాను. ప్రాయికముగా నతండే యితండై యుండవచ్చును. స్నేహితుండు మనుష్యుల హృదయ మందాశ్వాసమునం గలిగించును. అందరికి గుణము లభిగమనీయ ములు. మునిత్వ మెవ్వనికిం బూజ్యము గాదు. ధర్మమునకు గృహిణియైన ప్రవ్రజ్య యాముఖ్యునికిం గూడ నతిశయ మావహింపం జేయుచున్నపుడు సకలజన మనంబులను హరించు విద్వాంసుని విషయమై చెప్పనేల? అతనిని జూచుటకు నామనంబెన్నడుం గుతూహలము గలది కాలేదుగాని యిపుడు ప్రసంగ వశమునవిని యున్నాను గావున మంగళగుణశ్రీయుక్తుండైన యతనిని జూచెదమని మనస్సులోననుకొని "ఓయీ యాపరివ్రాజకుండు నివసించియున్న ప్రదేశమునకు నన్నుం దీసికొని పొమ్మని పైకిం బలికెను. వాడు మార్గమునుం జూపింపగా వానివెంటబోయి హర్షుండు ఫలభారావనమ్రసమేరు మహీరుహంబులు, కుసుమిత చాంపేయ తరుషండంబులు, కోరకిత కురవకనికరంబులు, రజోభరసిక్త తిలసాలతిలకంబులు, ఫలిత పూగద్రుమవిసరంబులు, ఉడ్డయమాన చటుల కృష్ణసారశాబక సుభగ భూములు, తాంబూలలతాపినద్ధజంబీర వనవీధులు, సహకార రామ రోమంథాయమాన హరిణ యూథంబులు, శ్రవణ సుభగగిరి నిర్ఝరనినాద జనితనిద్రాపర వశకరి కులంబులునై దృష్టి నాకర్షించుచున్న యరణ్య ప్రదేశంబు లంగనుచుం జనిచని యా బౌద్ధసన్యాసి సమీపమందే యుండునని తలంచెను. గిరినదీ

జలంబులఁ బ్రక్షాళిత హస్తపాదుండై యాచమనముచేసి విశ్రాంతి క్షణ సమున్ముక్త హేషారవ బధిరీకృతారణ్యాగహనమైన యశ్వసైన్యమునా ప్రదేశమందే యుండ నియమించి హృదయము చేఁదపస్విజన దర్శనోచితమైన వినయమును, దక్షిణ హస్తముచే మాధవగుప్తుని యువలఁబించి యల్పసంఖ్యాకులైన రాజపుత్రులను వెంటనిడికొని కాలినడకతో నరణ్యమధ్యమునకుఁ బోయెను.

ఇట్లు హర్షుఁడు చనిచని యాచెట్లమధ్యను నానా దేశీయులు స్థానాశ్రయులు, శిలాతలోపవిష్టులు, లతాభవన నివాసులు, వృక్షచ్ఛాయానిషణ్ణులు, తరుమూలనివిష్టులు, వీతరాగులు, ఆర్హతులు భిక్షువులు, శ్వేతాంబరులు, భాగవతమతస్థులు, బ్రహ్మచారులు, కేశలుంఛకులు, కాపిలులు, పాశుపతులు, లోకాయతికులు, కాణాదులు, ఔపనిషదులు, ఐశ్వరకారణికులు, ధర్మశాస్త్రవేత్తలు, పౌరాణికులు, యజ్వులు, వైయాకరణులు, పాంచరాత్రికులు, యితరసిద్ధాంతావలంబులు మొదలగువారిచే నాశ్రయింపఁబడిన దివాకరమిత్రుని యాశ్రమంబునకుంజనియె. అచట నాసనోపాంతనివిష్టానేక సింహశాబకములుగలది యగుటచే నకృత్రిమసింహాసనమందుఁ గూర్చున్న వానివలె నున్నవాఁడు, ఉపశమమునుఁ బానము చేయుచున్న వానివలెనున్న వనహరిణములు నాకుచున్న పాదములు గలవాఁడు, నీవారధాన్యబీజములను భక్షించుచున్న పారావతపోతముచే నధిష్ఠింపఁ బడినవామకర తలముగలవాఁడు, ఉద్గ్రీవమైనమయూరమును, మరకతమణీకరకమునువలె వారిధారచే నింపుచున్న యితరహస్తము గలవాఁడు అచ్చటచ్చటఁ బ్రాకుచున్న పిపీలికాపంక్తులకు శ్యామాకతండుల కణంబులను స్వయముగాఁ జల్లుచున్నవాఁడు, మృదువైనరక్తవస్త్రఖండముచేఁ గప్పఁబడినవాఁడై బాలాతపానులిప్తమైన పురందర దిగ్భాగమువలెనున్నవాఁడు, పద్మరాగమణిప్రభాసదృశమైన దేహకాంతిచే నెల్లగాఁ జేయఁబడిన దిక్కులకుఁ గాషాయాంబరధారణమునుపదేశింపుచున్న వానివలె నున్నవాఁడు, వినయముచే

నధోముఖమై ధవళమై స్నిగ్ధమైయున్న కంటిచేఁ గ్రూరజన వ్యాపాదిత జంతుపునర్జీవనార్థమై యమృతమును వర్షించుచున్నవాని వలెనున్న వాఁడు, సర్వశాస్త్రాక్షర పరమాణువులచే నిర్మింపఁబడిన వానివలెనున్నవాఁడు, మధ్యమ వయస్సు గలవాఁడునగు దివాకర మిత్రునిఁ జూచెను. తదీయాతిప్రశాంతగంభీరాకారముచే నాకృష్ట హృదయుఁడై హర్షుఁడు దూరమందుండి యేమనోవాక్శిరస్సులచే సాదరముగా వందనమాచరించెను.

స్వభావసిద్ధముగా మైత్రీమయుఁడైన యాదివాకర మిత్రుఁడు, అదృష్టపూర్వము, అమానుషలోకోచితము, సర్వాభిభావి, భ్రాజిష్ణువునగు నాభూపతియాకారవిశేషము చేతను, ఆభిజాత్య ప్రకాశకమైన వినయముచేతను మిక్కిలి సంతసిల్లెను. వీరస్వభావుఁడైన నాసన్న్యాసి భూపాలున కెదురుగా జని యనేకాభయదాన దీక్షాదక్షము, మహాపురుష లక్షణ లక్షితమునగు దక్షిణ హస్తముమీఁదికెత్తి స్నిగ్ధమధురమైన వాక్కుచే స్వాగతమునుఁ బలికి యభ్యాగతుఁడైన గురువునివలె బహుమానించి "ఇచ్చటఁ గూర్చుండుమని" ప్రార్థించి తనయాసనమును జూపించెను. అపుడు రాజు "అభిజాతుల సౌజన్యములోహా కృత్రిమైన సంయమన పాశము; గుణానురాగియగు గ్రహవర్మపలుమారితని గుణగణమును వర్ణించుచుండెడివాఁడు" అని మనస్సులోననుకొని "పూజ్యుఁడా! యుష్మద్దర్శన పుణ్యముచేనను గ్రహింపబడిన నాకు భవత్ప్రియోక్తమైన యీ యనుగ్రహము పునరుక్తమని తలంచెదను. పరునివలె నన్ను నిజాసనదానాద్యుపచారములచే సంభావించుట యనుచితము. సంభాషణామృతాభిషేకప్రక్షాళిత శరీరుఁడనైన నేను తమవంటివారియెదుట నిలుచుటకనర్హుఁడను. పాద్యోదకముకూడ నిష్ప్రయోజనము. తమరు యథాసుఖముగాఁ గూర్చుండుడు. ఇదిగో నేనిచట గూర్చుండెదనని" పలికి నేలనుపవిష్టుఁడయ్యెను.

ప్రభువులకు వినయాతిశయమే పరమార్థమైన యలంకారము; రత్నాదికము శిలాభారమని యెంచి పలుమారు సన్యాసి తనయాసనము పైఁగూర్చుండుమని ప్రార్థించినను రాజొప్పుకొనలేదు. అపుడు భదంతుఁడెప్పటివలెఁ దన యాసనముందుఁ గూర్చుండెను. అతఁడు భూపతి ముఖనిహితదృష్టియై కొంచెముసేపూరకుండి దంతకాంతులచేఁ గలికాలకాలుష్యమును గడుగుచున్నవానివలెఁ బరిమళసుభగము, ఫలమూలాభ్యవహార సాధనమునగులతావనమును గ్రక్కుచున్నవానివలె "ప్రకాశితసారమైన సంసారము నేటిదినము మొదలుకొని కేవలమనింద్యమేకాదు, వంద్యముకూడనగుచున్నది. జీవించియున్నవారీయద్భుతమును జూడలేదా? అచింతితోపనతమగు నీరూపము నాదృగ్గోచరమైనది. జన్మాంతరావస్థిత సుకృతములిట్టి హృదయోత్సవములచే ననుమేయింపబడుచున్నవి. అసులభదర్శనమైన యీయాకృతివిశేషమునుఁ గనపర్చినమాతపంబీజస్యముందే ఫలించినది. తృప్తితీరునట్లు నేత్రములచే నమృతము పానము చేయబడినది. పుణ్యబాహుళ్యములేనిది నీవంటివారిదర్శనములభింపదు. నీవుపుట్టినదినము సుదినము. సకలజీవలోకజీవితజనకుఁడవైన నిన్నుఁగన్నతల్లి మహాభాగ్యవతి. సుకృతతపఃపరమాణువులచే నీసర్వావయవములు సృజింపబడినవి. నావంటి ముముక్షువునకుఁగూడఁ బుణ్యభాజనుఁడవైననిన్నుజూచి మరల మనుష్యజన్మమందభిలాషపుట్టుచున్నది. ఇష్టములేనివారమయినను మన్మథునిఁజూచితిమి. నేఁడువనదేవతల చక్షుస్సుకృతార్థమైనది. నేఁడు పాదపములజన్మముకూడసఫలము. వానికిఁగోచరుఁడవైతివి. అమృతమయుఁడవైననీవాఙ్మాధుర్యము వర్ణనాతీతము. ఇట్టిబాల్యావస్థయందు నీకిట్టివినయమును నేర్పిన యుపాధ్యాయుఁడెవఁడో యూహించినను కనుగొనఁజాలనైతి. దీర్ఘాయుష్మంతుఁడవైన నీవీ భూమినిఁబుట్టనియెడల నీగుణగ్రామము శూన్యమైపోవును. ముక్తామణివలె నెవ్వనివంశమందు నీవుజనించితివో యారాజుధన్యుఁడు.

మహాభాగ్యవశమున దర్శనమొసంగిన నీకెట్లుప్రియము నాచరింపవలెనో తెలియక నామనంబు చాంచల్యమునొందుచున్నది. సకలవనచర సార్వసాధారణములైన కందమూలఫలములను గిరినదీజలమును నీకు సమర్పించుటకు మే మెవ్వరము. నాశరీర మితరులకుపకరణముగాఁ జేయఁబడనిది. నాకున్న సర్వస్వము నీయాతిథ్యమున కెదురుచూచుచున్నది. గురభ్యస్త విద్యాత్మకములు కొన్ని కలవు. ప్రీతి, యుపయోగమును విచారింపదు. ఇతరకార్యములకుపరోధము లేనియెడలఁ జెప్పఁదగిన యంశము గోప్యము కానియెడల నీవిప్పటికే తెంచిన కార్యమెద్దియో వినుటకు, నాహృదయ మభిలషించుచున్నది. సంచారయోగ్యముగాని యీప్రదేశమున కేపనిమీఁదవిచ్చేసితివో తెలుపవలెను. శోకాన్వాటవీభ్రమణఖేదము నెంతవరకుసహించెదవు. సంతాపార్హముగాని నీశరీరము సంతాపక్లిష్టమైయున్నట్లు కాన్పించుటకుఁగారణమేమి?” అనియాబౌద్ధసన్యాసియడుగగా భూపాలుఁడు “ఆర్యా! అమృతమును వర్షించుచున్నట్లున్న మీసంభాషణము చేతనే నా కాతిథ్యమొసంగబడినది. మాన్యులైన తమరనుపచరణీయుఁడనైన నన్నొకపూజ్యునిగా గౌరవించుటవలనధన్యుఁడనైతిని. నేనీమహాటవియందు దిరుగుటకు నిమిత్తమును విన్నవించుకొనుచున్నాడను. అవధరింపుఁడు. అల్పకాలముక్రిందట నాయిష్టబంధువులందరు మృతినొందినను శోషించిన యొకసోదరికొఱకు జీవితమును ధరింపవలసివచ్చినది. ఆమెయు భర్తృవియోగదుఃఖమువలనను, శత్రుపరిభవభయమువలనను, పరుషకిరాతబలబహుళము, మహామహిషవిఘ్నితపథికగమనము, నిశితకంటకాచితము. అవటశతవిషమమునగునీవింధ్యారణ్యమును జొచ్చెను. ఆమెనన్వేషించుటకీయరణ్యమందుఁ దిరుగుచున్నాను. ఇప్పటికినామె కనఁబడలేదు. వనచరులవలన నావృత్తాంతమును గురువర్యులువిని యున్నారేమో తెలుపుదురనునాశచే భవత్సన్నిధికివచ్చితిని” అని పలికెను. ఆమాటవిని సౌగతసన్యాసి జాతోద్వేగుఁడై “ఆయుష్మంతుఁడా! ఇట్టివృత్తాంతము మాశ్రవణపథమం దెన్నఁడునుఁబడలేదు.

సీకిట్టిప్రియాఖ్యానోపాయనములనుసమర్పించి యారాధించుటకు నేన పాత్రుఁడననిపలుకుచున్నసమయమందే శమసంపాదకమగువయస్సులోనున్నవాఁడు, సంభ్రాంతరూపుఁడు, బద్ధాంజలి, జాతకరుణుఁడు, సాశ్రులోచనుఁడునగు మఱియొకభిక్షువకస్మాత్తుగా నచటికరుగుదెంచి, భగవంతుఁడా! విధవమైననుదివ్యాకృతిగల యొకయువతివ్యసనాభిభూతయై వహ్నిలోఁబడుటకుసిద్ధముగానున్నది. తమరొకపరి యచటికివచ్చిజీవించియుండగా నామెనుసముచితసమాశ్వాసనములచే బ్రతికించెదరుగాక. ఆపద్గతములైనక్రిమికీటాదులుకూడ దమకంటఁబడినచో నెన్నఁడుమృతినొందవని" పలికెను.

అందుపైనిహర్షుఁడు తనచెల్లెలేమోయని శంకఁగలవాఁడై సోదరీస్నేహమువలనఁ లోపలగరుగుచున్నవానివలె దుఃఖముచే దోదూయమానమానసుఁడు, గద్గదికాగృహీతకంఠుఁడు, బాష్పాయమాణలోచనుఁడునగుచు "స్వామీ! ఆచిన్నదియున్నస్థలమిచటి కెంత దూరము. ఇంతవరకుజీవించియుండునా? నీ వెవ్వతెవు? ఎవ్వరిదానవు? ఈయరణ్యమున కేలవచ్చితివి? ప్రాణపరిత్యాగమునకు హేతువేమి?" అనియామెనడిగితిరా? ఆమెతమకంట నెట్లుపడినది? ఆకారముచే నెట్లున్నది? ఈవృత్తాంతమునంతయును మొదటినుండి తమవలన వినుటకు గోరుచున్నాఁడ"నని పలికెను.

హర్షునిచేనిట్లుప్రశ్నింపఁబడినయామస్కరి "మహాభాగుఁడా! నేటిదినమందు వేకువనలేచిభగవంతునికినమస్కరించి సైకతసుకుమారమగునీనదీకూలమునననుసరించి యాదృచ్ఛికముగాఁ గొంతదవ్వేగితిని. గిరినదీసమీపమందున్న యొకవనలతాగహనమందు హిమదూషితకమలాకరమందు దైన్యమునొందియున్న యాఁడుతుమ్మెదల ధ్వనివలెను, తానమువాయించుచున్న వీణాతంత్రులనాదమువలెను వినబడుచున్నదియు, అధృతికరమునతికరుణమునైయున్నదియు, నగు

స్త్రీలరోదనధ్వనినివింటిని. కరుణార్ద్రచిత్తుఁడనై రోదనధ్వనిపుట్టిన తావునకుఁబోయితిని. అచటనబలాచక్రవాళపరివృతయు, ఆపత్కాల మునందుఁగూడనవిముక్త సహజలావణ్యయు, అలక్తకరసతుల్యమైన దర్భాంకురక్షతస్రుతమైన రక్తముచే నెఱ్ఱనైనపాదములు గలదియు, ఒకచెలికత్తెగొడుగుగాఁబట్టినపద్మపత్రముచే సచ్ఛాయమైనను విచ్ఛాయమగుముఖముగలదియు, శూన్యతచే నాకాశమునుగూడ నతిశయించుచున్నదియు, నిశ్వాసములచే వాయుమయమైనదానివలెను, సంతాపసంతతిచే వహ్నిమయమైనదానివలెను, అశ్రుప్రస్రవణముచే జలమయమైనదానివలెను, నిరవలంబనత్వముచేవియన్మయమైనదానివలెను, విలాపాక్షరబాహుళ్యముచే శబ్దమయమైనదానివలెనున్నదియు, వనకుసుమధూళిధూసరితములైన పాదపల్లవములుగలదియు, ప్రభాతచంద్రమూర్తివలె లోకాంతరమునభిలషించుచున్నదియు, దుస్సహరవికిరణ సంస్పర్శముచే ముకుళితమైనకుముదినివలె దుఃఖముతో దివసమునుగడుపుచున్నదియు, ప్రాభాతికప్రదీపశిఖవలెఁ గృశించినదియు, మరణోద్యతయునగునొకతరుణీరత్నమును వీక్షించితిని.

నేనామెసమీపమునకుఁ బోవగానట్టివిపద్దశలోనున్నను నన్నుఁ జూచిబహుమానముతో నమస్కరించెను. అపుడు నేనతిదుఃఖితుడనై యామెతో సంభాషింపవలయునని కోరికగలిగి మహానుభావురాలైన యామె నెట్లుసంబోధింపనౌనని మనంబుననాలోచించితిని. అమ్మాయీయన్నచో నతిప్రణయము. తల్లీయనుటప్రియవచనము. సోదరీయనుట యాత్మసంభావనము. దేవీయని పిలుచుటపరిజనోచితము. రాజపుత్రియనుటయస్పష్టము. స్వామినీయనుట నేనునీభృత్యుఁడనని యొప్పుకొనుటభద్రయనుట యితరస్త్రీసముచితము. ఆయుష్మతీయనుటయీయవస్థకసదృశము. కళ్యాణినీయనుట ప్రస్తుతదశకు విరుద్ధము. చంద్రముఖీయనివిరాగులనవలసినమాటకాదు. బాలాయనిపిలుచుటయగౌరవోపేతము. ఆర్యాయన్నచో నామెయందు

ముదిమినారోపించుట. పుణ్యవతీయనుట ఫలవిపరీతము. భవతీయనుటసర్వసాధారణము. గొప్పవంశమందుబుట్టినస్త్రీని నీవెవ్వతెవనియడుగగూడదు. ఏలయేడ్చెదవనిప్రశ్నించుట దుఃఖకారణమునుస్మరింపజేయును. అనియిట్లునేనాలోచించుచుండగా నాస్త్రీసమూహమునుండి యార్యవేషముతోఁగూడిన దుఃఖోద్విగ్నయగు నొకస్త్రీనాయొద్దకువచ్చి పలితకతిపయశిరోజములుగల తనశిరస్సు భూతలమునుసోకునట్లునమస్కరించి హృదయసంతాపసూచకములైన యశ్రుబిందువులచేఁ దనచరణయుగళమును, అతిదుఃఖకరములగు మాటలచేనాహృదయమును దహించుచున్నదియై "భగవంతుఁడాతురీయాశ్రమము సర్వభూతానుకంపి. బౌద్ధులుసకల దుఃఖవిధ్వంసన దీక్షితులు. పూజ్యుడైనశాక్యమునియొక్క శాసనము కరుణాకులగృహము. జైనమతస్థులసజ్జనత్వముజనోపకారనిరతము. మునులధర్మముపరలోకసాధనమైనది. ప్రాణరక్షణముకంటె నధికతరమైన పుణ్యములేదనిలోకములో జనులువాడుదురు. స్వభావముచేతనే స్త్రీలనుకంపనీయులు. విపత్తులోనున్నవారిమాటజెప్పనేల? నాస్వామినియైనయీమె పితృమరణమువలనను, భర్తృవియోగమువలనను, సోదరప్రవాసమువలనను, యితరబంధువర్గవినాశమువలనను, అతిమృదుహృదయయై సంతానశూన్యయైయుండుటవలనను, నిరాధారయగుటవలనను, క్షుద్రశత్రుకృతమైనపరిభవమువలనను, యిపుడు మహాటవీపర్యటనక్లేశమువలనను, నిషిద్ధ్యమానయై, విక్లబీకృతహృదయయైదారుణదుఃఖమునుసహించుటకశక్తయై స్వప్నమందుఁగూడననతిక్రాంతవచనులైనగురుజనములనులక్ష్యముసేయక, అఖండితప్రణయముగల సఖీసమూహమునుదిరస్కరించి, యగ్నిలోఁబడుచున్నది. రక్షింపుఁడురక్షింపుఁడు. దుర్భరశోకనివారకమగు నుపాయము నుపదేశించికటాక్షింపుడనియతిదీనముగాఁ బలుకుచున్నదియైవిలపింపఁదొడఁగెను. అపుడునేనామెనుజూచి "ఆర్యా! నీవుచెప్పినట్లుచేసెదను. కానియీపుణ్యాశయమావాక్కులకగోచరమైన శోకములోనున్నది.

ఈమెయొక మహాపాతకమాత్రమైన రక్షించుటకుశక్యమైనయెడల నికమీదనీయభ్యర్థనము వ్యర్థముకాదు. నాకు రెండవగురువు వలెనున్నభగవంతుఁడైన సుగతుఁడుసమీపమందేయున్నాడు. నేనీ వృత్తాంతమును దెలియఁజేయఁగాఁబరమదయాళువైన యాతఁడిచటికిఁ దప్పక వచ్చును. దుఃఖాంధకారపటలమునునిరసింపఁగలకౌశలముగల సౌగతాగమసుభాషితములచేసీ మెను ప్రబోధపదవియందారోపించు ననిపలికితిని ఆమాటవినియామె చెలికత్తె "నాయనా! అట్లయినచో త్వరపడుఁడనిచెప్పి మరలనాకాళ్లపైఁబడెను. నేనునుతొందరతోని చటికివచ్చి యశరణానేకయువతిమరణమునుఁ బూజ్యులైన మా గురువుగారికిఁ దెలియఁజేసితిననిచెప్పెను.

ఇట్లాభిక్షువుపలికినమాటలనువిని రాజుసోదరిపేరువినశపోయి ననుసర్వాకారసంవాదినియైనదశచేతనేవీత సంశయుఁడై దుఃఖించుచు "ఆర్యా! అనార్యుడను, అతికఠినహృదయుడను, మందభాగ్యుడనైన నాచెల్లెలేయాచిన్నది. నిష్కారణవైరముగలమాభాగధేయముచే నామెయిట్టియవస్థనుపొందింపఁబడినది." అనిపలికి ఆర్య! లెమ్ము ఆమెయున్నచోటు నాకుఁజూపుము. ప్రభూత ప్రాణపరిత్రాణ పుణ్యోపార్జనము కొఱకుఁబోవుదము. బ్రతికియుండగానామెనుఁ జూచెదమని శ్రమణునితోఁబలుకుచులేచెను. శిష్యవర్గానుయాతుఁ డైన దివాకరమిత్రుఁడు సామంతరాజులోకానుగమ్యమానుడైన హ ర్షుఁడును భిక్షువు మార్గప్రదర్శకుఁడై ముందుజన నచటికి బయలుదేరిరి. క్రమముగాదగ్గిరకుబోయి ఆతావనాంతరితము, మరణోద్యతమునగుస్త్రీసమూహముయొక్క తత్కాలోచితములైన ప్రకారములుగలయాలాపములనువినిరి. ధర్మమా! శీఘ్రముగాఁ బరుగిడుము. కులదేవతా! ఎచ్చటనున్నావు భూదేవీ! దుఃఖితు రాలైన నీ పుత్రికకు ధైర్యముచెప్పవు.

పుష్పభూతికుటుంబినియగు లక్ష్మియెచ్చటికిఁబోయినది. నాథా
ముఖరవంశ్యుఁడా! విధవయుమనోవ్యథావిధురయునగు నీభార్యకేల
బోధింపవు? పూజ్యుఁడవైన సుగతుఁడా! నీభక్తజనము సంతాపము
నొందుచుండఁగా నీవునిద్రించితివా? పుష్పభూతిగృహమందుఁ బక్షపాత
ముగలరాజధర్మమా! ఉదాసీనముగానుంటివేమి? విపద్బంధుఁడైనవిం
ధ్యవతా! నీయందుగూడ నీయాంజలిబంధము వ్యర్థమైనది. తల్లీ
మహాటవీ! ఆపదలోనున్న యీయాక్రోశము వినకుండనున్నావు.
సూర్యుఁడా! దిక్కులేనియీపతివ్రతనురక్షింపుము. పుత్రికాస్నేహ
ముగలయశోవతీ! దుష్టదైవముచేవంచింపఁబడితివి. మహారాజప్రతా
పశీలా! అగ్నిలోఁబడుటకు సిద్ధముగానున్న నీపుత్రికనురక్షించుటకు
రావేమి?. అపత్యప్రేమ శిథిలమయ్యెనా?. మహారాజా రాజ్య
వర్ధనా! శీఘ్రముగారావేమి? భగినీప్రీతిమందగించెనా? పాపినైన
పావకుఁడా! స్త్రీవధనిర్ఘృణుఁడా! జ్వలించుచు సిగ్గుపడవు. సోదరుఁడా!
వాయుదేవుఁడా! నీదాసురాలను. దుఃఖితజనార్తిహారుఁడైన
హర్షునికి దేవీదాహమును శీఘ్రముగాఁజెప్పుము. శోక
చండాలుఁడా! నీమనోరథము ఫలించినది. దుఃఖదాయియగువియో
గరాక్షసుఁడా! తుష్టినొందితివి. నిర్జనమైనవనమందెవనినిగుఱించి
మొఱ్ఱపెట్టెదను. నాదుర్దశనెవనితోఁజెప్పెదను. ఎవఁడురక్షకుఁడు?
ఏదిక్కునకుఁబోయెద? మందభాగ్యనైననేనేమిచేయుదును. గాంధారీ!
లజ్జాపాశమునుబట్టుకొన్నాను. మంగళికా! బిగ్గరగానేలయేడ్చెదవు?
సుందరిసఖీ సమూహముదూరమగుచున్నది. శబరికా! అమంగళ
మైన యీశవశిబిరమందెట్లుండగలవు? సుకుమారగాత్రముగల
నీవుకూడ నగ్నిలోఁబడియెదవా? మృణాలకోమలమైన మాలా
వతీవాడియున్నావు. తల్లీమాతంగికా! నీవుకూడమరణించుటకం
గీకరించితివా? అమ్మాయీ! వత్సికా! అనిష్టమైన ప్రేత
నగరమందెట్లు నివసింపఁ గలవు? నాగరికా! ఈ రాజభక్తి
చే గొప్పతనమునుఁ బొందితివి. విరాజికా రాజపుత్రి

విపత్తులో జీవిత వినాశమునకు నిశ్చయించుటచేఁ బ్రకాశించుచున్నావు.
జలపాత్రమును మోయుదానా! కొండచరియనుండి పడుటకుద్యమించు
టచే ధన్యురాలవు. కేతకి! స్వప్నమందైన మనకిట్టిస్వామిని దొరుకునా?
మన దేహములను దహించు నగ్ని మనకుఁ బ్రతిజన్మమందు దేవీదాస్యము
నేయించునుగాక; విజయా! అగ్నినివీచుము. సానుమతి! స్వర్గమున
కుఁబోవఁగోరినయిందీవరిక స్వర్గమునకు నమస్కరించుచున్నది. కామ
దాసీ! అగ్నికిఁ బ్రదక్షిణముఁ జేయుట కవకాశము నిమ్ము; విచరికా!
అగ్నినిఁ బ్రజ్వలింపజేయుము. కిరాతికా! పువ్వులను జల్లుము. కుర
రికా! చితపైని గోరింటపువ్వులనుంచుము. చామరగ్రాహిణీ! చా
మరమును బట్టుకొనుము. నర్మదా! నిర్మర్యాద హాసములను సహిం
పుము. సుభద్రా! నీపరలోకగమనమునకు మంగళమగుగాక.
వసంతికా! అవకాశమునిమ్ము. దేవీ! ఛత్రధారి సెలవుపుచ్చుకొనుచు
న్నాడు ఇటుచూడుము. నీయిష్టురాలైన విజయసేన జీవితమును విడు
చుచున్నది. ముక్తికగట్టిగా నేడ్చుచున్నది. రాజపుత్రీ! నీకిష్టురా
లైన పత్రలత నీపాదములపైఁబడుచున్నది. కళింగసేనా! ఇది నాచర
మాలింగనము వసంతసేనా! ప్రాణములుపోవుచున్నవి. మంజు
లికా! అశ్రుదిగ్ధమైన నీనేత్రము నెన్నిమార్లు తుడిచెదవు. నన్నుఁ బట్టు
కొని యెంతసేపేడ్చెదవు. యశోధనా! నీపుట్టుక యిట్టిది. మాధ
వికా! నాకేల ధైర్యము చెప్పెదవు. కాళింది! సఖీజనులకంజలి జోడించు
కాలముపోయినది. కమలిని! పలుమారు దైవమును దూరుటచే
నేమిఫలము. సఖీజనసంగమసుఖము చిరకాలము లభింపఁ లేదుఁ
ఆర్యా! తరంగసేనా! నమస్కారము. చెలిసౌదామినీ! ఇంతసేపటికి.
గనఁబడితివి. కుముదికా! హవ్యవాహనార్పనకుసుమములనుఁ
దీసికొనిరమ్ము. రోహిణి! చితపై నెక్కుటకు చేయూతనిమ్ము.
అమ్మా! దాదీ ధీరవుకమ్ము. పాపము చేసినవారి కర్మవిపాకమిట్టిది
యగును. ఆర్యచరణములకిదిగో అంజలి. తల్లీ! ఇదిగో నాపరలోక
ప్రయాణ ప్రణామము. లవలికా! మరణసమయమందు హృదయ

మునకీకలిష్టమైనయుత్కంఠయేల? వామనికా! నా వామనేత్రము స్ఫురించుచున్నది. వాయసమిత్రమా! వృక్షముపైనుండి ప్రతిక్షణముక్షీణపుణ్యనైననాయెదుట నేలయఱచెదవు. హారీతీ! ఉత్తరము వైపుగుఱ్ఱములసకిలింతవినఁబడుచున్నది. *ప్రభావతి! చెట్లచాటున నుండికానవచ్చుగొడుగెవ్వనిది? దేవి! నీవదృష్టముగలదానవు. మన ప్రభువైన హర్షుఁడువచ్చినాఁడు.

ఈవిధమైనసంభాషణముల నాలకించుచుసమీపమునకుబోయి హర్షుఁడు వహ్నిప్రవేశమునకు సిద్ధముగానున్న రాజ్యశ్రీని విలోకించి మూర్ఛానిమీలితనేత్రములుగలయామెలలాటమును దనహస్తముచేఁ గట్టిగాఁబట్టుకొనెను. అపుడు ప్రేమాస్పదుఁడైనసోదరుని ప్రకోష్ఠమందుఁగట్టబడినయోషధుల ప్రత్యుజ్జీవనక్షమమైన రసవిసరమును వర్షించుచున్నట్లున్నదియు, హారిహార్య మణులయచింత్యప్రభావమునుగ్రక్కుచున్నదియు, నఖచంద్రకాంతులచే నమృతమును స్రవించుచున్నట్లున్నదియు, చంద్రకాంతచూడామణిని శిరస్సునందుగట్టుచున్నట్లున్నదియు, మృణాళమయాంగుళులుగలదానివలె నతిశీతలమై దహ్యమానమగు హృదయమును శాంతింపఁజేయుచున్నదియు, జీవితాహ్లాదకరము నగు హస్తసంస్పర్శముచే రాజ్యశ్రీకన్నులఁదెరచెను. స్వప్నమందైననూహింపఁ బడనిరాకఁగలవాఁడు, స్వప్నదృష్టదర్శనునివలెనున్నవాఁడు, నగుసోదరుని గాఁగిలించుకొని యాకాలమందావిర్భవించిన దుర్భరశోకావేశముచేనదీముఖప్రణాళికలవలెనున్న నేత్రములచే స్థూలబాష్పబిందు ప్రవాహమును బ్రవహింపఁజేయుచున్నదియై "అమ్మా! నాయనా! చెలులారా" యనిపలుకుచు "అమ్మాయీ ఇకనూరుకొనుము. ధైర్యమవలంబించుమని కరములచే ముఖమునుగప్పి సోదరుడు, కళ్యాణినీవీయగ్రజునిమాటమన్నింపుమని బౌద్ధాచార్యుఁడు, దేవిప్రభువువారియవస్థనుజూడవు, అతిరోదనము మానుమనిరాజలోకము, స్వామినిసోదరునిజూడుమనిపరిజనము, అమ్మాయీ

కొంచెము సేపూరుకొనుము, మరల నేఁడువచ్చునని వృద్ధబాంధవస్త్రీలు, ప్రియసఖి ఎంతసేపేడ్చెదవు ఊరుకొనుము. అన్నగారు దుఃఖించుచున్నారని చెలులుపలుమారు బ్రతిమాలుచున్నను, చిరసంభృత దుస్సహదుఃఖమువలన గలుగు బాష్పోత్పీడముచేఁ బీడ్యమానకంఠముగలదియై కరుణాకాహళమైన కంఠస్వరముచేఁ జిరకాలమేడ్చెను. మన్యువేగము శాంతింపఁగా నపుడు హర్షుఁడు వహ్నిసమీపమునుండి యామెనుఁ దీసికొనివచ్చి చెట్టునీడలోఁ గూర్చుండఁబెట్టెను. అంతలో నాచార్యుఁడైన దివాకరమిత్రుఁ డాతఁడు హర్షనృపతియని తెలిసికొని వివర్ధితాదరుఁడై భూరిసంజ్ఞాపితుఁడైన స్వశిష్యునిచేఁగమలినీదళసంపుటమందు ముఖప్రక్షాళనోదకమును దెప్పించి స్వయముగా భూపాలునికర్పించెను. నరేంద్రుఁడాజలము నత్యాదరముతో గ్రహించి సంతతరోదనాత్తామ్రముగుటవలన రక్తపంకజమువలెనున్న చెల్లెలికంటిని ముందుగడిగి పిదపఁ దనకన్నులనుఁ గడిగికొనెను. భూపాలుఁడు ప్రక్షాళితముఖుఁడై యుండ నచటనున్న జనసమూహముంతయు నిశ్శబ్దమయ్యెను. అంతనరేంద్రుఁడు సోదరిని జూచి "వత్సా! మాకుగురువు, నీభర్తగారికి రెండవహృదయమైనవాఁడు, జగత్పూజ్యుఁడునైన యీభదంతునికి వందనమాచరింపుమని చెప్పగా భర్తృమిత్రుఁడని వినటవలన మరలగన్నీరుఁ దెచ్చుకొనుచు నారాజపుత్రిక యాచార్యునకు మ్రొక్కుచుండగా నాతఁడు ప్రయత్నసంస్తంభిత బాష్పోద్గముఁడై ధైర్యచ్యుతినొంది కొంచము నేత్రములనుదిప్పికొని దీర్ఘముగా నిశ్వసించెను. అతఁడు క్షణకాలమూరకుండి వినయమునుజూపుచు మధురవాక్కులతోఁ గళ్యాణరాశీ! రోదనముచే నేమిప్రయోజనము? ఇప్పటికి నీరాజలోకము రోదనమునువిడువలేదు. అవశ్యకరణీయమైన స్నానవిధిని నిర్వర్తించి మరల నీప్రదేశమునకే రండని పలికెను. అంతభూపతి యాచార్యవచనము ననువర్తించుచున్నవాఁడై గిరినదియందు సోదరితోస్నానముచేసి మరల మునుపటి స్థలమున కేతెంచెను. అచటఁ

బరిజనముతోఁ గూడిన సోదరిని భుజింపఁజేసెను. అనంతరము తాను భుజించెను. భుజించి కూర్చుండి చెలియలి కారాగృహనివాసము, గుప్తుఁడను కులపుత్రుఁడు రహస్యముగా నామెను కాన్యకుబ్జమునుండి తీసికొనివచ్చుట, రాజ్యవర్ధన మరణవృత్తాంతము, ఆహారపరిత్యాగము, వింధ్యాటవీపరిభ్రమణక్లేశము, నిర్విణ్ణయై యగ్నిలోఁ బడుటకుపక్రమించుట మొదలగు నుదంతజాతమును సవిస్తరముగాఁ బరిజనులవలనవినెను.

వివిక్తస్థలమందు భగినీద్వితీయుఁడై చెట్టునీడలో నుపవిష్టుఁడైన భూవరునిచెంతకుఁబోయి యాచార్యుఁడు కొంతవడిఁ గూర్చుండి "శ్రీమంతుఁడా నీతో నొకవిషయము చెప్పవలసియున్నది. అవహితమనస్కుఁడవై దానినాకర్ణింపుము. అసామాన్యలావణ్యముగల భార్యలుపలువురున్నను వారినాదరింపక రజనీకరుఁడు యౌవనోన్మాదమువలనఁ బురందరపురోహితుఁడైన బృహస్పతి ధర్మపత్నియైన తారనపహరించి స్వర్గమునుండి పలాయితుఁడయ్యెను. సర్వాకారాభిరామయు నతికామయునగు నాచకోరాక్షితోఁ గ్రీడించుచు రమణీయ ప్రదేశములయందు సంచరించెను. చిరకాలమునకు సర్వగీర్వాణవాణీ గౌరవమువలన మరల నాయువతీరత్నము నుబృహస్పతికర్పించెను. ఆవతారోహా విరహాగ్నిచే సంతప్తమానసుండయ్యెను. ఒకనాఁడుదయగిరినుండి యుదయించుచు నిర్మలమైన సముద్రజలమందు సంక్రాంతమైన తనప్రతిబింబమును విలోకించి కమనీయకపోలకాంతిగల తారాముఖమును తనస్మృతిపథమునకుఁ దెచ్చుకొని కామవికారకలుషితుఁడయ్యెను. అపుడాసోముని కన్నులనుండి స్థూలములైన బాష్పబిందువులు సముద్రమందుఁబడెను. వానిని ముత్తెపుచిప్పలు మ్రింగినవి. ముక్తాశుక్త్యుదరములయందుఁ బడి ముత్తియములైనవానినిఁ బాతాళనివాసియగు వాసుకిలభించెను. పాతాళమందుఁగూడ తారాగణమువలె భాసిల్లు నాముత్యములచే

వాసుకియొక హారమునురచించి దానికి మందాకినియని పేరిడెను. ఆముక్తాహారము సర్వౌషధీనాథుఁడైన యోషధీశుని ప్రభావమువలన నత్యంతవిషహరమై హిమామృతోత్పన్నమగుటవలన స్పర్శమాత్రముచే సర్వసత్త్వసంతాపహరణశక్తమయ్యెను. వాసుకి విషోష్మశాంతికొరకు దానిననవరతము ధరించెను. కొంతకాలమతిక్రమింపగా నొకప్పుడు నాగములచేఁ బాతాళమునకుఁ దేఁబడిన నాగార్జునుఁడను నొక భిక్షువాముక్తాహారమును వాసుకినడిగి పుచ్చుకొనెను. ఆనాగార్జునుఁడు పాతాళమునుండి పైకివచ్చి తనకు మిత్రుఁడు సముద్రత్రయాధిపతియునగు సాతవాహనరేంద్రునికాముక్తావళి నుపాయనముగా సమర్పించెను. అదికాలక్రమమున శిష్యపరంపరవలన మాచేతిలోఁజిక్కినది. విచారింపఁగాఁ బరులిచ్చిన వస్తువును స్వీకరించుట భవాదృశులకుఁ బరిభవముగా గానవచ్చునుగాని సర్వప్రాణిరక్షాదీక్షితుఁడవైన నీవీహారము నౌషధిబుద్ధిచే విషరక్షార్థమై పరిగ్రహింపవలయునని ప్రార్థించుచున్నానని పలికి దివాకరమిత్రుఁడు దగ్గిరనున్న భిక్షుధరించిన వల్కలపటమాదుఁ గట్టబడిన మందాకినియను నాముక్తాహారమును విప్పెను. కొంగుముడినుండి విప్పుచున్నక్షణమందే దానికాన్తిసమూహము వ్యాపింపగా దిఙ్ముఖములొక్కమారు తెల్లబడినవి. లతావధూత్కంఠగల తరువులు మూలమునుండి వికసించినట్లుండెను. అభినవమృణాళలోభముగల వనసరసీహంసయూథములు పరుగిడినట్లు, కుముదవనములువికసించినట్లు, వనదేవతలు నవ్వినట్లు చమరీమృగకదంబకములు సంచరించినట్లు, పూర్ణచంద్రుఁడుదయించినట్లు కనఁబడెను. హర్షుఁడండతిసాంద్రమైన దానిరశ్మిజాలముచేఁ బ్రతిహతదృష్టియై బహుకష్టముతో దానినిఁజూడఁగలిగెను. చూచిచూచి భృశవిస్మయావిష్టుఁడయ్యెను. ఆచార్యుఁడు దానినిఁదీసి హర్షునికంఠమందుఁ దగిలించెను. నరపతియు నతిప్రీతుఁడై "ఆర్య యిట్టిరత్నములకు నరులనర్హులు తపస్సిద్ధివలనఁగాని దేవతాప్రసాదమువలనఁగాని తమకిది

లభించినది. దీనిం బరిగ్రహించుటకుఁగాని వలదని నిషేధించుటకుగాని నాకేమి స్వాతంత్ర్యము. దీనినిజూచినది మొదలుకొని తదీయ గుణగణాకృష్టహృదయుఁడనై విస్మయముచేఁ బరవంతుఁడనైతిని. ఈనాశరీరము నేనుబ్రతికియున్నంతకాలము భవదుపయోగముకొఱకు సంకల్పింపఁబడినది. కర్తవ్యములయందు భవదిష్టవినియోగార్హుఁడనని సప్రశ్రయముగాఁ బలికెను.

ఇట్లు కావళీవర్ణనాలాపములచేఁ గొంతకాల మతీతము కాగా నొకనాడు రాజ్యశ్రీ, పత్రలతయను తనతాంబూలకరండవాహినిని రహస్యముగాఁ బిలిచి దానికర్ణమూలమునందు మెల్లగాఁ జెప్పెను. అది పార్థివుని సవిధమునకేతెంచి "దేవా! తమమ్రోల నేనెన్నఁడు గట్టిగా మాట్లాడినట్లుకూడ జ్ఞాపకములేదు. ఏదైననొక విషయమును విన్నవించుకొనుటయెక్కడ? అసహ్యమైన నావ్యసన పరంపర వినయమును శిథిలపర్చుచున్నది. స్త్రీలకు భర్తగాని పుత్రులుగాని యవలంబనము. యీ యుభయము లేనివారు దుఃఖాగ్నిపచ్యమానహృదయులై జీవించియుండుట కేవలము లజ్జాకరము. తమరాకచే నామరణోద్యోగము విఘ్నితమైనది. కావునఁ గాషాయాంబరధారణము కొఱకు కభ్యనుజ్ఞనొసంగుమని వేడుకొనుచున్నానని రాజ్యశ్రీ విన్నవించుచున్నదని" పలికెను. ఆమాటలువిని జనాధిపుఁడూరకుండెను. అపుడాచార్యుఁడదివిని "ఆయుష్మతీ! శోకము పిశాచముయొక్క రూపాంతరము. తమోగుణముయొక్క యౌవనము జీవితము హరింపని యముఁడు. విషమునకు విశేషణము. నశింపని రాజయక్ష్మ. లక్ష్మీనివాసముగాని జనార్దనుఁడు. తెలివిగానినిద్ర అబుధసేవితమైన గ్రహవర్గము. అట్టిదుఃఖము ననుభవించుటకుఁ బ్రాజ్ఞులహృదయములుకూడ నశక్తములైనపుడు నవమాలికా కుసుమపేశలలైన స్త్రీల సరసబిసతంతుదుర్బలములగు హృదయములేపాటివి. సత్యవ్రతముగల అమ్మాయీ! వస్తుస్థితియిట్లుండగా నీవిషయమై మనమేమి

చేయఁగలము? ఎవ్వనినిందించుట? ఎవ్వనియెదుట మొఱలిడుట? హృదయమును దహించుచున్న యీదుఃఖము నెవ్వనితోఁ జెప్పికొనుట? ప్రాజ్ఞుఁడైన మనుజుఁడు కన్నులు మూసికొని సర్వమును సహింపవలెను. పుణ్యవతీ! పురాతనకర్మనింకొకరీతిగాఁ జేయుట కెవ్వఁడును సమర్థుఁడుకాఁడని తెలిసికొని మృదువైన మనస్సునందజ్ఞానమునుఁ జొరనియ్యకుము. శోకము బహుళముగానున్నను పితృకల్పుఁడైన జ్యేష్ఠసోదరుఁడు నీకుగురువు. మఱియొకరీతిగాఁ గల్యాణరూపమగు కాషాయగ్రహణమందు నీసంకల్పమును మఱెవ్వఁడనుమతించును. ప్రవ్రజ్యసకలమనోజ్వర ప్రశమనకారణము. ఆత్మవంతులకిది గొప్పపదము కాని మహాభాగుఁడైన నీసోదరుఁడు నీమనోరథము నకిపుడు భంగముచేయుచున్నాఁడు. అతఁడుచెప్పినట్లు చేయుము. జ్యేష్ఠసోదరుఁడనియు, వత్సలుఁడనియు, గుణవంతుఁడనియు, రాజనియు నెంచి సర్వవిధముల నాతనిని యోగమందు నీవువర్తింపవలెను." అనియుపదేశించి యూరకుండెను. అందుకురాజు మిగులసంతసిల్లి "ఆర్యా! తమరుతప్ప యిట్లుమఱెవ్వరు బోధింపగలరు? తమవంటివారు లోకమునకుఁ గోరకుండ దైవమునిర్మించిన విషమవిపదవలంబన స్తంభములు. మోహాంధకారమును నశింపఁజేయు ధర్మప్రదీపములు. మిమ్ములనొకటిఁ బ్రార్థించుచున్నాను. ఈ నాచెల్లెలు బహుదుఃఖఖేదిత; పూర్వవయస్సులోనున్నది. ఈమెకొఱకితరకార్యములన్నియు వెనుకబెట్టవలసివచ్చినది. భ్రాతృవధాపకారియగు శత్రునృపుని న్మూలించుటకు సర్వలోకప్రత్యక్షముగాఁ బ్రతిజ్ఞనొనర్చితిని. కావున తమరు కొంతకాలము నాపనియందుండవలెను ఆశ్రితికిశరీరము నొసంగుఁడు. ఈదినము మొదలుకొని యెంతకాలములో నేనీప్రతిజ్ఞాభరమును నిర్వహింపగలనో మాతండ్రిగారి మరణముచే దుఃఖితులైన ప్రజల వెతలో నూరడింపగలనో యంతకాలము సకలక్లేశ ప్రహాణహేతువులు శీలోపశమదాయకములు నగు మునదేశంబుల నొసంగుటకుఁ బ్రార్థించుచున్నాను. సమాప్త

త్యుఁడనై యీమెతోఁగూడ నేనును కాషాయమును ధరింపఁగలను. గొప్పవారర్థుల కేమి యొసంగరు? ధైర్యసముద్రుఁడగు దధీచి యింద్రునికిఁ దన వెన్నెముక నిచ్చి కృతార్థునిఁ జేసెను. ఇక మీఁదఁ జేయవలసిన కృత్యమును తమరే యెరుఁగుదురని పలికి రాజు విరమించెను.

అంతభదంతుఁడు "భవ్యులు రెండుమాటలాడరు. భవద్వశీకృతుఁడనైన నేనీశరీరమును నీకర్పించితిని. గురుకార్యమందుగాని లఘుకార్యమందుగాని యీజనుని నీయిష్టానుసారముగా నుపయోగించుకొనుము." అని పలికెను. భదంతుఁడిట్లభినందిత ప్రణయుఁడుకాఁగా భూపాలుఁడు సంతసిల్లినవాఁడై యారాత్రి యచ్చటనే నివసించి వస్త్రాలంకారాది ప్రదానముచే నిఘాతుని సంతోషపెట్టి సోదరినిఁ దీసికొని యాచార్యునితోఁగూడఁ గతిపయప్రయాణకములచే జాహ్నవీనదీతీరమందున్న కటకమునకుఁ జనెను.

హర్షుఁడచ్చటఁ దనమిత్రులతో రాజ్యశ్రీప్రాప్తికథను సవిస్తరముగా జెప్పెను. తరువాత కొంతకాలము భూమండలమంతయుఁ దిరిగి శత్రువులను సమూలముగాను న్మూలించి యనేక సంగ్రామములయందు నానాదేశాధిపతుల నోడించి వారిని కరదులనుగా జేసి విజయలక్ష్మీసనాథుఁడై నిజనగరంబునకేతెంచి సకలవిభవంబులతోఁ బట్టాభిషిక్తుఁడై నిష్కంటకమైన రాజ్యమునుఁ జిరకాలమేలి మహోదగ్రసుఖంబుల ననుభవించెను.

రాజ్యశ్రీప్రాప్తియను అష్టమోచ్ఛ్వాసము ముగిసెను.

హర్షచరిత్రము సమాప్తము.

శ్రీ వేదవ్యాస ప్రెస్. విజయనగరం సిటీ.